పరేంగిత ప్రజ్ఞ

దాదా గవంద్ ఆత్మకథ



అనుకృతి

శ్రీ శార్వరి

పరేంగిత ప్రజ్ఞ

"దాదా గవంద్ ఆత్మకథ"

అనుకృతి

శ్రీ శార్వరి

ప్రచురణ

మాస్టర్ యోగాశ్రమం

PARENGITA PRAGNA
DADA GAVAND ATMA KATHA
Telugu Version by ***SRI SARVARI***

Original : *INTELLIGENCE BEYOND THOUGHT*
AUTOBIOGRAPHY OF DADA GAVAND

Gen. Editor - Dr. Vaasili

First Print - September, 2007
Second Print - January, 2009

Price - Rs. 100/-


Published by :
MASTER YOGAASHRAM
Plot 89, Krishna Enclave,
M.D. Farm Road, Tirumalagiri,
SECUNDERABAD - 500 015.
Phone : (040) 2779 0094, 9393933946
E-mail : drvaasili@yahoo.co.in
www. masteryogashram.com

Printed by :
YOGAALAYA
Plot No. 90, Krishna Enclave,
Tirumalagiri, SECUNDERABAD - 500 015.
Phone : (040) 2779 6676

DADA's Other Publications

- **INTELLIGENCE BEYOND THOUGHT** (English)
  (Autobiography of Dada)
- **BEYOND THE MIND** (English)
- **TOWARDS THE UNKNOWN** (English)
- **INTUITIVE INTELLIGENCE** (English)
  (Creative Photo Book)
- **CHAITANYACHA VILAS** (Marathi)
  (Translation of Intuitive Intelligence)
- **CHAHUL ADNYATACHI** (Marathi)
- **MANANI PELE PAR** (Gujrathi)
- **MUKTAJEEVAN KI AUR** (Hindi)
- **ATEETA MANASAM** (Telugu)
- **PARENGITA PRAGNA** (Telugu)

All books by Dada in all languages are available at :
Dada Center Publications
C/o. **Amber Systems** 11-A, L.B.S. Marg, Vikhroli (W),
Mumbai - 400 079. Phone : -91-22-67999933.
E-mail : dada@mysticdada.org. Website : www.mysticdada.org



4th September, '07

Dear Shri Sarvari,

I congratulate you upon bringing out this Telugu version of my autobiography 'Intelligence Beyond Thought' to coincide with my 90th Birthday. I deeply appreciate the love and understanding with which you have so lucidly and vividly captured the essence of the original English text and conveyed my message to Telugu readers under your banner of Master Yogaashram.

I also appreciate the fact that you have brought out the second edition of 'Ateetha Manasam', the Telugu version of my book 'Beyond the Mind'. It is heartening to note that the first edition of 'Ateetha Manasam' received an overwhelming response from Telugu readers and got sold out within months.

I wish you all the best in your continual sincere efforts to bring out spiritual books of merit.


Yours sincerely

Dada

(Dada Gavand)

ఆరోహణ

Sri Sarvari



విలక్షణ యోగి

విలక్షణ వ్యక్తులు మాత్రమే చరిత్రను తిరగ రాస్తారన్నది చారిత్రక సత్యం. కొందరు చరిత్రను సృష్టిస్తారు. కొందరు సమాజాన్ని మలుపు తిప్పుతారు. కాని మనసుకు జవజీవాలందించేవారు చాలా తక్కువ. విలక్షణ వ్యక్తులవల్ల పరిణామం ముందుకు సాగుతుంది. మనల్ని మనం పరిశీలించుకునేటట్లు చేసినవారు కాలం పరీక్షకు నిలబడి చరిత్ర ప్రసిద్ధులవుతుంటారు. కాలాన్ని జయించి, కల్లోలాన్ని సృష్టించినవారే మహాత్ములు, వైతాళికులు, స్మరణీయులు.

దాదా గవంద్ ఆ కోవకు చెందిన విలక్షణ ప్రతిభాశాలి. వినయశీలి. ఆయన ఏరికోరి ప్రమాదం అంచుల్లో ప్రయాణం సాగించారు. మనస్తీరాలు దాటిపోగలిగారు. అక్కడ విస్ఫోటనాన్ని తట్టుకోగలిగారు. రగిలిన అగ్నికీలల్ని స్వాహా చేశారు. మనసులోపలి పొరల్ని చీల్చి రహస్యాల్ని ఛేదించి 'మనీషి' అయినారు. దాదా మాటల మనిషి కాదు. మనసులో పిరికితనం లేనివాడు. కారడవులలో ఒంటరిపోరాటం సాగించాడు. తనదైన శైలిలో, ఏకాంతంలో సాధన చేసి, సత్య దర్శనంతో ప్రజ్ఞను అలవోకగా అందుకున్నాడు. మనిషి చిరకాలంగా వెతుకుతున్న 'మనసు' రహస్యాల్ని ఛేదించాడు. బాధలకు, కష్టాలకు చక్కని పరిష్కారం వెదికిపెట్టాడు.

చరిత్రలోకి చూస్తే అన్ని మతాల లక్ష్యం ఒక్కటే. అన్ని నాగరికతలు ఆరాటపడుతున్నది సుఖం కోసమే. ఏ దేశతత్వవేత్తలైనా అన్వేషించింది పరమార్థం, పరమాత్మతత్వం.

సమాజాన్ని నిర్లక్ష్యం చేయాలి. సామాజిక హద్దుల్ని దాటాలి. కట్టుబాట్లను ఛేదించాలి. అయినవారికి దూరం కావాలి, అందర్నీ వదులుకోవాలి. అసలు తనకు తాను దూరం అయి ఆంతర్యానికి దగ్గర కావాలి. మనస్సు హద్దులు దాటి పోతే

తప్ప 'ఆత్మ' ఆచూకీ తెలియదు. బాహ్య సౌందర్యాలు, ప్రాపంచిక సుఖాలు, మేధావితనం, తెలివితేటలు, స్వార్థం, అహంకారం లాంటి వాటిని వదలి ముందుకు సాగాలి. అదే అన్వేషణ.

అటువంటి విలక్షణ వ్యక్తుల్ని, విప్లవ భావుకుల్ని గత శతాబ్దం చాలా మందిని ప్రపంచానికి అందించింది. రామకృష్ణ పరమహంస, షిరిడీ సాయిబాబా, మాస్టర్ సి.వి.వి, అరవిందయోగి, రమణమహర్షి, జిడ్డు కృష్ణమూర్తి, భగవాన్ రజనీష్ ... ఆ కోవకు చెందినవారు. వారికి అన్నివిధాల దీటైన వ్యక్తి దాదా గవంద్. సభ్య ప్రపంచానికి దూరంగా, అజ్ఞాతంగా, ఏకాంత వాసంలో, అరణ్యం మధ్యలో మనుగడ సాగిస్తూ, మేధో మథనం చేసి అమృత భాండాన్ని హస్తగతం చేసుకున్న విశిష్ట వ్యక్తి దాదాజీ. వారి అసలు పేరు దాదా గవంద్.

తాత్విక గ్రంథాలు అసంఖ్యాకంగా వస్తుంటాయి. కాని తత్వవేత్తల జీవిత చరిత్రలు చాలా అరుదు. తాత్వికతకు మెరుగులు దిద్దిన వారి జీవిత విశేషాలపై పాఠకులకు ఆసక్తి ఉంటుంది. సిద్ధాంత గ్రంథాలు, ప్రసంగాలు వెలువడతాయి. అవి నిక్కమైన అనుభవ సారాలు కావు. 'పరేంగిత ప్రజ్ఞ' అచ్చమైన జీవితానుభవం. అద్భుత ఆత్మశోధన. నిరాధారంగా తనలోకి నిష్క్రమించడం అంత సులభం కాదు. దాదా ప్రయోగం అద్భుత ఫలితాల నిచ్చింది. ఆత్మ కథలు రాసుకునేవారు తక్కువ. నిజాల చాటున దాగిన రహస్యాలు బయట కొస్తాయని భయం. దాదాజీ భయాన్ని ఎప్పుడో వదిలిపెట్టి అంతర్యాత్రకు సాహసించినవాడు. కీర్తి, ప్రతిష్టలతో బ్రతికే రాజకీయ, సాహిత్యకారులకు ఉన్న ఆసక్తి యోగులకు ఉండదు. స్వార్థం, కీర్తి దాహం ఉండదు కనుక 'తమ' గురించి లోకానికి తెలియచెప్పేందుకు ఏమీ లేదనుకుంటారు.

దాదా గవంద్ జీవితం సినిమాలాగా సాగదు. అందులో నాటకీయత లేదు. ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ సినిమాలో వలె అడుగడుగునా రోమాలు నిక్కబొడుచుకుంటాయి. భయం వేస్తుంది. ఉత్కంఠ కలుగుతుంది. భయ పడినా, చెమట పట్టినా ఆగే ప్రసక్తి లేదు. ఆ టెన్షన్ చాలా మెత్తగా, మృదువుగా మనసులోకి పరుగుదీస్తూ, మనసు తెరల్ని, పొరల్ని చీల్చివేసి, శూన్యంలో జొరబడుతుంది. మనసును తాకకుండా, నెమ్మదిగా పోయి ఆత్మను తట్టిలేపుతుంది.

అన్నీ సవ్యంగా ఉంటే ఎవరి జీవితమూ చదవబుద్ధి కాదు. అది సాదా బాక్సాఫీసు సినిమా అవుతుంది. కళాఖండం కాదు. దాదా జీవితంలో నిరాశలు, నిస్పృహలు, ఆరాటాలు, పోరాటాలు, ప్రతిఘటనలు, అన్వేషణ, ఆవేదనలు ఎక్కువ. ప్రతి ఒక్కటి హృదయాన్ని కదిలిస్తుంది. అయినవారికి, ఉన్న ఊరికి దూరంగా, ఎక్కడో సజ్జన్‌ఘడ్ పర్వతంపైన అడవి అంచున, చిన్న కుటీరంలో ప్రమాదాల అంచులు తాకుతూ జీవించడం అనూహ్యం. దేవుడు పిలిచినా రాను పొమ్మనే మొండితనం, మనస్సుతో కుస్తీపట్లు. దాదా ప్రధాన ప్రత్యర్థి మనస్సు. దానిని లొంగ తీసుకున్న తీరు, ఆయన ఆత్మవిజయం ఆధ్యాత్మిక పథం.

'ఆలోచనల్ని లయింపచేయడం ఎలా?' అన్న మకుటంతో ఆయన శోధన మొదలైంది. నిశ్చింతగా, ఒంటరిగా, నిర్మోహంతో లోపల గమనించడం, ఆలోచించడం, మూలాలను అన్వేషించడం జరిగింది. రాత్రని, పగలని లేదు. అడవి జంతువుల మధ్య భయాన్ని జయించడం, శాంతిని అన్వేషించడం, శూన్యం నుండి శక్తిని పుట్టించి వినియోగించుకున్న తీరు అపూర్వం. ఆ పద్ధతిలో సంప్రదాయం ఉండదు. బాహ్య వనరుల అవసరం కలగదు.

అది కుండలినీ శక్తి అని, అవి షట్చ్రక్రాలనే పేర్లు వాడరు దాదా. అసలు సంప్రదాయం వేపు కన్నెత్తి చూడరు. తనలోని ప్రజ్ఞనే శక్తిగా వినియోగించు కోవడం విశేషం. ఆ శక్తి తనదైనపుడు మనిషికి ఏ రుగ్మతలు, బాధలు ఉండవు. ఆ శక్తే సమాజంలో ఒక విలువ కల్పిస్తుంది. ప్రేమ, ప్రజ్ఞ, కరుణ – వీటితో హృదయం నిండిపోతుంది. మనిషికి కావలసింది అవే. వాటికొరకే గౌతమ బుద్ధుని నుండి జిడ్డు కృష్ణమూర్తి వరకు అన్వేషించారు.

మనిషిలో ఈ మార్పు కాస్త కాస్త వస్తే చాలదు. పరిణామం తెలియదు. ఒక్కసారిగా, ఒక్క ఊపులో రావాలి. మానవుడు మహనీయుడు కావాలి. ఆ మార్పు ప్రళయంతో సమానం. అది మానసిక విస్ఫోటనం. సంపూర్ణంగా గతం పైన ముసుగేసి, మనస్సును శూన్యం చేస్తే తప్ప ఆ మార్పు రాదు. సంప్రదాయక పూజలు, మంత్రాలు, జపాలతో ఆ ఫలితాన్ని ఇంతవరకు ఎవరూ సాధించలేదు. ఆ మార్పుకు ఏ దైవశక్తి అండగా నిలబడదు. అది అంతర్గత విస్ఫోటనం, అంతరంగ పరిణామం. ప్రతి మనిషిలో ఆ గుప్త నిధు లున్నాయి. వాటిని బయటకు తీయడానికి గురువులు అవసరం లేదు. దేవుళ్లు అవసరం లేదు. ఒకరి బోధలు, పాత సిద్ధాంతాలు సహాయపడవు. అన్నింటినీ వర్జించి, మనిషి మహాసాగరంలో దూకి, ఏకాంతంగా కాలానికి ఎదురీది, ఆ తర్వాత లోతుల్లోకి చొచ్చుకుపోవాలి.

అలాగ మనిషి అంతర్ యానం చేయడాన్ని అనుభవించి, వివరించారు దాదా. మనిషి ఏకాంత సీమాంతంలో కల్లోలాలు, సమస్యలు, ఆలోచనలు, గతం ప్రక్కలకు నెట్టగలగాలి అంటారు దాదా. ఈయన సంప్రదాయ గురువు కాదు. తను ఎవరికీ శిష్యుడు కాదు. కేవలం అన్వేషి. తన మార్గం ఇదని చెప్పడు. తనదొక సిద్ధాంతం అనడు. మన శక్తిని మనమే ఉపయోగించుకోవడం ఆయన సూత్రం. తనకంటూ శిష్యులు లేరు. ఓ చిన్న ఆశ్రమంలో 90 వసంతాల జీవితంలో "పూచిన పున్నాగ". ఆయనది మౌన విప్లవం.

ఈ పుస్తకం గురించి

రెండు సంవత్సరాల క్రితం వరకు దాదాజీ ఎవరో నాకు తెలియదు. ఎన్నడూ ఆయన పేరు వినలేదు. నేను 'నా యోగం' గురించి తప్ప యితర విషయాలలో

ఆసక్తి చూపను. ఏ ఆశ్రమాలకు వెళ్లాలనిపించదు. దేవాలయాలు దర్శించే అవసరం లేదు. స్వాములు, భగవాన్‌లపై మోజు లేదు. ఎవరినీ కలవను. నా జీవితం, నా కార్యరంగం పరిమితం. అది లోకానికి సుపరిచితం.

ఒక రోజున మా పెద్దబ్బాయి డాక్టర్ వాసిలి వసంతకుమార్ ఒక పెద్దాయన్ని తీసుకువచ్చి ఫలానా అని పరిచయం చేశాడు. ఆయనగారి పేరు కె.ఎస్.వి. చారి ముంబయ్ నివాసి. దాదా గవంద్ అభిమాని, అనుయాయి. ఆయన దాదాగారి *"Beyond the Mind"* అనే పుస్తకం యిచ్చి, దానిని తెలుగులో ప్రచురించాలి అన్నారు. దాదాజీ గారి మొదటి పుస్తకం అది. దానిని భారతీయ భాషల్లో ప్రచురించాలని వారి అభిలాష. నన్ను తెలుగులో రాసి పెట్టమన్నారు. నాకంత ఓపిక లేదు. నేను స్వంత పుస్తకాలే రాయలేకుండా ఉన్నాను. ఇంక అనువాదం ఏం చేసి పెట్టగలను. డా॥ వసంతకుమార్ రికమెండేషన్ కనుక కాదనలేక 'చదివి చూస్తాను. నచ్చితే రాస్తాను' అన్నాను. చదివాను. బాగుంది. కొత్త పోకడ, కొత్త ప్రయత్నం. రచనలో మౌలికత ఉంది. తనదైన స్వతంత్రత – బావుంది అనుకున్నాను. మాస్టర్ యోగాశ్రమం ప్రచురణగానే వచ్చింది "అతీత మానసం". ఊహించనివిధంగా మన పాఠకులు ఆదరించారు. స్పందించారు. అదే సమయంలో దాదాజీ ఆత్మకథ *"Intelligence Beyond Thought"* ఢిల్లీలో ఆవిష్కరణ జరిగింది. దాదాజీ నాకో పుస్తకం పంపారు. ఆత్మకథలంటే నాకు ఆసక్తి. ఇష్టంగానే చదివాను. లోగడ పరమహంస యోగానంద 'ఒక యోగి ఆత్మ కథ', యోగి రామ 'హిమాలయ యోగులు' పాఠకులకు పరిచయం. ఆ కోవలోదే దాదా గవంద్ ఆత్మకథ. నేను తెలుగులో రాస్తానని దాదాజీకి ఉత్తరం రాశాను. వారు వెంటనే జవాబు రాశారు 'గో ఎ హెడ్' అని. గురుపౌర్ణమి రోజున ప్రారంభించి నెలరోజుల్లో శ్రావణ పౌర్ణమి నాటికి రచన పూర్తి చేయగలిగాను.

Intelligence Beyond Thought కు నేను పెట్టినపేరు "పరేంగిత ప్రజ్ఞ". ఈ పేరు చూస్తే ఇది స్వీయకథ అనుకోకపోవచ్చు కాని ఇది నిజమైన "ఆత్మ" కథ. పది కాలాలపాటు నిలిచే పుస్తకం అని నా ఆత్మ విశ్వాసం. చదివిన ప్రతి ఒక్కరి గుండెతలుపు తట్టి నిద్రలేపి, చైతన్య పరచగలదని మరొక నమ్మకం. ఈ మంచి పుస్తకం మీకు అందడానికి కారకులు ముగ్గురు: శ్రీ కె.ఎస్.వి. చారి (ముంబయ్). వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. మా చిరంజీవి, మాస్టర్ యోగాశ్రమ సారధి, సంచాలకుడు డా॥ వాసిలి వసంతకుమార్‌కు, ప్రస్తుతం మా పుస్తకాలకు అందాలు దిద్దుతూ అన్ని విధాల సహకరిస్తున్న మంచి యోగమిత్రుడు శ్రీ ఎం.ఎస్. మూర్తికి నా అభినందనలు, ఆశీస్సులు.

A very very Real Spiritual AutoBiography

Master C.V.V. Namaskaram

పరేంగిత ప్రజ్ఞ

"దాదా గవంద్ ఆత్మకథ"

1. దైవఘటన

మన సమాజంలో 'వివాహం' ఒక మరపురాని మధురమైన అనుభూతి. జీవితాంతం స్మృతుల్లో భద్రంగా ఉంటుంది.

ఏ దేశంలోనైనా వివాహం భార్యాభర్తల ఆశలపల్లకి.

నూరు సంవత్సరాల సాహచర్యానికి అనుబంధం, ప్రేమబంధం వివాహ బంధం.

బంగారు భవిష్యత్తుకు అతిసుందరమైన మెత్తనిబాట.

పెళ్లయిన కొత్తల్లో కమ్మని కలలు కంటూ గతాన్ని, బాల్యాన్ని మరచిపోతారు. సుమధుర శృంగార స్వప్నాలలో విహరిస్తారు. జీవితాంతం సుఖసంతోషాల తూగుటుయ్యాలలు ఊగాలన్న ఊసులాట.

అది ఆనంద తరంగం. ఒక సాగరకెరటంలా సంసారసాగర కెరటం. వివాహ వేళ అందరిలో ఉత్సాహం ఉరకలు వేస్తుంది. వివాహం తర్వాత అలల ఉధృతం తగ్గుతుంది. కెరటం తీరాన్ని చేరుతుంది. వివాహంలో ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ఆశలు చివురిస్తాయి. కలల్లో బంగారు మేడల్లో కాపురం చేస్తారు. ప్రతి మనిషి జీవితంలో అది మధుర సంఘటన. కొందరికి చిత్రమైన మలుపు. పెళ్లి వేడుకల్లో అందరూ సంబరాలు పంచుకుంటారు.

1955లో, మా ఇంట్లో అలాంటి వివాహ వేడుక జరిగింది. ముంబయ్ దగ్గరలోని తానే మా ఊరు. తమ్ముడు రామ్ పెళ్లి దగ్గర పడుతోంది. తలా ఒకపని పంచుకుని ఉత్సాహంగా అందరూ పనులు చేస్తున్నారు. వంట ఇంటి హడావుడి ఓ ప్రక్కన. ఇంట్లో అందరికీ కొత్త బట్టలూ, పెళ్లి బట్టలూ, నగలు

నత్రా కొనుగోలు మరొక ప్రక్కన. ఆ రోజుల్లో పెళ్లి అంటే పెద్ద పండగతో సమానం. మూడు రోజుల పెళ్లి అంటే మాటలు కాదు.

ముహూర్తానికి మూడు నాలుగు రోజులు ముందుగానే మా చెల్లెళ్లు, బావలు, వారి పిల్లలు, దగ్గర బంధువులు వచ్చి చేరారు. ఇల్లంతా సందడి, కేరింతలు, తుళ్లింతలు, నవ్వులు, పువ్వులు. వరుడు రామ్ నా కన్న పన్నెండేళ్లు చిన్న. వాడిలో పెళ్లి కళ ఉట్టి పడుతోంది. తనకు బట్టలు కుట్టించుకున్నాడు.

మా నాయన మాధవ్‌రావ్ గవండ్ పోయి చాలా కాలమైంది. తమ్ముడు రామ్ పెళ్లినాటికి నా వయస్సు 38. ఇంటికి పెద్దవాడిని. బాధ్యతలు బరువులు మోస్తున్నవాడిని. మా ఇంట్లో చివరి శుభకార్యం యిది. పెళ్లి పెత్తనం నాది. ఏ లోటు రాకుండా చూస్తున్నాను. వచ్చే బంధువుల్ని స్నేహితుల్ని పరామర్శించడం, మర్యాదలు చేయడం పెద్ద పని. ఎవరికీ ఏ లోటు కలగకూడదు ... ఆచారం.

1935లో మా నాన్నగారు గతించేనాటికి నాకు పద్ధెనిమిదేళ్లు. ఆ రోజు నుండి ఇంటి బాధ్యత నాది. నేను పుట్టింది 1917లో ముంబయ్‌లో. నాన్న పోయిన తర్వాత అమ్మ, చెల్లెళ్లు, తమ్ముడు అందరి బాగోగులు చూచుకోవలసి వచ్చింది. పైగా వ్యాపారం. ఆడపిల్లలందరికీ పెళ్లిళ్లు చేశాను. రామ్ పెళ్లి నా చివరి బాధ్యత. పెళ్లి మూడురోజుల తర్వాత నా తల భారం తీరినట్లయింది. ఊపిరి పీల్చుకున్నాను.

ఇంక నా భవిష్యత్తు నిర్ణయించుకోవాలి. నా జీవన మార్గం నేను ఎన్నుకోవలసిన తరుణం. పైకి ఇంటి పనులు తలకెత్తుకుని చేస్తున్నా నా ఆంతర్యం వేరు. ఇటీవలి కాలంలో అంతరాత్మ పైకొచ్చి హెచ్చరిస్తోంది. నాది తీరని తపన. ఆరని జఠరాగ్ని. ఈ సుఖాలు, సంతోషాలు, సంపదలు నాకు తృప్తి కలిగించడం లేదు. నిన్న చేసిన పనే నేడు చేయడం, నిత్యకృత్యాలు విసుగు పుట్టిస్తున్నాయి. ఎన్నాళ్లు జీవించినా ఇదే బ్రతుకు.

కొంతకాలంగా మహాత్ముల జీవితాలు చదువుతూ, వారి బోధలు మననం చేసుకుంటున్నాను. జీవితాన్ని కొత్తకోణంలోంచి దర్శిస్తున్నాను. నా మనసు మార్పును కోరుతోంది. కొత్తదనం కాంక్షిస్తోంది. సత్యం ఏదో లీలగా ఊరిస్తోంది. శాంతి వేరే ఉంది. ప్రశాంతి కావాలి. ఉపశాంతులు చాలవు. పెద్దలు మనశ్శాంతి, ఆత్మశాంతి అంటారు. బంధాలు వదులుకోవాలంటారు. బాంధవ్యాలు తెంచు కోవాలంటారు. అంటే ఈ జీవితంలో పొందవలసింది మరేదో ఉంది. సంసారం – సుఖాలు కాదన్నమాట.

అంతరసత్యం ఏదో తెలుసుకోవాలి. అసలు 'శాంతి' అంటే ఏమిటి? అది ఎక్కడ, ఎలా లభిస్తుంది? ఆ నిగూఢ రహస్యం నాకు తెలిసేదెలా? కొంతకాలం ఆలోచనలకు కళ్లెం వేసి, మనసును నిగ్రహించి, కుటుంబ వ్యవహారాలు చూడక తప్పలేదు. ఇవన్నీ అనవసరపు బాధ్యతలు అనిపించేది. నాకు వీటినుండి విముక్తి కావాలి. అంతరాత్మ మేలుకొలుపు. ప్రశాంతి కావాలి. అంతర్వాణి పిలుపు. ఈ వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలు, సంసార సుఖాలపైన మోజు లేదు. అసలు వీటి అవసరమే నాకు లేదనిపిస్తోంది. జీవితంలో సాధించవలసింది మరేదో ఉన్నది.

గత మూడు దినాలు రంగరంగ వైభవంగా వివాహ వేడుకలు జరిగాయి. విందులు, వినోదాలు జరిగాయి. అంతా ఆర్భాటం. హడావుడి. అర్ధరాత్రి తర్వాత అలసిపోయి, నా గదికి వెళ్లాను. కొన్ని రోజులుగా పెళ్లి హడావుడివల్ల సరిగా నిద్రలేదు. నా లోపల శూన్యం ఆవరిస్తోంది. ఆ శూన్యంలో ఏదో అలజడి, కలవరం. ప్రశ్నలు పైకుబికి వస్తున్నాయి. జీవితం అంటే ఏమిటి? ఇదేనా జీవితం! ఇంతేనా జీవితం? ఏది గమ్యం? ఏది గమనం? ఏది సత్యం? ఏది నిత్యం? సంబరాలలో పాలుపంచుకోలేకపోయాను. నా మనసు అంతర్ముఖమైంది. జటిల సమస్యలకు శూన్యంలో సమాధానాలు అన్వేషించసాగాను.

నాలో అర్థం కాని శూన్యం. నాచుట్టూ శూన్యం. ఏం చేయాలో తెలియడం లేదు. అయోమయం. ఎటుసాగాలి? ప్రస్తుతజీవితంపైన అయిష్టత. ఆశలు లేవు. కోరికలు లేవు. అగాధంలో దిగబడిపోతున్న భావం. శూన్యం నన్ను భయపెట్ట సాగింది. ఆలోచన లేదు. డబ్బు ధ్యాస లేదు. సమాజంపట్ల బాధ్యత లేదు. ఈ బ్రతుకు ఎందుకు? ఎన్నాళ్లిలా?

స్పష్టంగా తెలుస్తోంది – జీవితంలో ఓ అధ్యాయం ముగిసింది. సగం జీవితం అయిపోయింది. కుటుంబానికి నా సేవలు ఇంక అవసరం లేదు. అందరూ పెద్దవాళ్లయ్యారు. నా జీవితం గురించి ఆలోచించుకోవలసిన సమయం ఇది. ఎందుకో ఎప్పుడూ పెళ్లిమీద మనసు లేదు. అందుకే పెళ్లి చేసుకోలేదు. పెళ్లితో నా జీవితాశయం నెరవేరదని అంతరాత్మ చెబుతోంది. సంసారం ఓ పెద్ద పంజరం. లక్ష్యసాధనకు సంసారం ప్రతిబంధం. పెళ్లి మనిషికి బాధ్యతల్ని పెంచుతుంది. బంధాలను పెంచుతుంది.

బాధ్యతలు లేకుండా జీవించడం సాధ్యం కాదా! సంప్రదాయాల కబంధ హస్తాలలో బిగుసుకోకుండా జీవనం సాగదా? ఇవి నా తలపోతలు. తమ్ముని


పెళ్లికీ నా ప్రశ్నలకూ సంబంధం లేదు. ఇవి నా వ్యక్తిగత ప్రశ్నలు. నా జీవితం పట్ల నేను ఏర్పరచుకున్న అసంతృప్తి. నా కుటుంబం, సంప్రదాయం, సంస్కృతి నా గురించి నేను ఆలోచించేటట్లు చేశాయి. అవే నన్ను దూరం చేసుకున్నాయి. నన్ను ఒంటరిని చేశాయి. నేనేమిటో నన్ను అన్వేషించేటట్లు ప్రోత్సహించాయి. చాలా కాలంగా నాలో గూడు కట్టుకున్న ఆలోచనలు ఇవి. ఒక్క రోజులో పోగైనవి కావు. ఇప్పుడు నా సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం వచ్చింది. అన్ని ఆలోచనలు ఒకచోట చేరి సమాలోచనలు జరిపాయి.

మా కుటుంబం చెప్పుకోదగ్గ సంపన్నకుటుంబమే. సమాజంలో మాకు హోదా, గౌరవం, గుర్తింపు ఉన్నాయి. ఇంటిగౌరవాన్ని కాపాడవలసిన బాధ్యత ఇంటి పెద్దగా నాపైన ఉంది. కనుక అందుకు భిన్నంగా జీవించే అవకాశం లేకపోయినా అవసరం తన్నుకొచ్చింది. ఇంతకాలం మర్యాదల ఉచ్చుల్లో చిక్కుబడి, సంప్రదాయానికి బందీనై జీవిస్తూ వచ్చాను. సమాజంలో నాకొక స్థానం ఉంది. విలువ ఉంది. గుర్తింపు ఉన్న కారణంగా ఇంటి పరువు మర్యాదలు కాపాడడానికి కొన్ని మంచి పనులు చేయాలి. దానధర్మాలు చేస్తుండాలి. బంధువుల్ని, అతిథి అభ్యాగతుల్ని ఆదరించాలి. 23వ ఏట, నేను 'తానే' పురపాలక సంఘం సభ్యుడినైనాను. ఆ విజయం నా అంతస్థును పెంచింది. శక్తి మేరకు ప్రజాసేవ చేశాను. ఆ సేవవల్ల నాకు వొరిగింది లేదు.

పురపాలకసంఘంలో సేవ వల్ల అసమానతలు నిర్మూలించగలగాలి. అందరినీ సమదృష్టితో చూడాలి. ఎవరిలో ఎలాంటి మార్పు రాలేదు. చట్టాలు చేసినా ప్రజల జీవన సరళిలో మార్పు రాలేదు. కాదంటే జనంలో కాస్త సభ్యత, సంస్కారం, సఖ్యత పెరిగాయి. ఆ మార్పులు వీధి వరకే పరిమితం, బయట ప్రవర్తనకే పరిమితం. ఇంట్లో వ్యవహారం మామూలే. మనిషి ఆంతర్యంలో మార్పు రావాలి. మనిషిలో స్వార్థం నశిస్తే తప్ప ఆంతర్యం మారదు. ఎంత చేసినా మనిషిలో స్వలాభం, స్వార్థం తప్ప సమతా దృక్పథం అలవడే అవకాశం లేదు.

మా బంధువులు, మిత్రులు చాలామందిని గమనించాను. అందరూ అభ్యుదయం అని అంగలార్చే వారే తప్ప మారడానికి సిద్ధమైనవారు కనిపించలేదు. సంప్రదాయాలు వదలరు. ఆచారాలలో, నమ్మకాలలో మరింతగా కూరుకుపోతారు తప్ప బయటకు రారు. కొత్తను హర్షిస్తారు, అభినందిస్తారు. ఆచరణలోకి రానీయరు. దానివల్ల వేషభాషలలో మార్పు కనిపిస్తుంది తప్ప జీవిత విధానాలు మారవు. పైపై మెరుగుల వల్ల ఆంతర్యం మారదని గ్రహించాను. సమాజం వేరు, కుటుంబం

వేరు కావు. రెండూ వ్యవస్థ లోపలి భాగాలే. అవి రెండూ సమాంతరంగా నడుస్తాయి. సమాజం ముద్ర మనిషిపైన పడుతుంది. మనిషి ప్రభావం సమాజాన్ని మార్చడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. సమాజం మనిషిని ఎదగనీయదు, మారనివ్వదు.



పదహారేళ్ల ప్రాయంలో ...

నేను కోరేది మనిషిలో సంపూర్ణమైన మార్పు. మనిషిలోపల మార్పు. మనం 'జీవితం' అని మురిసిపోతున్న ఈ నాటకం అంతా బూటకం, కృత్రిమం. ఇంతకాలంగా సాగుతున్న నాటకంపైన తెరదించాలి. జీవితం అంటేనే విరక్తి కలుగుతోంది. కుటుంబ సభ్యులపైన, వ్యాపారాలపైన, సామాజిక మర్యాదలపైన పట్టుసడలిపోయింది. ఈ బంధాలు ఏవీ శాశ్వతం కాదు. ఈ ప్రేమలు, ఇష్టాలు గాలిబుడగల్లాంటివి, ప్రయోజనం లేనివి అనిపించాయి.

నా గదిలో ఒంటరిగా ఉన్నా నిద్ర రావడం లేదు. 'కర్తవ్యం ఏమిటి?' నా ముందు నిలిచిన ప్రశ్న. ఈ సమాజం నాకు వద్దు. ఈ కుటుంబానికి నా అవసరం లేదు. ఎవరికోసం నేను జీవించాలి? సంప్రదాయాలు ధిక్కరించి పోతేనేం? ఎవరు పట్టించుకుంటారు? నేను లేకపోతే ఎవరికి నష్టం? ఇవి ఒకరితో చర్చించ దగిన విషయాలు కావు. ఇవి నా మనస్సుకు పరిమితం. ఆత్మప్రబోధాలు. అమ్మతో

గాని, చిన్నాన్నలతో గాని ముచ్చటించే విషయాలు కావు. నా వరకు స్పష్టంగా అనిపించింది – నా జీవితంలో ఈ అధ్యాయం ముగింపుకు వచ్చిందని.

మనస్సు నిండా చీకట్లు ముసురుకున్నాయి. దారీ తెన్నూ కనిపించడం లేదు. ఆలోచించడం అనవసరం అనిపించింది. ఆలోచనల్తో పరిష్కారం లభించే సమస్య కాదది. ఇది ఆత్మసంబంధం. మనస్సుకు సంబంధం లేనిది. వాస్తవానికి, తర్వాత ఏమిటన్నది నాకూ తెలియదు. పెళ్లి హడావుడి తగ్గింది. ఇంట్లో సందడి చల్లబడ్డది. బరువు తీరింది. నాకు కావలసింది అంతవరకే. అదే ఊరట, నిశ్చింత. అయినా తెల్లవార్లు జాగారం చేశాను ... నిద్ర రాక.

మర్నాడు పెళ్లి బాకీలన్నీ సర్దుబాటు చేశాను. ఇంకా కొందరు దగ్గరి బంధువులున్నారు. వేటితోనూ, ఎవరితోనూ నాకు సంబంధం లేదు. ఏకాంతం నన్ను పిలుస్తోంది. అన్ని బంధాలు వదిలించుకోవాలి. అమ్మంటే నాకిష్టం. మనిషికి అన్ని బంధాలు పోయినా కన్నతల్లితో పేగుబంధం పోదు. జన్మనిచ్చిన తల్లి కదా! చెల్లెళ్లు, తమ్ముడు నాకు ఇష్టులే అయినా ఎవరూ నా వారు కారు, నేను ఎవరికీ ఏమీ కాను.

మనం మంచి, చెడు అని చెప్పుకునేవి రెండు గుణాలు కావు. ఒక్కటే. మంచికి నీడ చెడు. వెలుగు నీడ చీకటి. కోపం, ద్వేషం, అనారోగ్యం, బాధలు, సుఖాలు అన్నీ జీవితంలో కలిసే ఉంటాయి. అందువల్లనే ఎవరికీ పూర్తి మనశ్శాంతి ఉండదు. సుఖం దక్కదు. ఎత్తుపల్లాలు, ఉచ్ఛనీచాలు అన్నీ చిరకాలం కలిసి సాగుతూనే ఉంటాయి. ప్రతి ఒక్కరి జీవితంలో భౌతిక సుఖాలు, ఉద్రేకాలు ప్రముఖపాత్ర వహిస్తాయి. అవి అన్నీ కలవడమే జీవితం. కాని జీవిత పరమార్థం వేరు.

నాన్న చనిపోయారు. ఇద్దరు చిన్నాన్నలు పోయారు. నా కనిపించింది – ఎవరూ శాశ్వతంగా ఉండరని. భయపడడం అనవసరం. దిగులు తాత్కాలికం. ఎన్ని ఘనకార్యాలు చేసినా మనిషికి మరణం అనివార్యం. మరణ భయం తప్పదు. విచారం, అనిశ్చితి – మనిషిని మృత్యుద్వారం చేరుస్తుంటాయి.

నాకు అర్థం కానిది – జీవితాంతం పడే కష్టాలకు, యాతనలకు ఫలితం ఏమిటి? తాత్కాలికంగా బాధలు పోగొట్టుకుని సుఖపడుతున్నాం అనుకోవడమా! ఆ సుఖాలు, ఆనందాలు తాత్కాలికమే కదా! జీవితానికి లోతైన అర్థం లేదా? వేరే ఏదైనా లక్ష్యం, ఆదర్శం ఉండదా? కోరికలు తీరడం, ఆశలు నెరవేరడంతో జీవిత లక్ష్యం నెరవేరినట్లా? కాదేమో!

నా కనిపిస్తుంది – మనిషి తన చుట్టూ మెత్తని పట్టుదారాలతో వల అల్లుకుంటాడని. చివరకు ఆ వలలోంచి బయటపడడు. అక్కడే సోమరిగా యావజ్జీవం బందీగా పడి ఉంటాడు. అలా సంసార కారాగారంలో బ్రతకడమే జీవితమా? ఆ వలయాన్ని ఛేదించుకుని, బంధాలు త్రెంచుకుని, స్వేచ్ఛగా జీవించలేడా? అప్పుడు వాంఛించిన ఆత్మశాంతి లభించదా? జీవించడానికి 'ఆత్మ' సహకారం అవసరం. అప్పుడే జీవితానికి పూర్ణత్వం లభిస్తుంది. జీవితలక్ష్యం నెరవేరినట్లు. ఓ చిన్నవిత్తనం కఠిన శిలను సైతం ఛేదించుకుని మొలకెత్తుతుంది. ఒకసారి ఆత్మ స్పృహ కలిగితే మనిషి మహాత్మగా ఎదగగలడు. మనిషి తనలోనే మరొక మనిషిని, మనీషిని దర్శించగలడు!

అది నా జిజ్ఞాస. నాలో కదలిన భావవీచిక లవి. ఇంట్లో అన్ని వనరులు, వసతులు ఉన్నాయి. సమాజం సుఖాలు, ఆనందాలు అందించడానికి సిద్ధంగానే ఉన్నా అందుకునే ఆరాటం నాలోనే లేదు. నన్ను శూన్యం నిండా క్రమ్ముకుంది. నాలో నీరవ నిశ్శబ్దం. నా చుట్టూ స్తబ్దత. గుండెలోతుల్లో మథనం. క్రమంగా మబ్బులు విడిపోసాగాయి. కొత్త గవాక్షాలు తెరచుకుంటున్నాయి. కొత్త గాలి వీస్తోంది. కొత్త అర్థాలు తోస్తున్నాయి. ఏ బంధాలు నన్ను అలరించలేకపోతున్నాయి. ఏ ప్రలోభాలు నన్ను తాకడం లేదు. పారవశ్యం లేదు. మనసు 'పర'వశం అయింది. చుట్టూ ముడులు పడ్డ పట్టు దారాల పట్టుపోయింది. ప్రస్తుత పరిస్థితి నుండి ఎలాగైనా బయటపడాలి. అది తక్షణ కర్తవ్యం. విముక్తం కావాలి. స్వేచ్ఛ పొందాలి. అదే తరుణోపాయం.

అంతలో మరొక ప్రశ్న తలెత్తింది. ఇలా వైరాగ్యంతో, ఆత్మను అన్వేషించాలంటే అనువైన ప్రశాంత వాతావరణం అవసరం. నేనున్న చోటు, ఈ పరిసరాలు బొత్తిగా పనికిరావు. వేరేచోట వెతకాలి. మానసిక మథనం ఎక్కువైంది. చివరకు ఇల్లు వదలి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాను. కుటుంబం వద్దు, సంపాదన వద్దు. ముందుగా ఈ ఉచ్చులోంచి బయటిపడితే చాలు. అప్పుడు చూచుకోవచ్చు. ఇంతకాలం చేయలేని సాహసం ఇప్పుడు చేయాలనిపించింది.

అన్వేషణ సక్రమంగా సాగాలంటే వ్యాపకాలుండకూడదు. ప్రశాంతత కావాలి. వాతావరణం అనుకూలించాలి. కాలాన్ని పూర్తిగా ఉపయోగించుకోగలగాలి. అంటే, ఇల్లు వదలి వెళ్లిపోవడం మొదటిపని. ఎటో వెళ్లిపోవాలన్న నిర్ణయం జరగగానే మనస్సు విహంగం లాగా ఆకాశంలో విహరించసాగింది. మనస్సులో ఆనందం. ఏదో అజ్ఞాత శక్తి నాలో కదలినట్లయింది. అదే

ప్రోత్సహించి, ముందుకు నడిపిస్తుందని నమ్మకం ఏర్పడ్డది. హృదయం ప్రోత్సహించినట్లు చేయడమే మంచిది. అంతరాత్మను గౌరవించాలి.


నాలుగురోజుల వ్యవధిలో ఎంత మార్పు! ఇంకా బంధువులు అంతా వెళ్లనే లేదు. ఎవరికీ నా పట్ల ఆసక్తి లేదు. నా అవసరం లేకపోతే నన్ను ఎవరూ పలకరించరు. నేను ఎవరివైపు చూడను. ఒక సంచిలో బట్టలు సర్దుకున్నాను. కట్టుకునే బట్టలు, పక్కబట్టలు చాలా స్వల్పంగా. పడుకోడానికి ఒక చాప ... నా ప్రయాణం ఎక్కడికో నాకే తెలియదు. అది విజ్ఞతో, అజ్ఞతో తెలియదు. నిర్ణయం జరిగిపోయింది. భవిష్యత్తు గురించిన ఆశ లేదు, ఆలోచన లేదు. ఇది దైవఘటన.

అలా బయటకు వెళుతున్నానని అమ్మకు చెప్పాను. పని భారంతో అలసిపోయానని అమ్మ అనుకుంది. అప్పుడప్పుడు తీర్థయాత్రలకు, గుళ్లు గోపురాలు దర్శించడానికి, ఏవైనా మీటింగులకు వెళ్లడం నాకు అలవాటు. ఓ పదిరోజుల తర్వాత తిరిగి వస్తాను, ఎవరూ కాదనరు, వారించరు. పెళ్లి పనులతో అలసిపోయి విశ్రాంతికోసం వెళుతున్నానని అనుకున్నారు. నా మనసులోని భావం ఎవరికీ తెలియదు, తెలియవలసిన అవసరం లేదు.

నేను వెళ్లడం కనిపించని తీరాలకని నాకు మాత్రమే తెలుసు. నా గమ్యం అగమ్యం అని నాకే తెలుసు. అమ్మ కాళ్లకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నాను. నమస్కారం చేస్తున్నప్పుడు నా కళ్లలో తడి కనిపించిందేమో అమ్మ గాభరాపడ్డది. వెంటనే తిరిగి వచ్చేట్లయితే ఈ వీడ్కోలు నమస్కారం ఎందుకు అనుకున్నదా?! అమ్మ పాదస్పర్శ తగలగానే నా కళ్లు చెమర్చాయి. కన్నీరు ఆపుకోలేకపోయాను. ఉద్వేగం పొంగి వస్తోంది. మళ్లీ అమ్మను ఎప్పటికి చూస్తానో? అసలు చూడగలనో, లేదో, అదీ అనుమానమే. అందరికీ సెలవు చెప్పాను. ఇల్లు వదలి, గుమ్మం దాటి బయటపడ్డాను, గుండె బరువుతో.

ఇంటికీ నాకూ ఋణం తీరిపోయింది. ఎక్కడికి పోవాలో తెలియదు. ఒక గమ్యం లేదు. ఆ క్షణం నుండి కాలతీరం వెంట ప్రయాణం. నా కాళ్లు ఎటు నడిపిస్తే అటు నడవడం.

అది అనంతంలోకి ఆహ్వానం.



2. ఎవరికీ కనిపించని చోటుకు ...

సరాసరి రైల్వేస్టేషనుకు చేరాను. కొంతసేపు బల్లపైన కూర్చుని వచ్చీపోయే వారిని గమనించాను. ఎక్కడికి నా పయనం? ఏది నా దారి? మన దేశంలో పుణ్యక్షేత్రాలకు, దేవాలయాలకు కొదవలేదు. లోగడ చాలా తీర్థయాత్రలు చేశాను. కొన్ని పరిచయమే. ఎక్కడికి వెళ్లాలన్నది తేల్చుకోలేక పోతున్నాను. నాకు తెలిసిన వారు ఎవరూ ఉండనిచోటుకు, ఎవరూ నన్ను గుర్తించనిచోటుకు పోవాలి. నేనున్న తావు మా బంధువులకు, స్నేహితులకు అసలు తెలియకూడదు. కొంతకాలం అజ్ఞాతంగా గడపాలని కోరిక.

అంతలో మైకులో ప్రకటన – ముంబయ్ నుండి పూనే వెళ్లే రైలు ముప్ఫయి నిమిషములు ఆలస్యంగా నడుస్తున్నది ... అప్పటికి రావలసిన రైలు అరగంట లేటు. నా కోసమే లేటుగా వస్తున్నదా? మరొక ఆలోచన లేకుండా వెళ్లి పూనేకు టికెట్ కొన్నాను. రైలు వచ్చిన వెంటనే వెళ్లి అంతగా జనం లేని బోగీలో ఎక్కి కూర్చున్నాను. ఒక మూలన ఒదిగి కూర్చున్నాను ... జనం అంటే చిరాకు కలుగుతూంది.

పూనే చేరడానికి అయిదుగంటలు పట్టింది. మనసంతా శూన్యంగా ఉంది. ఒక్క ఆలోచనా లేదు. మామూలుగా చేసే పనుల ఒత్తిడి లేదు. కొంతసేపు నిశ్చలంగా సాగింది. తర్వాత బుర్ర వేగంగా పనిచేయసాగింది. ఆలోచనల్లో దిగులు ... అమ్మ తమ్ముడు చెల్లెళ్లు రాసాగారు. అందరినీ వదలిపోతున్నందుకు దిగులనిపించింది. ఏడ్చాను బిగ్గరగా, నిస్సిగ్గుగా ఏడ్చేశాను. కన్నీళ్లతో చెక్కిళ్లు తడిశాయి. గుండె బరువు తగ్గింది. ఇన్ని సంవత్సరాల బాధ్యతాయుత జీవితానికి

సడన్‌గా బ్రేక్ పడ్డది. నాలో ఏదో కరిగిపోతున్న అనుభూతి. రైలు ముందుకు సాగుతున్న కొద్దీ అయోమయం. సంకెలలు తెగిపోతున్న సవ్వడులు గుండెకు వినిపిస్తున్నాయి.

కాలం వెనక్కి నడిచింది. పసివాడిలా మారిపోయింది మనస్సు – బేలతనం. అమాయకత్వం. అసహాయత. అభద్రతా భావం. అమ్మను, అయినవారిని, కుటుంబాన్ని వదలిపోవడం బాధగానే ఉంది. అది దుస్సాహసం. అయిదు గంటల ప్రయాణంలో ఒకే యాతన. కిటికీ పక్కన కూర్చుని బయటకు చూస్తున్నా ఏవీ మనసుకు పట్టడం లేదు. మనసులో చొరబడడం లేదు. ఎవరితోనూ మాట్లాడాలని పించలేదు. అంతర్వేదన.

రైలు పూనే స్టేషన్‌లో ఆగింది. దిగవలసిన వాళ్లంతా హడావుడిగా దిగిపోతున్నారు. అదే చివరి స్టేషన్. అయినా తొందర అందరికీ. ఏ తొందరా లేని వాడిని నేనొక్కడినే. దిగి ఏం చేయాలో తెలియదు. రైల్లోనే కూర్చున్నాను– నిరామయంగా, నిర్విచారంగా. పోర్టరు వచ్చి హెచ్చరించాడు దిగమని. ఎంతసేపు అలా ఉండిపోయానో, రైలు ప్రక్కలైను మీదికి చేరింది. రైలు దిగి వచ్చి ప్లాట్‌ఫారం పైన బెంచీపైన కూర్చున్నాను. నా ప్రక్కన సామానుల సంచీ. ఒక పోర్టరు వచ్చి 'ఎక్కడి పోవాలి స్వామీ' అని పలకరించాడు బేరం దొరుకుతుందని. అవసరం లేదని చెప్పాను. ఇకపైన నా సామాను నేనే మోసుకోవాలి. నా బరువు మరొకరి పైన వేయకూడదు. కొంతసేపు అక్కడినుండి కదలలేదు. మనస్సు గజిబిజిగా ఉంది. ఎక్కడికైనా వెళ్లాలి? అదే ఎక్కడికని!?

స్టేషను దాటి బయటికొచ్చాను. రోడ్డుకి అవతలి వైపు 'ధర్మశాల' బోర్డు కనిపించింది. కొన్ని రోజులు యాత్రీకులు ధర్మశాలలో ఉచితంగా ఉండవచ్చు. ఆ రాత్రి అక్కడ గడపాలనుకున్నాను. వెళ్లి ఆఫీసులో అడిగాను. ఒక్కరికైతే ప్రత్యేకంగా గది ఇవ్వమని, హాలులో పడుకోమని చెప్పారు. కుటుంబంతో వచ్చిన వారికే గదులు.

హాలులో కొత్తవారితో కలిసి పడుకోవాలి. తెలియని వారితో కలిసి పడుకోవడం ఎలా? గది దొరకనందుకు చిరాకు పడ్డాను. చిరాకుకు కారణం అహంకారం. అందరితో కలిసి పడుకోవడానికి నామోషీ! హోటల్ గది తీసుకునే స్థోమత లేదు. నా పరిస్థితి గుర్తు రాగానే అహంకారం తలవంచింది. కాలాను గుణంగా మసలుకోవాలి! నేనిప్పుడు ఒక సామాన్యుడిని. డబ్బు గలవాడిని కాదు.

ఏ విలువ లేనివాడిని. గుర్తింపు లేనివాడిని. పైగా సంసారిని కాను. కుటుంబీకుడిని కాను. ఒంటిరిని, బికారిని. పరిస్థితికి తగినట్లు తలవంచాలి. వొదిగిపోవాలి. వరండాలో ఒక మూలన చేరి చాప పరచుకున్నాను. అంత విశాలమైన హాలులో అందరిమధ్య ఉన్నా నేను ఏకాకిని. ఒంటరివాణ్ని. కాస్త మనసు జారింది. బింకం సడలింది.

పూనే నగరం గొప్ప విద్యాకేంద్రం, యాత్రా స్థలం. అనేక దేవాలయా లున్నాయి. అనేక ఆధ్యాత్మిక ఆశ్రమాలు ఉన్నాయి. అది లక్ష్మీనగరం, సరస్వతీ నిలయం కూడా. యాత్రీకులతో నగరం నిత్యనూతనంగా ఉంటుంది. ఉదయం నగరం మేల్కొంది. నగరంతో పాటు నేనూ కళ్లు విప్పాను. హాలు బయటకు వెళ్లి ఆరు బయట చాప పరచుకు కూర్చున్నాను. ధర్మశాలకు జనం వచ్చేవారు వస్తున్నారు, పోయేవారు పోతున్నారు. అది యాత్రానివాసం కదా. నేను దాని గురించి ఆలోచించడం లేదు. ఏం ఆలోచించను?! ఆలోచించవలసిన రోజులు పోయాయి. బుద్ధితో పనిలేదు. జ్ఞానం కోసం అంగలార్చే వాడికి బుద్ధితో ఏంపని? బుద్ధిని వదలినవాడే జ్ఞాని కాగలడు. వచ్చే పోయే వారిని చూస్తుండడమే అప్పటికి పని. వాళ్లందరిలో తొందర, నడకలో తొందర, ఆలోచనల్లో తొందర. దేనికోసం ఆ పరుగులు?

ఆకలవుతోంది. వేళకు ఆకలివేస్తుంది తినడానికి అన్నం లేకపోయినా. సంచిలో ఉన్న టిఫిన్ బాక్సు తీశాను. రెండు, మూడు రోజులకు సరిపడా అమ్మ ఏవేవో ఫలహారాలు చేసిపెట్టింది. పెళ్లి ఇంట్లో ఫలహారాలకేం తక్కువ. తింటూంటే అమ్మ కళ్లలో మెదిలింది. ఆప్యాయంగా అమ్మ వడ్డిస్తే తినేవాడిని. ఇప్పుడు అమ్మ లేదు. నేను పెట్టుకుని తినాలి. ఇకపైన నా పనులన్నీ స్వయంగా చేసుకోవాలి. నా కెవరున్నారు? ఎవరూ లేనివాడిని! ఒంటరిని. చుట్టూ జనం కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు. నా గురించి ఎవరికీ పట్టదు. ఎవరికి ఎవరు ఈ లోకంలో! ప్రపంచమే ఒక పెద్ద పాంథశాల.

"నా కెవరూ లేరు. కుటుంబం లేదు. బంధువులు లేరు – అన్న భావన కలగడమే వైరాగ్యానికి తొలిమెట్టు. సన్యాసజీవితానికి స్వాగత వచనం అది. నా ప్రస్థానం. మూడు రోజులు పూనే ధర్మశాలలోనే ఉన్నాను – ఉత్తినే, ఎక్కడికి వెళ్లాలో తోచక. చదువుకోవడానికి పుస్తకాలు లేవు. అయినా నేను తప్పిపోయాను. తప్పి పోయానా! ఓడిపోయి పారిపోతున్నానా? గుండె లయ తప్పింది. లోపల కల్లోలం. గమ్యం లేని ప్రయాణం. 'అహం' ఘోరంగా అవమానం పాలైంది.

హోదా లేదు, గుర్తింపు లేదు, విలువ లేదు. ఇంక 'అహం'కరించే అవకాశం ఏదీ! సత్రంలో మూడురోజులే ఉండనిస్తారు. మరొకచోటుకు పోక తప్పదు. ప్రపంచంలోకి వచ్చిన ప్రతి జీవుడు కొంత కాలమే ఉంటాడు. తర్వాత మరణం తప్పదు. మరణం అంటే నిష్క్రమణం. వెళ్లి పోవడం! ఎక్కడకో తెలియని చోటుకి, లేదా బయలుదేరిన చోటుకు. ధ్యానానికి అనువైన తావులు చాలా ఉన్నాయి. ఎక్కడకు వెళ్లినా అయినవారికి దొరికిపోతాను. వచ్చారో, ఇంటికి తీసుకుపోతారు. ఎవరికీ కనిపించని, అందుబాటులో లేని 'అజ్ఞాత' ప్రదేశం చేరుకోవాలి.

మూడవనాడు ధర్మశాల వదలక తప్పలేదు. ఫలానా తావు అని నిర్ధారణ లేదు. ఆ ఉదయం హాలులో కూర్చుని ఉండగా, ఏడెనిమిది మంది గుంపుగా వచ్చి, నా దగ్గరగా కూర్చుని ఫలహారాలు తింటూ, కబుర్లు చెప్పుకోసాగారు. వారంతా 'సజ్జన్‌ఘడ్' పర్వతంపైకి వెళ్లబోతున్నారు. అక్కడ స్వామి రామదాసు సమాధి ఉంది. మూడు వందల సంవత్సరాల క్రితం సమర్థ సద్గురువు అక్కడ సమాధి అయినారట. అది చాలా పవిత్ర స్థలమట. వారి సంభాషణ వింటుంటే అది నా ధ్యానానికి అనువైన ప్రదేశమని అనిపించింది. రామదాసు పవిత్రాత్మ నన్ను పిలుస్తోందా అనుకున్నాను. అదే నా తపోనిలయం. పది గంటలకు సజ్జన్‌ఘడ్ బస్సు బయలుదేరుతుందట. వారంతా ఆ బస్సుకు వెళ్లడానికి తొందర పడుతున్నారు.

మరో ఆలోచన లేకుండా, నా సంచీ సర్దుకుని బయలుదేరాను. బస్టాండుకు వెళ్లి చూస్తే చాంతాడంత క్యూ ఉంది. కండక్టర్ జనం వద్దకు వచ్చి టిక్కెట్లు యిస్తున్నాడు. నేను వెళ్లి క్యూలో నిలబడ్డాను. అంతలోనే సీట్లు అయిపోయాయి. నా ముందున్న ప్రయాణీకులు నలుగురైదుగురు బిక్క మొహం పెట్టారు. తర్వాతి బస్సుకోసం అయిదుగంటల నిరీక్షణ తప్పదు. క్యూలో నా ముందున్న వారు నిరాశగా వెళ్లిపోయారు. నేను కదలలేదు, అక్కడే కూర్చుని తల పట్టుకున్నాను. అయిదు నిమిషాల్లో కండక్టర్ నా వద్దకు వచ్చి 'నీవు సజ్జన్‌ఘడ్ వెళ్లాలా' అని అడిగాడు.

ఆశ్చర్యంగా 'అవును' అన్నాను.

"వెళ్లి బస్సెక్కు పో. నాలుగో నంబరు సీట్లో కూర్చో పో" అన్నాడు.

ఆ సీటు ముందుగా రిజర్వ్ చేసుకున్న పెద్దమనిషి రాలేదట. నా చెవుల్ని, కళ్లను నేనే నమ్మలేకపోయాను. నిజానికి ఆ సీటు నా ముందున్న నలుగురిలో

ఎవరికో దక్కాలి. నాకు దక్కింది. అదృష్టం అభాగ్యులను సైతం వెతుక్కుంటూ వస్తుందేమో.

నాలుగైదు గంటల బస్సు ప్రయాణం. మనసు కల్లోలంగా ఉంది. ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. ఎక్కడికో పోతున్నాను. అక్కడ నన్ను తెలిసిన వారు ఎవరూ ఉండరు. ఎవరూ నన్ను వెతుక్కుంటూ వచ్చే అవకాశం ఉండదు. ప్రక్క పాసింజర్లతో కబుర్లు ప్రారంభించాను. నేను కట్టుకున్న బట్టలు చూస్తే గొప్పింటి వాడిననిపిస్తాయి. నేను సజ్జన్‌ఘడ్ వెళుతున్నందున వారు ఆశ్చర్యపడ్డారు.

'మనం వెళ్లే కొండపైకి వెళ్లే బస్సు వెళ్లిపోతుంది. సరాసరి కొండపైకి వెళ్లడం కుదరదు. రాత్రికి 'సతారా'లో ఆగి, ఉదయం బస్సుకు వెళ్లండి' అని సలహా చెప్పారు.

నేను ఎవరో తెలియదు. అయినా దయతో సలహా యిచ్చారు. వారే ఆ రాత్రికి నాకు భోజనం, వసతి ఏర్పాటు చేశారు. చక్కని భోజనం, మంచి కబుర్లు. వారు సనాతన కుటుంబీకులు. సంప్రదాయ నిబద్ధులు. కొండపైన నేను ఏం చేయదలచిందీ గుచ్చిగుచ్చి ఆరాలు తీశారు.

"నాకు ప్లాను అంటూ ఏమీ లేదండి. కొంతకాలం అందరికీ దూరంగా, ప్రశాంతంగా ఉందామని వచ్చాను. వ్యాపారం, కుటుంబం పట్ల ఆసక్తిపోయింది. సుఖాలపై మోజు లేదు. జీవితానికి అర్థం తెలుసుకోవాలన్న జిజ్ఞాస. దానిని మహర్షులు 'ఆత్మశాంతి' అంటారు. మామూలు వారు 'మనశ్శాంతి' అంటారు. పుస్తకాలలో చాలా చదివాను. అనుభవంలో తెలియదు. అది నాకు కావాలి. ఈ పవిత్ర పర్వతంపైన నా అన్వేషణ ఫలిస్తుందని ఆశిస్తున్నాను. పరమార్థం తెలుస్తుందని నమ్మకం".

వారు నా ధోరణికి అవాక్కయినారు.

ఉదయం ఫలహారం తర్వాత వారే నన్ను బస్టాండుకు తీసుకువెళ్లారు. తొమ్మిది గంటలకు సజ్జన్‌ఘడ్ బస్సు. గంట ప్రయాణం. చరిత్ర ప్రసిద్ధి చెందిన ఆ పర్వత పాదం వద్ద బస్సు ఆగింది. అక్కడ దిగి యాత్రీకులు కొండ ఎక్కాలి. నాలుగు కిలోమీటర్ల దూరం. కూలీలు చుట్టుముట్టారు సామాన్లు మోస్తామని. వద్దని వారించాను. నా బరువులు నేనే మోయాలని నిర్ణయించుకున్నాను. ఎవరికీ నేను భారం కాకూడదు.

సామానుతో కొండ ఎక్కుతుంటే శ్రమ తెలిసింది. ఒక్కరుగా ఎక్కడమే కష్టం. పైగా సామాను మోత. ఇంతకాలం జీవితంలో బరువు మోసే అవసరం కలగలేదు. మామూలు యాత్రీకుడినైతే కూలీ నెత్తిన సామాను పెట్టే వాడిని. ఇప్పుడు నా యాత్ర వేరు! ఇది అనంతయాత్ర గదా! మధ్యమధ్య ఆగి, అలుపు తీర్చుకోవలసి వచ్చింది. వేసవి కాలం. పైగా ఎర్రని ఎండవేళ. మిగిలిన వారు కూలీలను కుదుర్చుకున్నారు సామాన్లు మోయడానికి. వారంతా నాకంటే ముందుగా పోగలుగుతున్నారు. అపరాహ్నం వేళకు కొండపైకి చేరాను. అలసిపోయాను. సమాధికి అవతలగా ఒక దేవాలయం, దానికి ఆనుకుని ధర్మశాల ఉన్నాయి. సత్రం ఆఫీసుకు వెళ్లి గది కావాలని అడిగాను. దేవాలయానికి దగ్గరగా ఒక గది యిచ్చారు. దేవాలయానికి వచ్చే భక్తులు ఎక్కువ. ఎప్పుడూ సందడిగా ఉంటుంది. భజనలు, పాటలు, హారతులు – అంతా కోలాహలం. ఆ రాత్రి నాకు నిద్ర లేదు. భక్తులు తెల్లవార్లు భక్తిని ప్రవహింప చేస్తూనే ఉన్నారు.

తెల్లవారి మరొక గదిని అన్వేషించాలి. ఇంత జనం మధ్య నేనుండలేను. నాకు కావలసింది ప్రశాంతి. అదరగొట్టే భక్తి కాదు. పైగా అంత మంది జనంలో ఎవరో ఒకరు నన్ను గుర్తించే ప్రమాదం ఉంది. కొండపైన చాలా చోట్ల గాలించాను. అంతా అడవి. మనిషి జాడలేదు. జనావాసాల్లో తిరిగాను ఎక్కడైనా ప్రశాంతమైన గది కోసం. ఎవరికీ అలాంటి ప్రదేశం తెలియదన్నారు.

అయినా నా అన్వేషణ ఆపలేదు. అది తపన. తిరగ్గా తిరగ్గా ఒక చిన్న కుటీరం కనిపించింది. ఏడు, తొమ్మిదడుగులు సైజుది. ఒక చిన్న ద్వారం. చిన్న కిటికీ. ఆ కుటీరం పరిసరాలు నాకు నచ్చాయి. అందులో ఎవరూ ఉండడం లేదు. దేవాలయానికి కాస్తంత దూరం, యాత్రీకుల రద్దీకి చాలా దూరం. అది శబ్దాలకు దూరం, నిశ్శబ్దానికి చేరువ. 'ఈ గది నాది, నా కోసం' అనే భావం కలగ్గానే మనస్సు ఉప్పొంగింది. ఉత్సాహం పొంగుకొచ్చింది ... అది ఉద్వేగమా! ఏమో.

ధర్మశాల ఆఫీసుకు వెళ్లి దేవాలయం మేనేజరును కలిశాను. ఆ గది నాకు యిప్పించండి అని అడిగాను. ఇవ్వడానికి వీల్లేదన్నాడు తల ఎత్తకుండా.

'ఎందువల్ల?' ఆయన చెప్పిన కారణాలు "అక్కడ ఉండేందుకు వసతుల్లేవు ... అయినా సత్రంలో ఇన్ని గదు లున్నాయి. ఆశ్రమంలో వసతు లున్నాయి. ఇక్కడ ఉండండి. ఆ ప్రాంతం అడవి. ప్రమాదకరం. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?"

నేను గట్టి పట్టుదలగా ఉన్నాను. "ఎంతకాలం ఉంటారు?" ఆయన ప్రశ్న.

ఎంతకాలమో నాకు మాత్రం ఏం తెలుసు?

"ఇంతకాలమని చెప్పలేను. వారాలు కావచ్చు. నెలలు కావచ్చు. ధ్యానం చేసుకోవాలి. అదే నా సంకల్పం. నాకు ఆ మాత్రం ప్రశాంతత కావాలి".

"ఏం ఆశ్రమంలో ప్రశాంతంగా ఉండదా! ఆ ధ్యానం ఏదో ఇక్కడే చేసుకోండి. తలుపులు వేసుకుంటే శబ్దాలు వినిపించవు".

ఎంత ప్రాధేయపడ్డా మేనేజరు మెత్తపడలేదు. నిరాశగా బయటకొచ్చాను. ఆశ్రమంలో గది బాగా లేదు. గుడికి వచ్చే జనం.

మర్నాడు మళ్లీ మేనేజరు దర్శనం చేసుకున్నాను. 'ఎలాగైనా నన్ను కనికరించండి.'

"అంత ఏకాంతం అవసరపడిన నీ సాధన ఏది?"

ఆయన అభిప్రాయంలో సాధన అంటే జపమాల త్రిప్పడం, మంత్రం వల్లించడం, భజనలు చేయడం, భక్తిగీతాలు పాడడం, పవిత్ర గ్రంథాలు చదవడం.

నేనన్నాను. "నా ధ్యానం వేరు. అది సంప్రదాయబద్ధం కాదు. నిశ్చలంగా ఉండి, భావాలను, ఉద్రేకాలను, కోర్కెల్ని లయింప చేయడం. హృదయాంతరంలోకి గమనిస్తూ చొరబడడం. అక్కడ శూన్యం కావడం. నా ఆంతర్యాన్ని, స్వభావాన్ని, దాని మూలాన్ని తెలుసుకోవడం. అందుకు నిశ్శబ్ద వాతావరణం చాలా అవసరం".

నా కంఠ శోష వృథా. నా మాటలు ఆయనకు అర్థం కాలేదు. వీల్లేదు పొమ్మన్నాడు.

"ఆలయానికి దూరంగా ఉండే ఆ జీర్ణ కుటీరాన్ని ఇంతవరకు ఎవరికీ ఇచ్చింది లేదయ్యా. పైగా అది కొండ అంచున వుంది. ఎంతో ప్రమాదం. ఆ గది నిండా చెత్తా చెదారం వుంది".

"నేను శుభ్రం చేసుకుంటాను స్వామీ, దయ చూపండి".

అయినా వీల్లేదన్నాడు. నా వేషం, భాష నాగరీకం కావడం వల్ల నా భక్తిని శంకించాడు. నా అవతారం భక్తులు ఉండవలసిన తీరులో లేదు. ఆయన దృష్టిలో ఆధ్యాత్మిక అన్వేషి కాషాయబట్టలు, రుద్రాక్షమాలలు ధరించాలి. ఒంటినిండా బూడిద పూసుకోవాలి. ఏదో ఒక దేవుడి పేరు సదా స్మరిస్తూండాలి.

మర్నాడు ఉదయం మళ్లీ ఆఫీసుకు వెళ్లాను ... తాడో, పేడో తేల్చు కుందామని.

“అయ్యా! ఒక్క అవకాశం యిచ్చి చూడండి. ఏ మాత్రం అనుకూలంగా లేకపోయినా, ప్రమాదం అనిపించినా, తమరికి మనవి చేసుకుంటాను. మీరు చెప్పినమాట వింటాను. నా రక్షణ బాధ్యత ఆశ్రమానికి లేదు. మీదీ కాదు. నాకు ఏం జరిగినా అందుకు బాధ్యుడిని నేనే.”

ఈ సారి కాస్త మెత్తబడ్డాడు. “సరే నీ స్వంత పూచీకత్తు పైన ఒప్పు కుంటున్నాను. కొన్నాళ్లు ఉండి చూడు, నీకే తెలుస్తుంది” అన్నాడు.

హమ్మయ్య! ఆయనకు నమస్కారం చేసి, వెంటనే నా చిన్ని కుటీరానికి చేరుకున్నాను. గది శుభ్రం చేసుకున్నాను. ఇది ‘నా ఆశ్రమం’ అనిపించింది. శబ్ద ప్రపంచానికి దూరంగా ఇది నా ‘నిశ్శబ్ద కుటీరం’!



ఏకాంత పథగామి

ఎన్నో ఏళ్ల తపనకు ప్రతిఫలంగా
విప్లవాత్మ చూపించిన తపోవన మిది
ఎన్నో గ్రీష్మతాపాలను, తుఫానులను గమించి
శిఖరాగ్రాన నీ ముంగిట నిలిచాను!

ఒంటరిగా, నిశ్చింతగా, నిశ్చల మనస్సుతో
గాయపడిన హృదయంతో, ఆత్మ తాపంతో
ఒక్కొక్కమెట్టు భారంగా అధిరోహిస్తూ
అగోచర పరమాత్మ కోసం అన్వేషిస్తున్నాను
... నేను ఏకాంత పథగామిని.

నీలాపనిందలు

ఓహ్! నిశ్చింత! ఎంతో బరువు తీరింది. మనస్సు ఆనందంతో ఉరకలు వేయసాగింది. నా పర్వత ప్రస్థానం ప్రారంభమైంది. అన్వేషణ మొగ్గ తొడిగింది. నిత్యకృత్యాలకు చాలా తక్కువ సమయం వినియోగిస్తూ ఎక్కువ కాలాన్ని ధ్యానానికి ఉపయోగిస్తున్నాను. మూడు రాళ్లు చేర్చి ఒక పొయ్యి తయారు చేశాను వంటకోసం. అడవి కనుక ఎండు పుల్లలకు వెతక నవసరం లేదు. పొద్దుట అన్నం ఉడికించుకుని సగం తిని, సగం రాత్రికి ఉంచుకునే వాడిని.

రోజంతా ధ్యానం. అదే సాధన. అదే తపస్సు. చదవడం లేదు. పూజలు, భజనలు, ప్రార్థనలు ఏవీలేవు. అన్నీ నిరర్థకం, నిరుపయోగం అని నా నిర్ణయం. నియతిలేని ఆత్మసాధన. మనసులో ఏమీ లేకుండా చేసుకోవడం. మొదట్లో

చాలా కష్టమనిపించింది. లోపల గమనిక ఎక్కువైతే తప్ప అవగాహన కుదరదు. మనసు అంతర్ముఖం అయితే తప్ప బాహ్యాకర్షణలు తొలగవు. లోపల గమనించడం ప్రధానం. అలా గమనిస్తుంటే, కళ్లు తెరిచి ఉన్నా, బయటి ప్రపంచం కనిపించదు. లోపలకు పోగా, పోగా, చైతన్యం కలుగుతుంది. నిరాశ తొలగిపోతుంది. కొత్త గాలులు వీస్తాయి. ఆత్మ జాగృతమైన కొద్దీ చైతన్యాన్ని ఆశ్వాసించడం, శ్వాసించడం అలవాటైంది. చైతన్యంలో జీవించడం క్రమంగా అలవడింది. నా సాధనలో 'మనస్సు' ఆలోచనల్ని దాటిపోవడం ప్రధానం. కానీ అదే కష్టం. మనసు ఎదురు తిరుగుతుంది. ఆలోచనలు కల్లోలం సృష్టిస్తాయి. ఏకాగ్రత కుదరదు. మనస్సు ఉక్కిరిబిక్కిరవుతుంది. అయినా అన్వేషణ సాగించాలి. ఆలోచనల్ని అసలు పట్టించుకోకూడదు. ఇదీ అని తెలియకపోయినా, చీకట్లోకి దూసుకుపోవడం, అన్వేషణ సాగించడం.

నా సజ్జన్‌ఘడ్ జీవితం ప్రశాంతంగానే ఉంది. ఎవరితో ప్రమేయం లేదు. అయితే చుట్టు పట్ల అడవి గ్రామాల వారి దృష్టి నాపైన పడ్డది. ఆశ్రమం వారు నా గురించి ఆరాలు తీయసాగారు. వారికి ఏదో అనుమానం నేను గూఢచారినేమో నని. ఆశ్రమానికి, దేవాలయానికి దూరంగా ఉండడం ఒక కారణం. ఎవరితో కలవక పోవడం రెండవ కారణం. పూజలు, జపతపాలు లేకుండా 'ధ్యానం' అని ఒంటరిగా ఉండడం మరొక కారణం. గుళ్లో జరిగే పూజలు, హారతులు, ప్రసాదాలు నాకు అవసరం లేదు. అసలు నేను ఎవరని ఆరా తీయసాగారు. నేను ఏదైనా తపస్సు చేస్తున్నానా, గూఢచర్యం చేస్తున్నానా? అని వారి అనుమానం. నిజంగానే సన్యాసిని అయితే కాషాయ బట్టలేవి? కళ్లు మూసుకుని, ప్రాణాలు బిగబట్టి తపస్సు చేయడం లేదే? మామూలు మనిషినైతే తెల్ల బట్టలో, పట్టు బట్టలో ధరించాలి గదా! దేవాలయానికి వెళ్లి తీర్థ ప్రసాదాలకు చేయి చాచాలి గదా! అవేవీ లేని నన్ను ఎలా నమ్మగలరు?

నేను ఎవరితో కలిసి మాట్లాడకపోవడం వారి అనుమానాలను మరింత పెంచింది. నా కుటీరం దాటిపోను. ఎప్పుడైనా కొండవాలుల్లో తిరగడం చూస్తారు. దేవాలయం, ఆశ్రమం అంటిపెట్టుకు బ్రతికే భక్తులు, పూజారులు, సన్యాసులు నా గురించి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ నన్నొక దొంగసన్యాసిగా భావించి దొంగ చూపులు చూసేవారు. నేను చేస్తున్నది నిజమైన తపస్సు కాదని, అసలది తపశ్చర్య కాదని వారి ప్రగాఢ విశ్వాసం.

ప్రతి ఊరికి ఒక పెద్ద ఉంటాడు. ఒక అధికారి ఉంటాడు. ఆ అధికారి

తన ఇలాకాలోని గ్రామాలలో అక్రమాలు, నేరాలు జరగకుండా చూస్తుంటాడు. ఎవరిపైన గానీ అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు పంపుతాడు. ఎవరో నాపైన ఫిర్యాదు చేశారు. ఈ వింతమనిషి కొండమీద ఒంటరిగా ఉంటాడని, ఎవరితో మాట్లాడడని.

దేవాలయం పూజార్లకు గానీ, సత్రం మేనేజరుకు గానీ నా వివరాలు తెలియవు. నా పేరు, అడ్రసు ఎవరికీ చెప్పలేదు. కనుక నేను ఎక్కడి నుండి వచ్చానో, నేను ఏమిటో ఎవరికీ తెలియదు. నా బట్టలూ, ప్యాంటూ, బూట్లూ చూచారు అంతే! పట్నం నుండి పారిపోయి వచ్చి, తలదాచుకుంటున్నానని అనుకున్నారు.

ఒక రోజున ఒక పోలీసు వచ్చాడు విచారించడానికి. నేను స్పష్టంగా చెప్పాను "అయ్యా నేను ఏదో తపస్సు చేసుకుందామని నిర్జన ప్రదేశానికి వచ్చాను. నా కిష్టమైన ధ్యానం ఏదో నేను చేసుకుంటున్నాను. నేను ఎవరి జోలికి పోవడం లేదు".

పోలీసు అధికార స్వరంతో అడిగాడు "నీ గురించిన సమాచారం కావాలి పట్టణం వచ్చి పోలీసు స్టేషన్‌లో కలవండి."

"అయ్యా పోలీసు స్టేషన్ కనీసం పదిహేను, ఇరవై మైళ్లు. అంత దూరం నేను రాలేను".

"తప్పదు, వచ్చి తీరాలి".

చిక్కొచ్చి పడ్డది. వెళ్లడం ఇష్టం లేదు. రానని చెప్పడానికి లేదు.

నాకు రూల్సు తెలుసు. చట్టం తెలుసు. ఏదైనా నేరం చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉంటే తప్ప పోలీస్‌స్టేషనుకు రమ్మని పిలవరు. అంటే ఎవరో నామీద ఫిర్యాదు చేసి ఉంటారు.

ఆయనతో మర్యాదగా అన్నాను "సర్ ఎవరో అనుమానించి ఫిర్యాదు చేసినంత మాత్రాన నేను దోషిని కాను. పోలీస్‌స్టేషన్‌కు రానవసరం లేదు. నా గురించి విచారణ చేయదలిస్తే నాకేం అభ్యంతరం లేదు. ఎవరు వచ్చినా సమాధానం చెప్పగలను."


అప్పటికి పోలీసు వెళ్లాడు. కొన్నాళ్ల తర్వాత డిపార్టుమెంటు నుండి మరొకరు వచ్చారు. ఆయన ఇన్‌స్పెక్టరు. చదువుకున్నవాడు. ఇంగితజ్ఞానం ఉన్నవాడు. మర్యాద తెలిసినవాడు. అయినా ఎలా నమ్మించడం? నా వద్ద ఏ ఆధారాలు

లేవు. నా గురించిన నిజాలు చెప్పకుండా దాచాలి. కాస్త చిరాకు వేసింది. అయినా సహనం పాటించాను. అతను నమ్మాలి. నమ్మబలకాలి. అది తక్షణ కర్తవ్యం. ఆఫీసరు కదా! మర్యాద చేశాను.

"అయ్యా, ఇన్‌స్పెక్టర్! మీ ఉద్యోగ ధర్మం మీది. స్వామి రామదాసు మందిర పరిసరాల రక్షణ బాధ్యత మీది. మీకు సహకరించడం పౌరుడిగా నా కర్తవ్యం. నిజం చెప్పేస్తాను".

ఆయన వినడానికి సిద్ధపడ్డాడు. మనిషిలో వ్యతిరేకత లేదు. సుముఖంగా మొహం పెట్టాడు.

"అయ్యా! నేనిక్కడకు వచ్చిన పని ఏకాంతంగా ధ్యానం చేసుకోవడం. ఈ చిన్నకుటీరం, ప్రశాంత వాతావరణం నా ధ్యానానికి అనుకూలంగా ఉన్నాయి. జనాలకు, దేవాలయానికి దూరంగా ప్రశాంతంగా ఉంది. నేను పూజలు పునస్కారాలు చేయను. నాది ధ్యాన పద్ధతి. నాలోని ఆత్మను దర్శించాలన్నది నా సంకల్పం. ఆత్మసాక్షిగా చెబుతున్నాను. ఇది కొత్త పద్ధతి అయినా ఇది నాకు నచ్చిన పద్ధతి."



నూతన యౌవనంలో ... ఆత్మాన్వేషణలో ...

అధికారి నా మాటలకు అడ్డు తగలకుండా నిదానంగా విన్నాడు. నేను మరికొంత వివరంగా చెప్పాను.

"నా ధ్యానం దేవాలయాల్లో, సత్రాలలో చేసేది కాదు. దీనికి మంత్రాలు, ఆచారాలు, ఉపచారాలు ఉండవు. ఇది పూజా విధానం కాదు. ఈ పద్ధతి తెలియనివారు విమర్శించవచ్చు. భగవంతుని ఈ పద్ధతిలో మౌనంగా, ఆత్మతో ఆరాధించవచ్చునని వారికి తెలియదు. తెలిసినా నమ్మరు."

ఆయన ఆసక్తిగా వినడం వల్ల మరికొంత వివరంగా చెప్పాలనిపించింది.

"అయ్యా! ఇక్కడ నేను ఇంకొన్ని నెలలుంటాను. ఎక్కడికీ పోను. ఎవరికీ భయపడి పారిపోయే ప్రసక్తే లేదు. నా వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ కలగదు. నన్ను విశ్వసించండి. నేను చదువుకున్న వాడిని. గౌరవమైన కుటుంబీకుడిని. ప్రస్తుతం, అంటే నా లక్ష్యం నెరవేరే వరకు నా ఉనికి ఎవరికీ తెలియకూడదని అనుకున్నాను. మీరు మరీ వత్తిడి చేస్తే నా పేరు, అడ్రసు యిస్తాను. నా కుటుంబంలో అందరి గురించి చెప్తాను. మీరు వెళ్లి వాకబు చేసుకోవచ్చు. అయితే నా గురించి అక్కడ ఎవరికీ ప్రస్తుతం తెలియనీయవద్దు. నన్ను, నా మనస్సును తమరు అర్థం చేసుకోగలరని భావిస్తున్నాను. నన్ను నమ్మండి. అపార్థం చేసుకోవద్దు. నిరాటంకంగా నా సాధన నన్ను కొనసాగించనివ్వండి."

ఆయన దీర్ఘాలోచనలో పడ్డాడు. ఇన్‌స్పెక్టర్ ఆలోచించినంతసేపు నేను మౌనం వహించాను. నా మాట నమ్మాడు. నేను జీవిస్తున్న విధానం, పరిసరాలు గమనించాడు.

"దయచేసి నన్ను అర్థం చేసుకోండి" అన్నాను.

"మీరు ఇంకేం చెప్పనవసరం లేదు" అన్నాడు.

ఆయనకి నా పేరు సైతం చెప్పవలసిన అవసరం కలగలేదు. వెళ్ళే ముందు రెండు చేతులు జోడించి నమస్కారం చేసి, గౌరవ పురస్సరంగా అన్నాడు "మీ సాధన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను".

నా బట్టలు చూస్తే ఎవరూ నన్ను ఒక తపస్వి అనుకోరు. ధ్యానం చేసేవాడినని భావించరు. ఆధ్యాత్మిక రంగంలోని వారి వేషభాషలు, కట్టు, బొట్టు, నడక వేరుగా ఉంటాయి. ఆ లక్షణాలు నాలో బొత్తిగా లేవు. మర్నాడు కొండపైకి షికారుగా వెళ్లినప్పుడు నాకే అనిపించింది ఈ ప్యాంటు, షర్టు ఎబ్బెట్టుగా ఉన్నాయని. బట్టల్ని చూచి మనిషికి ఖరీదు కట్టే రోజులివి. మనిషి విలువలు తెలిసేది కొంతవరకు ఆహార్యం బట్టి. అసలు విలువ, సంస్కారం గ్రహించేవారు బహు అరుదు. అప్పుడే నా తలమీద ఉన్న టోపీ విసిరి పారేశాను. 'నాకు సమాజానికి మధ్య ఉన్న బంధం ఇది. ఈనాటితో అది తీరింది'.

పోలీసు అధికారి నా మాటలు నమ్మడం వల్ల చాలా తృప్తి కలిగింది. పెద్ద ప్రమాదం తప్పింది. ఆయన సానుభూతితో అర్థం చేసుకున్నాడు. లేకపోతే ఇక్కడి వారితో లేనిపోని చిక్కులు వచ్చేవి. తలమీది టోపీ పోవడంతో తల భారం తీరింది. కాస్త అహంభావం తగ్గింది. జనాలకు నేనూ తమలాంటి వాడినేనన్న భావం ఏర్పడుతుంది. భయపడరు. విచిత్రంగా చూడరు. నా హాట్‌తో పాటు నాలో మిగిలిన కాస్త దర్పం, డాబు, అహం పోయాయి. ఆ తర్వాత ఎవరూ నన్ను 'అదోలా' చూడలేదు. నేను గోప్యంగా, అజ్ఞాతంగా ఉండవలసిన అగత్యం కనిపించలేదు.

నీరవ నిశ్శబ్దంలో, ఏకాంత ప్రశాంతిలో రోజులు గడుస్తున్నాయి. ఇన్‌స్పెక్టరు వచ్చి వెళ్లాక చిత్రంగా, నా వైఖరిలో మార్పు వచ్చింది. ఆలోచనల్లో సరళత వచ్చింది. ప్రశాంతత నాలో చోటు చేసుకున్నది. మొదట అమ్మ జ్ఞాపకం వచ్చింది. అమ్మ మనసులోకి రాగానే మనస్సు చల్లబడ్డది. "ఇన్ని రోజులైనా నా గురించి కబురు తెలియకుండా అమ్మ దిగులు పడి ఉంటుంది. కొన్నాళ్లు అన్నం మీద అలిగి ఉంటుంది. అమ్మ, తమ్ముడు నా కోసం గాలించి ఉంటారు. పోలీసు రిపోర్టు ఇచ్చి ఉంటారు చివరికి".

అమ్మ ఆలోచన కలగ్గానే మిగిలిన ఆలోచనలు వెనక్కి తగ్గాయి. ఇల్లు, డబ్బు, ఆస్తులు ఏమీ జ్ఞాపకం రాలేదు. అమ్మను గురించి బెంగ. ఆత్మను గురించి విచారణ. ఒక్కోసారి ఏడుపొచ్చి, బిగ్గరగా ఏడ్చేవాడిని. కళ్ళ వెంట ధారాపాతం. ఏమిటో అమ్మ జ్ఞాపకాలు నన్ను వదలడం లేదు. ప్రశాంతంగా ఉన్నప్పుడు అనేక జ్ఞాపకాలు వస్తాయి. మనసు కల్లోల మవుతుంది. నేనున్న పరిస్థితికి, వస్తున్న జ్ఞాపకాలకు పొంతన లేదు. అసలు ఏవీ జ్ఞాపకం రాకూడదు. లోపల ఏం జరుగుతోంది? ఈ ఆలోచనలకు మూలం ఏది? ఎక్కడ? అలా నిర్వేదంగా లోపల గమనించసాగాను. లోతుల్లోకి, శూన్య కుహరంలోకి చొచ్చుకు పోసాగాను. ఆ ప్రయత్నంలో నన్ను నేనే శూన్యం చేసుకోగలిగాను. శూన్యం కాగలిగాను. లోతుల్లోకి వెళ్లిన కొద్దీ ప్రశాంతి. ఆలోచనల ఆవలి తీరాన ఎంత హాయి! ఎంత ప్రశాంతి! అక్కడ కదలని చలనా లున్నాయనిపించింది. అవి లోతుల్లో స్తబ్దంగా, నిశ్శబ్దంగా, శూన్యంలో కరిగిపోయిన భావాలు. అవి పైకి రావడం గమనించ సాగాను. 'మనస్సు' అన్నది ప్రత్యేకంగా లేదు. ఆలోచనల సమ్మేళనమే మనస్సు. కనిపించని సుతి మెత్తని దారాల పోగు. ఒక్కొక్క దారం ఒక ఉద్రేకం కలిగిస్తుంది. ఒక్కొక్క భావనకు, ఆలోచనకు పురుడు పోస్తుంది. అంటే మనసు ఉద్రేకాలకు

కేంద్ర బిందువు. గుర్తింపు కోసం, బయటకు రావడం కోసం తహతహ లాడుతుంటాయి.

అలా గమనించగా నాకు తెలిసింది, 'మేధ' అన్నది కేవలం నిర్ణయాత్మక మని. ఏమీలేని శూన్యం. నిర్ణయాలు తయారయ్యే కేంద్రం. మనస్సులో ఒక కొంత భాగం తెలియదు ఎక్కడో ఉంటుంది. అది ఎప్పటికీ బయటపడదు. అంచేత నేను ఎప్పుడూ పూర్తిగా మనస్సును దర్శించలేదు. భావాలను బట్టి మాత్రమే మనస్సును, మనశ్చర్యల్ని గమనించడం జరుగుతుంది. మనస్సులో అందని లోతులు, తెలియని భాగాలు చాలా ఉన్నాయి. వాటి కోసం లోలోపలకు వెళ్లసాగాను. అగమ్యంగా ఉన్న అగోచర భావ మూలాలతో సంపర్కం ఏర్పడ్డది. అవి అంతవరకు నాకూ అవగాహనకు అందని తీరాలు. తెలియని లోతుల్లోని అంతులేని అఖాతాలు. ఆ లోతులు చేరడానికి చాలా శ్రమించాలి, సహనం కావాలి.

ఇదంతా ఎందుకు జరిగినట్లు? ఎట్లా జరిగింది? నేను కోరానా? లేదే! ఇల్లు వదలి రావడం, అమ్మ జ్ఞాపకాలు వదలకపోవడం, అంతర్వీక్షణ. ఆలోచన ఆలోచనలు లేని స్థితికి చేరడం. మూలాలకోసం అన్వేషణ. నా దృక్పథమే మారిపోయింది. సాధన కొత్త పుంతలు తొక్కింది. కొత్తదారులు వెతుక్కుంది. ఇది కొత్తరకం జ్ఞానోదయం. ఇప్పుడు నా అన్వేషణకు ఒక గమ్యం లేదు. సాధనకు లక్ష్యం లేదు. అసలు భగవంతుడు, స్వర్గం, నరకం లాంటి భావనలే మరుగైనాయి. నా మనోయవనికపైన అవి లేనే లేవు. ఆత్మను గురించిన ఆవేదన, ఆలోచన సైతం లేవు. ప్రధానంగా మిగిలింది నేను, నా ఆంతర్యం. అంతులేని మనస్సు. మనస్సులోని శూన్యత.

వ్యసనాలు లేని మనోవృత్తుల్ని గమనించే పని నేను చేస్తున్నది. మనస్సుపై అంతర్దృష్టిని కేంద్రీకరించడం వల్ల మనశ్చర్యలు బయటపడసాగాయి. వాటిని గమనించే పనిలో అనుక్షణం 'ఎరుక'తో 'చైతన్యం'లో ఉండవలసి వచ్చింది. అంటే 'ఎరుక'ను చైతన్యంతో కలపడం వల్ల 'గమనిక' తీవ్రమైంది. లోపలి ప్రతి ఆలోచన కదలికను గమనించసాగాను. అది గమనిక లక్ష్యం. లక్షణం. నా ప్రమేయం, ప్రబోధం లేకుండా ఉత్తినే గమనించడమే. గమనిస్తూ కూర్చోవడం. మనం ప్రయత్నం చేస్తే అది అవరోధం కావచ్చు. నిర్మలంగా, నిర్మోహంగా గమనించడం ఒక్కటే మనం చేయవలసిన పని. అందులో ఆశ లుండవు. నిరాశలకు, నిస్పృహకు తావుండదు.

మొదట్లో ఈ గమనిక అసలు కుదిరేది కాదు. తర్వాత చాలా కష్టంగా సాగేది. చిన్నచిన్న భావ శకలాల్ని ఏరి, ఒకచోట పోగుచేయాలి. ఇంకాస్త శ్రద్ధ పెడితే, ఏకాగ్రత అలవడితే, చైతన్యం పొందితే, ఆలోచనల తీరం దాటి జీవ కేంద్రాన్ని చేరగలం. అది మన స్వంతం. మన శక్తి కేంద్రం అదే. అది మన సర్వస్వం. మనదైన ప్రజ్ఞ ప్రభవించేది అక్కడనే. అది ఆత్మానాత్మ వివేచన. అది ప్రమేయం.

నా పట్టుదలకు చైతన్యం బాసటగా నిలిచింది. కనుక పట్టు సడలలేదు. దారి తప్పే అవకాశం లేదు. ఇది నా దారి. నేను వేసుకున్న, ఎంచుకున్న దారి. అనుక్షణ అంతర్వీక్షణ ఫలితం. జాగృతి నాకు తోడైంది. అవి నా సాధనకు ఆలంబనలు, ధ్యానానికి ప్రతీకలు. ఇప్పుడు మనస్సులోకి పిచ్చి పిచ్చి ఆలోచనలు రావడం లేదు. ఉత్తినే ఏదీ ఆలోచించను. ఒక నిశ్చయం లేదు. కనుక అంతా నిర్మలం. ఒక గమ్యం లేదు కనుక అంతా గమనమే మిగిలింది. 'ధారణ' ఒక్కటే వ్యాపకం.

ఆ కాలంలో నేను నిద్ర ఎరుగను. అలసిపోయేది తక్కువ. శ్రమ చేస్తే గదా అలసట. నిద్ర అవసరం. తిండీ పరిమితం. గమనిక వల్ల మనస్సు స్ఫటికంలా, స్వచ్ఛంగా కనిపించేది. పడుకున్నా నిద్ర రాదు. నిద్ర మనస్సుకు ఒక సాకు. కొంచెంసేపు నిద్ర పోయినా చాలు, మనస్సు ఉత్సాహం పొందుతుంది.

అలా నా అవధాన ప్రక్రియ మొదలైంది. ఏ పనిచేసినా నిజాయితీగా, హృదయ పూర్వకంగా చేయటం నాకు అలవాటు. అవకాశా లుండవు. అనుమానా లుండవు. అలా మనస్సును శోధించసాగాను. ఎవరిపైనా ఆధారపడలేదు. ఏ సిద్ధాంతాన్నీ పట్టుకోలేదు. ఒక మార్గం అని లేదు. అంతా స్వతంత్రం. ప్రశ్నలు వేయను. సమాధానాలు వెతకను. ఏవీ చదవను. ప్రార్థనలు లేవు. అర్థింపులు లేవు. మంత్రాలు, జప తపాలు ఏవీ అవసరం లేదు. అయినా పిరికితనం లేదు. పలాయనం లేదు. అనుక్షణం అంతర్వీక్షణం. మనోవృత్తిపై పర్యవేక్షణ. అది అనుశీలన.



3. కుటీరంలో ఒంటరిగా ...

గత కొద్ది మాసాలుగా మనసు వికలమవుతోంది. ఏదో అంతర్మథనం సాగుతోంది. ఆంతర్యం తిరగబడుతోంది. అలజడి ఎక్కువవుతోంది. ఇల్లు, కుటుంబం, భద్రత ఏవీ లేకుండా పోయాయి. ఏకాంతవాసానికి వచ్చి చేరాను. ఎందుకు? ఏం సాధించాలని? ఈ మధ్య అనిశ్చితి పెరిగింది. ఆలోచనలు నన్ను కలవరపెడుతున్నాయి.

ఈ చిన్న కుటీరంలో ఒంటరి జీవనం. ఒక గమ్యం లేదు. లక్ష్యం లేదు. ఇలా ఎంత కాలం? సహాయం చేసేవారు లేరు. దారీ తెన్నూ కనిపించడం లేదు. నేను ఎంచుకున్న మార్గం సరైనదా, కాదా? చెప్పేవారేరి? అంతా అయోమయం? నా కంటూ ఒక గురువు లేడు. గురుతు లేదు. ఆధారం లేదు. నాకు తెలిసింది పాత జీవితంపైన అయిష్టం ఏర్పడడం. ఆత్మాన్వేషణలో ధనవ్యామోహం ఉండకూడదని, కోరికలు ఉండరాదని, భౌతిక సుఖాలు సంపదలు అవరోధాలని అంటారు. ఇప్పుడు ఏ వ్యసనాలు లేవు. గతం పైన తెర పడింది. అయినా సాధిస్తున్నదేమీ కనిపించడం లేదు. తర్వాత ఏమిటి? ఏం చేయాలి? ఎటు పయనం? ఏం సాధించాలి?

నాకు ఆదర్శాలు లేవు. సిద్ధాంతాలపై విశ్వాసం లేదు. అవి అన్నీ ఎవరో కల్పించి, రాసిపెట్టినవి. అనుభవానికి అందవు. పరీక్షకు నిలవవు. మతాలు, తత్వాలు, వాటి నియమాలు మనిషిని బంధిస్తాయి తప్ప స్వేచ్ఛ నివ్వడం లేదు. గురువులపై మోజు లేదు. ప్రాచీన సిద్ధాంతాలపైన, గురువుల పరంపరపైన విశ్వాసం కలగడం లేదు. అందుబాటులో రేడియో గానీ, పత్రికలు గానీ లేవు. నాపైన వాటి ప్రభావం పడే అవకాశం లేదు. ఆ అవసరమూ లేదేమో!

కలలకు, ఆశయాలకు గట్టిపునాదులే ఉంటాయి. అవి నాగరికత, సంస్కారం ముసుగులో కాపురం చేస్తాయి. సర్వసంగ పరిత్యాగినైనా వ్యామోహంలో పడవేస్తాయి. నాకు వేటిపైన మోజు లేదు. ప్రలోభం లేదు. ఏదీ కావాలని లేదు. కనుక వాటినీడ నాపైన పడదు. కోరికలు, వ్యసనాలు, కలలు ఎట్లా ఏర్పడతాయో నాకు తెలుసు. వాటిని పొదిగే మనస్సు నా అధీనంలో ఉంది. క్షణంలో మనస్సు శూన్యం అవుతుంది. కోరికలు నశిస్తాయి. విషయాసక్తి లేకపోతే మనస్సు మన అధీనంలో ఉన్నట్లే. అప్పుడసలు మనసుతో పనే ఉండదు.

మనస్సును నమ్ముకుంటాం కానీ, మనసే మంచిగా మోసం చేస్తుంది. మెత్తగా బాధిస్తుంది. మనస్సును జయించామని మురిసిపోతాం. నిజానికి మనస్సే మనల్ని జయిస్తుంది. నేను మనస్సునే అధీనం చేసుకోగలిగానని కలలు, కలవరింతలు, కామం ఉండవని గర్వపడ్డానుగాని అవి వాస్తవానికి లేకుండా పోలేదు. నాలోనే అణగి, మణగి ఒక మూలకు చేరాయి. అవి నిశ్శేషంగా కరిగిపోలేదు. ఒక విధంగా అవి బండబారాయి. పైగా గమనిక వల్ల, నిర్లక్ష్యం చేయడం వల్ల మరింత సున్నితంగా మారి తలలు విదిలించాయి. అయినా నా సాధన కొనసాగుతూనే ఉంది. అంతర్వీక్షణ సాగుతూనే ఉంది. గమనిక అవగాహన పెరుగుతోంది. ఆలోచనలు పక్కకు తప్పుకుని సాధనకు మార్గం సుగమం చేస్తున్నాయి. కనుక అంతరంగ యాత్ర సజావుగా సాగుతోంది. కాని గమ్యం తెలియడం లేదు. గమన వేగం అంతుబట్టడం లేదు. దిశానిర్దేశం అసలు లేదు. దిక్సూచి లేని ప్రయాణం కదా!

ఆశించడం, ఆశలు కల్పించుకోవడం మనసు మరచింది. క్రమంగా ఆలోచనలే అవసరం లేని స్థితికి చేరాను. ఇప్పుడు మనసు చెదరడం లేదు. ఆలోచనలు పరిపరి విధాల పోవడం లేదు. ఆలోచనలు లేనప్పుడు అవసరాల ఒత్తిడి ఉండదు. ఆశించడం లేనపుడు అవసరం ఉండదు. ఆశలు లేవు. ఆకాంక్షలు లేవు. అన్నీ నిష్క్రమించాయి. లయించిపోలేదేమో! అనునిత్యం జరిగే దానితో తృప్తిపడి జీవించడం అలవాటైంది. ఏది జరగాలో అదే జరుగుతుంది. ఆమోదించడమే నా పని. ఆలోచించడం లేదు. ప్రతిఘటన లేదు. అయిష్టం లేదు. అంటే వాంఛించే గుణాన్ని మనస్సు కోల్పోయినట్లు. క్రమంగా శూన్యం నన్ను ఆవరిస్తోంది.

అయినా ఒంటరితనం. ఏకాకిగా, ఏకాంతంగా నిర్జన ప్రదేశంలో జీవించడానికి చాలా ధైర్యం, సంయమనం, ఓర్పు కావాలి. లేదా మూర్ఖత్వం

కావాలి. నాకు అంతర్దృష్టి ఒక్కటే రక్షణ. ఏది జరిగినా నా ప్రమేయం లేనట్లే. ఆమోదమే ప్రమోదం. నాలో కొత్త శక్తి వచ్చి చేరుతోంది. క్రమంగా అది తెలుస్తూనే ఉంది. రోజురోజుకు విశ్వాసం బలపడుతోంది. ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. అది భావాతీత చైతన్యం అని తెలుస్తోంది. అందులో రహస్యం లేదు. అంతా ప్రశాంతి. నిశ్శబ్దం – శూన్యం. నిర్మోహం. ఆ శూన్యంలో విషాదం లేదు. స్తబ్దత లేదు. అది జడం కాదు. భావరహితస్థితి – అది చైతన్యం. ఆ స్థితిలో మనస్సు జోక్యం ఉండదు. వచ్చిన శక్తి పోదు. పూర్ణంగా, సుస్థిరంగా మనలో ఉండిపోతుంది. మరింత ఉజ్వలంగా ఉద్దీప్తమవుతుంది. మనోబలం పెరుగుతోంది. యవనిక విస్తరిస్తోంది. గతం నుండి సంపూర్ణ స్వేచ్ఛ లభించింది. భవిష్యత్తు నుండి విముక్తి లభించింది. కేవలం వర్తమానంలో జీవించడానికి అలవాటుపడ్డాను.

మనస్సు బయట తిరుగుళ్లు మానింది. ఆలోచన భావంలో వొదిగి పోయింది. భావం మనసు వెనక ఎక్కడో దాక్కుంది. దాంతో చైతన్యం పురి విప్పింది. అవగాహన పెరిగింది. ప్రజ్ఞ లాంటిదేదో పైకి రాసాగింది. ఈ కుటీరానికి వచ్చినప్పటికి, నేటికి ఎంత తేడా. ఇప్పుడు ఉద్వేగాలు, ఉద్రేకాలు అన్నీ సమసి పోయాయి. అమ్మ, తమ్ముడు మనసులోకి వస్తే మాత్రం కాస్త కల్లోలం జరుగుతోంది.

ఎంత నిర్వేదంతో ఇల్లు వదలి వచ్చినా, నాలో ఏదో మూల ఇంటిపైన మమకారం కలుగుతోంది. నేను లేని కుటుంబం ఊహించసాగాను. అమ్మను గురించి నా బెంగ. తమ్ముడు ఇబ్బందిపడి ఉంటాడు. వాడికి వ్యాపారంలో మెలకువలు తెలియవు. అయినా వయసొచ్చిన కుర్రాడు నెట్టుకు రాగలడు. అయినా మనసు అటు లాగుతోంది.

ఒక్కసారిగా భయం నన్ను ఆవహించి చలించిపోయాను. నిలువెల్లా కంపించాను. చాలా విషయాల్లో నేను ధైర్యంగానే ఉంటాను. భయం రానివ్వను. అనుమానానికి అవకాశం ఇవ్వను. వేటలోనూ ధైర్యంగా ఉండేవాడిని. 1944లో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నాను. ఒకసారి పోలీసులు తరిమి కొట్టారు. వేటలో ధైర్యం కావాలి. చిన్నతనం నుండి తుపాకి పట్టి వేటాడడం అలవాటు. అడవి పందుల్ని వేటాడేవాడిని. అడవి పందులు చాలా భీకరంగా ఉంటాయి. ఒకసారి రాత్రి వేళ మంచెపై నుండి పులిని కాల్చడానికి ప్రయత్నించాను.

నా జీవితంలో చాలా సాహసకార్యాలున్నాయి. అన్నీ ప్రమాదాల అంచుకు చేర్చినవే. ధైర్యం నా ఆయుధం. సాహసం నా ఊపిరి. క్రికెట్‌లో కెప్టెన్‌ని. ఎప్పుడు ఓటమి ఎరుగను. అసలు నాలో పిరికితనం లేదని నా నమ్మకం.

ఇక్కడ ఏకాంతవాసంలో ఒంటరిని. నిర్జన ప్రదేశంలో ఎవరూ లేనిచోట భయం ఎలా ఉంటుందో తెలిసింది. నాలోనూ పిరికితనం ఉంది. అది అప్పుడప్పుడు బయటకు తొంగిచూస్తోంది. ఎవరైనా నన్ను దోచుకుంటే ... దిక్కు మొక్కులేని స్థితిలో చనిపోతే ... అనుమానాలు, భయాలు. మనసు రకరకాల సంఘటనల్ని జ్ఞాపకం చేస్తోంది. భయ పెడుతోంది. ఉక్కిరి బిక్కిరవుతున్నాను.

ఈ భయాలకు బలమైన కారణాలు లేవు. నిష్కారణంగా భయం మనిషిని పట్టుకుంటుంది. ఆలోచనలు సైతం భయం కలిగిస్తాయి. నేను వేరూ ఆలోచనలు వేరా? కాదు. ఆలోచనలు నావే. భయాలు నావే. ఇక్కడ నుండి భద్రత ఉన్న చోటుకు వెళ్లాలనిపిస్తోంది. మనస్సు అలజడి సృష్టిస్తోంది. పారిపొమ్మని ప్రేరేపిస్తోంది. అంటే నా బలహీనతల్ని తెలిసీ నిరోధించ లేకపోతున్నాను. ఎవరితో చెప్పుకోను! ఎవరు ఓదారుస్తారు! ధైర్యం చెప్పేందుకు, మార్గం చూపేందుకు. నాకు ఒక గురువు లేడు. నన్ను నేనే ఓదార్చుకోవాలి. ధైర్యం చెప్పుకోవాలి. మంచినిగానీ, చెడునిగానీ భరించవలసిందీ నేనే. అంతర్ముఖం అయితే అన్నీ మరచిపోవచ్చు. అదొక్కటే మార్గం, తరుణోపాయం. ఫలితం నా చేతిలో లేదు. విధికి తలవంచక తప్పలేదు.

ఆ పరిస్థితిలో మనసు నైజం గ్రహించసాగాను. భయం భయంగానే భయాన్ని గమనించ సాగాను. శోధించ సాగాను. ఒంటరిగా, నెమ్మదిగా హృదయ కుహరంలో జొరబడి మనశ్చర్యల్ని, క్రియల్ని నిశితంగా పరిశీలించాను. ఆంతర్యం బోధపడసాగింది. ఇంతకాలంగా తెలియని విషయాలు తెలిసి రాసాగాయి. మనస్సుకు బయట తిరిగే పని తగ్గింది. అదే అంతరవలోకన. ఇప్పుడు మనసు నన్ను ప్రలోభపెట్టడం లేదు. ఆలోచన కలిగినా తెల్ల మబ్బు తునకలా విడిపోతోంది. బాహ్య ప్రేరణలు కలత పెట్టడం లేదు. మనోభావన నిర్మలంగా మారింది. నిశ్చలంగా ఉంటోంది. లోపల ఉన్నదేదో బయటపడుతోంది. బయట ఉన్నదేదీ లోపల ప్రవేశించడం లేదు. గమనిక వల్ల మరికొన్ని భయాలు మాయమైనాయి. అవి నావే నని, నాలోనివే నని ఇంతకాలం తెలియదు. ఇప్పుడు వేటి ప్రభావం నాపైన ఉండడం లేదు. బహుశా నా మనసు పొరల్లోకి నిష్క్రమించి ఉంటాయి.

భయం గురించిన ఆందోళన కన్న శృంగారం గురించిన ఆలోచన మరీ ప్రమాదం. నాలో సెక్సు ప్రకంపనలు ఎక్కువైనాయి. ఉద్రేకం కలుగుతోంది. వీటిని ఎదుర్కోవడం ఎలా? వీటిని అణచడం ఎలా? ఆలోచనల్లో ఇవి గమనిస్తే పారిపోయే రకం కావు. వాటి మూలాలు తెలుసుకోవాలి. అనుభవించి, ఉపశమింప

చేయడం జరగని పని. ఉద్రేకాలు తారాస్థాయికి చేరి నన్ను లోబరచుకోసాగాయి. ఉక్కిరి బిక్కిరవుతున్నాను.


అయినా, ఘోటక బ్రహ్మచారిని. అస్ఖలిత బ్రహ్మచారిని. నిగ్రహం కలవాడిని. నాకు సెక్సు వాంఛలు కలగడం ఏమిటి? స్త్రీ వ్యామోహం పరిహరించలేనా? స్త్రీ సంపర్కం అవసరమా! అనివార్యమా? నా కసలు ఎప్పుడూ ఆ ధ్యాస లేదు. దానివల్ల వొరిగేదేమీ లేదని నా అభిప్రాయం. అది వ్యసనం అని నా భావం. ఇంత తెలిసిన నాకు, నిగ్రహం పాటించిన నాకు, ఇప్పుడీ కోరికలు కలగడం ఏమిటి? పిచ్చిపిచ్చిగా కోరికలు బుసగొడుతున్నాయి. రెచ్చగొడుతున్నాయి. అసలు వీటికి మూలం ఏది? ఎక్కడినుండి వస్తున్నాయి? ఇంతకాలం ఎక్కడ దాక్కున్నాయి? వీటి ఆను పానులు, పుట్టు పూర్వోత్తరాలు నిశితంగా గమనించాలి. మనసే కారణం అనిపించింది. కోరికలు, ఉద్రేకాలు కలిగించేదీ మనస్సే.

నా అనుమానం ఎంతవరకు నిజం? ఎంత విశ్వసించదగినవి? ప్రశ్నించు కున్నాను. అసలు మనసుకిదేం రోగం? ఎందుకు ఉద్రేకాలు కలిగించాలి. లోపల నుండి ఉబికుబికి వస్తున్న ఒక్కొక్క ఉద్రేకం ఒక్కో ప్రమాద సూచిక. ప్రతీదీ శృంగార వీచిక. వాటిని ఆచరణలో పెట్టడం, అనుభవించడం ఎలా సాధ్యం? అన్నింటినీ నిర్లిప్తంగా, నిర్మోహంగా గమనించసాగాను. ప్రాపంచిక విషయాలు సరే, అవే నశిస్తాయి. వద్దన్నా ఆగవు. అవి జరిగితీరాలని లేదు. నిర్లక్ష్యం చేస్తే అవే అంతరించి పోతాయి. కుటుంబం గురించిన ఆలోచనలు ప్రమాదం కాదు. అవి జరిగినా, జరగకపోయినా నష్టం లేదు. ఎప్పుడో ఎక్కడో జరగబోయే విషయాలు జరగవచ్చు. జరగకపోవచ్చు. నాకెందుకు బెంగ. అవి మేధోజనితాలు. జ్ఞానంతో సంబంధం లేనివి. నాలో ఇంకా సంసార ప్రలోభాలు ఉన్నాయన్నమాట.

ప్రతి చిన్న విషయానికి స్పందించడం, పెద్దగా ఆలోచించడం, మథన పడడం మనకు అలవాటు. అవి నిజాలనే భ్రమ కలిగిస్తుంటాయి. నిజాలయ్యే అవకాశం ఉంటుంది కనుక. కానీ నా మనసు ప్రకల్పించే ఆలోచనలేవీ వాస్తవంలో జరిగే అవకాశం లేదు. అందుచేత నేను బొత్తిగా స్పందించను. ఎందుకు అని కూపీతీయను. అప్పట్లో నన్ను కంగారు పెట్టిన ఆలోచనలు సెక్సుపరమైనవి. దిగులు కలిగించినవి అమ్మను గురించిన జ్ఞాపకాలు. ఇప్పుడవి అంత తీవ్రంగా లేవు. సెక్సును గురించి తీవ్రంగా స్పందిస్తున్నాను. మనస్సు ఒక సందేశం అందిస్తుంది. దానిని ఆచరణలో పెట్టడానికి మనం నానా యాతన పడతాం.

ఒక్కొక్క భావన నా కళ్లముందు కదలసాగింది. మనసు తెరపై బొమ్మలు కదులుతున్నాయి. వేటికీ ఆధారాలు లేవు.

మానవ మస్తిష్కం అదే పనిగా ఉద్రేకాన్ని ఉత్పత్తి చేస్తుంది. మనసును ప్రేరేపిస్తుంది. ఆలోచనలు కలిగించి అనుభవించమని ప్రోత్సహిస్తుంది.



ఏడడుగుల గూటిలో ఏడు నెలల తపస్సు

నాలో ఈనాటకం కొన్ని పగళ్లు, రాత్రుళ్లు సాగింది. సహనంతో భరించాను. ప్రతి భావాన్ని ఆలోచనగా మార్చి విశ్లేషించాను. ఆచరించాలని ప్రయత్నించలేదు. అంటే ఉద్రేకాలకు నేను లోబడలేదు. రాత్రింబవళ్లు లోపల ఉన్మాదం – బయట ఒత్తిడి, ఘర్షణ, సమరం. క్రమంగా, మస్తిష్కం బయట నాటకానికి తెరపడింది. ఇప్పుడు నా పోరాటం లోపలి ఆరాటం పైన. ఎక్కడో అణచిపెట్టిన కోరికలు విషయాలుగా పొంగి రాసాగాయి. నేను వాటిని సాక్షీమాత్రంగా గమనించసాగాను. అవి నావి కానట్లు, వాటితో నాకు సంబంధం లేనట్లు ప్రవర్తించి అలక్ష్యం చేశాను. కుటీరం వదలి ఎక్కడికైనా వెళ్లిపోతే ఈ ఆలోచనలు సమసిపోతాయన్న భావం కలిగింది. గుడి పూజారి సలహా చెప్పాడు – ఆలయం దగ్గరగా వచ్చి ఉండమని. అక్కడికి వెళ్లినా నా మనస్సు నాలోనే ఉంటుంది.

జనం మధ్యకు వెళితే ఒంటరితనం ఉండదు. ఒంటరిపోరాటం చేసే బాధ తగ్గుతుంది. మనసు తొందర చేస్తోంది. నేను వదల వలసింది మరేదో ఉంది.

అది ఏమిటి? మనో వ్యాపకాలకు స్వస్తి చెప్పాలి. అంటే మానసికంగా సంయమనం పాటించాలి. చేయవలసిన పనులుంటే పిచ్చిపిచ్చి ఆలోచనల పైకి మనసు పోదు. ఏదైనా శారీరకంగా పనిచేస్తుంటే సోమరితనం ఉండదు. మనసుకు వ్యాపకం ఉంటుంది. అదీ రహస్యం.

గూఢచర్యతో నాలోని ఉద్రేకాలు సమసిపోయాయి. ఇప్పుడు ప్రేరణలు లేవు. పరితాపాలు లేవు. అనుతాపాలు లేవు. పనిలేకపోతే ఆలోచనలు వస్తాయి. పనిచేస్తే, పనిపైనే ఆలోచన ఉంటుంది. ఇతరాలోచన లుండవు. హృదయగతమైన సత్యం ఆవిష్కృత మవుతుంది. సంఘర్షణ చాలా రోజులు సాగింది. నా బుర్రను తినేసింది. రాత్రిళ్లు నిద్రకు దూరమైనాను. అంతా అశాంతి, కల్లోలం. స్థిమితం లేదు. ప్రశాంతి లేదు. మనశ్శాంతి లేదు. మనస్సును గమనించిన కొద్దీ అలజడి మరింత పెరిగింది. మనసు ఒక యంత్రం. ఆలోచన యాంత్రికం. యంత్రాన్ని పని చేయించాలి. లేకపోతే పాడైపోతుంది.

భయం అన్నది మానసికం. ఒకదాని వెంట ఒకటి భయాలు కలుగుతుంటాయి. ఒక రకం భయం కలిగితే దానిపైన మనస్సును కేంద్రీకరించాలి. దానికి లొంగిపోకూడదు. భయపడకూడదు. నిర్లక్ష్యం చేస్తుండాలి. అప్పుడు భయం వీగిపోతుంది. ఓడిపోతుంది. మనస్సు శూన్యం అవుతుంది. ఒక భయం కలిగితే, అది ఒక వ్యక్తికీ, ఒక విషయానికీ సంబంధించింది అయి వుంటుంది. దానిని అంతవరకే పరిమితం చేయాలి. మిగతా విషయాల పైన ఆ భయం నీడ పడనీయకూడదు. అప్పుడు భయాన్ని తొలగించడం సులభం.

ఆ దృష్టితో నా మానసిక యంత్రాన్ని గమనించసాగాను. దానిలో ఎన్ని పొరలు? ఎన్ని అరలు? ఎన్ని తెరలు? కొన్ని అభేద్యాలు, మరికొన్ని జటిలాలు. ఎన్నో మార్గాలలో మనసు పనిచేస్తుంది. ఒకే మార్గం అని, ఒకే పద్ధతి అని ఉండదు. ఉదాహరణకు ఉద్రేకాలు – ఎన్ని? ఎన్ని మార్గాలు? శక్తి – ఎన్ని రకాలు. మానసిక శృంగారం, జ్ఞానం అన్నింటికీ మూలం ఒక్కటే – ప్రేరణ చైతన్యం. మొత్తం మీద చైతన్యం ఒక్కటే చిలవలు పలవలు వేస్తుంది. అదే రకరకాల శక్తులుగా, ఉద్రేకాలుగా మారుతుంది, రూపాంతరం చెందుతుంది. ఒకే జీవచైతన్యం అనేక వృత్తుల ద్వారా ప్రవృత్తులుగా రూపాంతరం చెందుతుంది.

విభజించి శాసించే విధానం మనసుది. విడగొట్టి పెత్తనం చెలాయిస్తుంది, శాసిస్తుంది. తన ఆధిక్యతను నిరూపిస్తుంది. ఏకైక జీవచైతన్యాన్ని చిన్నచిన్న ముక్కలు చేసి బలహీన పరుస్తుంది. శక్తిని తగ్గించి నిర్వీర్యం చేస్తుంది. అది

అంతేనన్న భ్రమ కలిగిస్తుంది. మనసు చాలా తెలివిగా పనిచేస్తుంది. చేతికి చిక్కదు. తర్కానికి అందదు. విడివిడిగా ఒక్కొక్క అవయవానికి పనిచెబుతుంది. ఊడిగం చేయించుకుంటుంది. ఒకసారి ఒక్క ఆలోచననే ఆచరణకు పంపుతుంది. అన్నింటినీ సమీకరించేపని తను చూస్తుంది. నిర్వహణ, చాకిరీ శరీరానికి, ఇంద్రియాలది. పెత్తనం నిర్వాకం మనస్సుది. అలా మనస్సు యొక్క నగ్న సత్యాన్ని గ్రహించగలిగాను.

రహస్యంగా మనసు దాచుకున్న విషయాలను, సత్యాలను నిద్రిస్తున్నప్పుడు మనసు ఏమరుపాటుగా ఉన్నప్పుడు కనిపెట్టవచ్చు. మనసు శూన్యం అయితే ఆ భాగాల సమాచారం శూన్యమవుతుంది. అంటే మాయమైపోయి, శూన్యం మిగులుతుంది. అప్పుడు మనస్సు కొత్తవాకిళ్లు తెరుస్తుంది. నూతనత్వాన్ని, నూతన శక్తిని ఆహ్వానిస్తుంది. అప్పుడు మనస్సు సున్నితం అయి జాగృతమవుతుంది. ఆ మార్పు భరించడం కష్టం. దాని ప్రభావం మేధస్సుపైన, ప్రతాపం శరీరంపైన పడుతుంది. విలవిల్లాడిపోవలసి వస్తుంది. పిచ్చిపట్టినా పట్టవచ్చు. ఉన్మాదిగా మారనూవచ్చు. లేదా శరీరం బాలెన్స్ కోల్పోయి జబ్బు పడుతుంది. అలాంటి 'మాయ' రోగం వచ్చినప్పుడు బయటకు పోయి దిక్కులు చూస్తూ కాలం గడిపేస్తాను. అందాన్ని ఆస్వాదిస్తుంటే ఆలోచన కలగదు. ఏదీ తప్పించుకోవాలను కోను. దేని నుండీ పారిపోవాలనిపించదు. అయినా మనస్సు తప్పించుకునే అవకాశం యిస్తుంది. అందుకు ప్రోత్సహిస్తుంది. అలా తప్పించుకోడానికే కొత్త పుస్తకాలు చదవడం, ఇతరులతో కబుర్లు చెప్పడం. వ్యాపకాలు మనస్సుకు విశ్రాంతి నిస్తాయి. నేనెన్నడూ తప్పించుకునే ప్రయత్నం చేయలేదు కనుక మనస్సు నా పట్టు తప్పిపోలేదు.

నేను చేసిన మొదటి పని మనస్సును కట్టడి చేయకపోవడం. దానికి పూర్తి స్వేచ్ఛ నిచ్చాను. ఆలోచనల ద్వారా శక్తిని వినిమయం చేయకుండా నిరోధించ గలిగాను. ఇప్పుడు మనోభూమికపై పూర్తి ఆధిపత్యం నాది. అనుక్షణం మనస్సును వేయి విధాల కనిపెట్టి ఉంటాను. పిచ్చివేషాలు వేయనివ్వను. కాపలా కాస్తుంటాను. ఇప్పుడు మనసు తడబడడం లేదు. ఎటూ పరుగులు తీయదు.

ఆ విధంగా నా ఆంతర్యాన్ని విశ్లేషించి వివేచించడం వల్ల నాలోని ప్రతి భావాన్ని, భయాన్ని వెతికి పట్టుకోగలిగాను. మానసిక చర్యల్ని గమనిస్తూ, మూలానికి చేరగలిగాను. మనస్సు నిర్మాణానికి పునాది అహంకారం అని

తెలుసుకున్నాను. 'నాది' అంటే అహంకారం, నాలోని భావాలు, ఉద్వేగాలు, ఉద్రేకాలు, ప్రణాళికలు అన్నీ.

'అహంకారం' అంటే 'నేను-నాది' అనే కేంద్రీకృత వ్యవస్థ. అది చెదిరితే అంతా కల్లోలం. నా 'గమనిక' వల్ల, అనుశీలన వల్ల మనశ్చర్యల వేగం తగ్గింది. ఒకసారి ఒకే భావనపైనే అహంకార వృత్తి లగ్నమవుతుంది. 'అహం' భావంగా పనిచేస్తుంది. ఒకే దిశగా సాగుతుంది. అహం మొత్తంగా ఎప్పుడూ ఎక్కడా పనిచేయదు. మనోభూమికపైన, ఒక పని మీద లగ్నం చేయదు. స్వభావరీత్యా 'అహం' పరిమితం. చిన్నచిన్న శకలాలుగా విభాగితం కావడం దాని నైజం. అదే మనోమయ అహంకార ప్రవృత్తి.

మనం సాధారణంగా ఆలోచనలకు స్పందిస్తాం. కానీ ఆలోచనలు అనంతంగా సాగుతూనే ఉంటాయి. ప్రతి ఆలోచనకు స్పందించడం సాధ్యపడదు. కొన్ని భావాలు ప్రతిస్పందనలుగా మిగిలిపోతాయి. ప్రతి భావం ప్రేరకంగా, ఉపయోగకరంగా అనిపిస్తుంది. భావాలన్నీ నిజాలనిపిస్తాయి. వాస్తవానికి అవి అన్నీ భ్రమలే. భావనలన్నీ భ్రమా జనితాలు. మన విధులు, కామనలు, నిర్ణయాలు కలగలసి మన జీవన శైలిని నిర్ణయిస్తాయి. అలా కోరికలు కలగడం, అవి నెరవేరడం అనంతంగా సాగుతుంది. అదే జీవన సరళి. చచ్చేవరకు అవి అలా సాగుతూనే ఉంటాయి.

నేను ఆలోచనల్ని భావచిత్రాలుగా మార్చి, అవి శూన్యంలో కదలడం చూస్తాను. అవి క్రమంగా కరిగిపోతాయి. లేదా, ఒక దాని కొకటి పొంతన లేనట్లు దూరదూరంగా పోయి అంతర్ధానమవుతాయి. మనం ఏదైనా ఒక భావాన్ని పట్టుకుని దానితో సంబంధం పెట్టుకుంటే, అనుబంధం పెంచుకుంటే అది మనల్ని గట్టిగా పట్టుకుంటుంది. అవే భావానుబంధాలు. అవి కాలక్రమేణా కార్యరూపం ధరిస్తుంటాయి. వివేచన అంటే వాటిని మనకు అనుకూలంగా మార్చుకోవడం. తర్కం అంటే ప్రతికూలంగా స్పందించడం.

ఇప్పుడు నా పరిస్థితి, మనః స్థితి వేరు. ఏ ఆలోచనా నాకు 'ప్రేరణ' ఇవ్వదు. ప్రేరకం కాదు. మార్గదర్శకం కాదు. ఉద్రేకాలు నాకు ప్రేరకం కావు. 'అహం' బొత్తిగా పనిచేయదు. 'అహం' కారానికి, ఇంగిత జ్ఞానానికి సంబంధం లేదు. మనస్సులో అహంకారం ఉన్నప్పుడు అలజడి, సందిగ్ధం, కల్లోలం ఉంటుంది. నాలో అహంకారం నశించి నేను 'నేను'గా నగ్నంగా మిగిలాను. అంటే నాలోని

‘అహం’ శక్తిహీనమైంది. అప్పుడు మొదలైన అంతస్పందన ఇప్పుడు పూర్వంలా పనిచేయడం లేదు. మేధ, మనస్సు శూన్యమై ఏవీ తమలో దాచుకోవడం లేదు. అది నిజమైన శూన్యం. అంటే నాలోని శూన్యంలోకి కొత్త చైతన్యం ప్రవేశించింది.

ఈ పరివర్తన వల్ల మెదడు పరావర్తం చెందింది. మస్తిష్కంలో మెదడుపైన వత్తిడి అధికమైంది. అంతలో నీరసం, అలసట. అయినా మనస్సు పాదరసంలా మెత్తగా ప్రవహించసాగింది. ఇది సరికొత్త అనుభవం. అది రోజురోజుకు నాలో చైతన్యం పెంచుతోంది. శక్తిని పెంచుతోంది. విశ్రాంతి అవసరం అనిపిస్తే అలా కొండలపైకి షికారు వెళ్లేవాడిని. క్రమంగా అదే ‘ధ్యానం’ అయింది. ధ్యాస ధ్యానంగా మారింది. మేధ, మనస్సు, ఆలోచనల పరిధిని దాటిపోయాను.

ఏకాగ్రతకు భంగం కలిగేది. ఆలోచనలు పురివిప్పేవి. కోరికలు బుసకొట్టేవి. వాటిని దూరంగా తరమడానికి స్వేచ్ఛ, సంయమనం అవసరం. ఏకాగ్రత అవసరం. మనసులో ఒక కోరిక కలిగితే, వెంటనే దానిని నిలవరించి ప్రతిఘటించాను. దాంతో అవగాహన పెరిగింది. అంతర్ముఖీనత పెరిగింది. అంత రంగంలోకి చొరబడడం సులభమైంది. రాబోయే ఆలోచనల్ని ముందుగానే గ్రహించి, నిగ్రహించుకోగలుగుతున్నాను. మనస్సు పూర్తిగా నా అధీనంలోకి వచ్చింది. అలజడి సమసిపోయింది.


ఇప్పుడు నన్ను నేను సంపూర్ణంగా గమనించగలను. విశ్లేషించుకోగలను. అప్రమత్తత పెరిగింది. జాగరూకత పెరిగింది. అనేక కోణాల నుండి పరిశీలించి విశ్లేషించ గలుగుతున్నాను. ఒక్కొక్క భావం ఎక్కడ పుడుతుందో, ఎట్లా పైకి వస్తుందో, ఎలా విస్తరిస్తుందో తెలుస్తోంది. శృంగారం అనేది ఒక భావ శకలం. భావ శబలత. స్వకపోల కల్పనాచిత్రం. అది రూపుదిద్దుకుని శరీరంపై ప్రభావం చూపుతుంది. నరాలు ఉద్రేకం చెందుతాయి. కోరికగా మారి నిలవనీయని పరిస్థితి ఏర్పడుతుంది.

శృంగార భావన కలిగిన వెంటనే శూన్యంపైన తీవ్రంగా ధారణ చేస్తే అది బలహీనపడి కరిగిపోతుంది. ఆచరణలోకి వచ్చే అవకాశం ఉండదు. దాని బదులు మనస్సు గొప్ప అనుభూతిని స్వంతం చేసుకుని పరవశం చెందుతుంది. నేను ఆ మొత్తాన్ని ఒక దృశ్యంగా భావించి అదృశ్యం చేస్తాను. అది నా అనుభూతి ... సెక్సు భావనతో తలపడడం కష్టం కాదు. సెక్సు భావనను ఒక సవాల్‌గా స్వీకరిస్తాను. అది ఎక్కడ మొదలైందీ గమనించి అక్కడికి చేరి సమూలంగా తుడిచి వేస్తాను. శృంగార భావన చాలా సున్నితం. ఒక్కొక్కసారి మనసుకు చిక్కదు.

భావానికి అందదు. మనసులో దొంగలా ప్రవేశిస్తుంది. దానిని పట్టుకుని నిర్మూలించడానికి చాలా అప్రమత్తత అవసరం. సెక్సుపై విజయం సాధించడం వల్ల నాలో చాలా శక్తి సమకూరింది. కుక్కను పట్టుకోవాలంటే కుక్కకంటే మనిషి వేగంగా పరిగెత్తాలి. అలాగే ఒక భావాన్ని, ఉద్రేకాన్ని నిలవరించాలంటే అంతకన్న బలమైన శక్తిని ప్రయోగించాలి. అదే అప్రమత్తత. సెక్సుభావన వల్ల మనిషిలో కామవికారం ఎలా కలుగుతుందో తెలుసుకుని దానిని పరిహరించ గలిగాను.

వచ్చే ఆలోచనల్ని ముందే తెలుసుకోవడం అలవాటైంది. ఇతరత్రా వ్యాపకాల వల్ల కూడా సెక్సుభావనల్ని తొలగించుకోవచ్చు. గమనిక వల్లనే శక్తి కలుగుతుంది. అంటే మనస్సు జోక్యం లేకుండా చైతన్యం పొందవీలుంది. లైంగిక భావ ప్రేరణ ఒక విధంగా నాకు మేలు చేసింది. ఆలోచనల్ని మూలంలోనే త్రుంచి వేయడం, శూన్యంలో లయం చేయడం ఎలాగో తెలిసింది. నన్ను నేను అర్థం చేసుకోవడంలో శృంగార విజయం ఎంతో ఉపయోగించింది. లైంగిక భావాన్ని శక్తిగా ఎట్లా మార్చుకోవచ్చో అనుభవపూర్వకంగా తెలిసింది. అంటే శృంగార భావాన్ని జయిస్తే 'శక్తిపాతం' జరుగుతుందని గ్రహించాను.

భయం, కామం, కోపం లాంటి గుణాలు మనిషిలోని జీవశక్తిని హరిస్తాయి. వాటికి సంబంధించిన ఆలోచన లేకుండా చేస్తే చాలా శక్తి ఆదా అవుతుంది. మన శక్తి నిల్వలు పెరుగుతాయి. మిగిలిన వ్యసనాలు నిరోధించ వీలవుతుంది. ఒక ఆలోచన కార్యరూపం ధరించడానికి చాలా శక్తి ఖర్చవుతుంది. దానిని అనుభవించే సరికి నీరసం వస్తుంది. అలా కాక ఆలోచనపై దృష్టి నిలిపి, దానిని గమనిస్తే, నిర్మూలిస్తే శక్తి అద్భుతంగా పెరుగుతుంది. ఆ విధంగా భావాన్ని శక్తిగా మార్చుకోవడం నేర్చుకున్నాను. అది సాధన వల్ల సాధ్యమైంది.



కుటీరంలో మిగిలిన ఒక క్రిమి అవశేషం – నేను తీసిన ఫొటో



4. శక్తి వినిమయం

సంభోగేచ్ఛ మూలకారణం తెలుసుకోవడంవల్ల నాలో ఆత్మవిశ్వాసం ఏర్పడింది. నా శక్తిపైన నమ్మకం. అంటే నన్ను నేను కంట్రోల్ చేసుకోగలననే విశ్వాసం ఏర్పడ్డది. నా ఉద్రేకాలకు కళ్లెం వేయగలుగుతున్నాను. సాధారణంగా సంభోగేచ్ఛ కలగగానే, ఎవరైనా ఆ కోర్కెను తీర్చుకోడానికి ఉవ్విళ్లూరుతారు. నేను ఆ కోరిక నుండి విముక్తం అయి స్వేచ్ఛ పొందడానికి ప్రయత్నించి విజయం సాధించగలిగాను.

ఇప్పుడు మరొక సమస్య ఉత్పన్నమైంది. ఒక విషయం నుండి మనసును మళ్లించడానికి దానికై పడే ఏకాంత వ్యధ. అదొక సమస్యగా మారింది. మనం సమస్యలను పరిష్కరించే సందర్భంలో విశ్రాంతి కుదరదు. ఏకాంతం సాధ్యపడదు. మానసికంగా ఆ సమస్యలతో మనమూ ఉంటాం. మనకు తెలియకపోయినా, ప్రయత్నించకపోయినా మన ప్రమేయం ఉండి తీరుతుంది. కనుక ఆ సమస్యల నుండి తప్పించుకున్నట్లు కాదు. పరిష్కరించుకోగలిగే సమర్థత మనకు ఉన్నా గుర్తించం.

ఒక భావం కలిగింది అనుకుందాం. ఆ ఆలోచన మనకు సంబంధించింది కనుక స్పందిస్తాం. స్పందించగానే అది సమస్యగా మారుతుంది. ఆలోచన మరచి, సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తాం. కాని ప్రతికూలమైన మరొక పనిచేసి, ఆ సమస్యను మరింత జటిలం చేస్తాం. సమస్య ఎన్నటికీ పరిష్కారం కాదు. సమస్యను సృష్టించేది మనస్సు లేదా ఆలోచన. ఒక ఆలోచనకు మరొక ఆలోచన చేయడం పరిష్కారం కానేకాదు. ఒక ఆలోచన చుట్టూ రకరకాల

ఆలోచనలు సుడులు తిరుగుతుంటాయి. మనస్సు మధ్యవర్తిగా ఉన్నంతకాలం ఏ సమస్యా పరిష్కారం కాదు. అసలు సమస్యకు మూలకారణం తెలుసుకోవాలి.

అయితే, ఒక సందేహం! ఒక సమస్య గురించిన విచారణలో గాని పరిష్కారంలో గాని మనసు ప్రమేయం ఉండదా? ఉంటుంది. కాని, ఆలోచించడం మాని సమస్య దగ్గరకు చేరాలి. అందుకు శక్తి కావాలి. అది మానసిక శక్తి కాదు. మనదైన జీవశక్తి. అదే శక్తిపాత క్రియ. అప్పుడు భావంలో భావుకుడు, సమస్య, సమస్యను ఎదుర్కొన్నవాడు చిత్రంగా లయించిపోతారు. అదే రహస్యం. ఆ శక్తి చైతన్యానికి అదే దివ్యశక్తి.

ఆత్మ విచారణలో అంటే నన్ను నేను లోతుగా, సునిశితంగా విశ్లేషించు కున్నప్పుడు బయటపడిన గుప్తనిధులు అవి. సంభోగం పైకి మనస్సు పోయినపుడు తీవ్రంగా మథనపడ్డాను ... ఆ కోరిక ఎందుకు కలిగింది అని. మళ్లీ మళ్లీ అదే కోరిక ఎందుకు కలుగుతోంది? ఒకవేళ కోరిక తీరినా, మళ్లీ మనసు దానినే కోరడం ఎందుకు? అలా ఆలోచిస్తే కోరిక ఆగిపోయింది. సంభోగేచ్ఛ నుండి పూర్తిగా విముక్తం కాగలిగాను. అలా అంతర్మథనం వల్ల, అనుశీలన వల్ల 'భావన' నశించిపోతుంది. శూన్యంలో లయించిపోతుంది. ఆ తర్వాత అలాంటి భావనలు కలగవు. కలిగినా ఇబ్బంది పెట్టవు. అది ప్రశాంత సాధనకు ఉపాయం.

ఆ తర్వాత భోగ వాంఛ తగ్గింది. అంతకు ముందు రకరకాల బొమ్మలు కనిపించేవి. అవి ఊహాచిత్రాలు కావచ్చు. మనస్సు ఎప్పుడూ అటే పరుగులు తీసేది. ఆ తర్వాత ఏకాగ్రత కుదిరింది. సున్నితత్వం ఏర్పడ్డది. నాలోపల ఎక్కడో గుప్తనిధు లున్నాయి. అవి శక్తి కేంద్రాలు. ఇప్పుడు అవి బయటపడి సద్వినియోగ మవుతున్నాయి. నాలో అంతటి శక్తి, చైతన్యం ఉన్నాయా అని నాకే ఆశ్చర్యం కలిగింది. ఇంకా లోతులు నెమకడం ప్రారంభించాను. భయం, విషాదం, తత్సంబంధ భావాలను మనసునుండి తొలగించ ప్రయత్నించాను. తప్పించ గలిగాను. ఇప్పుడు ఏదీ నాకు సమస్య కాదు. సమస్య చుట్టూ ఆలోచనలు, వలయాలు తిరగవు. అది నాదైన వైరాగ్యభావన. అది భావశూన్య, భావాతీత స్థితి. అది భావరహిత స్థితి.

ఇప్పుడు నేను కొత్త వ్యక్తిని. నా ప్రపంచం వేరు. నాలో నేను జీవిస్తున్నాను. ఆనందంగా, తృప్తిగా జీవిస్తున్నాను. అంతలో నాకు అగ్నిపరీక్ష లాగా నా కుటీరంలో ఒక సంఘటన జరిగింది. నా గది బహుచిన్నది. గాలి, వెలుతురు లోపలకు రావు. కరెంటు ఎటుగూడా లేదు. ఉన్నది చిన్న బుడ్డి దీపం. దాని వెలుగు

అంతంత మాత్రం. నేల మీద చాప పరచుకుని పడుకుంటాను. ఒకసారి నా ఎదురుగా ఏదో పాకుతున్నట్లు అనిపించింది. ఎర్రగా, మండ్రగబ్బ లాగా ఉంది. పది పన్నెండు అంగుళాల పొడవున్న విషక్రిమి. దాని కాళ్లు లెక్కలేనన్ని. కోరలు చాలా ఉన్నాయి. అంతపెద్ద మండ్రగబ్బను ఎప్పుడూ చూడలేదు. భయంకరంగా ఉంది.

నేలపైన పాకుతోంది. తలుపు తెరిచే ఉంది. కనుక బయటకు పోవచ్చు అదిలిస్తే, చప్పుడు చేస్తే. చిత్రం. అంతలోనే అలాంటివి లోపలకు జరజర ప్రవేశించాయి. ఒకటా రెండా, వందలు. నా గదినంతా ఆక్రమించాయి. ఎలా పారిపోవడం? ఒక్కటి కరిచినా నా పని గోవిందా! అడుగుతీసి అడుగువేయడానికి జాగా లేదు. నా చాపపైకి పాకి వచ్చాయి. నా చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాయి. చిరుదీపం వెలుగులో వాటిని చూడడంతప్ప చేయగలిగింది లేదు. అవి కరవడం ఖాయం. నేను చావడం ఖాయం. సహాయం కోసం అరిచినా, అక్కడ చుట్టుపట్ల ఎవరూ లేరు. అరవడానికి నోరు పెగల్లేదు. శబ్దం వస్తే గదా!

మనసు చెదిరింది. నలువైపుల నుండి నా మీద దాడికి సిద్ధపడుతున్నాయి. చచ్చేంత భయం వేసింది. ఎప్పుడు ఇంతలా భయపడింది లేదు జన్మలో. మామూలుగా అయితే ఏదో ప్రయత్నిస్తాం లేదా పారిపోతాం లేదా చంపడానికి ప్రయత్నిస్తాం. నేను వాటిలో ఏ ఒక్కటీ చేసే పరిస్థితిలో లేను. వాటిని చంపాలని పించలేదు. పారిపోవాలనిపించినా ఆ పని చేసే అవకాశం లేదు. భయం గుప్పిట్లో నేను. నాలో ఏదో శక్తి కదిలినట్లయింది. ఆ శక్తి నా భయాన్ని స్వాహా చేసింది.

అప్పుడు 'అభావం' వల్ల స్పందన లేకుండా పోయింది. స్పందన లేకపోతే ప్రతిస్పందించడం జరగదు. స్పందనలో 'క్రియ' ఉంటుంది. అసలు భయపడడం అన్నది ఒక ప్రతిక్రియ. శూన్యంలోకి చూపుసారిస్తే పిరికితనం ఉండదు. భయం పోతుంది. అప్పుడు నా పరిస్థితి అయోమయం. చచ్చేంత భయపడ్డాను. అయితే ప్రతిక్రియ ఆలోచన రాలేదు. ఏదైనా చేయాలన్న ఆలోచన కలగలేదు. ఉత్తి నిరామయంగా, నిరాలోచనగా మానసిక శూన్యంలో ఉండిపోయాను. భయం అన్న స్పందన పోయింది. అంతా స్తబ్దత. ఒక ప్రతిక్రియ లేదు. ఆలోచన లేదు. మనస్సు మొద్దుబారింది.

కొంతసేపటికి ఆ విషక్రిముల్ని గురించి మరచిపోయాను. మనసు చూడనిది కళ్లు చూడవు. అవి తిరుగుతున్నా వాటివల్ల ప్రమాదం అన్న భావం లేదు. వాటిని గమనించడం మానేశాను. కారణం, కార్యం రెండూ లేని స్థితి.

అంటే భయభ్రాంతి. భయాన్ని భ్రాంతిగా భావించగలిగితే అంతా అభయమే! ఎప్పుడైతే భయం భావంతో కలిసిపోయిందో అపుడే భయభావన ఉండదు. ఆనాటి విషయం నా ఆలోచనల్ని కాటు వేయలేదు. అంతే మండ్రగబ్బల స్మృతి పోయింది. అవి అక్కడ ఉన్నాయో వెళ్లిపోయాయో తెలియదు. నిరామయంగా అంతరవ లోకనంతో బాహ్యాన్ని విస్మరించాను.

నాలో ఏదో కొత్త శక్తి ప్రవేశించింది. ప్రతిఘటించే శక్తి కాదది. సాత్త్వికం. ప్రతిక్రియ భావం లేనప్పుడు, ప్రతికూలత ఉండదు. విషక్రిములు ఎట్లా వచ్చాయో అలాగే వెళ్లిపోయాయి. నేను గమనించలేదు. అంటే గమనించే మనస్సు శూన్యమైన కారణం.

ఈ అనుభవాలతో నేను తెలుసుకున్నది భయ, మైథునాల విషయంలో మనసు ఒక భావం కలిగించి ప్రేరేపిస్తుంది. నెమ్మదిగా భావం పెరిగి పెరిగి రూపాంతరం చెందుతుంది. రూపం సంతరించుకుంటుంది. భావచిత్రాలు శరీరంపైన, నరాశయంపైన ఒత్తిడి తెస్తాయి. క్రియకు అట్లా 'ఊతం' లభిస్తుంది.

నా గమనిక అదే. ఆచరించింది అదే. ఆలోచనల్ని నాలోని చైతన్యభూమిక పైన బంధించడం వల్ల చర్య, ప్రతిచర్య లేకుండాపోయాయి. అప్పుడు అవగాహన పెరిగింది. లోతు ఎక్కువైంది. ఆ విధంగా మనస్సు భావాల్ని ఎట్లా ఉపయోగించు కునేది తెలిసింది. అప్పుడు ఆలోచన పట్టుసడలి మనసు శూన్యం కావడం సాధ్యమవుతుంది.

అంటే జరిగింది ఏమిటి?

ఆలోచనకు, చర్యకు మధ్య సంబంధం తెగిపోయింది. నిరామయస్థితి ఏర్పడింది. గమనిక పెరిగింది. గమనిక వల్ల ఆంతర్యంలోని శక్తి చైతన్యంగా మారింది. దానికి ఆలోచనతో పనిలేదు. అలా ఆలోచనలు లయించినప్పుడు మనసు నిర్మలం, నిశ్చలం అవుతుంది. ఇది నాకు కొత్త అనుభూతి. ఉద్రేకాలు, కామనలు, విచారాలు, భయాలు, ఆలోచనలు ఏవీ ఉండని స్థితి.

భావంతో జతకట్టిన శక్తి స్వతంత్రం. దానిది స్వేచ్ఛాప్రవృత్తి. తద్వారా కొత్తచైతన్యం ఏర్పడుతుంది. మనదైన అనుభూతి స్థిరపడుతుంది. మన మనో మండలం అవతల ఎక్కడో నిక్షిప్తమై ఉన్న నిగూఢశక్తి అది. దానిని అందు కోవాలన్న తపన, కోరిక ఉండకూడదు. స్వంతం చేసుకోవాలన్న స్వార్థం ఉండ కూడదు. ప్రతిఫలం, ప్రయోజనం ఆశించకూడదు. అందులో ఎలాంటి ఉద్రేకాలు,

ఉన్మాదాలు, ప్రేరకాలు పనికిరావు. అవి నాలో లేవన్న వైరాగ్యం కలగాలి. లేకుంటే ఏ క్షణంలోనైనా కాలు జారడం, పడిపోవడం జరుగుతుంది. అది పతనం. మన పతనాన్ని మనమే స్వాగతించడం!

అది ప్రతిభ. అది మౌలికం. ప్రతిభ అభిలషణీయమే కాని స్వార్థం కోసం వినియోగిస్తే ప్రతిభ క్షీణించి పోయే అవకాశం ఉంది. మహత్తత్వాన్ని, ప్రతిభను ఇంద్రియ భోగాలకు, చాపల్యాలకు వినియోగించకూడదు. శక్తుల్ని, సిద్ధుల్ని సంపాదించడం ఎంత కష్టమో వాటిని కాపాడుకోవడం అంతకన్న కష్టం. కోల్పోవడం చాలా సులభం. వాటిని మనలో నిలుపుకోవడానికే సాధన. వాటిని దుర్వినియోగ పరచకుండావుంటే ప్రతిభ, శక్తి పెరుగుతాయి. సిద్ధులు దినదినాభి వృద్ధి చెందుతాయి.

ఒకసారి నేను కాలు జారాను. అంటే మనస్సు జారింది. అమ్మ జ్ఞాపకం రాగానే గతంలోకి జారుకున్నాను. దుఃఖం కలిగింది. చాలాసేపు గతంలో నుండి వర్తమానంలోకి రాలేకపోయాను. అయినా వివేకంలోని ఒక పార్శ్వం నన్ను నిశితంగా గమనిస్తూనే ఉంది. నా ఉద్రేకాలను, ఆలోచనల్ని గమనిస్తోంది. అంత ఉద్విగ్నతకు హేతువు అమ్మ జ్ఞాపకానికి రావడం. అది స్మృతి. స్మృతిలోంచి విస్మృతిలోకి వెళితే అంతా శూన్యం. అమ్మను గురించిన మనోచిత్రం. భావనకు బలం లేదు. ఎంచేతంటే అది వాస్తవం కాదు కనుక. ఒకప్పటి వాస్తవం తాలూకు నీడ మాత్రమే స్మృతి. స్మృతి అనుభూతిగా మిగిలింది. ఆలోచన రగిలించింది. అప్పుడప్పుడు అమ్మను గురించి, ఇంటి గురించి నేను ఎంత ఆలోచించినా చేయగలిగింది లేదు.

ఆనాటినుండి నా అంతరంగాన్ని ఆలోచనపై కేంద్రీకరించసాగాను. ఉత్తినే ఏడిస్తే ఏం ప్రయోజనం? కన్నీరు కారడం తప్ప! ఒక చిన్న భావం పెరిగి పెద్దదై, ఆలోచనై, చిత్రంగా మారి, రూపంగా మారి ఎంత గొడవ చేస్తోంది! ఎంతో ఉద్రేకానికి లోను చేస్తోంది? దానిని మనం ప్రేమ, అనురాగం, బాంధవ్యం అని ముద్దుగా పిలుస్తాం. మొదటిసారి అనిపించింది – ఈ ఉద్రేకాలు, బాంధవ్య బంధాలు అన్నీ భావస్పందనలేనని, భావశబలతలని, వాటిని అధిగమించడం కష్టం కాదని.

భావస్పందన వల్ల నాడీ మండలం తీవ్రంగా ప్రతిస్పందిస్తుంది. శరీరంలోని ఆయా భాగాలు ఒత్తిడికి లోనై ఉద్రేకపడతాయి. శారీరకంగా ఇంద్రియాలు అనుభవిస్తే తప్ప ఉద్రేకాలు చల్లబడవు. అలాగే ప్రేరణ మనస్సుపై ఒత్తిడి తెస్తుంది.

తత్సంబంధమైన ఆలోచనలు చాలా కలుగుతాయి. ప్రేమ విషయంలోనూ, ద్వేషం విషయంలోనూ భావన ఆలోచనగా మారి విశ్వరూపం ప్రదర్శిస్తుంది. నేను తొలి నుండి చివరివరకు నిశితంగా గమనించడం వల్ల అవి లోపలనే అణగి పోతుంటాయి. పైకుబికి రావు. కలత పెట్టవు.

ఒంటరిగా ఉన్నప్పుడు ఉద్రేకాలు తల విదిలిస్తాయి. అప్పుడు స్పందన సున్నితంగా ఉండదు. ఏడుపొస్తుంది. నలుగురిలో ఉన్నప్పుడు ఉద్రేకాల స్పందన అతిగా ఉండదు. ఒంటరిగా ఉన్నప్పుడు ఏడుపు వస్తుంది. ఆంతర్యం ఒంటరి తనంలో విలపిస్తుందేమో. కారణం ఫలానా అని చెప్పలేం! చిన్న గుండెలో ఇంత పెద్ద విషాదం గూడుకట్టి ఉందా అనిపిస్తుంది. నాలోనూ అలాంటి వేదన ఉంది. అది అంతర్వేదన. నాలోనూ విషాదం ఉంది. విషాద కారణం వెతకినా కనిపించదు. ఫలానా కారణంగా దిగులు అని చెప్పలేను. ఉత్తినే కూర్చున్నపుడు దుఃఖం పొంగుకొస్తుంది. మేల్కొని ఉన్నప్పుడే ఏడుపొస్తుంది. నిద్రలో ఏడుపు రావడం అరుదు. గతంలోగాని, ప్రస్తుతంలోగాని, ఎవరితో ఏ సంబంధం లేకపోయినా ఏడుపొస్తుంది. అసలు కారణం ఒంటరితనమేమో అనిపిస్తుంది. నాలో నుండి నాకు తెలియని లోతుల్లోంచి విషాదం పొంగు లెత్తుతుంది.

అది నా జీవితంలోని విషాదపర్వం. నా 'వ్యక్తి'గత విషాదాలు క్రమంగా తొలగిపోయాయి. విషాద కారణాన్ని సమూలంగా ఉత్తరించి వేశాను. అవి నా అనుభవాల జ్ఞాపకాలు. అది మనిషి జననాంతర బాధ. మనిషిగా పుట్టినందుకు మనిషిలో గూడుకట్టుకున్న విషాదం. అది జన్మజన్మల విషాదశేషం. అది జన్మబాధ, జననబాధ, మనిషిబాధ. అది ఆత్మఘోష. నిజానికి అది మానవత్వానికి ఖరీదుకట్టే బాధ. అది మన వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుతుంది. భయంవలె విషాదాన్నీ మూలంలోనే అణచివేయగలిగాను.

అలాగ, మనలోపల పాతుకుపోయిన జన్మ సంచితాలను, విషాదాలను ఒక్క సంకల్పంతో, భావంతో నిర్మూలించవచ్చు. అందుకు స్పష్టమైన అవగాహన, గమనిక అవసరం. అదీ ఆలోచన లాంటిదే. అయితే బలం చాలదు. సంకల్పం దృఢంగా, స్థిరంగా ఉండాలి. లోపలి విషాదాన్ని ముఖాముఖి ఎదుర్కోవాలి. అంటే బయటి ప్రయత్నాలు ఫలించవు. లోపలకు దూసుకుపోవాలి. లోపల తిష్ట వేయాలి. పోరాటం సాగించాలి. విషాదం ప్రతి మనిషినీ బాధిస్తుంది, వేధిస్తుంది. మనసుకు, భావానికి, ఆలోచనకు సంబంధంలేని క్రియ అది. ఆ విషాదాన్ని సైతం నేను జయించాను.

మనం సాధారణంగా మనసు ఉపరితలాన్నే గమనిస్తాం తప్ప లోతులు తరచిచూడం. మనకు లోతులకు వెళ్లే ధైర్యం ఉండదు. లోపలి భావాలు బయటపడవు. గమనికతో వాటిని పట్టుకోవాలి. ఆలోచనలేని గమనిక, ఆలోచనలు అడ్డం లేనపుడు భావాలు చీల్చుకుని పైకొస్తాయి. మొదట్లో నేను చాలా భయపడ్డాను. కాని భావరహితం అయినకొద్దీ లోతులకు వెళ్లగలిగాను. అది గమనిక వల్లనే సాధ్యం. అప్పుడే మనకు సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. ఏ బంధాలు ఉండవు. ఆలోచన లుండవు. ఒత్తిడి ఉండదు. కలలు రావు. అప్పుడు అసలైన 'పూర్ణత్వం' అనుభవించగలం. నా ఏడుపులు విషాదాలే నాకు మార్గం చూపించాయి. నన్ను గమనిక వైపు మళ్లించాయి. నాలో నిగూఢంగా ఉన్న శక్తి తెలిసింది. ఒక కారణంగా కలిగే విషాదం పాక్షికం, స్వల్పం. మూలంలోని విషాదం సంపూర్ణం. ఇప్పుడు ఏ సంఘటనలు నన్ను కదిలించవు. చలింపచేయవు. కన్నీరు తెప్పించవు.



నా గుహ బయట ఏకాంతంగా ...

కొందరు అతి స్వల్ప విషయానికే ఏడుస్తారు. వారి స్పందన రోదనగా మారుతుంది. సానుభూతిని ఆశిస్తుంది. అది వారి సుకుమార మనస్తత్వం అనుకుంటాం గానీ కాదు. బలహీనత. ఒక చిన్న సంఘటనకు పెద్ద సంఘటనలతో సంబంధం ఉంటుంది. అదే బంధం. బాంధవ్యం. అదే విచారానికి కారణం.

విషాదానికి సంకేతం. నిజానికి మనస్సాగరంలో ఆ సంఘటన ఒక బిందువు. ఆ చిరు సంఘటనను, దాని జ్ఞాపకాన్ని తొలగించగలిగితే పెద్ద సముద్రాన్ని దాటి పోవచ్చు.

ప్రాయికంగా, మనం ఏ విషయాన్నీ సీరియస్‌గా తీసుకోం. సమగ్రంగా అధ్యయనం చేయం. అలా అధ్యయనం చేస్తే సమస్య ఉండదు. ఉన్నా సమస్య బాధించదు. ఒకేసారి బయటా లోపల గమనించగలగాలి. అదీ రహస్యం.

ఇప్పుడు భావం గురించి చూద్దాం! పూర్ణచైతన్యం భావం – సముద్రంలో ఒక నీటి కణం లాంటిది. ఏడవడం ఒక సంపూర్ణానుభవం. అది జీవితం. కన్నీరు జీవితపు లోతుల్ని తాకుతుంది. అది కారణంగా మనిషిలో కొత్తగా చైతన్యం ప్రభవిస్తుంది. ఆ విధంగా నేను అప్రమత్తం కాగలిగాను. నాలో కలిగిన చైతన్యం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. నమ్మలేని నిజం అది. ఎందుకంటే భావరహిత స్థితి నాది. ఆలోచనలేని నిరామయస్థితి. అది కారణాతీతం. జీవచైతన్య వారధి. అమ్మకోసం పడిన బెంగ చిన్న కారణం మాత్రమే. అది కారణంగా నా ఆంతర్యం మొత్తం ఆవిష్కృతమైంది. నాలోతుల్లో గూడుకట్టుకున్న విషాదం మొత్తం ఒక్కసారిగా కరిగిపోయింది. ఇప్పుడు నాలో రహస్య స్థావరాలు లేవు. చిత్రంగా ఒక చిన్న విషాదం గొప్ప వికాసహేతువైంది.

రాత్రింబవళ్లు ఒకే ధ్యాస. అప్రమత్తంగా ఉండడం వల్ల ధ్యాస నా ధ్యానంగా మారింది. అది అర్థించడం కాదు. ప్రార్థించడం కాదు. మనసును ఏకాగ్రం చేయడం కాదు. ఏదో ఆశించడం కాదు. కోరికలు తీర్చుకోవడం కాదు. నిర్వ్యాపారం. లోపలా బయటా భావాలను, ఉద్రేకాలను, ఇంద్రియచర్యల్ని గమనించడం మాత్రమే. మనోవికారాలను, మనశ్చర్యల్ని పట్టించుకోలేదు. భయాలు, ఉద్రేకాలు, కోరికలు, కామనలు ఏవీలేని స్థితి. మనస్సుకు ఆరాటం లేదు. పోరాటం లేదు. అహాన్ని బయటకు లాగి, చైతన్యవారాశిలో లయింప చేశాను. అది నా నగ్న స్థితి. నగ్న భావన. సర్వం విదితమయింది. నాలోని ప్రతి కదలిక, భావవీచిక స్పష్టంగా తెలుస్తోంది. ఆలోచనలు క్రమంగా మందగించాయి. నాలో ఉద్వేగం లేదు. తీవ్రత లేదు. స్పందన లేదు. అయినా జడత్వం లేదు. అంతా చైతన్యం నాలో. ఏదైనా చిన్న ఆలోచన పైకొచ్చినా పట్టించుకోను. కలతపడను.

అప్పటి నుండి ప్రతి అంశాన్ని నిశితంగా, లోతుగా గమనించడం అలవాటుగా మారింది. 'ఆలోకనం' తీవ్రమైంది. నాలో ఒక రకమైన నిర్లిప్తత చోటు చేసుకుంది. నాకేం కావాలి? ఏమీ అవసరం లేదు. విలోమ దృష్టి.

అనులోమ అనుశీలనం. లోపలా బయటా అంతా ప్రశాంతి. అద్భుతమైన సంయమనం. అన్ని మానసిక ఒత్తిడులు దూరమైనాయి.

ఆ తర్వాత నాకు వివేకంతో అవసరం కలగలేదు. వివేకాన్ని సైతం పక్కన పెట్టాను. ఆలోచనకు వివేకానికి ఎడతెగని మైత్రి. ఏదీ జ్ఞాపకం పెట్టుకోను. గమనిక ఒక్కటే వ్యాపకం, వ్యావృత్తి. అదే నివృత్తి. ఎలాంటి స్పందనలూ ప్రతిస్పందనలూ లేకుండా పోయాయి. ఆ స్థితిలో అంతా స్థిమితమే. అంతా నిశ్చలం. శూన్యం. ఎంతో హాయి! కోరేది లేదు. కోరదగింది లేదు. ఆశ లేదు. ఆశయం లేదు. ఆరాటం లేదు. అవరోధాలు లేవు. కనుక మనస్సు శూన్యంగా దిగంతాలకు వ్యాపించేది. నిర్మల కాసారం, నిశ్చలన చిత్రం జీవితం. నాలోకి వచ్చే భావతరంగాల్ని గమనించడం ఒక్కటే నేను చేస్తున్న పని.

అప్పట్లో నిద్ర అవసరం ఉండేది కాదు. నిద్రపోయినా మేల్కొని ఉన్నట్లే ఉండేది. శరీరం, మనస్సు ఏవీ అలిసిపోయేవి కాదు. నిత్యచైతన్యంలో ఉండేవి. మగత, మత్తు, అలసట ఉండేవి కావు. నిద్రించే సమయంలో మనకు శరీరస్పృహ ఉండదు. సర్వం మరచిపోతాం. నాకు నిద్రతో పనిలేదు. ఏదీ మరచిపోయే అవసరం లేదు. ఒకవేళ పడుకున్నా, నిద్రపట్టినా, చీమచిటుక్కుమన్నా మెలకువ వచ్చేది. అప్రమత్తంగా ఉండేది మనస్సు. పడుకున్నా మేల్కొని ఉండేవాడిని. ఉదయం అనిపించేది రాత్రి నేను అసలు నిద్రపోలేదని. కాని నిద్రలేమి వల్ల కలిగే అలసట, బద్ధకం ఉండేవి కావు.

ఆ అనుభవం వల్ల రెండు రకాల స్పందన తెలిసింది. నిద్రపోలేదన్న భావన కలగగానే నీరసం ఆవహించేది. ఒక్కొక్కసారి మహాఉత్సాహంగా ఉండేది. ఏమైనా రాత్రింబవళ్లు నిద్రలేకుండా కూర్చోవడం, ఉత్తినే పడుకోవడం చిరాకు. శరీరం, మనస్సు, కళ్లు బరువెక్కేవి. కొండల మీద తిరిగేవాడిని. ప్రకృతిని ఆస్వాదించే వాడిని. పచ్చని లోయలు, విశాల గగనం కొత్త ఊపిరి పోసేవి. అదనంగా శక్తి వచ్చేది.

అలా కొద్దికాలం సాగింది. మనస్సు ఆలోచించడం మరచిపోయింది. ప్రపంచంతో నాకు పనిలేదు. నిద్రలోనూ, జాగృతిలోనూ ఆలోచన లేకపోతే జీవితానికి అర్థం ఏమిటి? ఎందుకు జీవిస్తున్నట్లు? ఏం సాధిస్తున్నట్లు? ఇప్పుడు భయాలు లేవు. నా కుటీరమే నా ప్రపంచం. భావాతీతప్రజ్ఞ నాలో ప్రభవించ సాగింది. అది రోజురోజుకు ఎక్కువవుతోంది. నా జీవితంలో ఇదొక కొత్త అధ్యాయం కావచ్చు. నవజీవనానికి నాంది కావచ్చు!



5. విస్ఫోటనం

నా పయనం ఎటు?

అనంతసీమల్లోకి, అగోచరంలోకి పయనిస్తున్నా ననిపిస్తోంది. అలా అంతర్యామి అన్వేషణ సాగుతుండగా ఒకనాడు నా జీవిత రహస్యం తెలిసింది. అది మెరుపులా నాలో ప్రవేశించిన జ్ఞానకిరణం. ఆ రోజు మధ్యాహ్నం వంట చేసుకుని పొయ్యి ఆర్పాను. అన్నం వేడిగా ఉంది. కాస్త చల్లబడ్డాక తిందామను కున్నాను. వెళ్లి చాపమీద విశ్రమించాను. అప్పుడే ఒక అనూహ్య సంఘటన జరిగింది. షాక్ తిన్నాను. నాలోంచి ఫౌంటెన్ నీళ్లలా శక్తి పైకుబికి రాసాగింది. అది శక్తిపాతమా, విస్ఫోటనమా – నాకు తెలియదు. లోగడ అనుభవం కానిది, తెలియనిది. అది మెత్తగా, ఆనంద పూర్ణంగా, మహోజ్వలంగా, శాంతంగా ఉంది. ఆ సంఘటనతో నాలో ప్రేమ, కరుణ నిండి, పొంగి పొరలినట్లయింది. ఆపాద మస్తకం వణికిపోయాను. ఇప్పుడు నేను వేరు. ఇదివరకటి వ్యక్తిని కాను. కరుణ, జాలి, దయ, ప్రేమ నాలో ప్రవహించసాగాయి.

నేను మారిపోయాను. నాలో చైతన్యం నిండింది. నా అహం తునాతునక లైంది. దాని స్థానంలో మనస్సులేని స్థితి. నేను లేను. ఆలోచించే నేను లేను. ఆ మార్పు నాలో చోటుచేసుకున్నప్పుడు నేను సాక్షిని. నిమిత్తమాత్రుడిని. నా అంగీకారం లేదు. ప్రతికూల భావనా లేదు. నాలో అతీంద్రియ జ్ఞానం పరవళ్లు తొక్కింది. అన్నీ తెలుస్తున్నాయి. గతకాలపు స్మృతులూ, భవిష్యత్ స్వప్నాలూ లేని ప్రజ్ఞ అది. అది వాస్తవం. అది ప్రస్తుతం.

ఆ శక్తి నాలోకి ఎట్లా వచ్చిందో, ఎక్కడి నుండి వచ్చిందో తెలియదు.

అప్రయత్నంగా, అనూహ్యంగా క్షణకాలంలో వచ్చిన మార్పు అది. ఎంతో ఆనందంగా ఉంది. సుందరంగానూ ఉంది. గాలిలో తేలిపోతున్నట్లుంది. జీవితంలో ఇంత ఆనందం ఎప్పుడూ ఎరగను. అది నన్ను కదిలించింది. నన్ను ఆక్రమించు కుని లోబరచుకుంది. ఆత్మానందం. ఆత్మదర్శనం ఇదేనా? నాలో పరమ ప్రశాంతి. ఇప్పుడు లోపలా బయటా అంతటా చైతన్యమే. ఏదో దివ్యత్వం నన్ను ఆక్ర మించింది. ఆ క్షణంలో నా ఆనందానికి అవధి లేదు. కుటీరంలో ఆనంద తాండవం చేశాను. నా అంతటి అదృష్టవంతుడు ప్రపంచంలో మరొకడు లేడనిపించింది. ఆ ఆనందస్థితి ఎంతసేపు గడిచిందో తెలియదు. కొంతసేపటికి చల్లబడ్డాను. మామూలు స్థితికి వచ్చాను. అయినా లోపల దివ్యచైతన్య ప్రవాహం తెలుస్తూనే ఉంది. ఎంత హాయి, ఎంత తృప్తో. ఉద్రేకం చల్లబడి కరుణగా మారింది. మొదటిసారి ఆత్మానందం సంపూర్ణంగా అనుభవించాను. అన్నం తినబుద్ధి కాలేదు.

అప్పటి నుండి నా ధ్యానం, గమనికలో మార్పు వచ్చింది. ఇప్పుడు నాలోని దివ్యత్వాన్ని అనుభూతించడమే నేను చేయవలసిన పని. అదే తపస్సు. అదే ధ్యానం. కొంతసేపటి తర్వాత ఒళ్లు తెలియనంతగా నిద్రపట్టింది. నిద్రలో అనుభవం చిత్రంగా ఉంది. మనస్సు నిద్రించలేదు. లోపలి చైతన్యాన్ని ఆస్వాదించడమే నిద్ర. బాహ్యస్పృహ కోల్పోయి లోపల మేల్కొనడం. ఇప్పుడు నిద్ర కొత్త శక్తిని అందించింది. దివ్యజ్ఞానం అందుబాటులోకి వచ్చి నా మనసు తలుపు తడుతోంది.

ఆ రోజు కొత్త ఉత్సాహంతో కుటీరం వదలి బయటకు వెళ్లాను. లోకం కొత్తగా ఉంది. నిర్మలంగా, స్వచ్ఛంగా కనిపించింది. ఆకాశానికి అంచులు లేవు. ఆనందం అంబరాన్ని తాకింది. నా ఆంతర్యం ఆకాశమంత విశాలంగా, నిర్మలంగా ఉంది. కాలావధి లేదు. అసలు నేను లేను. ఏమో కాని నేను లోకంలో నడుస్తున్నాను. లోగడ చూచిన ప్రదేశాలు ఇప్పుడు అందంగా, సుందరంగా కనువిందు చేశాయి.

ఒక చెట్టు దుంగపైన కూర్చుని ఆలోచించాను. నాలో ఈ ప్రజ్వలనం ఏమిటి? ఈ చైతన్యజ్వాల ఎలా ఏర్పడ్డది? ఇంతటి శక్తి విస్ఫోటనం ఎందుకు జరిగినట్లు? కళ్లు మూసుకుంటే చాలు లోపలి నుండి శక్తి పైకి ప్రవహిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ రోజంతా దివ్యజ్ఞానం నాలో ప్రవహిస్తూనే ఉంది. ఉపశమనం కలిగింది.

నాకు కలిగింది జ్ఞానోదయం. ఈ విషయం అమ్మకు తెలియచేయాలి. నా ప్రయత్నం వృధా పోలేదు. కొండ చివరివరకు వెళ్లి అమ్మకు వినిపించేటట్లు బిగ్గరగా అరవాలనిపించింది. ఇది పునర్జన్మ. ఆధ్యాత్మికంగా నేను ఈ రోజే జన్మించాను. నా హృదయ స్పందన అక్షరాల్లోకి ప్రాకింది. చిన్న కవిత రాసుకున్నాను. పూర్వం ఎప్పుడూ నేను కలం పట్టి కవితలు రాయలేదు. ఇప్పుడు నా ఆనందమే నాచేత కలం పట్టించింది. కవితా ధారగా ప్రవహించింది. ఆ రోజంతా అక్షరాలతో కుస్తీపట్టాను. హిందీలో, మరాటీలో, ఇంగ్లీషులో రాశాను. భాష ఏదైనా భావం ఒక్కటే. స్పందన ఒక్కటే. పదాలు వాటంతట అవే దొర్లుకుంటూ వచ్చాయి. ఒక్కొక్క పద్యం రాసి, చదువుకుని ఆశ్చర్యపడ్డాను. ఈ రాసింది నేనేనా? అద్భుతమైన, అసలు సిసలు హృదయ కవితలు అవి :

అనుకోని అతిథి

తిరిగి తిరిగి వెదికి వెదికి అలసిపోయింది మనసు
ఇంక వెదక వలసిన తావులు లేవని గ్రహించింది
నిండు నిరాశతో దిక్కు మొక్కు లేని స్థితిలో కూర్చున్నా
అనుకోని అతిథిగా నీవు వచ్చావు నన్ను కనికరించావు.

ఇప్పుడు నా ధ్యానం మారింది. ధ్యాస మారింది. కూర్చునే విధానం మారింది. నా దృక్పథమే మారిపోయింది. నా చింతన వినూత్నం. శక్తి విస్ఫోటన వినూత్నం. ఇది ఎలా సాధ్యమో నాకు తెలియదు. మార్పుకు నేనే ఉక్కిరి బిక్కిరవుతున్నాను. ఒక క్రమశిక్షణ లేదు. డిసిప్లిన్ అవసరం అనిపించడం లేదు. ఏదీ ఆశించను. నాలోని శక్తి నడిపించినట్లు నడుస్తున్నాను. నేనుగా ఆలోచించను. ఆలోచన అవసరం లేదు నా వరకు. ఏ పని చేయాలన్నా తగిన శక్తి అందుతోంది. ప్రోత్సాహం లభిస్తోంది. మార్గం అదే ఏర్పడుతోంది అప్రయత్నంగా. శరీరంలో అనేక కేంద్రాలలో శక్తిచాలనం తెలుస్తోంది. వినిమయం తెలుస్తోంది. సంకల్ప మాత్రంతో శక్తి ఒకచోటు నుండి మరొకచోటుకు వెళుతూంది. ఒకచోట కనిపించి అంతలో మాయమవుతోంది. నాతో ఆడుకుంటోంది.

ఆ శక్తి నాలో కలగడానికి, కదలడానికి నేను స్థిరంగా, నిశ్చలంగా ఉండాలి. ఏ వ్యాపకాలు ఉండకూడదు. స్థిమితంగా కూర్చుంటేనే ఆ శక్తి నన్ను తన పనులకు ఉపయోగించుకుంటుంది. అది అగోచరం అయినా దాని చలనం నాకు తెలుసు. కదలికను గుర్తించగలను. నేను చేయవలసిన పని పూర్తికాగానే ఆశక్తి

మాయమవుతుంది. నా మనసు ఒక్కోసారి శక్తిని కోరుతుంది. కోరినప్పుడు ఆ శక్తి నా దరికి రాదు. నాలో శక్తి ఉన్నట్లు అసలు తెలియదు. నేను శూన్యంగా అయిపోతాను. మనస్సు అధీనంలో ఈశ్వరశక్తి పనిచేయదు. నన్ను అజ్ఞానంలో ముంచి ఆ శక్తి అజ్ఞాతంగా విజృంభిస్తుంది. నేను మూగనైపోతాను. నన్ను నడిపించేది ఆత్మశక్తి, అగోచరశక్తి. దివ్యశక్తి బయటపడదు. మనసుకు అందనంత దూరంగా మసలుతుంది. మనసు నీడసైతం పడనిచోట దివ్యశక్తి ప్రవహిస్తుంది.

కొన్ని నెలలపాటు శక్తి నాతో దాగుడుమూతలాట ఆడింది. మనసు గతి ఇంతేనేమో ననుకున్నాను. మనిషి గతిని మనసు మార్చగలదా? మనసు గతిని ఆత్మ మార్చగలదు. ఆ పని చేయగలిగింది అంతశ్చేతన. పరాశక్తి. అతీంద్రియ ప్రజ్ఞ లేదా మరేదో అయివుంటుంది. దివ్యశక్తి మనలో చైతన్యం కలిగిస్తుంది. ప్రేరణ కలిగిస్తుంది. మనకు కలిగే ప్రతి భావం, ఆలోచనకు మూలం మేధలో అణు రూపంలో ఉంటుంది. విస్ఫోటనం తర్వాత నాపైన మనసు పెత్తనం పోయింది. అంతర్చైతన్యం. మరేదో ప్రజ్ఞ నాలో ప్రవేశించి పనిచేస్తోంది. దానంతట అదే ఉద్యమిస్తుంది. అవసరం తీరగానే నిష్క్రమిస్తుంది. మనసు అరిచిగీపెట్టినా దానికి వినిపించదు. చలించదు. ప్రజ్ఞకు మనస్సుకు బొత్తిగా సంబంధం ఉండదు.

మానవ మేధ, ఇంద్రియాలు ప్రజ్ఞను అందుకోవని గమనించాను. అవి ప్రజ్ఞా ప్రాభవాన్ని సహించవు, భరించవు. ఇంద్రియాలు ప్రజ్ఞకు వాహికలు కావు. అందుకే అది అతీంద్రియ ప్రజ్ఞ. ప్రాపంచిక కార్యకలాప నిర్వహణ వరకు మనిషికి మేధోసహకారం అవసరం. మనసు సరిహద్దులు దాటిన తర్వాత ప్రజ్ఞ సాక్షాత్కరిస్తుంది. అది సవ్యంగా పనిచేయడానికి మనసు సహకారం అవసరం లేదు. సున్నితమైన హృదయం ఉంటే చాలు. హృదయ కుహర మధ్యలో ప్రజ్ఞ ప్రభవిస్తుంది. మనస్తీరం తర్వాతది హృదయం. ప్రజ్ఞకు స్వతంత్రం, స్వేచ్ఛ ఎక్కువ. వేనిపైన ఆధారపడదు. మనసు కాలానికి కట్టుబడి, పరిస్థితులకు లోబడి పనిచేస్తుంది. ప్రజ్ఞ కాలానికి, జ్ఞానానికి అతీతంగా వ్యవహరిస్తుంది. కనుక గతంతో, భవిష్యత్తుతో సంబంధం లేనిది ప్రజ్ఞ. ప్రజ్ఞకు వర్తమానం భూమిక. మనసు లయించిన తర్వాత ప్రజ్ఞ ప్రభవిస్తుంది. దివ్యత్వం పరిమళిస్తుంది.

అమ్మకోసం ...

అమ్మా! నేను మళ్లీ పుట్టాను. ఇప్పుడే పుట్టిన పసిపాపను నేను.
ఈ భూమ్మీద మళ్లీపుట్టినరోజు జరుపుకుంటున్నాను
అమ్మా! ఈ చిత్రమైన పునర్జన్మ గురించి నీకు చెప్పనా?
అయినా బిడ్డ జన్మరహస్యం తల్లికిలా నివేదించగలడు?

అమ్మా, నీవు నాకు మొదట భౌతికంగా జన్మనిచ్చావు
నన్ను ఈ ప్రపంచంలోకి తెచ్చింది నీవు. కాని అమ్మా
ఈ పునర్జన్మ నాకు అమృతత్వం ప్రసాదించింది.


అమ్మా, ఇది నిజంగా నిజం
ఈ రోజు నేనెంత ఆనందంగా ఉన్నానో తెలుసా!
ఈ శుభవార్త నీ కందించాలని ఉంది. ఎలా?
నీ కన్నకొడుకు మళ్లీ పుట్టాడని సంతోషించు.

అమ్మా, నన్ను నవమాసాలు మోసి కని పెంచావు
నీ రుణం ఎలాగూ తీర్చుకోలేనిది
ఇప్పుడు 'నేను' ఎవరో తెలుసుకోగలిగాను
అక్షరమైన దివ్యప్రజ్ఞను అందుకోగలిగాను.

అమ్మా! ఈ ఏకాంత పర్వతశిఖరంపైన
నేను సురక్షితంగా ఆనందంగా ఉన్నాను
నాలో ఇంతకాలం మరుగున ఉన్న ఆత్మ
సత్యాన్ని చివరకు దర్శించగలిగాను.

అమ్మా! ఇక్కడ నా ప్రక్కన నీవు
నీ ప్రక్కన నేను ఉంటే ఎంత బావుండేది
నా ఆనందం నీతో సగం పంచుకునేవాడిని
నా పరావర్తనం నీవు మనసారా చూచేదానివి.





6. మెహర్‌బాబా పిలుపు

శక్తి విస్ఫోటనం తర్వాత నా జీవితం ఒడుదుడుకులు లేకుండా సాగుతోంది. ఏదో సాధించాలన్న తపన లేదు. సాధించింది చాలునన్న తృప్తి. మధ్యాహ్నం వండుకున్నదే రాత్రికి. సాయంత్రం కొండపైకి పోయి ఓ బండమీద కూర్చుని ప్రకృతి సౌందర్యం ఆస్వాదిస్తాను. కుటీరంలోనూ చేసే పనిలేదు. పడుకునేందుకు, జపానికి ఒకే చాప. ప్రక్కన ఉన్న చెలమ నుండి నీళ్లు తెచ్చుకుని గబగబ రెండు కడవలు నెత్తిన కుమ్మరించుకుంటాను. చలి తట్టుకోలేను. నిప్పు రాజేసి చలి కాచుకుంటాను. నిరాడంబర జీవనం. వచ్చేది లేదు, పోయేది లేదు. అంతా నిరామయం, నిర్వ్యాపారం.

దేవాలయ ఆశ్రమంలో ఉండే బైరాగులు, సన్యాసులు వస్తుంటారు. "గుళ్లో పూజలు, భజనలు చేస్తాం. మీరు రారు ఎందుకు" అని ప్రశ్నిస్తారు. ఏదో చెప్పి తప్పించుకుంటాను. ఎవరితోనూ వాదించను, చర్చించను. ఆధ్యాత్మిక విషయాలలో ఎవరి నమ్మకం వారిది. చర్చించి, వాదించి ప్రయోజనం ఉండదని నా నమ్మకం. నేను ఏకాంతంగా ఉండాలి. ఎవరూ నా పద్ధతిని విమర్శించే అవకాశం ఇవ్వను. నాకందిన శక్తిని కాపాడుకుంటే చాలు. నా ఇష్టాలు, అయిష్టాలు ముఖ్యం కానేకాదు. ఎంత అమాయకంగా, అజ్ఞాతంగా ఉంటే అంత మేలు. అహంకారం పెరగదు. శక్తి వృథా కాదు. దైవశక్తికి మన వినయ విధేయతలు పెట్టుబడులు కావాలి.

నా కుటీరానికి గాలి పోటు, వాన పోటు ఎక్కువ. కొండ శిఖరాన ఉన్నదేమో ఎండ ఎక్కువ, గాలి ఎక్కువ. వర్షాకాలంలో రేకులు లేచిపోతాయి. ఎప్పుడు గోడలు కూలిపోతాయో అనిపిస్తుంది. వర్షాలకూ, గాలికీ గోడలు పగుళ్లిచ్చాయి.

ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు కొండ పగిలి, విరిగి పడుతుందేమో నన్నంత భయం. వర్షాకాలం అయిపోతే అదొక తృప్తి. నిర్భీతి. లే ఎండలో బయట తిరగడం హాయిగా ఉంటుంది. ఎండ వస్తే చాలు ప్రకృతి ఆనంద నాట్యం చేస్తుంది. పర్వతం పచ్చదనంతో పరవశిస్తుంది. రంగురంగుపూలు ఆకాశంలో నక్షత్రాలవలె మెరుస్తుంటాయి. అప్పుడప్పుడు కొండ పల్లెల నుండి ఆవులు, గేదెలు, మేకలు వచ్చి మేస్తుంటాయి. చెట్ల మీద చిలకలు, పక్షులు, బుల్ బుల్ పిట్టలు రాగాలు తీస్తుంటాయి. ప్రకృతి అందాలు చూస్తే నాకు ఆనందం. నేను ప్రకృతిలో కలిసి కరిగిపోతాను.

నాలో శక్తిపాతం జరిగిన కొన్ని వారాలకు, ఒకనాడు ఆరుబయట రాతి బండపైన కూర్చుని ఉండగా ఒకతను నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. తాను అవతార్ మెహర్‌బాబా శిష్యుడినని పరిచయం చేసుకున్నాడు. నాచేతికి ఒక కాగితం అందించాడు. అది మెహర్‌బాబా సందేశమట. బాబా నన్ను వెంటనే వచ్చి తనను కలవమని ఆదేశం.

"రేపు మధ్యాహ్నం లోగా వచ్చి నన్ను కలువు" అని ఉంది. కాగితంలో సంతకం లేదు. ఆ మాటలు చాలా కటువుగా అనిపించాయి. అందులో దార్ఢ్యకం ఉంది. తూష్ణీభావం ఉంది. పై అధికారి తన క్రింది ఉద్యోగిని శాసిస్తున్నట్లు ఉంది. ఆయన ఎవరో నాకు తెలియదు. ఆయన పేరు వినలేదు, కలవలేదు. అసలు ఎవరినీ కలవాలని నేను అనుకోను. ఆయన చాలా పేరున్నవాడట. ఆయన ఎక్కడ ఉన్నారని అడిగాను. ఆ ప్రక్కన ఎక్కడైనా ఉన్నాడేమో! ఏ గుహలోనైనా తపస్సు చేసుకుంటున్న మహాత్ముడేమో! అనుకున్నాను.


"ఆయనకు నా గురించి ఎట్లా తెలుసు? ఆయన్ని నేనెందుకు చూడాలి? నాతో ఆయనకేం పని? నన్ను చూడాలని ఎందుకనుకున్నాడు" ప్రశ్నించాను.

నా ప్రశ్నలకు, నా అజ్ఞానానికి వచ్చినవాడు ఫక్కున నవ్వాడు. సమాధానం ఇవ్వలేదు. పైగా నావైపు అలక్ష్యంగా అదోలా చూచాడు.

ఏమిటీ శాసనం? దబాయింపు! చిరాకు కలిగింది. అతనికి సమాధానం చెప్పలేదు. కొండపైన నా ధ్యానం ఏదో నేను చేసుకుంటున్నాను. ఈచోటు వదలి వెళ్లాలనిపించడం లేదు. ఎవరీ బాబా? ఇతను శ్రమపడి వచ్చాడు ... నన్ను తన స్వామి దగ్గరకు చేర్చడానికి. ఏ సత్సంగమో, సభో జరుగుతుండాలి. ఆయన ఆహ్వానం మన్నించాలనిపించలేదు.

సాయంత్రం కొండపైన షికారు వెళ్లి తిరిగి వస్తూ దేవాలయం వారి ఆశ్రమానికి వెళ్లాను. అక్కడ పూజారి పలకరించాడు. "మెహర్‌బాబా ఎవరు?" అని అడిగాను. "ఆయన మనిషి ఎవరో వచ్చాడు, నన్ను ఆయన గారు రమ్మంటున్నారుట, నాకైతే వెళ్లాలని లేదు" అని చెప్పాను.

పూజారి అన్నాడు "అయ్యో! మెహర్‌బాబా అంటే భగవంతుని అవతారం. గొప్ప పేరున్నవాడు. ఆయన ఆహ్వానం తిరస్కరించకండి. బాబా ఉన్నది ఈ దగ్గరలోనే. కొండ దిగి వెళ్లాలి. వెళ్లిరండి రేపటికి తిరిగి రావచ్చు".



శబ్ద ప్రపంచంలో నిశ్శబ్దంగా ... అవతార్ మెహర్‌బాబా

పూజారి మాటలు నాపైన పనిచేశాయి. మర్నాడు ఉదయం ఆ వచ్చిన వ్యక్తితో కలిసి మెహర్‌బాబాను కలవడానికి బయలుదేరాను. అయిదు నెలల ఏకాంతవాసం తర్వాత కొండ దిగడం అదే ప్రథమం. చుట్టుపట్ల గ్రామాలతో నాకు పరిచయం లేదు. గ్రామాలలో కాలినడక, కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లుంది. రోడ్డు ప్రక్కన ఉన్న ఒక కాకా హోటల్ లోంచి పాటలు వినిపిస్తున్నాయి పెద్దగా. ఇన్ని నెలల నిశ్శబ్ద జీవనం వదలి, శబ్ద ప్రపంచంలో అడుగుపెట్టాను. శబ్ద ప్రపంచం దుర్భరంగా ఉన్నది. అయినా పాటలు వినసొంపుగా

ఉన్నాయి. కొంచెం సేపు అక్కడ ఆగి విశ్రాంతి తీసుకున్నాం. తర్వాత మళ్లీ నడక. రెండు గంటలు నడిచి మెహర్‌బాబా ఉన్నచోటుకు చేరుకున్నాం.

నాతో వచ్చిన వ్యక్తి ముందు గుమ్మంలోంచి లోపలకు దారి తీశాడు. లోపల హాలులో బాబా చుట్టూ ఇరవైమంది వరకు శిష్యగణం వుంది. ఆయన పెద్ద సింహాసనం వంటి కుర్చీ మీద కూర్చుని ఉన్నాడు. అందరూ తెల్లని బట్టలు ధరించి ఉన్నారు. ఇది సన్యాసి మఠం కాదనిపించింది. మెహర్‌బాబాది పొడవైన గిరజాల జుట్టు. పెద్ద కళ్లు, పొడవైన ముక్కు, స్ఫురద్రూపం. చాలా సంవత్సరాలుగా ఆయన మౌనం పాటిస్తున్నారట. సౌంజ్ఞలతో తన భావాలు చెబుతుంటాడు. ప్రక్కనున్న వారు ఆయన భావాల్ని వివరించి చెబుతారు.

నేను లోపల ప్రవేశించగానే "నీవు నాకు తెలుసు" అన్నట్లు చేతులు కదిపాడు. ఒక మందహాసం చేసి "నేను అవతార పురుషుడిని" అన్నాడు. అదీ సంకేతమే. ప్రక్కవారి వ్యాఖ్యానం అది.

నన్ను గదిలోకి తీసుకుపోయి, స్నానం చేసి విశ్రమించమని ఓ శిష్యుడికి చెప్పాడు. తనను సాయంత్రం నాలుగు గంటలకు కలవాలట. అదీ ఆజ్ఞ. శిష్యుని వెంట వెళ్లాను. నడచి నడచి అలసిపోయాను. స్నానం ముగించాను. ఆ గదిలో పెద్ద నిలువుటద్దం ఉంది. చాలా నెలల తర్వాత అద్దంలో నన్ను నేను చూచుకున్నాను. గడ్డం పెరిగి వికారంగా ఉంది. అయినా ఆకర్షకంగా ఉంది. ఎవరో టీ తెచ్చి పెట్టారు. అయిదు నెలల తర్వాత 'టీ' తాగాను. పడుకోడానికి మంచి పరుపు వేశారు. ఏమిటీ వైభోగం! కటిక నేలపైన పడుకునే నాకు రాజభోగం పట్టింది ఆ రోజు. మంచంమీద పడుకోగానే మెహర్‌బాబా మాటలు జ్ఞాపకం వచ్చాయి "నీవు నాకు తెలుసు. నేను అవతారుడిని" అంటే ఏమిటి?

ఒకగంట తర్వాత ఒకతను వచ్చి భోజనం తెమ్మంటారా? అని అడిగాడు. పది నిమిషాల్లో వేడివేడి భోజనం వచ్చింది. ఉత్తి అన్నం మాత్రమే తినడానికి అలవాటైన నాకు షడ్రుచుల భోజనం. మొదటిసారి పంచభక్ష్య పరమాన్నాల మొహం చూచిన వాడిలా మొహం పెట్టాను. పళ్లెం నిండా రకరకాల స్వీట్సు, వంటకాలు. శుభ్రంగా భోజనం చేశాను చాలా రోజుల తర్వాత. నాలుగు గంటల వరకు విశ్రాంతి. నాలుగింటికి బాబాను కలవాలట!

ఆ వేళకు ఎవరో వచ్చి నన్ను తీసుకు వెళ్లాడు. పరస్పర అభివాదాల తర్వాత ఆయన ఎదురుగా తివాచీపైన కూర్చున్నాను. నా ప్రక్కన దుబాసీ –

ఆయన మాటలు అనువదించడానికి. మెహర్‌బాబా మౌనభాష మనకు అర్థం కాదు గదా! ఆయన నావైపు నిదానంగా చూచి ప్రేమగా నవ్వారు. ఆ కళ్లలో గొప్ప వశీకరణ ఉంది. ఆ చూపుల్లో ఆకర్షణ ఉంది. మొహం మీద గొప్ప తేజస్సు తాండవిస్తోంది.

నా ఆరోగ్యం గురించి ప్రశ్నించాడు. నిత్యకృత్యాల గురించి అడిగాడు. నేను కూరలు, నెయ్యి ఏవీ లేకుండా ఉత్త అన్నం మాత్రమే తింటానంటే ఆశ్చర్యపడ్డాడు – అదేదో అసంభవచర్య అయినట్లు.

'నాకు అదే బావుంది' అన్నాను. "రోజు కొండ దిగి వెళ్లి కూరలు, వెచ్చాలు తెచ్చుకోవాలంటే కాలహరణం కదా" అన్నాను.

"కొండపైన ఏకాంత జీవనం బావుందా?" బాబా మొదటి ప్రశ్న.

"ఆపాటి ఏకాంతం నా ధ్యానానికి, అన్వేషణకు అవసరం" అన్నాను.

"ఇక్కడ మాతో ఉండు. నీకు కావలసినవన్నీ సమకూరుస్తాను" అన్నాడు.

"జీవితంలో ఏం కావాలో నాకు తెలియదు."

"నీవు నాతో ఉండిపో. అయితే ఒక నియమం ..."

ఆయన వేపు దిగ్భ్రాంతిగా చూచాను "ఏమిటా నియమం?"

మెహర్‌బాబా చిత్రంగా చేతులు తిప్పారు. మెడ ఆడించారు. ఒక శిష్యుడు దానికి వ్యాఖ్యానం చెప్పాడు "నీవు పూర్తిగా మెహర్‌కు సరెండర్ కావాలి. తనకు విధేయంగా ఉంటూ, తాను చెప్పినట్లు చేయాలి. గొంతు కోసుకోమన్నా అందుకు సిద్ధపడాలి. వెనకాడకూడదు. అదీ సరెండర్ అంటే అర్థం".

ఆ మాట వినగానే నాకు దిమ్మ తిరిగింది. గదిలో కొంతసేపు నిశ్శబ్దం తాండవించింది.

నేనన్నాను నెమ్మదిగా "బాబా! నేను సరేనని ఒప్పుకోవడం సులభం. అలాగే ననడం తేలిక. కానీ నా మార్గం ఇది కాదు. నాకు నచ్చే పద్ధతి చెబితే ఆమోదించేవాడిని. ఒకరు చెప్పింది వినడం, చెప్పినట్లు చేయడం నా పద్ధతి కాదు. మీరు చెప్పినట్లు నేనుండలేను".

బాబా నావైపు నిదానించి చూచి నవ్వుతూ అన్నారు "నమ్మకం ముఖ్యం. సరెండర్ కావడమూ అవసరమే. నా మార్గంలో అవి రెండూ ప్రధానాంశాలు. నేను చెప్పినట్లు వింటే నీవు ఆశించే ఆధ్యాత్మిక శక్తులు, సంపదలు నీకు అనుగ్రహిస్తాను".

ఈయన అనుగ్రహించడం ఏమిటి? నేను గ్రహించడం ఎందుకు? అవుననలేదు, కాదనలేదు.

మళ్లీ ఆయనే అన్నారు : "కొన్నాళ్లు ఇక్కడ ఉండు. ఆలోచించి నిర్ణయించుకో. ఆ తర్వాత నాకు చెప్పు."

దాంతో మా సంభాషణ ఆగింది. ఆయన లేచి సత్సంగానికి వెళ్లారు.

ఆ రాత్రి భోజనం తర్వాత మెహర్‌బాబా శిష్యులు కొందరు నా గదికి వచ్చారు. నాకూ బాబాకు జరిగిన సంభాషణ గురించి ఆరాతీసి, నా సమాధానాలు విన్న తర్వాత అన్నారు "అవతార్ మెహర్‌బాబా గురించి మీకు తెలియదు. సాక్షాత్తు భగవంతుడు. అంతటి అవకాశం యిచ్చినప్పుడు వెంటనే అంగీకరించ వలసింది. తప్పు చేశారు. మేం ఎన్నో సంవత్సరాలుగా ఆయన శిష్యరికం చేస్తున్నా మాలో ఎవరికీ అలాంటి అవకాశం యివ్వలేదు. మీరు అదృష్టవంతులు."

కొందరైతే వెంటనే ఒప్పుకోమని ఒత్తిడి చేశారు. నానా విధాల బ్రతిమలాడారు.

ఆ రాత్రి, బాబా యిచ్చిన అవకాశం గురించి తీవ్రంగా ఆలోచించాను.

నా మార్గం నాకుంది. అది స్పష్టం. మధ్యలో ఈ ప్రలోభానికి తలవొగ్గడం ఎందుకు? మనస్సుకు అవకాశం యిస్తే ఇలాగే ప్రలోభపెడుతుంది. ఎవరికైనా ఆధ్యాత్మిక సంపదలు అప్పనంగా లభిస్తాయా? ఒకరు ఇవ్వడానికి వారివద్ద నిల్వలు ఉంటాయా? నా జీవితం తృప్తిగా ఉంది కదా! ఆలోచించాను. ఆయన శిష్యుల మాటల్లోనూ నిజం ఉందనిపించింది! అయినా మరొక రకంగా మనస్సు అంగీకరించడం లేదు.

సుఖమయ జీవితం – మంచి బట్టలు, భోగాలు, శిష్యులు – ఇవన్నీ అవసరమా? వీటి కోసం కక్కుర్తిపడి, నాలో పెరిగిన జ్ఞానజ్యోతిని, అది చిన్నదే కావచ్చు, దానిని ఆర్పడం న్యాయమా? నన్ను నేను వంచించుకోవడం అవుతుంది. నా ప్రజ్ఞను అవమానించడం అవుతుంది. నా అంతరాత్మను వంచించలేను. కొండపైన నాకు కలిగిన అనుభవం, అందిన ప్రజ్ఞ నా స్వంతం, స్వతంత్రం. ఒకరి అనుగ్రహంతో వచ్చింది కాదు. మెహర్‌బాబా యిచ్చిన అవకాశంతో పోల్చుకుంటే, నేను తప్పు చేయడం లేదనిపించింది. ఇది ఏ విధంగా గొప్ప కాదు. ఆ ప్రజ్ఞ నాకు కలగకపోతే బాబా ఉచ్చులో పడేవాడిని. ఆశ్రమం, సుఖాలు, పేరు, శిష్యవర్గం చేదు కావు కదా! ఒక మహాత్ముని రక్షణ మంచిదే. భద్రత

ఉంటుంది. ఆటుపోటు లుండవు. భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. ఇవన్నీ వ్యామోహాలే గదా!

మరొక కోణంలో చూచి విశ్లేషిస్తే బాబా మార్గం నాకు సరిపడ దనిపించింది. ఎంత గొప్పవాడైనా, మహాత్ముడైనా ఒకరిపై ఆధారపడడమే అవుతుంది. ఎవరికి వారు తన ఆత్మను నమ్ముకోవాలి. జ్ఞానం సంపాదించాలి. సజ్జన్‌ఘడ్‌లో నాకు కలిగిన అనుభవం దృష్ట్యా నేను మరొకరిపైన ఆధారపడనవసరం లేదని, నా గురువు నాలోనే ఉండి నడిపిస్తున్నాడనిపించింది. మెహర్‌బాబా యిచ్చిన అవకాశం నా నిజాయితీకి ఒక పరీక్షగా భావించాను. అదొక సవాల్. అయిదు నెలలపాటు కొండపైన ఒంటరిగా జీవించాను. ఈ మూడు రోజుల్లో సుఖాలు మరిగింది శరీరం. పైగా బాబా నాపైన ఆధ్యాత్మిక సంపదలు కురిపిస్తానని హామీ యిస్తున్నాడు. ఈ మార్పు నన్ను కలచివేస్తోంది. నా అనుభవం నాకు సహనం నేర్పింది. సంయమనం పాటించడం నేర్పింది. శక్తిపాతం, విస్ఫోటనం, ప్రజ్ఞ నన్ను చెదరనీయలేదు.

ఎవరికీ నేను తలవంచదలచ లేదు. నా కాళ్లతో నేను నడవాలి. గమ్యం కనిపించకపోయినా ఫరవాలేదు. మార్గం తప్పకూడదు. నా మార్గంలో అసలు గమ్యం లేదు. హామీలు లేవు. లక్ష్యం లేదు. మార్గ నిర్దేశనం అసలు లేదు. కేవలం చైతన్యంతో, వర్తమానంలో జీవించడం ఒక్కటే పట్టు. ఎక్కడకో చేరడం జరగని పని. స్వశక్తితో సంపూర్ణంగా జీవించగలిగితే చాలు.

బాబా చెప్పిన ఆధ్యాత్మిక సంపదలు ఆకర్షణీయంగా ఉన్నమాట నిజం. అవన్నీ కోరికలున్న వారికి. నాకు కాదు. ఏం చేసుకోను ఆ శక్తుల్ని? సుఖంగా జీవించడం ఎందుకు? సుఖాలు, సంపదలు కావాలనుకుంటే ఇంటిదగ్గర అన్నీ ఉన్నాయి. ఇల్లు వదలి రావడం ఎందుకు జరుగుతుంది. ఏ శిఖరాలు చేరడం నా లక్ష్యం కాదు. తిరిగి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాను. నా కుటీరం, నా సాధన నాకు చాలు. నా నిర్ణయం మెహర్‌బాబాకు చెప్పాను. ఆయన చిన్నగా నవ్వి అన్నారు "ముందు ముందు ఎప్పుడైనా నీ నిర్ణయం మారి ఇక్కడకు రావాలనిపిస్తే తప్పక రావచ్చు. ఎలాంటి అభ్యంతరం ఉండదు".

"ముందు వెళ్లి ఒకసారి అమ్మగారిని చూడు" అని ఉచిత సలహా యిచ్చాడు. ఆతిథ్యానికి థాంక్స్ చెప్పి నా కుటీరం చేరుకున్నాను.

★ ★ ★


సజ్జన్‌ఘడ్ తిరిగి వచ్చాక ఆ ప్రహసనం గురించి మళ్లీ ఆలోచించాను. అసలు నేనిక్కడ ఉన్న విషయం బాబాకు ఎట్లా తెలిసి ఉంటుంది? ఆయనకేమైనా అతీంద్రియ జ్ఞానం ఉందా? ఎవరైనా చెప్పి ఉంటారా? ఆయన నిజంగానే దివ్యదృష్టితో నన్ను గమనించి, పిలిపించి ఉంటాడా? లేక అది నాకు పెట్టిన పరీక్షా?


ఆ సంఘటనతో నాకు తెలిసింది – నాలో ఇంకా ఏ మూలనో ప్రలోభాలు ఉన్నాయని. ఆయన పిలుపు నన్ను నేను పరిశీలించుకునే అవకాశం యిచ్చింది. ఆంతర్యం బయటపడ్డది. మనసును చెదరనీయకూడదనుకున్నాను. అటువంటి సందర్భాలలో మనసును నమ్ముకుంటే పతనమే. మనసు మోసం చేస్తుంది. అంతరాత్మపైన భారం వేయడం మంచిది. శూన్య సందేశాలు వినగలగాలి.

రెండు మాసాలు కొండపైన కుటీరంలోనే ఉన్నాను. ఏకాగ్రత, గ్రహణశక్తి, ధ్యానం బాగా కుదిరాయి. వీక్షణ పెరిగింది. బాహ్యప్రేరణలు నిరోధించడం, ప్రలోభాలకు తలవంచకపోవడం అలవాటైంది. ఒక్కసారి కాలు జారితే, మనస్సు వీగితే, సుఖాలు, సంపదలు, కీర్తి మనిషిని కట్టికుదుపుతాయి. మనసు అంబుల పొదిలో చాలా అస్త్రాలుంటాయి. ఒక్కొక్క బాణం వదులుతుంది. సదా అప్రమత్తంగా ఉంటే తప్ప వాటి నుండి రక్షించుకోలేం. మెహర్‌బాబా దర్శనం వల్ల నేను చాలా నేర్చుకున్నాను. మంచి పాఠం.

ఇప్పటికి ఇల్లు వదలి ఏడునెలలైంది. ఒకసారి అమ్మను చూడాలి. అది కోరిక కాదు – ధర్మం. జన్మను ప్రసాదించిన అమ్మ రుణం తీర్చుకోవాలి. ఆమెకు ఆత్మశాంతి కలిగించడమే రుణం తీర్చుకోవడం. అమ్మను చూచి రమ్మని బాబా చెప్పిన మాటలో ఏదో అంతరార్థం ఉండి ఉంటుంది. అమ్మ దీవన బిడ్డకు ఎప్పుడూ అవసరమే.

ఇక కొండ దిగిపోవలసిన సమయం దగ్గర పడ్డదని అంతరాత్మ సందేశం.





7. సజ్జన్‌ఘడ్‌కు వీడ్కోలు

సజ్జన్‌ఘడ్ వదిలేరోజు నా గుండె గుబగుబ లాడింది. కళ్లలో నీళ్లు తిరిగాయి. కుటీరం జ్ఞాపకాలతో హృదయం నిండిపోయింది. ఒంటరి నివాసం. ఏడు నెలల అనుభవాలు. నాకు సజ్జన్‌ఘడ్‌తో తీయని అనుబంధాన్ని కలిగించింది. వెళ్లిపోతున్న ఆనందం. ఇంక తిరిగి ఇక్కడకు రానేమోనన్న దిగులు. నాతో తీసుకువెళుతున్న తీపి జ్ఞాపకాలు. అక్కడ గడిపిన కాలం మహాద్భుతం.

స్వల్ప కాలంలో ఎంత మార్పు. కాలభ్రమణం ఎంత వేగం. ఏడడుగుల గూటిలో ఏడు నెలల తపస్సు. నాకు నీడనిచ్చిన కుటీరం అది. నా ఆశల్ని పండించిన కుటీరం అది. నా స్పందనల్ని ఆశ్వాసించిన కుటీరం అది. నా భయాలను పోగొట్టి అభయమిచ్చిన కుటీరం. అది నా హృదయ కుహరం. నాలో చెలరేగిన తుఫానులకు, పెను మార్పులకు అది ప్రత్యక్ష సాక్ష్యం. ఇక్కడే నాలో ఆత్మ పురుడు పోసుకుని నన్ను మళ్లీ కన్నది. ఇది నా పునర్జన్మకు పురిటిగది. దివ్యశక్తి నాలో ప్రవేశించింది ఇక్కడే.

ఈ నా చిన్న కుటీరం వదలి పెట్టాలంటే ఎందుకీ దిగులు! గుమ్మం దాటగానే గుమ్మాన్ని స్పృశించి నమస్కరించాను. అక్కడి మట్టి తీసుకుని నుదుట దిద్దుకున్నాను. కన్నీటిని దాచుకుంటూ కొండ దారంట బయలుదేరాను దేవాలయం వైపుగా.

ముందుగా ఆశ్రమానికి వెళ్లి పరిచయస్తుల్ని పలకరించాను. పూజారికి, ఆశ్రమం అధికారికి కృతజ్ఞతలు చెప్పాను – ఇంతకాలం నన్ను అక్కడ ఉండడానికి దయతో అనుమతించినందుకు. ఆయన ఆశ్చర్యపడి అన్నాడు –

"మీరు చాలా మారిపోయారు"

నిజమే. గడ్డం పెరిగింది. జుత్తు పెరిగింది. బట్టలు మారాయి. ఆశ్రమం లోని వారు నన్ను చూచి మరింత ఆశ్చర్యపోయారు. నాలో వచ్చిన మార్పు ఫలానా అని వారు చెప్పలేకపోయారు. నా పట్ల చూపుతున్న గౌరవంతో నాలో వచ్చిన మార్పు మంచి దనిపించింది. నాకూ తెలుసు నేను మారాను. నాలో చాలా మార్పు వచ్చింది. వచ్చిన మార్పును నాలో ఇతరులు గుర్తించి నమస్కరిస్తున్నారు. వాళ్లు ఆసక్తిగా చాలా ప్రశ్నలు వేశారు. ఇంతకాలం ఒంటరిగా నేను ఏంచేశానని ప్రశ్నించారు. వారంతా ఆశ్రమాన్ని అంటి పెట్టుకుని పది పన్నెండు సంవత్సరాలుగా ఉంటున్నా ఎవరిలో ఏ మార్పూ రాలేదు. వారంతా సంప్రదాయ రీతిలో పూజలు చేస్తారు. భజనలు చేస్తారు. సత్సంగం చేస్తారు. వారికి ఇతరత్రా పద్ధతులు తెలియవు. చెప్పినా నమ్మేపాటి సంస్కారం వారికి లేదు.

ఒకతను ఆసక్తిగా అడిగాడు. "మీరు గుడికి రారు. పూజ చేయరు. మంత్రాలు జపించరు. ఒక పుస్తకం చదవగా చూడలేదు. ఇంతకాలం ఒంటరిగా ఏం చేశారు? భయం లేకుండా ఎట్లా ఉండగలిగారు?" వారి ఆసక్తి గమనించాను. నా గురించి కాస్త వివరంగా చెప్పాలనుకున్నాను, ఇలా చెప్పాను.

"మనం చేయవలసిన పనల్లా ఒక్కటే. మనసు పట్టు నుండి విడిపోవడం, అంటే మనసు నుండి స్వేచ్ఛ పొందడం. ఆలోచనలు, బంధాలు, సంబంధాలు, ఉద్రేకాలు, వాంఛలు, కోరికలు లేకుండాచేయడం. మన అభివృద్ధికి మతం చాటున, ఆధ్యాత్మికత పేరున చేసే పనులన్నీ అవరోధాలే. మనసు అన్నింటిని కల్పిస్తుంది. ప్రోత్సహిస్తుంది. పెత్తనం చెలాయిస్తుంది. మనసు హద్దుల్ని, ఆంక్షల్ని అతిక్రమిం చాలి. మనసు కల్పించే ఉద్రేకాలు, ప్రకోపాలు నిరోధించాలి. వాటన్నింటికీ దూరం అయితే అప్పుడు అంతర్ ప్రశాంతికి అవకాశం ఏర్పడుతుంది. అవరోధాలు తొలగిపోతే అంతరంగంలో నిశ్శబ్దం నెలకొని, మహాశక్తి ముఖద్వారాలు తెరచుకుంటాయి. అప్పుడు మనదైన ఆధ్యాత్మికత్వం మనలో ఏర్పడుతుంది. అది స్వతంత్రం.

"ఇక్కడ చాలా బావుంది. ప్రశాంతంగా కాలంగడప వీలైంది. మనలో నిశ్చలత్వ సాధన ఇక్కడ సాధ్యం. ఈ వాతావరణంలో ప్రతి ఒక్కరు ఆత్మావలోకనం చేసుకొన వీలుంది. మనసు కల్పించే అలవాట్లనుండి మనం తప్పించుకోవాలి. అప్పుడు కోరికల ఒత్తిడి ఉండదు. దూరంగా తప్పుకోవచ్చు. సంప్రదాయ ఒత్తిళ్ల

పోతాయి. మన ఆంతర్యమేదో స్పష్టంగా, స్వచ్ఛంగా తెలుస్తుంది. అది అసలైన సవాలు. మనల్ని మనం తెలుసుకోవడమే అసలు ప్రక్రియ. అదే ఆధ్యాత్మిక జీవనానికి ఆలంబన. మిగతావన్నీ మానసిక వికారాలు. అందుచేతనే మతం మాటున మనవారు తయారుచేసి పెట్టిన క్రతువులకు, ఆచారాలకు, నిబంధనలకు నేను దూరం అయ్యాను. నా ఏకైక లక్ష్యం నాలోని సత్యాన్ని దర్శించడం, నాలోని నాదైన శక్తిని అందుకోవడం".

ఒక శ్రోత లేచి ప్రశ్నించాడు : "మీరు ఏదో అవసరం అంటున్నారు. మనిషికి నిజాయితీ అవసరం కాదా? మనం చేసే ప్రయత్నానికి నిజాయితీ అవసరమే కదా! ఇక్కడ మేమంతా నిజాయితీగా ఆత్మాన్వేషణ చేస్తున్న వాళ్లమే. మేమూ మార్పు ఆశించే ఇక్కడకు వచ్చాం. మా ఎవరిలో ఆశించిన మార్పు రాలేదు. అవసరం అంటే వేరే అర్థం ఉందా?"

అతని ప్రశ్నకు ఎట్లా సమాధానం చెప్పాలో నాకు అర్థం కాలేదు. కాలంలో చాలా వెనక్కి వెళ్లవలసి వచ్చింది. నా జీవితం తొలినాళ్లలో ఆరాట, పోరాటాల దగ్గరకు వెళ్లాను. అంతలో మరొక జిజ్ఞాసువు ప్రశ్నించాడు.

"మీరు వచ్చినప్పుడు మీ సూటు, బూటు, హాటు చూచి మీరిక్కడ ఉండే రకం కాదనిపించింది. మీరు ఒంటరిగా ఉండదలిస్తే మిమ్మల్ని అనుమానించాం. మీరు నాగరికతకు, సుఖాలకు అలవాటు పడ్డవారు కదా".

ఆ మాటకు కొందరికి ఆనాటి నా రూపం కళ్లలో మెదిలిందేమో కిసుక్కున నవ్వారు. ఆలయం మేనేజరు అన్నాడు "మీరు వచ్చినప్పటి నుండి మీతో చాలా సార్లు మాట్లాడాను. ఎక్కడ నుండి వచ్చారని అడిగాను. ఇప్పుడు మీరు చాలా మారారు. మీరెందుకు వచ్చింది తెలుస్తోంది".

మరొక సన్యాసి అడిగాడు : "ఇన్నాళ్లు సజ్జన్‌ఘడ్ పైన ఉన్నా, మాకు దూరంగా గడిపారు. కొంతసేపు మాతో గడపండి. మీ గురించి, మీ అనుభవాల గురించి చెప్పండి".

నా గురించి చెప్పుకోవడం నాకిష్టముండదు. అయినా వాళ్లు ఆసక్తిగా అడిగారు. అందునా వీడ్కోలు సమయం. కొంతైనా నా గురించి చెప్పడం నా ధర్మం అనిపించింది.

"నా గురించి అడిగారు. నా పేరు దత్తారామ్ గవంద్. మా ఊరు తానే. నా అనుభవాలు మీతో పంచుకోవడం నాకూ ఆనందమే. మాది సంపన్న కుటుంబం. తిండికి, అవసరాలకు ఎప్పుడూ లోటు లేదు. మా నాన్నగారు పెద్ద

వ్యాపారి. నేను పదకొండు వరకు చదివాను. అకస్మాత్తుగా మా నాన్నగారు పోయారు. అప్పుడు నా వయస్సు 18 సంవత్సరాలు. నాన్న మరణం నన్ను ప్రభావితం చేసింది. కుటుంబంలో మార్పులు వచ్చాయి. నా బాధ్యత పెరిగింది. ఇంటికి పెద్దకొడుకుగా అన్ని బాధ్యతలు తీసుకున్నాను.

రోజులు గడుస్తున్నాయి. కొత్త జీవితానికి కాస్తకాస్త అలవాటు పడుతున్నాను. ఒక ఆదివారం నాన్న గదిలో పుస్తకాలు బూజు దులిపే పని పెట్టుకున్నాను. నాన్నగారి లైబ్రరీలో చాలా పుస్తకాలున్నాయి. చాలా వేదాంత గ్రంథాలు, మతగ్రంథాలు. వాటిపైన నాకెలాంటి ఆసక్తి లేదు. బూజు దులిపి శుభ్రంగా సర్దడమే నా పని. అలా దుమ్ము దులుపుతూ అలవోకగా కొన్ని పుస్తకాల పేర్లు చూచాను. ఒక చిన్న పుస్తకం నా దృష్టిని ఆకర్షించింది. ఆ పుస్తకం పేరు "Theosophy and life's deeper problems". అది ఆనీబీసెంట్ నాలుగు ప్రసంగాల సంకలనం. ఉత్తినే అలా పేజీలు తిప్పాను. ఆనీబీసెంట్ రాజకీయంగా ప్రసిద్ధురాలు. ఆమె ఫిలాసఫర్ అని నాకు తెలియదు. ఆమె సామాజిక సంస్కర్త. భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని ఉద్యమం నడిపిన బ్రిటీష్ వనిత. జీవిత సమస్యల గురించి ఆమె అభిప్రాయం ఏమై ఉంటుంది?

పుస్తకం తెరిచి, అక్కడక్కడ కొన్ని వాక్యాలు చదివాను. ఆసక్తికరంగా ఉంది ధోరణి. ఉపనిషత్తుల నుండి 'కోట్' చేసింది. స్థిమితంగా కూర్చుని ఆ పుస్తకం మొదటి నుండి చదవసాగాను. ఆమె శ్లోకాలను జీవితానికి అన్వయించిన తీరు అద్భుతంగా ఉంది. భారతీయ తాత్వికత గురించి బాగా తెలిసి రాసినట్లు అనిపించి చదవసాగాను. ఆమె అంటారు "జీవితానికి లోతైన అర్థం వుంది. బహుళ ప్రయోజనం వుంది. మనకు తెలిసిన దైనందిన ఉపయోగాలే కాక లోపల నిగూఢ శక్తి ప్రవాహాలున్నాయి. వాటిని ఆమె ప్లేన్స్ (భూమికలు)గా వర్ణించారు. ఆ లోతులు తెలుసుకోవడం ముఖ్యం. అవి తెలుసుకోవడమే జీవిత పరమార్థం. ధ్యాన సాధనలో ఆ భూమికలను చేరవచ్చు".

ఆమె చెప్పిన తీరు ఆకర్షకంగా ఉంది. అందులో సత్యం ఉన్నదనిపించింది. లాజికల్‌గానూ ఉంది. నాకు నచ్చింది. తాను చెప్పదలచింది స్పష్టంగా, అర్థమయ్యేలా చెప్పడం విశేషం. ఎక్కడా క్లిష్టత లేదు. ఆ పుస్తకం నన్ను ఆకర్షించింది. అలా చదువుతూ కూర్చుండిపోయాను. అమ్మ వచ్చి నన్ను భోజనానికి పిలిచింది. కొంచెం ఆగివస్తానని పంపాను. పావుగంట తర్వాత మళ్లీ వచ్చింది. వెళ్లి గబగబ నాలుగు మెతుకులు తిని వచ్చి మళ్లీ చదవసాగాను. ఏకబిగిన ఈచివర నుండి ఆచివర వరకు చదివాను.

ఆ పుస్తకం నాలో ఆసక్తి రేపింది. జిజ్ఞాస కలిగించింది. జీవితపు లోతులు తరచి చూడాలని, కొత్త కోణంలో జీవితాన్ని చదవాలని అనిపించింది. ఆమె చెప్పిన భూమికల్లోకి వెళ్లాలి. నాలో కొత్త ఉత్సాహం, శక్తి కలిగాయి. సాయంత్రానికి చదవడం పూర్తిచేసి, ఇంకా అలాంటి పుస్తకాల కోసం లైబ్రరీ గాలించాను.

అంతకు ముందు నాకు వేదాంత గ్రంథాలతో పరిచయం లేదు. ఆసక్తీ లేదు. స్కూలు చదువు, ఆటలు, వేటలు. ఈ పుస్తకం మొదటిసారిగా నన్ను జీవితం గురించి ఆలోచింపచేసింది. జీవిత విలువల వైపు దృష్టి తిప్పింది. తర్వాత థియోసాఫికల్ సొసైటీ గురించి వాకబు చేశాను. థియోసఫి గురించి చదివాను. నిజంగానే జీవితానికి వేరే విలువలు ఉన్నాయి. మనకు తెలియని లోతులు ఉన్నాయనిపించింది. చిత్రం!

మా ఊరిలో ఒక థియోసాఫికల్ సెంటర్ ఉందని తెలిసింది. దాంట్లో ఉన్నది ఆరుగురు సభ్యులు. దానికి ప్రెసిడెంట్ ఆర్.ఎస్. భగత్. సొసైటీ నుండి మరికొన్ని పుస్తకాలు తెచ్చి చదివాను. మా నాన్నగారు థియోసాఫికల్ సాహిత్యం గురించి బాగా చదివేవారట. నాకు కలిగిన ఆసక్తి మంచిదే. పరమార్థాన్వేషణ. ప్రాచీన మత సిద్ధాంతాలకు థియోసఫి శాస్త్రీయంగా వివరణ యిస్తుంది. సత్యాన్ని శోధించి బయట పెడుతుంది. పూర్వ మతాలది సంప్రదాయపద్ధతి. థియోసఫీ వారిది శాస్త్రీయ అవగాహన. ఆనీబీసెంట్‌ను రాజకీయంగా ఎరుగుదును. ఆమె వివరణ నాకు నచ్చింది. ఆనాడే నా ఆత్మాన్వేషణ మొదలైంది. థియోసఫీ ద్వారా భారతీయ తత్వానికి బాటలు వేసుకున్నాను.

డా. ఆనీబీసెంట్ పుస్తకాలు చదివిన తర్వాత అడయార్‌లోని థియోసాఫికల్ సొసైటీకి వెళ్లాను. మద్రాసులో, వారణాశిలో వారి సమావేశాలకు హాజరైనాను. నాతోపాటు థియోసఫీ పట్ల ఆసక్తికలవారు మరో ఆరుగురు కలిశారు. భగవత్, భావే, డాగే, రణదీప్ దంపతులు, తాక్కే. మేం బొంబాయిలో, పూనేలో ప్రసంగాలు వినడానికి వెళ్లాం. ఇంకా థియోసఫి గురించి తెలుసుకోవాలని మా సొసైటీ ప్రెసిడెంట్‌ను అడిగాను. ఆదివారాలు లాడ్జిలో సమావేశాలు కాక బుధవారాల్లో మా ఇంట్లో కలుస్తుండేవాళ్లం. మేడం బ్లవట్‌స్కీ రాసిన పుస్తకాలు చదివి చర్చిస్తుండే వాళ్లం. సభ్యులే కాక, మా స్నేహితులు, ఆసక్తి కలవారు వచ్చేవారు. మా ఇంటి సమావేశాలు మంచి ప్రేరణగా ఉండేవి.

అలా చదువుతూ, చర్చిస్తుండగా జిడ్డు కృష్ణమూర్తి గురించి తెలుసుకోవడం జరిగింది. అతని అయిదారు సంవత్సరాల వయసులోనే మరొక ప్రముఖ

థియోసఫిస్టు లెడ్‌బీటర్ అతనిలోని దివ్యాంశను గుర్తించి అతని ద్వారా ప్రపంచానికి కొత్త సందేశం అందుతుందని, అతనొక ప్రవక్త కాగలడని ప్రచారం చేశాడు. అది తెలిసిన తర్వాత నాకు కృష్ణమూర్తిని చూడాలనిపించింది.

ఒకరోజు మిత్రుడు భావే వచ్చి కృష్ణమూర్తి బొంబాయి వస్తున్నాడని, ప్రసంగిస్తాడని చెప్పాడు. గొప్ప అవకాశం. కృష్ణమూర్తిని చూచే అదృష్టం, ఆయన ఉపన్యాసాలు వినే అవకాశం కలిగింది. భావే, అతని భార్య కుసుమా నేను బొంబాయి బయలుదేరాం.

నాకు బాగా జ్ఞాపకం ... అందరం నేలపైనే కూర్చున్నాం జె.కె. రాకను నిరీక్షిస్తూ. అంతలో పొడవాటి లాల్చీ, పైజామాతో ఆజానబాహువు, వేదిక పైకి నెమ్మదిగా, గంభీరంగా వచ్చి అందరికీ అభివాదం చేశాడు. ఆయన ముఖం గంభీరంగా, తేజోపూర్ణంగా ఉంది. ఆయన నడకలో ఠీవి, చూపులో దర్పం. అంతులేని ఆత్మ విశ్వాసం కనిపించాయి. వేదికపైన పద్మాసనంలో కూర్చుని, వెన్ను నిటారుగా నిలిపి గంభీరంగా అందరివైపు చూచాడు. కృష్ణమూర్తి రూపం, తొలి ప్రసంగం నాలో చెరగని ముద్రవేశాయి. ఆయన చెప్పింది పూర్తిగా అర్థం కాలేదు. అయినా ఆ క్షణంనుండి నాకు కృష్ణాజీ అంటే వల్లమాలిన ఇష్టం ఏర్పడ్డది. ఆ తర్వాత ఆయన ప్రసంగాలు చాలా విన్నాను. ఆయన పుస్తకాలన్నీ చదివాను. మన సంప్రదాయ విజ్ఞానం ఎంత సంకుచితమో, మన మతాలవల్ల ఎంత హాని కలుగుతుందో ఆయన పుస్తకాల ద్వారా తెలుసుకోగలిగాను.

థియోసఫిస్టులు ఎన్నుకున్న విధానంలో మార్పు నెమ్మదిగా వస్తుంది. భవిష్యత్తులో ఎప్పటికో పరిణామం సాధ్యపడుతుంది. థియోసఫి ప్రకారం మనిషిలో చెడుగుణాలు ఒక్కటొక్కటిగా తొలగిపోవాలి. సద్గుణాలు ఒక్కటొక్కటిగా ఏర్పడాలి. ఉదాహరణకు కోపం పోవాలంటే మనిషి ప్రేమించగలగాలి. సత్ప్రవర్తన అలవరచు కోవాలి. పవిత్రంగా జీవించాలి. అంత జరిగిన తర్వాత రెండవ మెట్టు ఎక్కడం కుదురుతుంది. ఆ పద్ధతిన ఫలితాలు సాధించడానికి చాలా కాలం పడుతుంది. కృష్ణాజీ విధానం నాకు నచ్చింది. ఆయన కాలాన్ని సూటిగా ప్రశ్నిస్తాడు, ఎదుర్కొంటాడు. ఏదైనా వర్తమానంలో, ఈ క్షణంలో జరగాలి అంటాడు. అది నాకు నచ్చిన పాయింట్.

నేను గ్రహించిన విషయం థియోసఫిస్టులు చాలా మంచివారు, బుద్ధి మంతులు. మరీ పెద్దమనుషులు. హాయిగా, తృప్తిగా జీవించే వర్గం. నిజానికి వారెవరూ జీవితం మారాలని అనుకోరు. మారితే తట్టుకోలేరు. వారి జీవిత

ప్రమాణాలు అలాగే ఉండాలి. ఇతరులు మాత్రం మారాలి. లోకం మారాలి. వారెవరిలో విప్లవ దృష్టి లేదు. అందరూ మేధావులే. మారడానికి బొత్తిగా ప్రయత్నించకుండానే గొప్ప మార్పు సమాజంలో రావాలని ఆశిస్తారు. కర్మ సిద్ధాంతానికి తల వంచి జీవిస్తుంటారు. నిజానికి సడెన్‌గా సమాజం మారితే వారు ఉక్కిరి బిక్కిరవుతారు.

కృష్ణమూర్తి ఆలోచన నాకు నచ్చింది. ఆయన భావధార నచ్చింది. అందులో విప్లవం ఉంది. తిరుగుబాటు ధోరణి ఉంది. ధిక్కారస్వరం ఉంది. పొగరు ఉంది. అన్నింటికీ మించిన స్వతంత్ర పిపాస ఉంది. నేను చాలామంది గురువుల్ని కలిశాను. వారితో మాట్లాడాను. ఆధ్యాత్మిక జీవనంపట్ల ఆసక్తిగల పలువురు సాధు సన్యాసుల్ని కలిశాను. అందరిలో నాకు నచ్చినవాడు కృష్ణమూర్తి. అతని 'భావన' నా 'భావన'తో సరితూగింది.

రెండు సంవత్సరాల పాటు విడవకుండా కృష్ణమూర్తి ప్రసంగాలు విన్నాను. అయితే ఆయన్ని కలవలేకపోయాను. అంతా తెలిసినట్లు అనిపించేది కానీ నాలో ఎలాంటి మార్పు రావడం లేదు. నా ఆశయం మేరకు, ఆదర్శం మేరకు జీవించలేక పోతున్నాను. ఆ వైఫల్యం నన్ను క్రుంగదీసింది. నా అవగాహనకు, ఆచరణకు మధ్య పొంతన కుదరడం లేదు. దూరం తగ్గడం లేదు. ఆర్జించే జ్ఞానం వేరు, సాగే జీవితం వేరు. చదివింది, విశ్వసించింది, తెలుసుకున్నది ఏదీ ఆచరణలో పెట్టలేకపోతున్నాను. ఆయన్ని ఇంకా బాగా అర్థం చేసుకోవాలంటే ఒకసారి కలవాలి. ముఖాముఖి మాట్లాడాలి. పరిచయం అయితే ఆయన నాకు సహాయం చేయగలరని ఆశ. ఎట్లా కలవాలి? భయం! అంత గొప్ప వ్యక్తిని కలవడం, మాట్లాడడం సాధ్యమా! చివరకు పూనే వెళ్లి నేరుగా ఆయన్ని కలవాలని నిర్ణయించుకున్నాను.

అపాయింట్‌మెంట్ తీసుకున్న సమయానికి నేను వెళ్లాను. కృష్ణాజీ గదిలో ఒక్కరే ఉన్నారు. నా కోసం ఎదురు చూస్తున్నట్లు అనిపించింది. తడబడుతూ గదిలోపలకు వెళ్లాను. ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? ఆయన మొహంలో కాంతి, ప్రసన్నత చూడగానే నా భయం పోయింది. ఆయనతో స్నేహంగా మాట్లాడ వచ్చు ననిపించింది. వేరే లాంఛనాలు లేకుండా సరాసరి విషయ ప్రస్తావన చేశాను.

"సార్, మీ పుస్తకాలు చదివి, మీ ప్రసంగాలు విని మిమ్మల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. కానీ మీ ఆంతర్యం పూర్తిగా అర్థం కాలేదు.

మీరు చెప్పేది అనుభవానికి అందుతుందా? ఏదో అగోచరం అంటారు. అగోచరాన్ని అనుభూతించడం నావల్ల కావడం లేదు. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాదేమో అనిపిస్తోంది. నిరాశ కలుగుతోంది. కారణం నాతొందరపాటా? అసహనమా?"

కృష్ణమూర్తి అన్నారు, "మీలో తృష్ణ ఉంది. జిజ్ఞాస ఉంది అది తెలుస్తోంది. 'అసహనం' మంచిదే. కొంత అవసరం కూడా. కావలసింది అందుతుంది. కాస్త ఓపిక పట్టు. వీలుంటే నా ప్రసంగాలకు వస్తుండు. రాజమండ్రి, వారణాశి, మద్రాసులో ప్రసంగాలున్నాయి. అప్పుడు అర్థమవుతుంది. ఆలస్యం అయినా ఫరవాలేదు. సరిగా అర్థం చేసుకోవడం ముఖ్యం."

ఆయన మాటలు కొంత ఊరట కలిగించాయి. ఆయన చెప్పినట్లే క్యాంపులకు వెళ్లాను. ఆ మూడు చోట్లకే కాదు. సింహళం కూడా వెళ్లాను. అలాగే కృష్ణమూర్తి అడుగుల్లో అడుగులు వేస్తూ నడిచాను.

ఆ ఇంటర్వ్యూ, కాంపులు నాకు మేలు చేశాయి. అవగాహన పెరిగింది. అవగాహనకు వివేకానికి సంబంధం లేదు. ఆయనది వేదాంత ధోరణి కాదు. తత్వబోధ కాదు. అవగాహనతో మనస్సు యొక్క కట్టడులు దాటవచ్చు. పరిమితుల్ని అతిక్రమించవచ్చు. జీవిత సత్యం తెలుసుకోవడానికి మనస్సే అసలైన అవరోధం. జీవితాన్ని యదాతథంగా అనుభవించనీయదు. మనస్సు దారి మళ్లిస్తుంది. ఎవరికి వారుగా, నేరుగా సత్యాన్ని గ్రహించవలసిందేనని గ్రహించాను. ఇతరులు ఎవరూ మనకు అనుభవం కలిగించలేరు.

క్రమంగా అంతశ్శోధన వైపు దృష్టి సారించాను. నా లోపలికి చూచుకోవడం అలవాటైంది. పుస్తకాలు ఆ పనికి ఏ విధంగాను సహకరించవు. గురువు కాని, మరొకరు గాని మార్గదర్శకం కాలేరు. ప్రతి ఒక్కరు తనలో తనను వెతుక్కోవలసిందే. ఇది అరకొర ప్రయత్నం కాదు. సగం చేసి విరమించకూడదు. సంపూర్ణంగా అంకితం కావాలి.

అయితే అది అంత సులభమైన విషయం కాదు. నా జీవితం, నా చుట్టూ అల్లుకున్న సమాజం, ప్రపంచం గురించి మక్కువ ఉండకూడదు. అప్పుడు తెలిసింది మనస్సు చేస్తున్న మోసం. ప్రపంచాన్ని, సమాజాన్ని మనస్సు చిన్నచిన్న ముక్కలుగా చేసి పెత్తనం చేస్తుందని. మనసే భ్రమ కలిగిస్తుంది. మనల్ని భ్రమలో పడవేస్తుంది. నిజం కానిదాన్ని నిజమని నమ్మిస్తుంది. అది మనస్సు మాయ. మనో వ్యాపారాలు, మనసు క్రియలు సంకుచితం, పరిమితం. ఇప్పుడు నా జీవితమే నాకో పెద్ద సవాల్‌గా మారింది. నా అవగాహనలో మార్పు వచ్చింది.

కృష్ణమూర్తి ప్రసంగాలు వినడానికి ఎంత దూరమైనా వెళ్లేవాడిని. అలా ఇంటికి దూరం అయ్యాను. బాధ్యతలకు దూరం కాసాగాను. వ్యాపారం పైన ఆసక్తి తగ్గింది. బంధువులపై ఇష్టం తగ్గిపోతోంది. నా తిరుగుళ్లు, వైఖరి ఇంట్లో వారికి, అయిన వారికి నచ్చక విమర్శించసాగారు. కాని నాలో వస్తున్న మార్పు నాకు ఆనందంగానే ఉంది. ఏ అవాంతరం ఏర్పడినా ఎదుర్కొనడానికి సిద్ధపడ్డాను.

★ ★ ★

అప్పట్లో, 'తానే'లో ఒక వేట బృందం ఉండేది. నేను, మా చిన్నాన్న, ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు లాయర్లు ఆ బృందంలో సభ్యులం. దగ్గరలో ఉన్న కొండల మీదికి వెళ్లి అడవిలో వేటాడేవాళ్లం. అడవి పందుల్ని, జింకల్ని, బాతుల్ని, కుందేళ్లను పట్టుకునేవాళ్లం. ఒక ఆదివారం మేం వేటకు వెళ్లాం. అడవి పందుల్ని వేటాడటంలో సాహసం ఉండేది. అవి భయంకరంగా ఉండడమే కాక నానా తిప్పలు పెడతాయి. అవి దొరక్కపోతే కనిపించిన చిన్న జంతువుల్ని వేటాడేవాళ్లం. ఆరోజు మూడు గంటలు తిరిగినా ఒక్క జంతువూ చిక్కలేదు. విసిగిపోయి, ఒక పొద మాటున విశ్రాంతి కోసం కూర్చున్నాం. అంతలో అకస్మాత్తుగా ఒక కుందేలు కనిపించింది. అది మావైపే వస్తోంది. తుపాకి గురి పెట్టి కాల్చాను. కాని నా గురి తప్పింది. నాలుగు రౌండ్లు కాల్చినా ప్రయోజనం లేదు. కుందేలు తప్పించుకుంది. పరిగెత్తిపోయే జంతువుల్ని గురిపెట్టి కాల్చడం చాలా కష్టం. అయినా తుపాకి పేల్చాను. కుందేలుకు కాస్త తగిలింది. దెబ్బ తగలడంతో ఏడుస్తూ అరుస్తోంది.

మరొకసారి తుపాకీ కాల్చితే అది చిక్కేది. ఆ క్షణంలో ఎందుకో నా మనసొప్పలేదు. జాలి వేసింది. అయ్యో అనిపించింది. అది పడిపోయిన చోటుకు వెళ్లాను. ప్రాణం రక్షించుకోడానికై కుంటుతూ పారిపోడానికి ప్రయత్నిస్తోంది. దాని కళ్లలో భయం నన్ను కదిలించింది. పాపం, దాని శరీరం భయంతో వణుకుతోంది. చనిపోయే ముందు ఏ జీవికైనా ఎంత ప్రాణభయం! ఎంత ఆశ జీవించాలని! ఆ క్షణంలో తనను తాను ఎంతగానో ప్రేమిస్తుంది. నాకు జాలి కలిగింది. నిలువెల్లా పులకించాను. 'ఆ ప్రాణిని చంపే హక్కు నాకెవరిచ్చారు? నాకెక్కడిది? అదీ నా వంటి ప్రాణే కదా'.

అంతరాత్మ ప్రబోధం విని తుపాకీ దించాను. చేతిలో తుపాకీ లేకపోతే నాకింత ధైర్యం ఉండేదా! ధైర్యం యిచ్చింది తుపాకి. దైవం యిచ్చింది కాదు. దైవం కలిగించింది జాలి, దయ.

నాలోని వేటగాడు ఎదురుతిరిగి ప్రశ్నించాడు "దానిని అంత నిర్దాక్షిణ్యంగా, క్రూరంగా ఎందుకు కాల్చావ్? అది నీకు ఏం అపకారం చేసింది? చూడు, తన వారికోసం అది ఆక్రోశిస్తోంది. అది ఆడది అయి వుంటే దాని పిల్లలు ఎంత బాధపడతాయి? ఎంతగా నిన్ను శపిస్తాయి. అడవిలో జంతువులు స్వేచ్ఛగా జీవిస్తాయి. వాటిని స్వేచ్ఛగా జీవించనీయనిది మనుషులే!"

ఆ క్షణంలో నాలోని వేటగాడు మరణించాడు. నా పొగరు నశించింది.

సాధారణంగా వేటకు వెళ్లినవారు ఏ ఒక్కవేట దొరికినా సంతోషంగా తిరుగుముఖం పడతారు. ఈసారి నాలో ఎలాంటి ఉత్సాహం లేదు. సంతోషం లేదు. లోగడ నేను ప్రతిసారి విజయోత్సాహంతో తిరిగి వచ్చేవాడిని. నాతోటివారు లేళ్లను, దుప్పుల్ని వేటాడి తెచ్చుకున్నారు. నేను మోయలేనంత విషాదాన్ని వెంట తెచ్చుకున్నాను. ఈసారి వేటలో 'పశ్చాత్తాపాన్ని' వేటాడి పట్టుకున్నాను. ఆ రాత్రి నాకు భోజనం సయించలేదు. అమ్మ నా దిగులుకు కారణం వేటలో 'ఓటమి' అనుకుంది. కాదు అది జీవితంలోనే ఓటమి. అసలు జీవితాన్నే ఓడిపోయాను. పోగొట్టుకున్నాను. ఆ రాత్రి కంటిమీద కునుకు రాలేదు. నాలో అంతర్యుద్ధం సాగింది. మరునాడు అమ్మకు చెప్పాను "ఇకపైన వేటకు వెళ్లను. మాంసం తినను".

అది నిర్ణయమే కాదు నా శపథం. ఇంట్లో ఎవరికీ నా నిర్ణయం నచ్చలేదు. ఎంతగా వాదించినా ఎవరూ నా నిర్ణయం మార్చలేకపోయారు.

మాంసాహారం మానడం వల్ల నా ఆరోగ్యం చెడలేదు. భేషుగ్గా ఉన్నాను. ఉత్సాహం తగ్గలేదు. ఇదివరకటి కన్న నా బుర్ర చురుగ్గా పనిచేస్తోంది. తర్వాత ఎప్పుడూ మాంసం మీదికి మనసు పోలేదు. ప్రతి విషయాన్ని లోతుగా అధ్యయనం చేయసాగాను. నా దృక్పథం మారింది. నేను మారాను."

★ ★ ★

అక్కడ ఆపి, భారంగా నిట్టూర్చి, చుట్టూ ఉన్న సన్యాసుల వైపు చూచాను. ఒకతను అడిగాడు, "దాదా, జీవితంలో పెనుమార్పు రావాలంటే అలాంటి సంఘటన అవసరమా? దానిని మీరు ఎలా ఎదుర్కోగలిగారు? అనేక బాధ్యతలు ఉన్నాయి గదా? ఆ బాధ్యతల నుండి ఎలా తప్పించుకోగలిగారు?"

"ఉంటాయి మిత్రమా, విడివిడిగా చూస్తే అన్నీ సమస్యలే, కలివిడిగా చూస్తే ఏదీ సమస్య కాదు".

"ఆ తర్వాత సజ్జన్‌ఘడ్ రావటం, ఏకాంత జీవనం మీకు తెలుసు.


కుటుంబంలో బాధ్యతల కారణంగా పెళ్లికి దూరమైనాను. దానికి తోడు నాకు ఎప్పుడో ఆధ్యాత్మిక భావన కలిగింది. కొన్ని సంవత్సరాలు ఆ జిజ్ఞాస అంత బలంగా లేదు. కుటుంబమే ముఖ్యం అనిపించింది. ఇద్దరు చెల్లెళ్ల పెళ్లి చేశాను. నన్ను పెళ్లి చేసుకోమని ఒత్తిడి వచ్చింది. తమ్ముడు, ఇంకా ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. వారి పెంపకం, మంచిచెడులు చూచే బాధ్యత ఉంది.

రోజులు గడుస్తున్న కొద్దీ నా జీవన నేపథ్యం మారసాగింది. బహుదా విస్తరించింది. మనో యవనిక మారింది. పెళ్లి చేసుకుంటే బ్రతుకు పరిమితం అవుతుంది. కొన్ని సుఖాలు ఉండవచ్చుగాని సాధించేది ఏమీ ఉండదు. ఆధ్యాత్మిక రంగంలో ఎదగదలచిన వారికి పెళ్లి పెద్ద అవరోధం. సంసారం లంపటం. అమ్మ పోరు పెట్టేది పెళ్లిచేసుకోమని. నేను ఆసక్తి చూపలేదు. మిత్రుల ఇళ్లకు వెళ్లినప్పుడు అన్యోన్యంగా ఉన్న దంపతుల్ని చూచినపుడు పెళ్లి చేసుకుంటే బావుండునేమో అనిపించేది. అయినా అదొక తగలాటం ఎందుకని అంతరాత్మ చీవాట్లు పెట్టేది. నాలాంటి మానసిక సన్యాసికి ఒంటరి జీవితమే మేలు!

అప్పట్లో వ్యాపారం, కుటుంబ క్షేమం నా ముఖ్యబాధ్యతగా భావించాను. చెల్లెళ్ల పెళ్లి చేయడం అవసరం. అలా సాగుతుండగా నా జీవితమే నాకో ప్రశ్నగా నిలిచింది. ప్రశ్నలకు సమాధానాలు వెతకసాగాను. సమాజంలో నాకు మంచి స్థానమే ఉంది. మర్యాద మన్నన ఉన్నాయి. జీవితం గౌరవప్రదంగా సాగుతోంది. కాని, ఇదేనా జీవితం? జీవితానికి అర్థం ఏది? అని ప్రశ్నించుకో సాగాను.

★ ★ ★

తర్వాత అరుణాచలం వెళ్లి రమణ మహర్షిని దర్శించాను. మహర్షి సూచన మేరకు మూడు రోజులు రమణాశ్రమంలో వారి సన్నిధిలో గడిపాను. దుబాసీ ద్వారా మా సంభాషణ సాగింది. నిజంగా రమణ మహర్షి మహాత్ముడు. ఆత్మ సాక్షాత్కారం పొందిన రుషి. అద్భుతమైన వ్యక్తి. ఆయన మొహంలో తేజస్సు మాటలలో వర్ణించలేను. మహర్షి మన ఎదురుగా ఉన్నా, ఎక్కడో దిగంతాల అవతలకి చూస్తున్నట్లు అనిపిస్తుంది. వారి నిరాడంబర జీవనం, ఆశ్రమ జీవితం నాకు నచ్చింది. ఎంత వినయం, ఎంత ప్రశాంతి, ఎంత స్వచ్ఛత. అక్కడ ఉన్న మూడు రోజులు మహర్షి ప్రక్కనే కూర్చుని భోజనం చేశాను. ఆయన భక్తులతో జరిపే సంభాషణలు వినే భాగ్యం కలిగింది. రమణ మహర్షి తరచు అంటారు "మూలానికి వెళ్లి అన్వేషించు" అని. 'నేను'కు మూలస్థానం ఏదో తెలుసుకోవాలి, ఎవరికి వారు ప్రశ్నించుకుని, అన్వేషించా లంటారు రమణులు. కోపం, ద్వేషం లాంటివి ఎవరికి వారే పరిహరించుకోవాలంటారు. వాటిని నిగ్రహిస్తే, వదిలితే



ఆధ్యాత్మిక లోగిలి ... భగవాన్ రమణ మహర్షి

ఈశ్వరానుగ్రహం లభిస్తుందని, మనల్ని మనం తెలుసుకోగలమని, అదే ఆత్మాన్వేషణ గమ్యమని మహర్షి చెప్పారు.

నేను చిన్నవాడిని. అనుభవం లేనివాడిని. రమణ మహర్షిని అర్థం చేసుకోలేకపోయాను. అక్కడి నుండి బయటకొచ్చాను. వారి కళ్లలోని వెలుగు, ఈశ్వరీయత, తేజస్సు ఇప్పటికీ నాకళ్లలో కదులుతుంటాయి.

అక్కడి నుండి పాండిచ్చేరి చేరాను. అరవిందాశ్రమంలో ఏడు, ఎనిమిది మంది అంతేవాసులున్నారు. వారంతా సాధకులు. అప్పుడు శ్రీ అరవిందయోగి అజ్ఞాతంలో ఉండి సాధన చేస్తున్నారు. ఎవరినీ దర్శనానికి అనుమతించడం లేదు. మదర్‌ని కలిసి, ఆమె మాటలు విన్నాను. ఆమె ఆశ్రమానికి వచ్చినవారిని, సాధకుల్ని గైడ్ చేస్తారు. మద్రాసు నుండి కాంచీపురం, తిరుపతి, పూరిజగన్నాథ్, రామేశ్వరం, కన్యాకుమారి మొదలైన క్షేత్రాలు పర్యటించాను. చాలామంది యోగులను, క్షేత్రాలను దర్శించానన్న తృప్తి కలిగింది.

★ ★ ★

ఇంటికి తిరిగి వచ్చి మళ్లీ కుటుంబ, వ్యాపార బాధ్యతలు చేపట్టాను. లోపల చింతన యదాతథంగానే ఉంది. అన్వేషణ సాగుతూనే ఉంది. ఒకనాడు మిత్రుడు భావే వచ్చి జిడ్డు కృష్ణమూర్తి విదేశాల నుండి వస్తున్నట్లు వార్త అందించాడు. ఇండియాలో పలుచోట్ల ప్రసంగాలు ఏర్పాటు చేశారట. పూనేలోను ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నారు. పూనే థియోసాఫికల్ సొసైటీలో మాకు వసతి భోజనాలు ఏర్పాటు చేసుకున్నాం. మొత్తం ఎనిమిది మంది పూనే వెళ్లాం. అంతా నా వంటి యువకులు, జిజ్ఞాసులు, కొందరు సీనియర్లు. మా అందరికీ అది గొప్ప అవకాశం. అక్కడికి వెళ్లిన వారిలో రావుగారు, అచ్యుత పట్వర్థన్, ఎల్.బి. భావే, కుసుం, మిస్

సారాభాయ్, పామా పట్వర్ధన్, సునంద, ద్వారక్, లలిత, గౌతమ్, ప్రొఫెసర్ ఆర్.ఎస్. భగవత్ ముఖ్యులు.

కృష్ణమూర్తి రోజూ ఉదయం గ్రూప్ గాదరింగ్ పెట్టేవారు. పగలు, మిగతా వేళల్లో చదవడం, చర్చలు. ప్రసంగాలు వింటూ, చర్చలలో పాల్గొన్నాం. ప్రతిరోజూ కృష్ణమూర్తిని చూస్తూ, మాట్లాడే అరుదైన అవకాశం లభించింది. ప్రసంగాలు దగ్గరగా వినే అదృష్టం కలిగింది. జె.కే. అంతర్జాతీయ మేధావిగా అప్పటికే గుర్తింపు పొందారు. ఈ శతాబ్దపు ఏకైక తత్వవేత్త అనే పేరు వచ్చింది. మంచి 'వక్త'గా లబ్ధ ప్రసిద్ధుడు. ఆయన సిద్ధాంతం ఎవరికైనా నచ్చుతుంది. ఆలోచింప చేస్తుంది. ఆయన పట్ల ఆకర్షణ మరీ ఎక్కువైంది. క్యాంపు పది రోజులు జరిగింది. కాలం సద్వినియోగమైంది. మరొక విధంగా ఆ క్యాంపు మమ్మల్ని కల్లోల పరిచింది.

మేమంతా యువకులం. భవిష్యత్తు గురించి బంగారు కలలు కంటున్నవాళ్లం. కృష్ణమూర్తి తాత్వికత భవిష్య కాలానిది. మాకు నచ్చింది. ఆయన ప్రసంగాలు మాపైన బాగా ముద్రవేశాయి. మాలోపల ప్రతిఒక్కరు భవిష్యత్తులో రాబోయే మార్పుల గురించి ఊహాచిత్రాలు వేస్తున్నవాళ్లమే. ఎవరి జీవితం ఎట్లా మారుతుందో. మాలో ఎక్కువ మంది బ్రహ్మచారులు. మాకు 'పెళ్లి' ఒక ప్రశ్న! అవసరమా, కాదా అన్నది తేలని ప్రశ్న. ఆ విషయంలో కృష్ణమూర్తి గారి సలహా తీసుకోవాలని, ఆయన అభిప్రాయాలు తెలుసుకోవాలని అనుకున్నాం. కృష్ణమూర్తి బ్రహ్మచారి. ఎనిమిది మంది బ్రహ్మచారులం అపాయింట్‌మెంట్ తీసుకుని వారిని కలుసుకున్నాం.

వాస్తవానికి కృష్ణమూర్తి ఇది చెయ్, ఇది వద్దు అనరు. దేనికీ సూటిగా సమాధానం చెప్పరు. సమస్యను విశ్లేషిస్తారు. పూర్వాపరాలు చర్చిస్తారు. నిర్ణయం మనకే వదిలేస్తారు. ఆయన ధోరణి ఇలా ఉంటుంది.

"మీరేం అనుకుంటున్నారు? ఏం చేద్దామనుకుంటున్నారు?" అని మొదలుపెట్టి చివరకు అంటారు : పెళ్లి కావాలనిపిస్తే, చేసుకోవడం మంచిదనిపిస్తే 'గో ఎహెడ్' పెళ్లిచేసుకోండి. జీవిత భాగస్వామిని వెతుక్కోండి. ఓకే" అంతే గాని, తన అభిప్రాయం ఇది అని చెప్పరు.

ఆయన మాటలు వినడానికి సొంపుగా ఉన్నా, ఆలోచిస్తే 'భయం' వేస్తుంది. నాకైతే చాలా చిరాకు కలిగింది. జీవితంలో అనుకున్నది సాధించాలంటే పెళ్లి అవరోధమని నా నిశ్చితాభిప్రాయం. 27 ఏళ్ల వయసులో చెల్లెళ్ల పెళ్లిళ్లు చేసే సమయంలో 'పెళ్లి' అనవసరం అనుకున్నాను.

కృష్ణమూర్తి అంటారు : "కోరికలు అణచుకోవద్దు. అణచివేయడంవల్ల

మనసు బండబారి, సున్నితత్వం కోల్పోతుంది. ఆలోచన గాడి తప్పుతుంది. పెళ్లి కోరికను అణచుకోవడం వల్ల ప్రత్యేకంగా వొరిగేదేమీ ఉండదు" అని.

అంటే ఏమిటి? నేను వాంఛను అణచివేస్తున్నట్లా? అది తప్పని అనుకుంటు న్నానా! ఆలోచనలు నన్ను కలవరపరచాయి. నా గురించి నాకే స్పష్టత లేదు. నా నిర్ణయం మంచిది కాదా?

మరొకసారి కృష్ణాజీని కలవాలనుకున్నాం. కొద్ది రోజుల తర్వాత నాకు ప్రయివేట్ ఇంటర్వ్యూ లభించింది.

ఆ రోజు మరవరాని రోజు. గదిలో కార్పెట్‌పైన ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాం. గదిలో ఇంకెవరూ లేరు.

"నాకు ఆత్మానుభవం కావాలి" అని అడిగాను సూటిగా.

"అది కేవలం మతదృష్టితో రాదు. అలవాట్లలో, ప్రవర్తనలో కొద్దిపాటి మార్పులవల్ల కలగదు. పూర్తి స్వేచ్ఛ కావాలి. పూర్తి సమయం కేటాయించగలగాలి. సత్యశోధనకు, సత్యసాధనకు పూర్ణస్వాతంత్ర్యం అవసరం."

ధైర్యంగా నా మనసులోని మాట చెప్పేశాను.

కృష్ణమూర్తి సడెన్‌గా నా చేతిని అందుకుని గట్టిగా నొక్కి అన్నారు : "డోంట్ వర్రీ! నువ్వు ఏదీ అణచిపెట్టడం లేదు. దాచుకోవడం లేదు. వివాహం ఒక బంధం అనుకోకుండా ప్రతిబంధం అనుకుంటున్నావు, అంతే గదా!"

నాకు నా ఆలోచన, నిర్ణయం తప్పనిపించడం లేదు.

మా సంభాషణ గురించి మిత్రులు గుచ్చిగుచ్చి ప్రశ్నించారు. వారికి పెళ్లి అభివృద్ధికి ఆటంకం అనిపించలేదు. 'ఇష్టమైన వారు చేసుకోవచ్చు' అని కృష్ణమూర్తి చెప్పిన మాట పట్టుకున్నారు. వారి లోపలి కోరిక అదే. మా బృందంలో నేను తప్ప, మిగిలిన ఏడుగురు తర్వాత పెళ్లి చేసుకున్నారు. నేను మాత్రం వివాహం, సంసారం వద్దనుకున్నాను.

కృష్ణాజీ సమావేశం నాకు చాలా ఉపకరించింది. పెద్ద బరువు తగ్గింది. మన ఆదర్శాలకు అనుగుణంగా జీవించే ఇల్లాలు లభించడం చాలా కష్టం. ఒకరి ఇష్టాలకు, అయిష్టాలకు రెండవ వారు తలవంచక తప్పదు. తలదించుకుని బ్రతకవలసి వస్తుంది సంసార జీవితంలో. ఒకరికోసం మన స్వేచ్ఛను త్యాగం చేయాలి. కుటుంబ జీవితంపై వ్యామోహం పూర్తిగా పోయింది. ఆధ్యాత్మికంగా లోతులు చూడాలన్నా, శిఖరాలకు ఎగబాకాలన్నా ఏ బంధాలు ఉండకూడదు. ఎంత కాదనుకున్నా ఇద్దరి మనసులు కలవ్వు. వైరుధ్యం తప్పని సరి. వైరుధ్యం

తప్పించడం కుదరని పని. ఇద్దరిలో ఒకరు ఏవో సమస్యలు సృష్టిస్తుంటారు. రెండవ వారు పరిష్కారం వెతుకుతుండాలి.

మా బంధువుల్లో, స్నేహితుల్లో చాలామంది సంసారాలు గమనించాను. నా లక్ష్యసాధనకు, ఆకాంక్షకు, అభివృద్ధికి అలాంటి జీవితం సరిపడదనిపించింది. రోజు రోజుకు నాలో తృష్ణ పెరుగుతోంది. జిజ్ఞాస అధికమవుతోంది. బయటి ప్రలోభాలు, ఒత్తిడులు లేకపోతే మన అనుభవాలు, అంతరాత్మ ప్రబోధాలే మనకు మంచి పాఠాలవుతాయి. ఏకాంతంగా, ప్రశాంతంగా, నిశ్చలంగా ఉంటేనే నా గురించి నేను ఆలోచించగలను, శోధించగలను.

నా బుర్ర గట్టిది. ఇష్టాలు, అయిష్టాలు, నిర్ణయాలు స్వంతంగా చేసుకోగలదు. మరొకరి ఇష్టాలను, నిర్ణయాలను నేనెందుకు స్వీకరించాలి, అంగీకరించాలి? అంటే నాతోనే నేను మైత్రి చేయాలి. నా మనసు నాకు బాగా తెలుసు. ఎవరితో ఎంత స్నేహం నటించినా, నా వంటివాడు మరొకరి ఇష్టానుసారం నడవలేడు. నేను ఓపెన్‌గా, స్వేచ్ఛగా, ఇండిపెండెంట్‌గా ఉంటాను. ఎవరితోనూ నాకు స్నేహం కుదరదు.

నా అంతరాత్మ నన్ను అతలాకుతలం చేసింది. అంచేతనే ఎవరి మార్గం అనుసరించలేకపోయాను. ఎవరినీ నాకు మార్గదర్శకంగా తీసుకోలేదు. అయిన వారికి దూరమైనాను. మిత్రులను దూరం చేసుకున్నాను. ఇతరుల మాటలు, అభిప్రాయాలు ఎంత మంచివి అనిపించినా, నాకు ఆచరణీయాలు కాలేదు. అవి నాకు సమ్మతం కాదు. ఎంత కాదన్నా అవి అన్నీ 'సెకండ్ హాండ్' భావాలే. మరొకరి మేధస్సుకు పుట్టిన భావనలు. అనుభవం నాది కావాలి! నిర్ణయాలు నా స్వంతం కావాలి! అవే నాకు సత్యాలవుతాయి. మరొకరి అనుభవం పట్టుకుని వేలాడినంత కాలం నాకు స్వేచ్ఛ ఉన్నట్లు కాదు. ముందుకు పోవడం జరగని పని.

అదే సమయంలో కృష్ణమూర్తి అభిమానుల నుండి ఒక వర్తమానం వచ్చింది. కృష్ణమూర్తి తత్వప్రచారం కోసం వారణాశిలో ఒక సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు, అందులో నేను వచ్చి సహాయంగా ఉండమని అచ్యుత్ పట్వర్ధన్ రాశాడు. నాకు వ్యవసాయం తెలుసు. వారణాశి సెంటర్‌లో ఫార్మింగ్ ఉందట. ఆ బాధ్యత నన్ను తీసుకోమన్నారు. మంచి అవకాశం. దీర్ఘంగా ఆలోచించాను.

ఆ పని మంచిదే కావచ్చు! దాని వల్ల నాకు ఒరిగేదేమిటి? నా అంతరంగ శుద్ధికి వ్యవసాయం ఎలా ఉపయోగిస్తుంది? ఆధ్యాత్మికంగా నేను సాధించేది

ఏముంటుంది? నా మిత్రులు కొందరు వెంటనే వారణాశి బయలుదేరారు. జె.కె. సెంటర్‌లో పనిచేయడం అదృష్టంగా భావించారు. నేను వెళ్లలేదు. ప్రసంగాలు వినడం వల్ల, పుస్తకాలు చదవడం వల్ల, గ్రూపు కార్యక్రమాల వల్ల రావలసిన మార్పు లేదు. కృష్ణమూర్తి ఆశిస్తున్న మార్పుకు అది మార్గం కానే కాదనిపించింది. నేనున్న పరిస్థితిలో సమిష్టి కృషి అభిలషణీయం కాదు. ఒంటరిగా ఏదైనా సాధించాలి.

అప్పట్లో చాలామంది వేదాంత ప్రసంగాలు విన్నాను. ఏవీ నాకు నచ్చలేదు. వారిలో చాలామంది గురువులపైన ఆధారపడ్డవారే. గురువు అనుగ్రహం కోసం వెంపర్లాడే వారే. ఇరవై ముప్ఫయి సంవత్సరాలు గురుశుశ్రూష చేసినా వారిలో వచ్చిన మార్పు లేదు. నేను అలా ఒకరిని అనుసరించలేను. శాశ్వతంగా వేరొక బాటలో నడవడం నా వల్ల కాదు.

క్రమంగా కృష్ణమూర్తి ప్రసంగాలపైన, పుస్తకాలపైన, భావాలపైన ఆసక్తి తగ్గింది. ఇప్పుడు నా సమస్యకు కేంద్రం 'నేను'. నేనే పరిష్కరించుకోవాలి. బయటి వారెవరూ నాకు సహాయం చేయలేరు. ఎవరిని ఎవరూ ముందుకు తోయరు. నా అంతర్‌యాత్రకు నేను సిద్ధం కావాలి. నా శోధన నేనే జరపాలి. అది నా నిర్ణయం.

అప్పుడు అసలు సమస్య తలెత్తింది. జీవితాన్ని ఎలా మలుపు తిప్పాలి? ఎట్లా మలుచుకోవాలి? బాధ్యతలున్నాయి. వాటిని వదిలించుకోవడం ఎలా? బయట ప్రపంచం గురించి నా అవగాహన నాకుంది. అది స్పష్టం. పుస్తకాలు, వేదాంతాలు సమస్యల్ని పరిష్కరించవు. ఏది చదివినా మరొకరి ప్రభావానికి లోనుకావడం జరుగుతుంది. అవి నాకు సరిపడేవి అయివుండవు. అవి రాసిన వారు ఆచరించి ఉండరు. ఊహలల్లి ఉంటారు. చాలామంది బోధించడం తప్ప ఆచరించరు. వారు ఆచరిస్తే వారు మారి ఉండాలి గదా! ఎవరిలోనూ పెద్ద మార్పు కనిపించదు. పైపై వేషధారణ, సంభాషణలు. ఎంతసేపూ మహాత్ముల ఉపదేశాలు వర్ణించడం, ఉదహరించడం. తమ అనుభవాలు చెప్పేవారు కనిపించరు. స్వంతజ్ఞానం ఎవరిలోనూ లేదు. ఒకరిమాటలు మరొకరు చెప్పడం జ్ఞానం ఎలా అవుతుంది. అవి చిలకపలుకులు. అంచేత చదవడం విరమించు కున్నాను. ఎవరి సిద్ధాంతాలు అవసరం లేదు. నా దారి నాది కావాలి! మరొకరి దారిలో నేను నడవలేను.

ఆ నిర్ణయం తర్వాత నాలో ఆత్మతత్వ విచారణ పెరిగింది. అంతర్వీక్షణ మొదలైంది. కళ్లు మూసుకుని నాలోకి నెమ్మదిగా నిష్క్రమించసాగాను. కుటుంబం

పైన, వ్యాపారాల పైన ఆసక్తి పూర్తిగా తగ్గిపోయింది. నా జీవితం గాడి తప్పింది, కొత్త దారికి మళ్లింది. ఒక ముఖ్యమైన దానిని చేజార్చుకున్నాను. మరొక ముఖ్యమైన దానికై వెదకడం ప్రారంభించాను. అయినా కుటుంబం కోసం కొన్ని పనులు చేయక తప్పలేదు. ఏ పనిచేస్తున్నా నిరాసక్తత, నాలో శూన్య భావన. నేను కుటుంబానికి మానసికంగా దూరం అయిపోతున్నాను. ఎవరితోనూ మాట్లాడాలని పించదు. అందరినీ దూరం చేసి, నన్ను ఒంటరిని చేస్తోన్న భావన! అది ఏది? అన్ని సంపదలు, సుఖాలు, వ్యాపారాలు ఉన్నా వేటికీ కానివాడిని. ఏవీ అవసరం లేనివాడిని. నా ఇంట్లోనే నేను పరాయివాడిని. నా శరీరానికి నేను పరమై పోతున్నాను. ఏమీ కాకుండా పోతున్నాను. ఏమిటీ పరిస్థితి? ఎటు దారి తీస్తుందో ఈ వైఖరి?

అందరి పట్ల, అన్ని వ్యవహారాల పట్ల వైరాగ్యం, అయిష్టత. పారిపోవాలని పిస్తోంది. ఎక్కడికో తెలియదు! ఓ నాలుగు రోజులు ఎక్కడైనా ఏకాంతంగా గడపాలి. నా జీవితం గురించి ఆలోచించుకోవాలి. ఎంత మథనపడ్డా సమాధానం దొరకలేదు. అదృష్టవశాత్తు అప్పుడే రామ్ పెళ్లి కుదిరింది. హమ్మయ్యా! నా కిదొక అవకాశం. మనిషికి ఒక్కొక్క కోరిక ఒక బంధాన్ని సృష్టిస్తుంది. చివరకు ఆ బంధాలు త్రెంచుకోవడం అసాధ్యం అవుతుంది. మనం చేస్తున్నామనుకునే పనులనన్నిటిని మనచేత చేయించేది మనస్సు. మనసే మనల్ని, మనచుట్టూ ఉన్న వారిని ప్రలోభ పెడుతుంది.

సంసార బాధ్యతలు మోస్తూ, వ్యాపారం చూస్తూ పది సంవత్సరాలు జీవితాన్ని అనేక కోణాలలో పరిశీలించాను. జీవితంలో విజయాలు సాధించిన వారిని అధ్యయనం చేశాను. వారి జీవితాల్లోంచి చాలా నేర్చుకున్నాను. ఆర్థికంగా విజయం సాధించిన ప్రతి ఒక్కరిలోనూ ఏదో విషాదం ఉంది, చీకటి కోణా లున్నాయి. అసంతృప్తి, భయం, ఆందోళన, అసూయ, ద్వేషం, కోపం, అసహనం ఉన్నాయి. ఎవరిలోనూ ఆనందం, తృప్తి కనిపించవు. శాంతి కనిపించదు. భౌతికంగా విజయాలు సాధించడం అంటే అర్థం కోరికలు పెరగడం.

సంప్రదాయపు ఇరుకు సందుల్లో జీవిస్తున్న వారిని చూచాను. నాలో ప్రశ్నలు మరీ అధికమైనాయి. మన ఇష్టాయిష్టాల సమ్మేళనమే జీవితం. అంటే ఆశలు, కోరికల మెట్లు ఎక్కడమే వారి జీవితాశయాలు. కొన్ని అయినా సాధించడం విజయం. జీవిత లక్ష్యం. ప్రతి ఒక్కరు అనుకున్నవి సాధించడమే గొప్ప విజయం అనుకుంటున్నారు. ఒక కోరిక కోరటం అంటే మనల్ని మనం పరిమితం

చేసుకోవడం, మనసును కుంచింప చేయడం. దాంతో అవగాహన, అంతర్దృష్టి పోతుంది. అవసరం ఉండదు. మన అవగాహన లోపిస్తే మనం అంధులం అయినట్లే. కళ్లుండీ చూడలేని తనం. విశాలదృష్టి లేకపోవడం శాపం! అలాంటి వారికి జీవితపు లోతులు తెలియవు. అర్థం కావు.

నా కనిపించింది ప్రపంచంలో ప్రతి ఒక్కడికీ ఆకలి, ఆశ ఎక్కువని. ప్రతివాడు ఏదో రకమైన జోలె పట్టి బ్రతికేవాడే. అర్థించడానికి మూలకారణం ఆశించడం. ఒకరిని అర్థించడం బేలతనం. అయోగ్యత. అందరూ జీవితాంతం అర్థిస్తూ, ఆశిస్తూ బ్రతుకుతుంటారు. ఎవరూ తృప్తిగా జీవించరు. ఎవరూ ఎవరినీ ఆనందంగా, తృప్తిగా బ్రతకనీయరు. నా చుట్టూ బ్రతుకుతున్న మనుషులు, వారి మనస్తత్వాలు గమనిస్తే అసహ్యం వేసింది. అలాంటి జీవితం నాకు వద్దనిపించింది. వారి జీవిత స్వభావం విచిత్రంగా, అసహ్యంగా ఉంది.

ఎప్పుడైతే జీవిత విధానం పట్ల రోత కలిగిందో, అయిష్టత ఏర్పడిందో అప్పుడే నా అవగాహన పెరిగింది. నా ఆలోచనలు, ఆలోకనం కొత్త చివుళ్లు వేయసాగాయి. ఈ మార్పు నాముందు నిలిచిన సవాల్! అది ఆధ్యాత్మికంగా సాహసయాత్రలో తొలి మలుపు. తొలి అడుగు. మామూలుగా మనిషికి తెలియని మహాశక్తి ఏదో ప్రతి మనిషిలో ఉందని మహాత్ములు చెబుతుంటారు. పుస్తకాలలో చదివినవి ఏవీ నాకు కావాలనిపించలేదు. కొత్త చైతన్యం కావాలి. నాలో నిక్షిప్తమై ఉన్న శక్తి ఏదో అది బయటకు రావాలి.

నాకు వివేకం ఇచ్చిన శక్తి కాదు, మరేదో ఉంది. అది కావాలి. విలాస జీవితం పైన మోజు లేదు. నా మనసు అటు పోవడం లేదు. ఏదో సాహసం చేయాలి! ఆ సాహస కార్యంలో నాకు సహాయం చేసేవారు ఎవరున్నారు? ఎవరో నాకు విజయం కూర్చలేరు. తీవ్రత నాలో రోజురోజుకు హెచ్చింది. కొత్త ద్వారాలు తెరుచుకోవాలి. కొత్త లోకంలో ప్రవేశించాలి.

అది కేవలం నా అభిలాష కాదు. అది అవసరం. అది తీరని దాహం. లక్ష్యాలు, గమ్యాలు ఏర్పరచుకోవడం దండగ. ఇంతవరకే ఎదగాలని, ఇంతే సాధించాలని అనుకోవడమే ఒక గమ్యం నిర్దేశించుకోవడం. అంతే ఆధ్యాత్మికంగా సాధనకు పరిమితులుండవు. విషయాలు చర్చకే పరిమితం. లోతులకు వెళ్లి వెదికితే తప్ప నిగూఢ, నిక్షిప్త సత్యాలు తెలియవు. ఎన్ని అవరోధాలు దాటాలి! ఎన్ని పొరల్ని చీల్చుకుంటూ పోవాలి? అంత సులభమా! మనస్సు ప్రభావం నుండి తప్పించుకుని లోతులకు వెళ్లడం ఒక్కటే మార్గం.

చిన్నతనంలో నేను సరదాగా, జాలీగా తిరిగినా, అందరికంటే భిన్నంగా ఉంటానని అందరికీ తెలుసు. సరదాగా తిరిగినా జీవితాన్ని సీరియస్‌గా తీసుకునే స్వభావం నాది. పద్దెనిమిది నుండి ముప్ఫయి వరకు జీవితాన్ని వివిధ కోణాలలో చూచాను. నిజాయితీగా అధ్యయనం చేశాను. నా కృషి ఫలించింది. మంచి దోవ దొరికింది. మంచి పుస్తకాలు చదివాను. ఎందరో మహాత్ముల్ని దర్శించాను. ఎన్నో ఆశ్రమాలు, పుణ్యక్షేత్రాలు తిరిగాను. మిత్రులతో తాత్వికచర్చలలో పాల్గొన్నాను. నా పరిశీలన, అవగాహన పెరిగింది. ఎంత చదివినా, ఎంత శోధించినా, ఆలోచించినా అంతా మనస్సు పరిధిలోనే జరిగింది. మనసు హద్దుల్ని దాటి పోతే తప్ప అసలు సత్యం బోధపడదని గ్రహించాను.

సృష్టి స్థితులకు ఆకరమైన జీవచైతన్యం అగోచరంగా ఉంది. దానిని తెలుసుకోవాలన్న తపన ఎక్కువైంది. మూలాల్లోకి వెళ్లాలి. పైపై మెరమెచ్చులతో తృప్తిపడకూడదు. అలాంటి ప్రయత్నం ముసలితనంలో చేసి ప్రయోజనం లేదు. ఒక జీవితకాలంలో సాధ్యమో కాదో నాకు తెలియదు. ఇది సరైన వయసు. ఇంకా చాలా సంవత్సరాలు కష్టపడవచ్చు. సాధించగలనన్న విశ్వాసం ఉంది. పట్టుదల, శక్తి, ఆరోగ్యం పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం నిజాయితీగా అంకితం అయితే చాలు. అన్ని విధాల అనుకూలమైన వయస్సు ఇది. ఏదైనా వయసులో చేయడం మంచిది. ముసలితనం వచ్చేవరకు ఆలోచనతోనే గడుపుతారు చాలా మంది. రవంత ప్రయత్నం చేయరు.

ఉద్యమించాను. ఇంకా వయసు చేజారిపోలేదు. నిరాశ అవసరం లేదు. వివాహబంధం, సంసారబంధం ఎటుగూడి లేవు. కీర్తికోసం ప్రాకులాడడం లేదు. ప్రపంచానికి దూరం కావడం సులభం. తెంచుకోవలసిన బంధాలు లేవు. పెంచుకోకుండా ఉంటే చాలు. మనిషికి బుద్ధి, వివేకం విడివిడిగా పనిచేస్తాయి. దేని కదలికలు దానివి. దేని వ్యవహారం, తీరు తెన్నులు దానివి. అవి మనల్ని సవ్యంగా చూడనీయవు. మనలోతులకు వెళ్లనీయవు. అహంకారంతో మనమే జీవిత సత్యాన్ని చూడం. ముందు అహంకారం వదిలించుకోవాలి. ఆధ్యాత్మిక రంగంలో అహంకారం మొదటి ప్రతిబంధం. జీవితాన్ని నగ్నంగా దర్శించాలి. అప్పుడే ఆత్మవైపు సాగడం జరుగుతుంది. ఆ తర్వాత జీవశక్తి మనల్ని నడుపుతుంది. దానిని తెలుసుకుని, దానికి సరెండర్ కావాలి. ఆ పని మనం చేయాలి.

మన మేధస్సు చాలా శక్తి గలది. కాని గతంలో చిక్కుబడి ఉంటుంది.

కుంచించుకుపోయి ఉంటుంది. సరికొత్త భావాలకు అవకాశం ఇవ్వదు. తాను ఆర్జించిన జ్ఞానమే గొప్ప, సర్వం అనుకుంటుంది. నా పరిస్థితి వేరు. ఇంతకాలం సంపాదించిన జ్ఞానం నాకు ఏ మాత్రం ఉపయోగించదు. నా ప్రయత్నానికి సహకరించదు. సమాజం, సంప్రదాయం, మతం, చాదస్తం నాకు నచ్చవు. సంప్రదాయాన్ని త్రోసిరాజంటే తప్ప మనం మన ఇష్టం వచ్చిన రీతిలో జీవించలేం. సాధన చేయలేం. మన విధానమేదో మనమే నిర్ణయించుకునే స్వేచ్ఛ మనకుంది. పాతలో కూరుకుపోతే పైకి రావడం అసంభవం. 'స్వేచ్ఛ' అంటే సంప్రదాయాన్ని పూర్తిగా కాదనడం, కొత్తని ఆహ్వానించడం. నిజానికి రెండూ బానిసత్వ లక్షణాలే, అస్వతంత్రాలే. ఆచారానికి, సంప్రదాయానికి తలవంచడం లాంటిదే కొత్తకి తలవంచడం. గత కాలపు అనుభవాలు మన ఆనవాళ్లు కారాదు. అవి మార్గదర్శకాలు కారాదు. పాతవి వదిలితే పునాదులు కదులుతాయని భయం. మన వ్యక్తిత్వం పోతుందని పిరికితనం.

పరిపరి విధాల మనసు ఆలోచించసాగింది. వేదాంతం దండగ. అది నిరుపయోగ జ్ఞానం. సుఖజీవనం అనవసరం. అనుభవించే భోగాలకు సుఖాలకు ఎప్పటికీ తృప్తి ఉండదు. కీర్తి ప్రతిష్టలు పైపై ఆకర్షణలు. అవి కాలానికి నిలిచేవి కావు. నా మనసు కలలు కనడం మానింది. నా పైన, భావాల పైన మనసు పెత్తనం లేకుండా శూన్యం కాసాగాను. అయినా నా మార్గం ఏది? ఎటు పోవాలి? అడుగు ఎటు వేయాలి?

ఈ నా స్పందన, భావ విప్లవం పాక్షికం కాదు, తాత్కాలికం కాదు, అసమగ్రం కాదు. అది నా సంపూర్ణ అవగాహన. నేను ఎన్నుకున్న మార్గం. నేను పూర్తిగా సమర్పణ కావాలి. మునిగిపోవాలి, ఫలితం కలగాలంటే ఆలోచిస్తూ కూర్చుంటే, రకరకాల వ్యాపకాలు పెట్టుకుంటే, జీవశక్తి తరిగిపోతుంది. ఏకాగ్రత కుదరదు. అంతర్ముఖం కాలేను. ఆత్మలో పూర్తిగా లయం కావాలి. ఆత్మకు అంకితం కావాలి. సరెండర్ కావాలి!

అలా శక్తినంతా కూడగట్టుకోగలనా అని సందేహం. మనస్సు నాకు సహకరిస్తుందా? నేను కోరినట్లు చేస్తుందా? లేక మనపైన పెత్తనం చేస్తుంటే మనం ఎంత నిజాయితీగా ఉన్నా, మనసు మనల్ని గమ్యం చేరనివ్వదు. అది దాని నైజం. కనుక మనస్సును ఏమార్చడం కుదురుతుందా? జయించాలా? మనసు జోక్యం లేకుండా చేయడానికి చీకటిలో ప్రయాణించాలా? వెలుగులో పయనించాలా? మసక చీకటిలో నడవాలా?

నాలో ఇంత ఘర్షణకు కారణం తమ్ముడి పెళ్లి కావడం. ఇప్పుడు కుటుంబానికి నా అవసరం అంతగా లేదు. చిన్నవాళ్ల బాధ్యతలు తీరాయి. తమ్ముడు ఎలాగోలా వ్యాపారం చేసుకోగలడు. అమ్మను పోషించగలడు. బాధల్ని దిగమింగి నా మార్గం నేను ఎన్నుకున్నాను. నా లక్ష్యసాధనకోసం సంపదలు వదులుకున్నాను. పరువు, గౌరవం పక్కలకు నెట్టివేశాను. అన్వేషణ సాగింది. అగోచర సీమల్లోకి ప్రయాణం మొదలైంది.

నా సజ్జన్‌ఘడ్ రాకకు పూర్వరంగం అది. నేను ఒంటరిగా ప్రశాంతంగా ఉండాలని పట్టు బట్టింది అందుకోసం. నేను అనుకున్నట్లు ఒంటరిగా, రాత్రింబవళ్లు నా అన్వేషణ సాగింది. ఆ చిన్న కుటీరంలో నా అంతర్యాత్ర ప్రారంభించాను. హృదయ కుహరంలోకి నిరాటంకంగా చొచ్చుకు పోగలిగాను. నా అంతరాత్మకు పూర్తిగా సరెండర్ అయినాను. నియమంగా జీవించాను. సంయమనం పాటించాను. నాకు సత్యదర్శనం అయింది. అదే ఆత్మదర్శనం అయి ఉండవచ్చు. తేడా తెలియదు. అది దివ్యానుభవం. అది శక్తి విస్ఫోటనం".

★ ★ ★

నా కథను అక్కడి సన్యాసులు శ్రద్ధగా విన్నారు. తమ గతాన్ని నా గతంతో పోల్చుకుని ఉంటారు. నేనన్నాను –

"మీ ప్రతి ఒక్కరికీ నేను రుణపడి ఉన్నాను. నా కృతజ్ఞతలు. మీ అందరి మంచి మనసు, ఇక్కడి ప్రశాంత వాతావరణం, పవిత్రత నా దివ్యావిష్కారాన్ని సుగమం చేశాయని నా విశ్వాసం".

అందరి వద్ద సెలవు తీసుకుని బయలుదేరాను. ఒకతను సామాను బస్టాండుకు తెస్తానని వచ్చాడు. ఎవరినీ కష్టపెట్టడం నాకిష్టం లేదు. 'థాంక్స్' చెప్పి వద్దన్నాను. అలా సజ్జన్‌ఘడ్‌కు వీడ్కోలు చెప్పాను.

ఏడు మాసాల క్రితం ఈ కాలిబాటపైన ఎక్కలేక, బరువు మోయలేక ఆగుతూ, అలసట తీర్చుకుంటూ కొండపైకి వెళ్లాను. అప్పుడు నా గత జీవిత స్మృతుల్ని క్రిందనే వదిలేశాను. ఇప్పుడు నాలో భయాలు, బంధాలు, ఆచారాలు అన్నీ పోయాయి.

ఆనాటికీ, నేటికీ ఎంత తేడా! ఇప్పుడు నా వెంట ఉన్నది – నా అనుభవం ఒక్కటే. అది దివ్యానందం. అది దివ్యపరిమళం. తరగనిది, ఎవరూ తస్కరించ లేనిది. అమ్మను చూడాలి. బంధుమిత్రుల్ని పలకరించాలి. నాది పునర్జన్మ. నా ప్రశాంతిని నాలో భద్రంగా దాచుకుని ముందుకు సాగాను.



8. ఏకాంతం నుండి సమాజంలోకి

ముంబయ్ చేరిన వెంటనే సరాసరి ఇంటికి చేరుకున్నాను. త్రోవలో రకరకాల ఉద్వేగాలు, స్పందనలు. ఏడు నెలల విరామం, ఎడబాటు తర్వాత అయినా అనుకున్నది సాధించానన్న ఆనందం, తృప్తి నాలో. శాంతిగా ఉంది. దీర్ఘకాలం విరామం తర్వాత అయినవారందరినీ చూడాలన్న ఆవేగం.

నన్ను చూడగానే అమ్మ గట్టిగా నిట్టూర్చింది ... తిరిగి వచ్చినందుకు ఆనందంతో. అమ్మ నోటివెంట మాట రాలేదు. కళ్లలో ఆనందం కనిపించింది. చిన్న పిల్లవాడిలా వెళ్లి అమ్మ ఒడిలో వాలిపోవాలనిపించింది. అమ్మను గట్టిగా కౌగిలించుకున్నాను. ఆ ప్రేమ స్పర్శ చాలు ... తల్లికి బిడ్డకు మధ్య కోటి కథలు చెప్పడానికి, కోటి అనురాగాలు పుట్టించడానికి. చాలా సేపు నాకు మాట రాలేదు. తర్వాత అమ్మ ఏడ్చింది. కళ్ల వెంట ఆనంద బాష్పాలు రాలాయి. చేతులతో నా బుగ్గలు నిమిరింది. తమ్ముడు, చెల్లెళ్లు పరుగున వచ్చారు. అందరిలో ఆనందం ఉరకలు వేస్తోంది. ఆ రోజు ఇంట్లో గొప్ప పండుగ.

నేను శాశ్వతంగా ఉండిపోవటానికే వచ్చాననుకుంది పిచ్చి అమ్మ. నా కోసం గది శుభ్రం చేయించింది. చకచక అన్ని ఏర్పాట్లు జరిగాయి.

"లేదమ్మా! నేను తిరిగి వెళ్లిపోతాను" అనగానే కంగారు పడ్డది. ఏడవ సాగింది. అమ్మను ఓదార్చడం నావల్ల కాలేదు.

"నేను బాగున్నాను తల్లీ! నీకు దిగులెందుకు. నన్ను చూచి సంతోషించు. నీవు నన్ను గురించి గర్వపడాలి. నాకీ ఆధ్యాత్మిక జీవనం బాగుంది".

నేను తిరిగి వచ్చింది అమ్మకు నా అనుభవాలు వివరించి చెప్పాలని. ఆమెకు నా సాహసం అర్థం కాదు. దాని ప్రత్యేకత ఆమెకు తెలియదు. ఆమె సగటు తల్లి. బిడ్డల మీద ప్రేమ తప్ప మరేమీ తెలియని తల్లి. ఆమె బెంగ నా ఆరోగ్యం గురించి, నా బాగు గురించి.

"దూరంగా ఉండి ఎట్లా బ్రతుకుతావు? సంపాదన లేకుండా!"

డబ్బు, దర్పం, యావ ఏవీ లేకుండా సుఖంగా బ్రతకవచ్చునని చెప్పినా ఆమె నమ్మదు.

"అమ్మా, నేను బాగుండడం కదా నీకు కావలసింది. నాకు ఏలోటు రానివ్వను" అని హామీ యిచ్చాను.

అమ్మ అసలు బెంగ నేను ఒక ఇంటివాడిని కాలేదని. అందరిలాగా పెళ్లి చేసుకుని పిల్లల్ని కనాలి. ఇంటిపట్టున ఉండాలి. నేను ఏం చేసినా చేయకపోయినా తన కళ్ళముందు కనిపిస్తుంటే చాలట. నేనన్నాను –

"అమ్మా, నాకు ఇల్లు, ఇల్లాలు, సంసారం, పిల్లలు అవసరం లేదు. జీవితాన్ని కట్రాయికి కట్టి నేనుండలేను. నేను స్వేచ్ఛా జీవిని. స్వతంత్రంగా జీవిస్తాను. నా గురించి ఆలోచించి బెంగపడవద్దు."

నా మొండితనానికి విరుగుడుగా ఆమె ఓ ఉపాయం చెప్పింది. "అందరితో కలిసి ఉండడం ఇష్టం లేకపోతే చెప్పు. నీకోసం ఒక ప్రత్యేక ఇల్లు కట్టిస్తాం. కాని నన్నుమాత్రం విడిచి వెళ్లవద్దు."

"అమ్మా! జీవితంలో నా మార్గం వేరు. ఇక నేను ఎవరితో కలిసి ఉండను. దయచేసి నన్ను ఆపకండి".

అమ్మ ఏడిచి గోలచేసింది. ఏమైనా వెళ్లనివ్వనని పట్టుబట్టింది.

"చూడమ్మా! నీకు దేవుడిపైన నమ్మకం వుంది కదా! ఆ దేవుడు నీకు ఇద్దరు కొడుకుల్ని యిచ్చాడు. ఎందుకు నీకంత స్వార్థం. ఇద్దరినీ నీతోనే ఉంచుకోవాలనుకోవడం స్వార్థం. ఒకరిని ఆ దేవుడి పనికి వదలకూడదా! నీ త్యాగానికి భగవంతుడు మెచ్చుకుంటాడు గదా."

ఆ మాటతో అమ్మ గర్వంగా నావైపు చూచింది. నా చెంప మీద మెత్తగా ఒక జెల్లకొట్టి ప్రేమగా అన్నది : "ఒరేయ్, ఈ అమ్మ దగ్గరా నీ తెలివి?"

అలా అనడం అమ్మలకు అలవాటు. అది అంగీకార సూచన. అది

అనురాగఝరి. తమ్ముడు, చెల్లెళ్లు ప్రయత్నించారు అమ్మకు వత్తాసుగా. నేను ఎవరి మాట వినే స్థితిలో లేనని అందరికీ అర్థమైంది.

కొన్ని రోజుల తర్వాత ముంబయ్ వెళ్లాను మిత్రుల్ని కలవడానికి, కొంతకాలం మిత్రులతో గడపాలని, అందరూ నా గురించిన వివరాలు అడిగి ఆసక్తిగా విన్నారు. వారిలో కొందరు థియోసఫిస్టులు. మిగిలిన వారు జిడ్డు కృష్ణమూర్తి అనుయాయులు, అభిమానులు. నా ధ్యానం గురించి చెప్పాను. భావాతీత ప్రజ్ఞ, అతీంద్రియ ప్రజ్ఞ, పరేంగిత ప్రజ్ఞ గురించి వివరించాను. నాలో కలిగిన శక్తి విస్ఫోటన గురించి చెప్పేసరికి అందరూ చలించారు. మాట రాలేదు ఎవరికీ. నిశ్చల ప్రశాంతి నుండి మహాశక్తి ఉద్భవిస్తుందని చెప్పాను. ఆసక్తిగా విన్నారు. నమ్మారు. కాని అనుభవం లేదు వారికి. నాపట్ల ఆరాధనగా చూచారు. రకరకాల ప్రశ్నలు వేసి, సందేహాలు తీర్చుకున్నారు.

మళ్లీ కృష్ణమూర్తితో సమాగమం

కొద్ది రోజుల్లో చెన్నైలో కృష్ణమూర్తి ప్రసంగా లున్నాయని మిత్రుడు భావే చెప్పాడు. ప్రత్యేకించి కృష్ణమూర్తిని వినాలని లేకపోయినా, ఒకసారి కలిసి నా అనుభవాలు చెప్పాలనిపించింది. ఆయన స్పందన ఎలా ఉంటుందో! ముంబయ్ నుండి చెన్నయ్‌కి ఇరవై గంటల రైలు ప్రయాణం. మంచి ఆపిల్స్ కొన్నాను బహూకరించడానికి. చెన్నయ్ రైలెక్కాను.

నేను థియోసాఫికల్ సొసైటీ మెంబర్‌ని గనుక గెస్ట్ రూం దొరకడం కష్టం కాలేదు. నాలాంటి సభ్యులకు సొసైటీలో గదులు కేటాయిస్తారు. కృష్ణాజీ మకాం వసంతవిహార్‌లో. థియోసాఫికల్ సొసైటీకి పది నిమిషాల నడక దూరం. చెన్నయ్ చేరిన మరునాడే వసంత విహార్ వెళ్లాను అపాయింట్‌మెంట్ కోసం. కృష్ణమూర్తి అసిస్టెంటు మాధవాచారి మర్నాడు ఉదయమే అపాయింట్‌మెంట్ ఏర్పాటు చేశాడు. కృష్ణాజీని ఎంతో తొందరగా కలుసుకుని నా గురించి చెప్పాలని లోపల తొందరగా ఉంది.

మర్నాడు ఉదయం పెందలకడ లేచి, స్నానం అదీ పూర్తిచేసి, తెల్లబట్టలు ధరించి, ముంబయ్ నుండి తెచ్చిన ఆపిల్స్‌తో వెళ్లాను. మాధవాచారి స్వాగతం చెప్పాడు. పళ్ల బుట్ట ఆయన కిచ్చాను. 'కొంచెం వెయిట్ చేయండి' అని చెప్పి లోపలకు వెళ్లాడు. ఇంతకాలం తర్వాత కృష్ణాజీ నన్ను గుర్తిస్తారో లేదో?

అనుకున్నాను. ఆయనకు వేలమంది అభిమానులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు. వారిలో నేను .....

అంతలో కృష్ణమూర్తి వచ్చారు. నావైపు నిదానించి చూచి, నవ్వుతూ "ఓ గడ్డం పెంచుకున్నావా?" అన్నారు.

"పెరిగింది గడ్డమే కాదు కృష్ణాజీ. గడ్డం వెనక చాలా కథ వుంది" అన్నాను.

క్షణం సేపు నావేపు లోతుగా చూచారు. ఆయనవి ఎక్స్-రే కళ్లు. చూపులతో మనసుల్ని, ఆత్మల్ని చదవగలరు. నాచేయి పట్టుకుని లోపలి గదిలోకి నడిపించారు. ఇద్దరం కార్పెట్ పైన కూర్చున్నాం.

"ఏం జరిగింది వివరంగా చెప్పు" నా చేతిని గట్టిగా నొక్కుతూ అడిగారు. 'ఎంత ఇష్టం నేనంటే' అనుకున్నాను.

"చెప్పు. చెప్పు ... డీటెయిల్డ్‌గా చెప్పు".

ఇల్లు వదిలిన దగ్గర నుండి నా కథ వివరించాను. సజ్జన్‌ఘడ్ పైన ఏకాంత సాధన, అనుభవాలు గుదిగుచ్చాను. శ్రద్ధగా విన్నారు.

"చాలా సంతోషంగా వుంది. చాలా శ్రమ పడ్డావ్" అన్నారు.



ముంబయ్‌లో జిడ్డు కృష్ణమూర్తి – నేను తీసిన ఫొటో

ఇద్దరి మధ్య కొన్ని నిమిషాల మౌనం. తర్వాత తనే అన్నారు.

“ఆ శక్తిని దాని ఇష్టం వచ్చినట్లు రానివ్వు. దానిపై వత్తిడి పెట్టవద్దు. బలవంతంగా కావాలని ప్రయత్నించవద్దు. గివ్ ఇట్ ఫ్రీడం”.

ఆ మాట చెప్పి వెంటనే విషయం మార్చి నా ఆరోగ్యం గురించి అడిగారు.

శక్తి ప్రసరణ గురించి కృష్ణాజీ అన్న మాటల ఆంతర్యం తర్వాత బోధ పడ్డది. ‘శక్తి’ని గురించి పుస్తక పరిజ్ఞానంతో నిర్ణయిస్తాం, అది తప్పు. దివ్యశక్తికి మనమే రూపకల్పన చేస్తుంటాం. దాని హద్దుల్ని, నియమాల్ని మనమే ఏర్పరుస్తాం. అది తప్పు. కావాలని, రావాలని కోరడమూ తప్పే. మన జ్ఞాపకాలలో ఆ శక్తి సమాచారం ఉంటుంది. ఆ లిమిట్స్‌లోనే ఆలోచిస్తాం, ఊహిస్తాం. మనకు అనుకూలంగా అన్వయించుకుంటాం. తనకు సంబంధం లేని శక్తి గురించి మనసు ఆలోచించి పెడుతుంది. ఒక మతం ఒక విధంగా, ఒక పుస్తకం ఒక విధంగా శక్తిని వివరిస్తుంటాయి.

ఆ శక్తిని మనం నియంత్రించకూడదన్నది కృష్ణమూర్తి అభిమతం. దానిని స్వేచ్ఛగా ప్రసరించనివ్వాలి. ఆ పని సజావుగా జరగాలంటే దానిని గమనిస్తుంటే చాలు. మన మనస్సుతో దానికి అవరోధాలు కల్పించకూడదు.

ఆ శక్తి జ్వలించినప్పుడే నాకా రహస్యం తెలిసింది. కృష్ణాజీ అభిభాషణ కూడ అదే. వారు అనుభవ పూర్వకంగా చెప్పిన మాట అది. వారిచ్చిన సందేశం నా సందేహాన్ని నివృత్తి చేసింది.

కొండమీద ఉండగా ఏం తినేవాడివని ఆరా తీశారు. ఉత్త అన్నం మాత్రం తినేవాడినని చెప్పాను. ఆయన నా చేతిని గట్టిగా పట్టుకుని “మంచి ఆహారం తీసుకోవాలి మిత్రమా! ఇప్పటికైనా గోధుమ, ప్రోటీన్సు, ఆకు కూరలు బాగా తిను. ఇక నుండి ఆకలిని చంపకు. ఉపవాసాలుండకు. బాగా తినాలి. ఆధ్యాత్మికానికి ఆరోగ్యం అవసరం.”

నేను నవ్వి అన్నాను “అన్నం మినహా మరేదీ అవసరం లేదనిపించింది. ఏకాగ్రత చెడకుండా ఉండడానికే కుటీరం ఎన్నుకున్నాను. దీక్షగా సాధన చేయాలంటే వ్యాపకాలు, పనులు పెట్టుకోకూడదు గదా! అంతరంగ పరిశీలనకే టైం చాలదు. అందుచేత మితంగా తింటూ అమితంగా సాధనచేస్తూ, నిరాడంబరంగా జీవించాను. ఇకపైన పస్తులుండవలసిన అవసరం రాకపోవచ్చు లెండి!”

ఇంకా నేనున్న కుటీరం గురించి, పరిసరాల గురించి వివరాలు అడిగారు. అకస్మాత్తుగా “మీ అమ్మగారిని చూచావా?” అని ప్రశ్నించారు.


వెళ్లి చూచి వచ్చానని చెప్పాను. అరగంట గడిచింది. నాకు కేటాయించిన సమయం అరగంట. బయట అభిమానులు నిరీక్షిస్తున్నారు. లేచి నమస్కారం చేశాను : "కృష్ణాజీ థాంక్స్. థాంక్యూ సోమచ్."

అంటూ చేతులు చాచాను. ఆయన స్పర్శ కావాలి. ఆయన 'సరే' నన్నట్లు నన్ను గట్టిగా కౌగిలించుకున్నారు ఆత్మీయంగా, పారవశ్యంగా. ఆయన మొహంలో గొప్పకాంతి. అది నాకు విజయశాంతి. అది నా జీవితంలో మరపురాని మధుర సంఘటన.

చెన్నయ్ నుండి ముంబయ్ వచ్చి పదిహేను రోజులు గడిపాను. మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపొమ్మని అంతరుద్బోధ. ఈ జనం మధ్య కుటుంబంతో కలిసి ఉండలేను. నేను స్వేచ్ఛా జీవిని. ఎవరి ఆంక్షలు, అనుబంధాలు నాకు అవసరం లేదు. సజ్జన్‌ఘడ్ లాంటి మరొక ప్రదేశం కావాలి. పైగా అది వేసవి కాలం. ముంబయ్‌లో ఉండడం కష్టం. పర్వత జీవనం అలవాటు పడ్డవాడిని. ఏకాంత జీవనం కోరేవాడిని. నగరంలో ఉండలేను. పంచగని కళ్లలో మెరిసింది. అది వేసవి విడిది. ఎప్పుడో ఒకసారి వెళ్లాను అక్కడికి.

ఈసారి అమ్మ అనుమతితోనే బయలుదేరాను. తనే ఒక దుప్పటి, ఒక స్టవ్, అవసరమైన వస్తువులు తెప్పించి సర్దింది. కాస్త సామాగ్రి ఎక్కువగానే ఉంది. నేను వెళ్లడం మాత్రం అమ్మకు లోలోపల ఇష్టం లేదు. నేను మారనని తెలుసు. అయినా ఆ మార్పు విలువ ఆమెకు తెలియదు. ఆధ్యాత్మికతత్వం అందరికీ అర్థం కాదు. శుష్క వేదాంతంగా భావిస్తారు. ఏదో తన కొడుకు బావుంటే చాలు. బాగుపడితే అదే పదివేలు. అమ్మలంతా అలాగే ఆలోచిస్తారేమో. నేనన్నాను "ఈసారి మరీ అంత అజ్ఞాతంలోకి పోనులే. నన్ను చూడాలనిపిస్తే కబురుచెయ్ వస్తుంటాను".

అమ్మ సంతోషించింది. ఈసారి అమ్మ అంగీకారంతో, ఆశీస్సులతో బయలు దేరాను. మహర్షికైనా అమ్మ దీవెన, అనురాగం అవసరం.





9. గుహాంతర నివాసం

ముంబయ్ నుండి పంచగని వైపు ప్రస్థానం.

పూనేకు 120 కిలో మీటర్ల దూరం భిలార్. అది పర్వతాలపైన ఒక కుగ్రామం. ఊరికి అల్లంత దూరాన నా మిత్రుడు డా॥ సావంత్ కొక వ్యవసాయ క్షేత్రం ఉంది. అతనితో కలిసి రెండు రోజులు గడిపాను. నేను ఉండదలచింది ఏకాంతంగా, ఒకరితో కలిసి కాదు. తన ఇంట్లోనే ఉండమని అతను బలవంతం చేశాడు. ఉండ నన్నాను. ప్రక్క గ్రామంలో తన స్నేహితుడికి ఒక చక్కని బంగ్లా వుంది. అక్కడ ఉండే ఏర్పాటు చేస్తానన్నాడు. నాకు కుటుంబంతో కలిసి ఉండడం కుదరదన్నాను. అయితే కొద్ది రోజులు ఉండడానికి అంగీకరించాను. నెమ్మదిగా గ్రామం వెలుపల ఏకాంతవాసం అన్వేషించాలి.

ఒకరోజున బయట తిరుగుతుండగా గ్రామస్థులు పర్వతాలపైన అడవిలో ఒక గుహ ఉన్నట్లు వార్త అందించారు. వెంటనే అక్కడికి వెళ్లి చూచాను. చాలా బావుంది. సాధనకు అనుకూలంగా ఉంటుంది. గుహలో ఎవరూ ఉండని కారణంగా ముళ్ల పొదలు, రాళ్లు రప్పలు చిందర వందరగా ఉన్నాయి. ఇరవై, ముప్పయ్ అడుగుల విస్తీర్ణం ఉంటుంది. మిత్రుడు గణపత్ సావంత్ కొందరు కుర్రవాళ్ల సాయంతో ఆ గుహను శుభ్రం చేసి పెట్టాడు. ఇప్పుడు గుహ నివాస యోగ్యంగా ఉంది.

ముచ్చటగా ముస్తాబై, రా రమ్మని ఆహ్వానిస్తున్నది. గుహ లోపల వెచ్చగా, హాయిగా ఉంది. కొద్ది దూరంలో ఒక శిథిలాలయం ఉంది. దేవాలయం దాపున ఓ సెలయేరు. చిన్న జలపాతం. పర్వతం పై నుండి క్రిందికి పడే జలధార, స్వచ్ఛమైన నీరు. మొత్తం మీద వాతావరణం రమణీయంగా ఉంది. పర్వత

దృశ్యాలు బావున్నాయి. గుహ గ్రామానికి రెండు మైళ్ల దూరం. తీరైన బాట లేదు. కనుక ఎవరూ అటువైపు వచ్చే అవకాశం లేదు. అవసరమూ ఉండదు. నిర్జన ప్రదేశం.

నేను ఆ గుహలో ఉండబోతున్న విషయం తెలిసి గ్రామస్థులు భయపడ్డారు. నన్ను భయపెట్టారు. అది ప్రమాదమని, ఒంటరిగా ఉండకూడదని హెచ్చరించారు. నాకు ఎలాంటి ప్రమాదం జరగదని హామీ యిచ్చాను. నచ్చ చెప్పాను. నా ఆంతర్యం ఎరిగిన మిత్రుడు సావంత్ వారించలేదు. గోధుమ కంకులు, బియ్యం పంపే ఏర్పాటు చేశాడు. గుహ లోపల నెగడు వేస్తే పురుగులు, దోమలు రావని గ్రామస్థులు సూచించారు. గుహలోపల ఒక కుంపటిని సిద్ధం చేశాను. ఎండు కట్టెలు, ఆకులు వేసి మంట చేసేవాడిని. దాని మీదనే వంటా, వార్పూ. అన్నం, పప్పు వండుకునేవాడిని. అలా అగ్ని రగిల్చి, రాత్రింబవళ్లు నిప్పును చూస్తూ కూర్చోవడం అలవాటైంది. గణపత్ అనే కుర్రాడు కట్టెలు తెచ్చి పెడుతుండేవాడు.

గుహకు సెలయేరు 400 మీటర్ల దూరం. రోజూ వెళ్లి అక్కడ స్నానం చేసి, వాడుకోడానికి నీళ్లు తెచ్చుకుంటాను. గ్రామస్థులు తరచుగా కాయగూరలు తెచ్చి పెట్టేవారు. గోధుమ, బియ్యం, పప్పులు తెచ్చేవారు. అప్పుడప్పుడు పాలు తెచ్చేవారు. క్రమంగా భిలార్ గ్రామం వారితో పరిచయం ఏర్పడ్డది. ఇదివరకు ఎవరి పొత్తు గిట్టేది కాదు. ఇప్పుడు అందరితో మాట్లాడుతున్నాను. ఎవరెవరో వచ్చి కూర్చుని గంటల కొద్దీ కబుర్లు చెపుతారు. వారంతా మంచివారు, అమాయకులు. నా తపస్సు వారికి అర్థం కాదు. నా తపనకు అర్థం వారికి తెలియదు. నేను స్వామినని చెప్పుకునేవారు.

అయితే, నేను పుస్తకాలు చదవను, భజనలు చేయను, పాటలు పాడను. ఇంక పూజ ఏమిటని ఆరాలు తీశారు. వాళ్లకు అర్థమయ్యే భాషలో, స్థాయిలో వివరించేవాణ్ణి.

"ఇది కొత్త పద్ధతి. మన లోపలకు వెళ్లే పద్ధతి. లోపలకు వెళ్లి అక్కడ ఏమున్నదో చూచే పద్ధతి. మన భగవంతుడు మన లోపలనే ఉంటాడు. వెతుక్కుంటే లోపలే కనిపిస్తాడు. నిజానికి పనుల్లో పడి మనమే భగవంతుణ్ణి మరచిపోతాం.

"ప్రతి మనిషి లోపల ఒక గుహ ఉంటుంది. కొండల్లో ఉన్న ఈ గుహ లాంటిది. ఆ గుహ లోపల అసలు దేవుడుంటాడు. మనం మనస్సుతో వెతుకుతాం. ఒక విగ్రహంలో వెతుకుతాం. అట్లా కాక మన లోపల గుహలో వున్న అసలైన భగవంతుని ఆచూకీ తెలుసు కోవాలంటే ఇట్లా నాలాగా వెతకాలి. ఏ ఆలోచన లేకుండా, ఏ పని లేకుండా, నిశ్చలంగా, ప్రశాంతంగా కూర్చుని లోపల వెతకాలి. ఏ టైంలో నైనా ఆ పని చేయవచ్చు. నేను అలా అన్వేషిస్తున్నాను."

ఆ గ్రామస్థులకు నిత్యం కష్టపడి పనులు చేయడం మాత్రమే తెలుసు.

పంచగని పేరుబడ్డ విహార యాత్రాస్థలం. చాలా మంది వస్తుంటారు. విదేశీయులు ప్రకృతిని దర్శించడానికి వస్తుంటారు. అప్పట్లో హిప్పీలు వచ్చేవారు. కొండ కోనల్లో, గుహల్లో పెద్ద ఋషులుంటారని వారి నమ్మకం. రుషుల కోసం, యోగుల కోసం గాలించేవారు. ఒకనాడు, అకస్మాత్తుగా ఒక హిప్పీ నా గుహలో ప్రత్యక్షమైనాడు. అతను యోగుల్ని అన్వేషిస్తూ చాలా చోట్ల తిరిగాడట. ఇక్కడ గుహలో ఒక యోగి ఉన్నాడని ఎవరో చెప్పారట. నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. అతను కాస్త మంచి హిప్పీ అనిపించాడు. వికారంగా లేడు. స్నేహంగా మాట్లాడాడు. నా గురించి చాలాచాలా ప్రశ్నించాడు. ఇట్లా అందరికీ దూరంగా ఉండడం ఎందుకని అడిగాడు. అయిష్టంగానే నా అనుభవాలు కొన్ని చెప్పాను. నా అభిప్రాయాలు, అనుభవాలు అతనికి అర్థమయ్యే రీతిలో ఇంగ్లీషులో చెప్పలేక పోయాను. నాతో కలిసి తినేవాడు. ఉదయం గ్రామానికి వెళ్లి బ్రెడ్లు, ఇతర తినుబండారాలు తెచ్చేవాడు. రెండు వారాలు నాతో ఉన్నాడు. అతని ఆసక్తి నా ఒంటరి జీవితం, యోగానుభవాలు గురించి.

హిప్పీ తృప్తిగా వెళ్లాడు. వెళ్లే ముందు తను తెచ్చుకున్న 'హమ్మక్' నా కిచ్చి వెళ్లాడు. తర్వాత రాత్రిళ్లు నేను దాన్లో పడుకునే వాడిని. క్రింద పడుకోవడం కన్న హమ్మక్‌లో పడుకోవడం ప్రమాద రహితం. దాన్లో పడుకుంటే ఊయల ఊగుతున్నట్లు హాయిగా ఉంటుంది.

సజ్జన్‌ఘడ్‌లో నాలో శక్తి విస్ఫోటనం తర్వాత, నిరంతర శక్తిపాతం, చైతన్య ప్రసరణ జరుగుతోంది. ముంబయ్‌లో ఉన్నపుడు, చెన్నయ్ వెళ్లినపుడు శక్తి ప్రసరణ జరగలేదు. జరిగినా నా మనస్సు వేరే విషయాలపైన ఉండడం వల్ల గమనించలేక పోయి ఉంటాను. ఈ గుహకు వచ్చిన తర్వాత శక్తిపాతం ఉధృతమైంది. ప్రస్ఫుటంగా తెలుస్తోంది. నిజానికి ఇక్కడ సాధన తక్కువే. నిర్దిష్ట కార్యక్రమం లేదు. అయితే స్వేచ్ఛ, ఆనందం. ఎలాంటి ఒత్తిడి నాపైన ఉండడం లేదు.

ఇప్పుడు మరలా ఆ చైతన్యం నాలో పొంగులెత్తుతోంది. ఎక్కువ కాలం ధ్యానంలో గడపవలసి వస్తోంది. ధ్యానం పెరిగిన కొద్దీ అంతరంగ శాంతి పెరుగుతోంది. ఆశించక పోయినా జరుగుతోంది సహజంగా. అది సహజ యోగక్రియ అయింది. నేను ఫలానా ధ్యానం, ఫలానా యోగం చేయాలని అనుకోను. శక్తి చాలనం దానంతట అదే కలుగుతోంది. నేను దాని దిశను, దశను మార్చడానికి ప్రయత్నించను. కావాలని కోరను. వద్దని అనుకోను. క్రింది నుండి పైకి, పైనుండి క్రిందికి దానిష్టం వచ్చినట్లు ప్రవహిస్తుంది. ఆ గమనం తెలుస్తుంది. గమనించడం ఒక్కటే నా పని. అది మాయమైనా బెంగపడను.

మనసు ఆలోచించడం ఎప్పుడో విరమించి, విశ్రమిస్తోంది. ఆలోచించేది వంట గురించి, నిత్యకృత్యాల గురించి మాత్రమే. దానికి లోతుగా ఆలోచించాల్సిన పని ఉండదు కనుక శ్రమ అనిపించదు. శక్తిపాతం నాటకీయంగా జరుగుతుంది. ఒక్కోసారి ఆనందం అనిపిస్తుంది. ఒక్కోసారి దుఃఖం పొంగి వస్తుంది. ఒత్తిడికి, వేగానికి తట్టుకోలేక ఏడ్చేస్తాను. దిగులుపడుతుంటాను. అలాంటప్పుడు పిచ్చి పట్టినట్లు బయట తిరుగుతాను. నా గుహకు ఎగువన విశాలంగా ఉంటుంది. అక్కడకు వెళ్లి కూర్చుని ఆకాశంలోకి చూస్తాను. చుట్టూ అరణ్యం చాలా దూరం వరకు కనిపిస్తుంది. పచ్చపచ్చగా, హాయిగా ఉంటుంది. చాలా ఫలవృక్షాలు. మామిడి, జామ, రేగు. వాటికోసం పక్షులు, కోతులు, కుందేళ్లు, అడవి పందులు తిరుగుతుంటాయి. అప్పుడప్పుడు పాములు కనిపిస్తాయి. చిరుతల అడుగులు, నక్కలచాళ్లు కనిపిస్తాయి. వేటకు వెళ్లిన రోజులు జ్ఞాపకం వస్తాయి.

చుట్టూ భీకరారణ్యం. అయినా నాకు భయం లేదు. గ్రామస్థులు వచ్చి జాగ్రత్తలు చెబుతుంటారు. రాత్రి వేళల్లో బయటకు రావద్దనేవారు. గుహలో అగ్ని రగులుతుంటే జంతువులు రావట. నా గుహకు ఎప్పుడు ఏ జంతువు రాలేదు. ఒకటి, రెండు సార్లు కొండ చివరన చిరుతను చూచాను.

ఒకనాడు గుహ బయట కూర్చుని ఉండగా మునిమాపు వేళ గుహపైగా కొండమీద ఒక చిరుత కనిపించింది. నాకు దానికి మధ్య 70-80 అడుగుల దూరం. దానిని చూచి కదలకుండా కూర్చున్నాను. అదీ తీవిగా నావైపు చూచింది. తర్వాత వేరే దిక్కుకు దృష్టి మళ్లించాను. సూర్యాస్తమయం అయింది. చీకటి పడ్డది. ఇంకా అది అక్కడే ఉంది. చీకటిపడ్డ తర్వాత అది కనిపించలేదు. గుహలోకి వెళ్లి తిండి తిని 'హమ్మక్'లో దూరి నిద్రపోయాను.

గుహలో రెండు నెలల కాలం గడిచింది. మే నెలాఖరుకు ఎండలు తగ్గాయి. రుతు పవనాలు మొదలైనాయి. గుహలో ఉండడం ఏ మాత్రం మంచిది కాదని గ్రామస్థులు చెప్పారు. వర్షాకాలంలో పాములు, చిరుతల్లాంటి క్రూర మృగాలు గుహల్ని ఆశ్రయిస్తాయట. ఊళ్లోకి వచ్చి బడిలో ఉండమని, నా కోసం ఒక వెదురు గదుల పాక నిర్మిస్తామని చెప్పారు.

ఆ పర్వతాలపైన మహాబ్లేశ్వర్ పెద్ద వేసవి విడిది. చాలా మంది ధనికులు వస్తుంటారు వేసవిలో. వర్షాభారం కారణంగా వర్షాకాలంలో మూసి ఉంచుతారు. యాత్రీకులు రారు. విహార యాత్రలకు వచ్చేవారు అరుదు. డాక్టర్ సావంత్ నన్ను తన మిత్రుడు హిర్జీభాయ్ రజ్దాకు పరిచయం చేస్తానన్నాడు. నాకు అనుకూలమైన విడిది దొరుకుతుందని విశ్వాసం.

మహాబ్లేశ్వర్‌లో వర్షపాతం చాలా అధికం. నాలుగు నెలల్లో 250 అంగుళాలు నమోదవుతుంది. వేసవిలో చల్లగా ఉంటుంది. ముంబయ్, పూనేల నుండి సంపన్నులు, ఇతర రాష్ట్రాల నుండి కులీనులు వచ్చి వేసవిలో విడిది చేస్తారు. యాత్రీకుల కోసం అక్కడ పెద్ద పెద్ద బంగళాలు, రెస్టారెంట్లు ఉన్నాయి.

రజ్దాకు అక్కడొక పాత బంగళా ఉంది. అందులో తేనె టీగల పరిశ్రమ సాగుతుంది. వర్షాకాలంలో ఆ వ్యాపారం సాగదని, నాలుగైదు నెలల పాటు ఉండవచ్చని చెప్పాడు. బంగళాలో మూడు గదులు, ఒక పెద్ద హాలు ఉన్నాయి. బాత్‌రూం, టాయిలెట్స్ ఉన్నాయి. రజ్దా దయతో ఆ బంగ్లా నా పరం చేశాడు వర్షాకాలం వాడుకొమ్మని.

నన్ను కలవడానికి ఎవరూ రాకూడదని, ఒంటరిగా ఉండనివ్వాలని నిబంధన పెట్టాను. ఆ మేరకు డాక్టర్ సావంత్ హామీ యిచ్చాడు. నాలుగు నెలల పాటు అటుగా ఎవరూ రారు. అంతా నా ఇష్టం. డా. సావంత్, రజ్దాలు పంచగనిలోని వారికి నన్ను కనిపెట్టి ఉండమని రహస్యంగా చెప్పారు. అలా వర్షాకాలం నాలుగు నెలలు నాకు వసతి సమస్య లేకుండా పరిష్కారమైంది.

అక్కడ ఉన్న కాలంలో అప్పుడప్పుడు డా. సావంత్ వచ్చేవాడు. వస్తూ గోధుమ, ఆలూ, ఉర్లగడ్డలు, ఉల్లిపాయలు, వెచ్చాలు తెచ్చేవాడు. ఉల్లి, అల్లం వాడితే ఒంట్లో వేడి పుడుతుంది. గది చల్లగా ఉండేది. రజ్దా రగ్గులు, బొగ్గుల కుంపటి పంపాడు. వర్షపు నీటితో వంట, స్నానం, తాగడానికి. ఆయనే గోధుమలు, తేనె పంపేవాడు. నా ఆహారం అన్నం నుండి గోధుమకు మారింది. బియ్యం వండుకోవడం తేలిక. చలికి గోధుమ మంచిది. చపాతీలు, తేనె, చిక్కుళ్లు నా ఆహారం.

బయట జోరున వర్షం కురుస్తున్నా, లోపల చలి వేస్తున్నా నా సాధన ఆగేది కాదు. గమనిక, అంతరంగ యాత్ర ఆనందంగా ఉండేది. నిరంతరం శక్తిపాతం జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొంతసేపు రకరకాల యోగముద్రలలో ఉండేవాడిని. ఒక్కొక్క యోగముద్ర బాధాకరంగా ఉండేది. కొన్ని గంటల పాటు కదలలేక పోయేవాడిని. మామూలు స్థితికి వచ్చేవాడిని కాను. ఎక్కువకాలం ఆసనంలో ఉన్నప్పుడు అలసట కలిగేది. నేనేం చేయను? వాటిని నిరోధించడం నా వల్ల కాని పని! కావాలని కోరినవి కావు గదా. అవి శక్తిచాలనాలు. అవి వస్తే శక్తి అమితంగా తయారయ్యేది. చాలా సేపటికి ముద్రలు ఆగి, స్పృహలోకి వచ్చేవాడిని. ఎనర్జీ నార్మల్ కొచ్చేది. శ్రమ అనిపించినా, అలసట కలిగినా తర్వాత

చాలా ఉత్సాహంగా ఉండేది. ఆ ముద్రలు ఏమిటో, ఎందుకు వస్తున్నాయో నాకు తెలియదు. వాటి గురించిన పరిజ్ఞానం నాకు లేదు. శక్తిపాతం లాంటిదే ముద్రలు రావడం. లోపల ఏదో మార్పు జరగుతోందని మాత్రం తెలుస్తుంది.

వర్షాకాలం అయిపో వచ్చింది. ఆ బంగ్లాలో తేనె పరిశ్రమ మొదలవుతుంది. నేను వేరేచోటుకు మారాలి. ఈ మధ్యకాలంలో రజ్దాతో కాస్త పరిచయం పెరిగి ఆత్మీయంగా మారింది. అతనికి నా సాధన పట్ల ఆసక్తి, గౌరవం ఏర్పడ్డాయి! నేను వెళ్లిపోతాను అని చెప్పినపుడు "ఎందుకు వెళ్లడం ఇక్కడే ఉండవచ్చుగా!" అన్నాడు. ఆ తేనె కేంద్రంలో నాకొక గది కేటాయిస్తానన్నాడు. నా 'సాధన' జనం మధ్య కుదరదని చెప్పాను.

ఆ పాత ఇంటికి 200 అడుగుల దూరంలో ఒక చిన్న గది ఉంది. అందులో ఎప్పుడో తోటమాలి ఉండేవాడట. కొన్ని సంవత్సరాలుగా ఆ గది ఖాళీగా ఉంది. ఆ గదిని రాళ్లతోనే కట్టారు. పది, పదిహేను అడుగుల ప్రమాణం. ఆనుకుని ఒక వరండా. ఎవరూ నివశించని కారణంగా అది పాడుబడినట్లు ఉంది. దానిని బాగు చేయిస్తానన్నాడు.

ఆ ప్రాంతం బావుంది. అంతా అడవి. ఎర్రని నేల. పచ్చని చెట్లు. నలభై అడుగుల దూరంలో బావి. మంచినీరు. ఇల్లు జీర్ణావస్థలో ఉన్నా ఒప్పుకున్నాను. కరెంట్ లేదు. ఏ ఇతర సౌకర్యాలు లేవు ఒక్క నీటి వనరు తప్ప. ఆ గదిలోకి ప్రవేశించగానే ఒక పెద్దనాగుపాము ఒక మూలన కనిపించింది. శుభం. అది వెళ్లిపోతుందని కాస్త చప్పుడు చేశాను. అది కదలలేదు. బహుశా చాలా కాలంగా అది దానికి స్థావరం అయి వుంటుంది. నేను కొత్తగా వచ్చిన అతిథిని. మొదటి రోజు రాత్రి వరండాలో పడుకున్నాను. భోజనం అయిన తర్వాత రజ్దా యిచ్చిన రగ్గు పక్కవేశాను. ఆ రాత్రి నా నిద్ర వరండాలో.

సర్పభయం లేకుండా నిద్రపోగలిగాను. ఉదయం లేచి చూస్తే ఆ నాగ సర్పం లోపల లేదు. ఎప్పుడో వెళ్లిపోయి ఉంటుంది నన్ను కరుణించి. వెంటనే గది శుభ్రం చేశాను. సామాను లోపల సర్దుకున్నాను. ఆవరణలోని చెట్ల కొమ్మలు నరికి, చిన్న మొక్కలు పీకి, అంతా వాసయోగ్యం చేశాను. అలా కష్టపడి పనిచేయడం ఆనందంగా ఉంది. శ్రమలోనూ ఆనందం లభిస్తుంది. కొత్త కుటీరంలో కొత్తజీవితం.

ప్రక్కనే బావి. కావలసినంత మంచినీరు. స్నానానికి, బట్టలు ఉతుక్కోడానికి, వంటకు నీటి కరువు లేదు. పెరడులో అల్లం, ఉల్లి వేశాను. కూరకాయ పాదులు

పెట్టాను. మొక్కలు, విత్తనాలు నాటాను. ఆకు మళ్లు వేశాను. మొత్తం నా నివాసం చుట్టూ చక్కని చిన్నతోట తయారైంది. ఈ పనులు అయింతర్వాత ధ్యానంలో పడ్డాను. రెండు, మూడు గంటలు ధ్యానం తీవ్రంగా సాగేది. మిగిలిన సమయంలో తోటపని. తీరిక లేదు. అలసట లేదు. లోపల నుండి వచ్చే శక్తికి ఉక్కిరి బిక్కిరయ్యే వాడిని. రాత్రనక, పగలనక శక్తిపాతం జరుగుతుండేది. ఒక పద్ధతీ, క్రమం అంటూ ఉండేవి కావు.

ఇంతకాలం అంతర్గతంగా ఉన్న శక్తి ప్రజ్ఞగా పరివర్తనం చెందసాగింది. దానికి కారణం నాకు తెలియదు. దివ్యత్వ ప్రసరణకు హేతువులు, కార్యకారణాలు ఉండవు. ఆ ప్రజ్ఞకు, నా వివేకానికి, మేధస్సుకు, తెలివికి సంబంధం లేదు. మనస్సు ప్రభావం వివేకంపైన పనిచేయదు. విజ్ఞతకు ప్రజ్ఞకు సంబంధం లేదు. నాలో ముందర కలిగింది ఇంద్రియ ప్రజ్ఞ. తర్వాత అదే అతీంద్రియ ప్రజ్ఞగా మారింది. ఇంద్రియ ప్రజ్ఞపైన మనసు ప్రభావం ఉంటుంది. మనసు ముద్ర ఉంటుంది. అతీంద్రియ ప్రజ్ఞపైన మనసు నీడ కూడా పడదు. అతీంద్రియ ప్రజ్ఞ సాధకునిలో అనేక మార్పులు తెస్తుంది. శరీరం కాంతివంతమవుతుంది. చూపుల్లో కరుణ, ప్రేమ, శాంతి కనిపిస్తాయి. మనిషిలో దివ్యత్వం స్పష్టంగా తెలుస్తుంది చూచేవారికి. స్వభావం సాత్వికమవుతుంది. కోపతాపాలు, అసూయాద్వేషాలు దగ్గరకు రావు. స్వార్థం, అహంభావం కనుచూపు మేరలో కనిపించవు. అది కావాలని కోరితే వచ్చేది కాదు. అర్హతను బట్టి లభిస్తుంది. సాధనబట్టి, తీవ్రతను బట్టి పెరుగుతుంది. కోరినపుడు శక్తిపాతం జరగదు. దివ్యత్వం కలగదు. కోరనపుడు అన్నీ లభిస్తాయి. అది స్వేచ్ఛ నుండి సర్వస్వతంత్రంగా ఉద్గమిస్తుంది. ఉజ్వలిస్తుంది.

ఒక్కొక్కసారి పనులన్నీ చకచక పూర్తి చేసుకుని ధ్యానానికి కూర్చోవాలని పిస్తుంది. కారణం చెప్పలేను. లోపలి నుండి స్పందన అది. ఒత్తిడి అది. ఇంగితం కాదు పరేంగితం. అంతరుద్బోధ. అలాంటి సందర్భాలలో మనసు పనిచేయదు. శూన్యమవుతుంది లేదా ప్రక్కలకు తప్పుకుంటుంది. ఏ స్పందన తెలియదు.

శక్తిపాతం జరిగినప్పుడు భావావేశంలో కవిత్వం పొంగు కొచ్చేది. అప్పట్లో ముప్ఫయ్, నలభై కవితలల్లాను మరాటీలో. ఎంతో చక్కగా వచ్చాయి. నాకు నిజానికి కవిత్వం రాయడం రాదు. అప్పుడు రాసిన కవితలు తర్వాత కొన్ని కనిపించకుండా పోయాయి.

ఇప్పుడు నా కర్తవ్యం శక్తిప్రవాహంలో కొట్టుకుపోవడం. లోపల ఎక్కడో ఒక బిందువు వద్ద స్పందన కలుగుతుంది. అది లోపల్లోపల చాలా సేపు

తచ్చాడుతుంది. అక్కడి నుండి మరోచోటుకు కదలినట్లవుతుంది. ఎక్కడ ఎంతసేపు ఉండేదీ తెలియదు. అక్కడ వర్కింగు పూర్తి అయితే మరొక చోటుకు మారుతుందేమో. చక్కగా అనుభవిస్తూ ఆనందించడమే నా పని. భావ రహిత స్థితిలోనే శక్తి పైకి వచ్చేది. శరీరం మొత్తం ఆ శక్తితో నిండిపోయేది. గాలిలో తేలిపోతున్నట్లుండేది. నడకలో ఆ భావరహిత స్థితి. అది ఏదో మాగ్నటిక్ ఫోర్సు. దాంతో నాలో కొత్త చైతన్యం వచ్చేది. శరీరం, మేధ చాలా సున్నితంగా పనిచేయ సాగాయి. అది మహా ఉధృతంగా వచ్చిపడేది.

నా కనిపించేది ఆ ఉధృతిని, వేగాన్ని తట్టుకొనే శక్తి నా మేధకు లేదని. నా మేధస్సు, నరాశయం పూర్తిగా మారాలి. అప్పుడే ఆ దివ్యశక్తిని భరించగలను. ఇంతకాలం మనసుకు ఆలోచించడం ఒక్కటే తెలుసు. దివ్యచైతన్యం భరించే శక్తి మనసుకు ఉండేది కాదు. ఇది ప్రజ్ఞా విశేషం. మనసు ప్రజ్ఞను భరించలేదు. తన లోపల ఇముడ్చుకోలేదు. మనసు గతకాలపు జ్ఞాపకాలను తనలో భద్రపరచ గలదు.

ఆధ్యాత్మిక విభావరిలో 'ఆలోచన' పాత్ర తక్కువ. నిరుపయోగం. నిత్యకృత్యాలకు మాత్రమే ఆలోచన. అందుకు బుర్ర ఉపయోగించాల్సిన పని ఉండదు. అనాలోచితంగా, అన్నీ అలవాటు ప్రకారం జరిగే పనులే. నాడీ మండలం దివ్యత్వాన్ని, ప్రజ్ఞను నిలుపుకునే స్థితిలో ఉండదు. కొన్ని మార్పులు చేస్తే కొంత ప్రజ్ఞను స్వీకరిస్తుంది. అది అంతీంద్రియ ప్రజ్ఞ, అదీ పారవశ్యంలో అనుభూతి నిస్తుంది.

ఆధ్యాత్మిక రంగంలో మనస్సుకు ఏమీ పనిలేదు. భౌతిక, నరాశయ ప్రయత్నాలు నిష్ఫలమవుతాయి. మనసు భజనలతో, ఆటపాటలతో, మంత్ర జపంతో తృప్తిపడుతుంది. అవి ఎన్ని చేసినా 'ఆత్మ' ద్వారాలు తెరుచుకోవు. పెను మార్పుకు దివ్య శక్తిచాలన అవసరం. శరీరంలోని ప్రతి అణువును ప్రభావితం చేయగలది ఆత్మశక్తి.

మహాబ్లేశ్వర్‌లో నా జీవితం సంపూర్ణంగా వికసించింది. అంతా స్వేచ్ఛ. ఆంతరిక జీవితం చాలా ప్రభాస మానమైంది. చైతన్యం పొందడమే కాక ఆత్మశక్తితో ప్రఫుల్లమైంది. అలా ప్రకృతితో తన్మయమై నిర్భయంగా, శూన్యంగా జీవించడం ఎంత హాయి.

చాలా ఎత్తయిన ప్రదేశం కావడంతో సూర్యోదయం ముందుగానే కనిపిస్తుంది. ప్రకృతి, పరిసరాలు సుప్రభాత గీతిక లాలపిస్తాయి. పక్షుల కిలకిలలు,

కువకువలు నిద్రలేపుతాయి. మనసున్న మనిషికి ప్రకృతిని మించి సౌందర్యం వేరే ఉండదనిపిస్తుంది. ఆ ఏడాది అక్టోబరు వరకు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. నవంబరులో ఆకాశం నిర్మలమైంది. కాస్తంత బయటకు వెళ్లే వీలు చిక్కింది. అప్పుడు మహాబ్లేశ్వర్ వర్షాలకి తడిసి ముద్దయింది. చలి మొదలైంది.


ఆ రోజు బాగా ఎండ కాస్తోంది. అయినా చుట్టూ పొగమంచు దట్టంగా ఆవరించింది. బావివద్ద బట్టలు ఉతికి, కుటీరానికి వచ్చి ఆరవేస్తుండగా, చిత్రమైన శబ్దం వినిపించింది. అది మంద్రస్థాయిలో ప్రారంభమై తారాస్థాయికి చేరిన రాగంలా ఉంది. బట్టలు ఆరవేసి చుట్టూ చూచాను ఏమిటో అర్థంకాక. అంతలో తేనెటీగలు గుంపుగా నా తలపైగా రివ్వున దూసుకుపోయాయి. వేలు, లక్షల సంఖ్యలో ఆకాశంలో మేఘం కమ్మినట్లు వచ్చి పడ్డాయి. నన్ను చుట్టు ముట్టాయి. ఏం చేయడానికి పాలుపోలేదు. వణికిపోయాను. తడి దుప్పటి ఒకటి దండెంపైన ఆరవేసింది లాగి, మొహం మీద, ఒంటినిండా కప్పుకున్నాను. గది లోపలకు పరుగెత్తి తలుపులు మూశాను. తలుపు సందులోంచి వాటిని గమనించాను.

ఎంత వేగంగా వచ్చాయి! ఎక్కడి నుండి వచ్చాయి? అవాక్కయ్యాను. అవి ఆకాశంలోంచి కిందికి దిగి జంబూవృక్షం మీద వాలసాగాయి. అది నేను విశ్రాంతిగా కూర్చునే చోటు. తేనె టీగలు నెమ్మదిగా ఒక కొమ్మను ఆశ్రయిస్తున్నాయి. అంతలో రజ్జా పరుగున వచ్చాడు ... ఇద్దరు పనివాళ్లతో కలిసి. నన్ను చూచి గాభరాగా 'మీకేం కాలేదు గదా' అని విచారణ చేశాడు.

'రండి ఇంక ప్రమాదం లేదు'.

తలుపులు తెరిచి బయటకొచ్చాను. వచ్చిన ముగ్గురి తలలపైన టోపీ లున్నాయి. వలలు ముసుగేసుకున్నారు. వారు ఒక టేకుతో చేసిన తేనెపట్టు పట్టుకొచ్చారు. తేనె టీగలు వాలిన చెట్టు క్రిందికి వెళ్లి ఆ పెట్టెలో రాణి ఈగను పెట్టారు. అది భ్రమర కుటుంబం. దాని చుట్టూ ఇరవై నిమిషాల్లో తేనెటీగలు చేరాయి.

ఆ తేనెపట్టు వల్ల నాకు మంచి తేనె లభించింది. ఆర్థికంగా సహాయం. ఏడాదిలో కొన్ని వందల రూపాయల రాబడి. రెండు సంవత్సరాల్లో పది తేనెపట్లు తయారైనాయి రజ్జా సాయంతో. మహాబ్లేశ్వర్ అడవుల్లో పూల మొక్కలు విస్తారంగా ఉన్నాయి. అక్కడి తేనె ప్రసిద్ధి. నేను గోధుమ, కూరగాయలు పండించాను. రోజూ అరగంట తోటపనులు. ఎక్కడి కక్కడే భగవంతుడు అందరికీ అన్నీ సమకూర్చుతుంటాడు. అది ప్రకృతి మనిషికి ప్రసాదించిన వరం.



10. అపూర్వ స్పందన

ఏడు సంవత్సరాలు కుటీరమే ఆశ్రమంగా ఆశ్రమ జీవితం గడిపాను. తేనెటీగల పెంపకంతో పాటు, కాయకూరల తోట నా కుటీర పరిశ్రమ. అంతరంగ శోధన నా సాధన. ఏడు వర్షర్తులు వెళ్లిపోయాయి. ఎందరో యాత్రీకులు, తేనె వ్యాపారులు వస్తున్నారు, పోతున్నారు. నా జీవితంలో మార్పు లేదు. అంతలో ఒక అవాంతరం వచ్చి పడ్డది. రజ్దా ఈ తేనె వ్యాపారం విరమించుకున్నాడు. ఇల్లు, తోటలు అమ్మకానికి పెట్టాడు. వాటిని కొన్నవాడు ఒక హైదరాబాదీ. పెద్ద అడ్వకేటు. పార్లమెంటు మెంబరు. పేరు దుండీరాజ్ నాయక్. రజ్దా నా గురించి చెప్పాడు. నేను అక్కడే ఉండడానికి అంగీకరించాడు. అయినా ఎంతకాలం? నాయక్ నిజంగా మంచివాడు. నా కుటీరం ఖాళీ చేయమని ఒత్తిడి చేయలేదు. అయినా మహాబ్లేశ్వర్ వచ్చిన పని పూర్తయింది. నా ధ్యానం ఒక తీరం చేరింది. నాయక్ మంచితనాన్ని నేనెందుకు ఉపయోగించుకోవాలి?!

ఏడు సంవత్సరాలైంది మహాబ్లేశ్వర్ వచ్చి. ఒకేచోట అంతకాలం గడపడం పద్ధతి కాదు. ఆ ప్రదేశంతో ఆత్మీయత పెరుగుతుంది. ఉన్న బంధాలు వదిలించుకుని వచ్చి కొత్తబంధంలో చిక్కుకోవడం ఏమిటి! 1962లో ఒకనాడు నా సామాన్లన్నీ సర్దుకున్నాను. వంట సామాగ్రి అక్కడి వారికి యిచ్చాను. మిగిలిన సామాను రెండు సంచుల్లో సరిపోయింది. అడ్వకేట్ నాయక్‌ని కలిసి, తాళం చెవి యిచ్చి, కృతజ్ఞతలు చెప్పడం మర్యాద. ఆయనకు బహూకరించడానికి కొన్ని సీసాల తేనె తీసుకున్నాను. నా పది తేనె పట్టులు 'బర్కు' అనే కుర్రాడి కిచ్చాను. ఏడేళ్లుగా నాకు సాయం చేస్తున్నది తనే. వర్షాకాలంలో ఎండు కట్టెలు తెచ్చి పెట్టేవాడు.

నాయక్ గారిని కలవడానికి హైదరాబాదు బయలుదేరాను. ఆయన ఇల్లు రాజభవన్‌లా ఉంది. పేరున్నవాడు. పైగా రాజకీయ నాయకుడు. పార్లమెంటు మెంబరు. నవాబు దర్జాతో ఉన్నాడు. నన్ను సాదరంగా ఆహ్వానించాడు. ఆయన సోదరి ప్రేమగా, ఆప్యాయంగా పలకరించింది. వారి బలవంతం మీద రెండు రోజులు వారి మహల్‌లో వారికి అతిథిగా ఉన్నాను.

నాయక్ తీరికగా ఉన్న సమయంలో వెళ్లి కలిశాను. వారి కాటేజ్ ఖాళీ చేస్తున్నానని చెప్పి బీగాలు అక్కడ పెట్టాను. థాంక్స్ చెబుతూ అన్నాను "మీ కాటేజీ నాకు ఆశ్రమం. నా సాధనకు చాలా ఉపకరించింది. అయినా ఒకేచోట ఉండి, అనుబంధాలు పెంచుకోకూడదు."

ఆయన అయిష్టంగా వాటిని అందుకుంటూ "ఎక్కడికి వెళ్లాలను కుంటున్నారు" అడిగారు.

"నాకు ప్లాన్ అంటూలేదు. మరోచోటు చూచుకుంటాను".

"మా కాటేజి వదలిపోవడం ఎందుకు?"

"మీ మంచితనాన్ని నా స్వార్థానికి ఉపయోగించుకోకూడదు గదా! ఖాళీ చేయమని అడిగేవరకు ఉండడం సభ్యత కాదు".

ఆయన నవ్వి అన్నారు "అది మీకు సౌకర్యంగానే ఉందికదా. మహాబ్లేశ్వర్ మీకు నచ్చింది. అక్కడే ఉండండి. మీవంటి వారు మా కాటేజిలో ఉండడం మాకు సంతోషం".

నేను ఆయన్ని వప్పించడానికి ప్రయత్నించాను "ఒక చోట ఎక్కువ కాలం ఉండడం ..."

ఆయన మందలింపుగా "మీ నాన్నగారే చెబుతున్నారనుకోండి. కాదన గలరా? బీగాలు తీసుకువెళ్లి ఎప్పటిలాగా ఉండండి".

నా కళ్ల వెంట నీళ్లు కారాయి ఆయన మంచితనానికి. ఆయనలో ఉన్నది ఓ పితృహృదయం. అది మందలింపు కాదు అనురాగం. ప్రేమతో వంగి ఆయన పాదాలు తాకి నమస్కరించాను: "నిజంగానే మీలో నా తండ్రిగారిని చూస్తున్నాను. మీ సహృదయానికి నా నమస్కారాలు".

ఏం చెప్పను? కాదని ఎలా అనగలను? అవి జీవితంలో మరపురాని మధుర క్షణాలు. నా గుండెను కరిగించిన క్షణాలు. నాలో ఉద్వేగం కట్టలు తెంచుకుని కన్నీరుగా ప్రవహించింది.

ఆయన ప్రేమగా అన్నారు : "బీగాలు మీ వద్దనే ఉంచుకోండి. ఏవైనా మరమ్మత్తులు, మార్పులు కావాలంటే కబురు చేయి. చేయిస్తాను".

బీగాలు తీసుకుని, వారి సోదరికి కృతజ్ఞతలు చెప్పి బయలుదేరాను. ఆ తర్వాత నాయక్‌ని కలవలేదు. ఎక్కడికైనా వెళ్లిపోవాలనుకుంటే విధి ఇక్కడికే తెచ్చి పడేసింది. దేనినీ ప్రతిఘటించడం నా పద్ధతి కాదు. వచ్చినదాన్ని అంగీకరించి ఆమోదించడమే.

బయలుదేరిన చోటుకే తిరిగి వచ్చి చేరుకున్నాను.

★ ★ ★

తర్వాత పన్నెండు సంవత్సరాలు, అంటే 1974 వరకు అదే నా ఆశ్రమం, ఆవాసం. ఏకాకిగా, స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవించాను. ఆ కాలంలో ధ్యానం అద్భుతంగా సాగింది. హృదయం లోపల వర్కింగ్ తెలిసేది. కోరినప్పుడు శక్తిపాతం జరిగేది. చైతన్యం ఉరకలు వేసేది. ఏ పని చేయవలసి వచ్చినా అదే శక్తి వినియోగపడేది. కళ్లు మూసుకుని లోపలకు తొంగిచూడడం, గమనించడమే నా పని. శక్తి ప్రసారం గమనించేవాడిని. నిరోధించడం ఎప్పుడూ జరిగేది కాదు.

ఆ శక్తి విద్యుత్ లాగా మెత్తగా, శరీరంలో ప్రవేశిస్తుండేది. అది చేరగానే ఆయా ప్రాంతాలు శక్తి పొందేవి. చైతన్యం పొందేవి. అక్కడ కావలసిన 'పని' పూర్తి కాగానే మరో చోటుకు కదిలేది. లేదంటే అంతర్ధాన మయ్యేది. ఆ వర్కింగ్ వల్ల శరీరంలో ప్రతి అణువు శక్తిని పొందేది. కొంత కాలానికి నాలో సున్నితమైన మార్పు గమనించాను. శరీరంలో, మనసులో బండతనం పోయి సున్నితత్వం అలవడింది. నేను పూర్తిగా మారేవరకు శక్తి వర్కింగ్ తెలుస్తూనే ఉంది.

అంత చిత్రమైన మార్పు జరుగుతున్నా నాకు ఎరుక ఉండేది. ప్రతి చిన్న మార్పు తెలుస్తుండేది. ప్రతీ కదలిక, ప్రతీ స్పందన, మార్పు నాకు తెలుసు. నా ఆత్మకు తెలుసు. మనసుకు తెలియకపోవచ్చు. ఇప్పుడు ఆత్మదే పైచేయి. పెత్తనం మనసుది కాదు. నాపైన మనసు పెత్తనం లేదు. అసలు ఆలోచనలు మనసులో ప్రవేశించేవి కావు. కేవలం అనుభవాలు అనుభూతులుగా మిగిలిపోయేవి. నేనుగా ఎప్పుడూ ఏ విషయం ఆలోచించను. అయినా అనుభవం ఉంటుంది. అనుభూతిస్తాను. మనసు ప్రమేయం లేకుండానే వర్కింగు సాగుతుంది. దానికి బుద్ధితో పనిలేదు. ఆలోచన అవసరం లేదు. 'ఆలోకనం' చాలు. భావం అవసరం లేదు. అది భావాతీతం. అవగాహన మిగిల్చే అనుభూతి అది.

ఆ భూమికల్లో స్పందన, అవగాహన కలిసే ఉంటాయి. అది సమయస్ఫూర్తి. అది సమ్యగవగాహన. అనుక్షణం అప్రమత్తత. సదా చైతన్యస్థితి. ఏకోన్ముఖీనత. అంతర్యామిత్వం. భయాలు, ఆందోళనలు, ఆశలు, నిరాశలు, అవరోధాలు, నిరోధాలు ఏవీ ఉండని నిరీహ స్థితి. మనస్సు సైతం శూన్యంలో పయనిస్తూ శూన్యమై అగోచరాన్ని అనుభవిస్తుంది. ఆత్మను ఆవాహన చేసుకుంటుంది. తనను ఆత్మలో లయింప చేస్తుంది. అది స్నేహవృత్తి. అంటే దివ్యజ్ఞానానికి, ప్రజ్ఞకు మనసు ప్రమేయం ఉండదన్నమాట.

ఆ విధంగా నాలో ప్రజ్ఞ ప్రభవించింది. చైతన్యం ప్రబుద్ధమైంది. మనసు, ఆలోచన అవసరం లేని కొత్త ప్రపంచం అది. అది జీవధార. సజీవ చైతన్యం. అంటే మానసిక శక్తిగా మనం అనుకునేదంతా ఆత్మశక్తిగా పరిణామం చెందుతుంది. ఘనీభవించిన మేధ అవసరమైనప్పుడు సున్నితంగా స్పందిస్తుంది. ఆత్మీయంగా అనుభూతిలో నిలుస్తుంది.

ఆలోచించే మేధస్సు ఆలోచనతోపాటు శూన్య మవుతుంది. మనసు ద్వారా తెలుసుకునే పద్ధతి పోయి, ఆత్మతో తెలుసుకోవడం జరుగుతుంది. అదే ఆత్మజ్ఞానం, సమ్యక్ అవగాహన. ఆపైన అంతా సర్వజ్ఞత్వం. నేర్చుకోవలసింది, మనస్సు పెట్టి తెలుసుకోవలసిందీ ఉండదు. విశ్వవిజ్ఞానం ప్రజ్ఞ ముందు ఆవిష్కరించ బడుతుంది. ఆలోచనల అవసరం లేకుండానే జ్ఞానం మనలోకి ప్రవహిస్తుంది. వివేకం విడిగి విప్పారుతుంది. క్రమంగా అభావం ఆత్మగా రాణిస్తుంది.

అతీతమానస స్థితిలో సర్వం సంపూర్ణంగా విదితమవుతుంది. గతంలోకి నిష్క్రమించడం, ఆలోచనలు తవ్వి తీయడం ఉండదు. అంతా సద్యస్ఫూర్తి. తెలియనిదంటూ ఉండదు. తెలుసుకోవలసిందీ ఉండదు. విశ్వప్రజ్ఞ మన దవుతుంది.

మనిషి తనను అధిగమించి పైకి పోవడానికి ఎప్పుడూ అవకాశం ఉంది. కాలాన్ని అధిగమించి, మనస్సు దాటి స్వేచ్ఛను పొందవలసిన అవసరం ఉంది. అనంత సౌందర్యాన్ని, ఆనందాన్ని స్వంతం చేసుకోవచ్చు. జీవచైతన్యం, అఖండ ప్రాణనిధి మనకు అందుబాటులో ఉంటుంది. అదే ప్రతిజీవి ఆశించే స్వేచ్ఛ. మనిషి చేరుకోవలసింది ఆ తీరాన్ని, గమ్యాన్ని.

నా అనుభవం ప్రతిరోజు దాదాపు అదే. విశ్వప్రజ్ఞను అందుకోవడం, లోకహితం కోసం విడుదల చేయడం, ఆ మహాశక్తికి వాహికగా మారడం మన పని. నా ద్వారా భగవత్కార్యం నెరవేరుతున్నదని భావించేవాడిని. అంతకు మించి

‘అది నాశక్తి’ అని ఏనాడు పొంగిపోలేదు. గర్వించలేదు. వివేకం ప్రజ్ఞతో సహకరించడం వల్ల ఆ భావం నాలో స్థిరపడ్డది. అది వివేకప్రజ్ఞ. అది ప్రజ్ఞా విశేషం.

★ ★ ★

ఆ మహాశక్తిని భరించడానికి, ఆస్వాదించడానికి పౌష్టికాహారం, నిద్ర, విశ్రాంతి చాలా అవసరం. పన్నెండు సంవత్సరాలు మహాబ్లేశ్వర్ కొండలపైన అడవిలో గడిపాను. ఎప్పుడో గాని బయటి ప్రపంచంలోకి వెళ్లింది లేదు. నా కుటీరమే నా సర్వస్వం. తేనె, తోట, వ్యవసాయం – తృప్తి అయిన జీవితం నాది. నేను కోరుకున్న ఆధ్యాత్మిక జీవనం పుష్కలంగా లభిస్తోంది.

నన్ను అభిమానించి, చూడడానికి వచ్చే వారిలో ఒక సంస్థానాధీశుడున్నాడు. పూర్వం మన దేశం నిండా స్వదేశ సంస్థానా లుండేవి. స్వాతంత్ర్యానంతరం అవి భారతదేశంలో లీనమైనాయి. అయినా మాజీ సంస్థానాధీశులు తాము ప్రభువుల మని, జమిందార్ల మని భావిస్తుంటారు. వారి భరణాలు ఎక్కువ కనుక విలాస జీవితాలు గడుపుతారు. అలాంటి వారిలో ‘భోర్’ రాజా ఒకరు. ఆయనకు విలాస జీవితంకన్న ఆధ్యాత్మిక జీవితం పైన ఇష్టం. ఆయనకు మహాబ్లేశ్వర్‌లో ఒక వేసవి విడిది ఉంది. నన్ను కలిసి వేదాంతం చర్చించేవాడు. మా పరిచయం పెరిగిన తర్వాత అమర్‌నాథ్ యాత్రకు వెళదాం రమ్మని ఆహ్వానించాడు. నాకు యాత్రలంటే ఒకప్పుడు ఆసక్తి ఉండేది. ఇప్పుడు అంతగా లేదు. హిమాలయ సౌందర్యాలు చూడాలని ఉండేది. సరేనని అంగీకరించాను.

మన దేశంలో అన్ని తీర్థయాత్రలలోకి అమర్‌నాథ్ యాత్ర మహాకష్టం, క్లిష్టతరం. గుర్రాలపైన వెళ్లాలి లేదా కాలినడకన. పదమూడు వేల అడుగుల ఎత్తున ఉంటుంది అమర్‌నాథ్. హిమాలయాల్లో ఎత్తుకు వెళ్లిన కొద్దీ ప్రాణ వాయువు తగ్గి, శ్వాస కష్టమవుతుంది. అంతా నిర్జనం. పర్వత మార్గం. మంచుతో కప్పిన బాటలు. కొండలపై నుండి మంచుగడ్డలు విరిగి పడుతుంటాయి దారికి అడ్డంగా. మామూలు జనం మంచుగడ్డలపైన నడవలేరు. చలికి తట్టుకోలేరు.

శ్రీనగర్ నుండి పహల్‌గాంవ్ వరకు ప్రయాణ సౌకర్యం ఉంది. తర్వాత పర్వత లోయల్లో మూడు రోజులు నడవాలి. రాజాసాహెబ్ వద్ద మంచి కెమెరా ఉంది. టెలిఫోటో లెన్స్‌లున్నాయి. అమర్‌నాథ్ యాత్ర నా ఫోటో కళా వైదుష్య ప్రదర్శనకు మంచి అవకాశం. హిమాలయాల అందాల్ని కెమెరాలో బంధించడంతో పాటు నాకు ఆసక్తికరమైన విషయాలు మరో రెండున్నాయి. మంచు శివలింగం

ఎట్లా ఏర్పడుతుందన్నది ఒకటి. అంత ఎత్తున ఒక గుహాలయంలో మాత్రమే నిర్దిష్ట సమయంలో ఏర్పడడానికి కారణం ఏమై ఉంటుంది? అది శివమహాత్మ్యమా? అది లింగాకారమా! పోనీ ఏర్పడిందే అనుకున్నా కొద్ది రోజుల్లో కరిగిపోతుంది. అక్కడ లింగం రూపు దిద్దుకోగానే ఇక్కడ నుండి యాత్రీకులు బయలు దేరతారు.

నా రెండవ ఆకర్షణ – జంట పావురాళ్లు. అమర్‌నాథ్ గుహపైన రెండు పావురాళ్లు సంచరిస్తాయంటారు. అవి ఎక్కడ నుండి వస్తాయో ఎవరికీ తెలియదు. ఆ ప్రాంతం అంతా నిర్మానుష్యం. ఒక్క ప్రాణీ కనిపించదు. పావురాళ్లు కాదుగదా ఎలాంటి పక్షులు బ్రతికే వీలు లేదు. అవి వస్తాయి, పోతాయి. పైగా అందరికీ కనిపించవు. పుణ్యాత్ములు మాత్రమే వాటిని చూడగలుగుతారట. అదొక మర్మం.


మేము అమర్‌నాథ్ చేరే సమయానికి వాతావరణం చక్కగా ఉంది. నాకు రెండు పావురాళ్లు కనిపించాయి. మంచుకొండలో గుహపైగా అవి ఎగురుతూ కనిపించాయి. ప్రక్కవారిని ప్రశ్నిస్తే తమకు కనిపించలేదన్నారు. వందల సంవత్సరాలుగా ఈ జంట పావురాల వింత కథ అలా సాగుతూనే ఉంది.

అమర్‌నాథ్ గుహను చేరడం చాలా కష్టమైంది. తినే పదార్థాలు తీసుకువెళ్లాం. గుంపులుగా నడిచి వెళ్లాం. నా పక్కన రాజా ఉన్నారు. ఆయన పరివారం సామాన్లు మోసి తెచ్చారు. ఎన్ని సౌకర్యాలు ఉన్నా గుహను చేరడం లింగాన్ని దర్శించడం విశేషం. ఎప్పుడు మంచు తుఫానులు వస్తాయో తెలియదు. మధ్యమధ్య ప్రవాహాలు అడ్డు వస్తుంటాయి. యాత్రీకులు దారి తప్పుతుంటారు. మంచుగడ్డలు విరిగిపడి మరణిస్తుంటారు. కాశ్మీరీ గైడ్లను తీసుకుపోవడం మంచిది. వారికి ఆప్రాంతాలు సుపరిచితాలు.

ఆగస్టులో అమర్‌నాథ్ యాత్ర. పౌర్ణమి రోజుకు గుహను చేరుకున్నాం. ఆరోజున అమరలింగం పూర్ణాకృతిలో ఉంటుంది. గుహ లోపలికి వెళ్లాం. ఎవరూ కొన్ని నిమిషాలు తప్ప ఆ లోపల ఉండలేరు. అంత చలి. గాలి ఆడదు. ఒక్కొక్కరు లోపలకు వెళ్లి దర్శనం చేసుకు వస్తారు. కొద్ది నిమిషాల దర్శనమే అనుమతిస్తారు. పూలు, పండ్లు సమర్పించుకోవచ్చు. ఎందరు యాత్రీకులు వచ్చినా అక్కడి నిశ్శబ్దం భంగం కాదు. నిర్మలంగా ఉంటుంది పరిసరం. గుహలోకి ప్రవేశించే సరికి ప్రతి ఒక్కరి మనస్సు శూన్యమై పవిత్ర భావం చోటు చేసుకుంటుంది. అక్కడకు వెళ్లే వారంతా భక్తులే. హిందూ మతంపైన విశ్వాసం గలవారు. ప్రతి ఒక్కరు దర్శనం

చేసుకున్న తర్వాత తిరుగు ముఖం పడతారు. తిరుగు ప్రయాణం కష్టమనిపించదు.

నా సందేహాలు కొన్ని : మతం అంటే అసలు అర్థం ఏమిటి? ఆధ్యాత్మికత అంటే ఏమిటి? ఇక్కడి మంచులింగం అర్థం ఏమిటి? పావురాల జంట ఏమిటి?



హిమాలయాల్లో ... అమర్‌నాథ్ మంచులింగం

హిమాలయాల్లో అంత ఎగువన ఏర్పడే శివలింగం ఏదైనా సందేశాత్మకమా?

గుహ అంటే గుహ్యమైనది. మన హృదయం, హృదయకుహరం. అది శూన్యం. ప్రతి మనిషి హృదయం శూన్యంగానే ఉంటుంది. ఆ శూన్య గుహలో మనసు పోగు చేసిన చెత్తా చెదారం ఉంటుంది. అవే వాంఛలు. మనసు కోరికలన్నీ వాంఛలే. ఏదైనా ఇంకా ఇంకా కావాలని కోరుతుంది మనసు. శూన్యం కమ్ముంటుంది హృదయం. మనం గుహను శుభ్రం చేస్తే, అందులోని చెత్తా చెదారం తీసివేస్తే, అందులో దివ్యత్వం ప్రవేశిస్తుంది. శూన్యమైన గుహ మాత్రమే దివ్యత్వాన్ని నింపుకో గలుగుతుంది. దివ్యత్వం ఎప్పుడూ శూన్యంలోనే కదులుతుంది, ప్రయాణిస్తుంది. ప్రశాంతి వైపు ఆకర్షించబడుతుంది. కొండల పైనుండి నీరు క్రిందికి ప్రవహించినట్లు దివ్యత్వం పై నుండి మనలోకి ప్రవహిస్తుంది. హృదయ శూన్యంలో విస్తరిస్తుంది. పరచుకుంటుంది. తోట పచ్చగా, ప్రశాంతంగా ఉంటే పక్షులు వస్తాయి. వాటిని ఎవరూ రమ్మని పిలవనవసరం లేదు. మన మనస్సు

నిష్కల్మషంగా ఉంటే, హృదయం ప్రశాంతంగా ఉంచుకుంటే దివ్యత్వం దిగివచ్చి వాలుతుంది.

★ ★ ★

తిరిగి మహాబ్లేశ్వర్ చేరాను. హృదయం ప్రశాంతంగా ఉంది. అమర్‌నాథ్ గుహ రహస్యం తెలిసింది. మంచు లింగాన్ని, పావురాల జంటను దర్శించాను. ప్రకృతి రహస్యాలు మనిషికి అర్థం కావు. సృష్టి రహస్యాలు అసలు తెలియవు. శూన్య మనస్సుతో శూన్య హృదయాన్ని అన్వేషిస్తే సత్యం బోధపడుతుంది. మహాబ్లేశ్వర్‌లో సాధన, జీవితం బాగుంది. కొద్దిసార్లు మాత్రమే అమ్మను చూడడానికి వెళ్లి వచ్చాను. ఒకసారి తనే వచ్చింది నన్ను చూడాలనిపించి. పంచగనిలో ఒక బంగళాలో ఉన్నది. అమ్మ, తమ్ముడు, బావగారు వచ్చారు. అక్కడ ఉండగా నేను వారితో ముంబయ్ వస్తానని ఆశించారు. రెండు సంవత్సరాలు వారు అక్కడ ఉన్నారు అప్పుడప్పుడు వెళ్లి పలకరించేవాడిని. నా ఏకాంతవాసం వదులుకోవడం సుతారమూ ఇష్టం లేదు. వాతావరణం పొడిగా ఉంటే తమ్ముడు వచ్చి ఏవేవో విషయాలు చెప్పేవాడు. నేను వారికి అర్థం కాను. అసలు ఎవరికీ నేను అర్థం కానేమో!

ఎవరైనా యాత్రీకులు అటు వస్తే, గ్రామంలోని వారు నా గురించి చెబితే ఆసక్తిగా వచ్చేవారు. అలాంటి వారు సత్యాన్వేషులు, జిజ్ఞాసులు. పెద్ద వారిని కలుసుకోవడం ఒక తృప్తి. కొందరు అలా ఆశ్రమాలు దర్శించి, యోగుల్ని, రుషుల్ని దర్శించి పుణ్యం సంపాదించుకుంటారు. అలా వచ్చేవారికి ధ్యానం, యోగం, తత్వం, ఆత్మ గురించి కాస్త తెలుసు. ప్రశ్నించేవారు, నాకు తోచిన సమాధానాలు చెప్పేవాడిని. ఇంగ్లీషులోనే సంభాషణ సాగేది. “జీవితాంతం సాధన చేసినా మనకి అంతుచిక్కని విషయాలు చాలా ఉంటాయి. మనసుకు తెలిసింది మనసు భాష. మనది ఆలోచనా ప్రపంచం. అసలైన దివ్యత్వం మనకు తెలియదు. అతీంద్రియ శక్తులు కొన్ని తెలుస్తాయి. అతీంద్రియ ప్రజ్ఞ మన అందుబాటులో ఉండదు. పరేంగిత ప్రజ్ఞ ఆనవాళ్లు తెలియవు. మనకు దివ్యశక్తులు అందుబాటు లోకి రావు. అసలైన దివ్యత్వం మనకు తెలియదు.”

నెమ్మదిగా నా భావాలను ఇంగ్లీషులో వ్యక్తం చేయ గలుగుతున్నాను. శక్తి, విస్ఫోటన, శక్తిపాతం, శక్తిచాలనం లాంటి వాటి గురించి అర్థమయ్యేలా చెప్పడం కష్టం. గమనిక, నిరీక్షణ, గవేక్షణ గురించి ఎంతని చెప్పను! ఏమని చెప్పను? అనుభూతి, అనుభవం లేని వారికి అలాంటి విషయాలు అర్థం కావు. ఆధ్యాత్మిక అనుభవాలను, మన అనుభూతులను మాటలతో వర్ణించడం సాహసం. నేను

చదివిన చదువు తక్కువ. నా ఇంగ్లీషు భాషా జ్ఞానం స్వల్పం. చాలా విషయాలు వారికి అర్థమయ్యేలా చెప్పలేకపోయేవాడిని.

ఆ రోజుల్లో గంటలు గంటలు ధ్యానంలో గడిచేది. రెండు మూడు గంటల పాటు కదిలే పనిలేదు. నాకేం తెలియదు. కూర్చోగానే లోపల స్పందన తన వేపు లాగేది. అది గమనిస్తూ, పరవశం చెందడమే నా పని.

అలా నిశ్చలంగా ధ్యానంలో ఉన్నప్పుడు ఒక నాగసర్పం వచ్చి నా ఒళ్లో కూర్చునేది. ధ్యానం విరమించి కళ్లు విప్పేసరికి అది ఒడిలో ఉండేది. నాకు స్పృహ రాగానే అది నెమ్మదిగా జారుకునేది. నా ధ్యానంలో రెండు నాగులు నాతోనే ఉండేవి. అవి ఏమీ చేసేవి కావు. ధ్యానంలో కూర్చోగానే రావడం అంటే అర్థం వాటికి ఏదో ధ్యాన స్పర్శ తెలిసి ఉండాలి.

జంతువుల్లో పరిణామ వికాసం చెందిన జంతువులుంటాయి. అవి అపకారం చేయవు. పైగా ధ్యానులకు సహకరిస్తుంటాయి. అలాంటి వాటిలో 'నాగజాతి' ఒకటి. దేవుళ్లు, దేవతలతో నాగులు కలిసి ఉన్నట్లు పురాణ కథలు చెబుతాయి. యోగానికి నాగులు ప్రతీకలు. గుళ్లలోనూ జంట నాగుల శిలా విగ్రహాలుంటాయి. లేళ్లు, పులులు, ఆవులు, ఏనుగులు ఆధ్యాత్మిక వేత్తలకు నేస్తాలు. మనం మైమరచి ధ్యానంలో, తపస్సులో ఉంటే నాగులు పరవశంతో ఎదురుగా పడగ విప్పి నాట్యం చేస్తాయి. నేను ధ్యానంలో ఊగిపోయినట్లే అవీ ఊగేవి. నేను ధ్యానంలో ఉన్నంతసేపు అవి నాకు రక్షణగా ఉండేవి. తర్వాత వెళ్లిపోతుండేవి. నా ఆశ్రమం దాపుల చాలా నాగుపాములు సంచరిస్తూ ఉండేవి. వాటి కదలికల్ని నేను ఎన్నడూ కాదనలేదు. అక్కడ చెట్లపైన రకరకాల పక్షులు నివశించేవి. రాత్రి వేళల్లో లేళ్లు, పులులు సైతం యదేచ్ఛగా వచ్చిపోతుంటాయి. అది రక్షిత ప్రాంతం కాదు అయినా అవే నాకు రక్షణ యిచ్చేది. వాటి జీవనం వాటిది, నా జీవితం నాది. సహజీవనం మాది.

ఒకనాటి సాయంత్రం నా ఆశ్రమం ముంగిట కూర్చుని ఎటో గమనిస్తు న్నాను. ధ్యాన మగ్నం అయ్యానేమో! మగత క్రమ్మింది నన్ను. పరధ్యానం ఏర్పడ్డది. నా స్థితి ధ్యానస్థితి. దేహస్థితి మగత. చుట్టూ ప్రశాంత వాతావరణం. చీకట్లు ముసురుకుంటున్నాయి. పొదల్లోంచి ఒక పులి వచ్చింది. వచ్చి నాకు ఇరవై అడుగుల దూరంలో నిలబడ్డది. చూడడానికి భయంకరంగా ఉంది. అది నా వేపు చూస్తోంది. నేనూ దానివేపు తొణుకు బెణుకు లేకుండా చూస్తున్నాను. దాని కళ్లలోకి చూచాను. నాకు భయం కలగలేదు. నన్ను చూచి దానికీ భయం

కలగలేదు. నా అంతశ్శక్తి మొత్తం నా చూపుల్లో కేంద్రీకృతమైంది. కొన్ని నిమిషాలు ఒకరి కళ్లలోకి ఒకరం అలా చూచుకున్నాం. అది నెమ్మదిగా కదిలి వెళ్లిపోయింది. అది నా మీదికి ఉరికితే అంతే సంగతులు. ఉహుఁ దానికి నన్ను చంపాలన్న ఆలోచన లేదు పాపం.


ఆ సమయంలో పులిని క్రూర జంతువు అనిగానీ, దానివల్ల ప్రమాదం అని గానీ, నా మనసు భావించలేదు. ఏ ఆలోచనా లేని శూన్యం నేను. అంటే మనస్సులో భయానికి, ఆందోళనకు చోటు లేకుండా పోయింది. అంతగా శూన్యమైంది మనసు. నాలోగానీ దానిలోగానీ ప్రతిస్పందన లేదు. అది వెళ్లిపోయిన తర్వాత అది పులి అని, ప్రమాదకరమని అనిపించింది. అప్పుడు భయం వేసింది. ఆలోచన లేనంతకాలం, మనస్సు లేనంతకాలం మనిషికి భయం కలగదు. మనసు, ఆలోచన, భావన భయాన్ని కల్పిస్తుంది, సృష్టిస్తుంది. చిత్రమైన అనుభవం.


ఆ సంఘటన తర్వాత మిత్రుడు రజ్దా వచ్చి నా కథ విని కంగారు పడ్డాడు. ఆ ప్రాంతంలో పులులు తిరుగుతుంటాయని అందరికీ తెలుసు. అవి కుక్కల కోసం, పందుల కోసం వస్తుంటాయట. లోగడ, నేను వేటాడే రోజుల్లో అయితే, ఇలా పులి కనిపిస్తే ఎంత సంబర పడేవాడినో! ఇప్పుడు నా దృష్టి ఆంతర్దృష్టి. ఆంతరికం, ఆంతర్యం అన్నీ మారిపోయాయి.

ఆ నాటివి దత్తారామ్ గవంద్‌గా జీవించిన రోజులు.

ఇవి, ఉత్తి 'దాదా'గా అన్వేషణ సాగిస్తున్న రోజులు.

అది 'తానే' – ఇది మహాబ్లేశ్వర్ – అంతే తేడా.





11. మనసున్న మనుషులు

మహాబ్లేశ్వర్ సుప్రసిద్ధ వేసవి విడిది కావడం వల్ల విదేశీ పర్యాటకులు వస్తుంటారు. అలా వచ్చిన వారు నా గురించి విని చూడడానికి వచ్చేవారు. అలా కొందరితో పరిచయాలు ఏర్పడ్డాయి. ఒక రోజున ఇద్దరు అమెరికన్లు వచ్చారు. భారతీయ సంస్కృతి, మత విశిష్టత గురించి సంభాషణ జరిగింది. అప్పటికి నా ఇంగ్లీషు అధ్వాన్నంగా ఉండేది. పూజలు, జపాలు, ధ్యానం గురించి మా సంభాషణ సాగింది. వాళ్లు ఆత్మల్ని గురించి, ఆత్మదర్శనం గురించి వివరంగా అడిగారు.

వారితో మాట్లాడుతుండగా ఒకాయన వచ్చాడు. మనవాడే. ఎప్పుడూ చూడలేదు. గంటన్నర సేపు మా సంభాషణ శ్రద్ధగా విన్నాడు. అతిథులు వెళ్లిపోయిన తర్వాత ఆయన తనను పరిచయం చేసుకున్నాడు. అతని పేరు ఏదో 'షా'. కలకత్తాలో నగల వ్యాపారి.

"రేపు వచ్చి మరోమారు మీ దర్శనం చేసుకోవచ్చా" అని అడిగాడు.

ఆయనకు నాలో ఏదో అంశ నచ్చింది. 'సరే' రమ్మన్నాను.

మర్నాడు ప్రొద్దుటే వచ్చాడు. సంప్రదాయం తెలిసినవాడు. జీవితానికి అర్థం అన్వేషిస్తున్నవాడు. జిజ్ఞాస ఉన్నవాడు. సంభాషణ మొదలవగానే అడిగాడు:

"నిన్న మీరు అమెరికన్లతో చెప్పిన విషయాలు ఆశ్చర్యంగాను, కొత్తగాను అనిపించాయి. మీరు మన సంప్రదాయాన్ని అంగీకరించరా? పరంపరను కాదనడం ధర్మమా! ప్రాచీన మహర్షులు ఆర్జించి, అందించిన విజ్ఞానం నిరుపయోగమే నంటారా? మీరు హిందువులే కదా! హిందూ మతం, హిందూ సంప్రదాయం మీకు నచ్చవా? ఎందువల్ల?"

నేను అంతే నిర్మొహమాటంగా, ఖండితంగా చెప్పాను.

"నచ్చవు ... పాత సంప్రదాయాలంటే పాతబడినట్లే. అవి ఈ కాలంలో చెల్లవు. వాటికి కాలం చెల్లింది. తీసి ప్రక్కన పెట్టవలసిందే. సత్యాన్ని నేరుగా, మనంగా తెలుసుకోవాలి. గతంతో ఏ మాత్రం సంబంధం లేకుండా మనం జీవించగలగాలి. అప్పుడే సత్యదర్శన మవుతుంది. మీరు గతాన్ని పట్టుకుని వేలాడడం అంటే ప్రస్తుతాన్ని కాదనడమే అవుతుంది. గతంలో జీవించగలరా చెప్పండి? ఇదీ అంతే. కొత్తని ఆమోదించలేని వారే గతంలో కూరుకుపోతారు. గత స్మృతులతో బ్రతుకుతుంటారు."

మా ఇద్దరి చర్చ గంటసేపు తీవ్రంగానే సాగింది. ఆయన చివరికి విసిగిపోయి అన్నాడు "దాదా! ఈ దేశంలో ఎవరికీ మీ పద్ధతి నచ్చదు. ఎవరూ మీ సిద్ధాంతాలు విశ్వసించరు – నమ్మరు. దయచేసి తమరు అమెరికా గాని, యూరోపు గాని వెళ్లిపోండి. మీ ఆధ్యాత్మిక తత్వం అక్కడి వారికి నచ్చవచ్చు".

కొన్ని నిమిషాల తర్వాత అడిగాడు "మీకు అమెరికా వెళ్లాలని లేదా?"

ఆయన జోక్ చేస్తున్నాడనిపించి నవ్వేశాను.

షా ఈసారి సాత్వికంగానే అన్నాడు "మీ సిద్ధాంతం ఇండియాలో ఎవరికీ నచ్చదు. ఫారిన్ వాళ్లకి నచ్చవచ్చు. అక్కడకు వెళ్లండి".

నేను నవ్వేశాను. అమెరికా, యూరోపు అంటే పెద్ద జోక్.

వెళుతూ అన్నాడు, "ఏమైనా సాయం కావాలంటే చెప్పండి".

నేనన్నాను : "నాకెలాంటి సహాయం అవసరం లేదు. నేను ఎక్కడికీ వెళ్లాలను కోవడం లేదు".

షా : "అలా కాదు దాదాజీ! నాకు ముంబయ్‌లో మంచి మిత్రులున్నారు. అవసరమైతే సాయం చేయగలరు".

తన అడ్రసు కార్డు యిచ్చి "మీకు ఎప్పుడు, ఏ అవసరం కలిగినా నాకు రాయండి. నేనున్నాను." అన్నాడు.

★ ★ ★

షా గారు కలకత్తా వెళ్లిపోయాక, నా బుర్రలో అమెరికా జొరబడ్డది. అమెరికా ఆలోచనలు రాసాగాయి. అప్పుడు జోక్‌గా తీసుకున్నానే గానీ, అందులో కొంత నిజం ఉందేమోననిపించింది. ఈ దేశంలో ఎవరినీ నా పరిశోధన గురించి చెప్పి ఒప్పించలేను. నిజానికి షా గారిది మంచి మనస్సే. సరదాకి అన్నా, హేళనగా అన్నా, ఆ మాటల్లో అమెరికా ప్రస్తావన వచ్చింది కదా! నా 'భావన' అమెరికా

వారికో, యూరోపు వారికో నచ్చుతుందని ఎలా ఊహించగలిగాడాయన. తర్వాత షా గురించి మరచిపోయాను.

మూడు నెలల్లో షా గారు మళ్లీ మహాబ్లేశ్వర్‌లో ప్రత్యక్షమైనాడు. అంతకన్న ఆశ్చర్యం ... నా అమెరికా ప్రయాణం ఖర్చులు తాను భరిస్తాననడం. ప్రయాణం ఏర్పాట్లు తానే చూస్తానని హామీ యిచ్చాడు.

నేనన్నాను "మంచిది. కానీ అమెరికాలో ఎవరూ తెలిసినవారు లేరు. అక్కడకు వెళ్లినా నిభాయించుకోవడం కష్టం".

"అలా అనకండి. దానిపైన కాస్త గట్టిగా మనసు పెట్టండి" అన్నాడు షా.

ఏమిటో మళ్లీ ఈ అమెరికా ప్రలోభం? ఆయన పట్టుదలగా ఉన్నాడు. అమెరికా వెళ్లడం అనేది నా తలకు మించిన పని. స్కిండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీ ఎం.డి తనకు తెలుసునని, వారు తరచు అమెరికాకు నౌకలపైన సరుకులు పంపుతుంటారని, ఆ డైరెక్టరు గారింట్లో నగలూ, నట్రా తయారు చేసి యిచ్చేది తనేనని చెప్పాడు. ఆ మేనేజింగ్ డైరెక్టరు ఉండేది ముంబయ్‌లో.

ఆమె గారి పలుకుబడి ఉపయోగించి నా ప్రయాణం ఏర్పాటు చేస్తానన్నాడు. ఆమె గారే లోగడ హరేకృష్ణ ఉద్యమం ప్రెసిడెంట్ షీలా ప్రభుపాదను నౌకలో ఉచితంగా అమెరికా పంపారుట. ఎం.డి సుమతిబెన్ మురార్జీ నాకు అలాంటి ఉచిత ప్రయాణం ఏర్పాటు చేయగలరని హామీ యిచ్చాడు. తనకు ఆమెతో అంత గట్టి పరిచయం ఉందని మరీ మరీ చెప్పాడు. "దయచేసి కాదనకండి" అని ప్రాధేయపడ్డాడు.

'అమెరికా వెళ్తాను సరే! వెళ్లి అక్కడ నేనేం చేయాలి' అనేది నా ప్రశ్న. నావద్ద ఉన్న డబ్బు చాలా స్వల్పం. ఏ మాత్రం చాలదు. అమెరికా అంటేనే అంతా డబ్బుతో వ్యవహారం. డాలర్ల మీద నడవగలగాలి. దాని గురించి ఆలోచించక పోవడమే ఆరోగ్యకరం అనిపించింది. అసలు మరో దేశానికి ఎందుకు వెళ్లాలి? వెళ్లి ఎవరిని ఉద్ధరించాలి? ఎందుకు?

చాలా మందికి అమెరికా వెళ్లడమంటే మోజు. నాకలాంటి మోజు లేదు. ఇక్కడ, మన దేశంలో నిరాడంబరంగా, సుఖంగా జీవించడమే ఇష్టం. ఏమిటో షా గారు! నాలుగు నెలల్లో మళ్లీ వచ్చాడు. తాను సుమతిబెన్ మురార్జీతో మాట్లాడాడట. ఆమె 'చూద్దాం!' అన్నది.

ఇప్పుడు బంతి నా కోర్టులో ఉంది. అంగీకరించడమో, తిరస్కరించడమో నేను చేయవలసిన పని. షిప్పింగ్ కంపెనీ ఆఫీసులో నా కాగితాలు చూపించడం,

తను ఈసారి వచ్చినప్పుడు, తన వెంట తీసుకుపోయి డైరెక్టరుకు పరిచయం చేస్తానన్నాడు.

అన్నమాట ప్రకారం షా వచ్చి నన్ను ముంబయ్ తీసుకువెళ్లాడు. మహాబ్లేశ్వర్ వదలి ముంబయ్ వెళ్లడం అంటేనే నాకు కంగారుగా ఉంది. శ్రీమతి సుమతిబెన్ అడిగారు "మీకు నిజంగా అమెరికా వెళ్లాలని ఉందా? ఆరు వారాలు సముద్రం మీద ప్రయాణం చేయగలరా?"

ఫరవాలేదన్నాను. ఇంత కష్టపడిన 'షా'కు వద్దని షాక్ యివ్వడం ఇష్టం లేక.

"కొత్త దేశం, ఒక టూరిస్టుగా వెళ్లవలసి ఉంటుంది. అక్కడ ఏవో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయబోతున్నట్లు భావించకండి."

"నాకు ఉపన్యాసాలు చేతకాదు".

మరొక దేశం వెళుతున్నప్పుడు కొన్ని అనుమతులు కావాలిట. నాకు పాస్ పోర్టు రావడమే అసంభవం అని తెలిసిపోయింది. ఊరు, పేరు వదిలి అడవిలో బ్రతుకుతున్నవాడిని నేను. భారతదేశపు ఓటర్ల లిస్టులో నా పేరు లేదు. జనాభా లిస్టులో నా పేరు నమోదై ఉండదు. అది 1975 ప్రాంతం. పాస్‌పోర్టు కావాలంటే మనిషికి తగిన గుర్తింపు ఉండాలి. హోదా ఉండాలి. పెద్ద నౌకా సంస్థ ఉచితంగా టికెట్ యిస్తే సరిపోదు. వీసా కావాలట. నాకు కనీసం రేషన్ కార్డు లేదు. ఇల్లు లేదు. అడ్రసు లేదు. బ్యాంకు ఎకౌంట్ లేదు. చివరకు బర్త్ సర్టిఫికేట్ లేదు. అసలు సమాజమే నన్ను గుర్తించదు. నేనొక అడవి మనిషిని.

షా గారు నాపైన అభిమానంతో, ప్రేమతో చాలా కష్టపడ్డారు. లాభం లేకుండా పోయింది. కార్గోషిప్ అధికారులైతే చేతులెత్తేశారు. "ప్రయాణం చేస్తున్నట్లు సర్టిఫై చేయగలం గాని మిగత గొడవలతో మాకు సంబంధం లేదు" అనేశారు. మేం కలిసిన ప్రతి అధికారి నాకు పాస్‌పోర్టు పొందే అర్హత లేదని, వచ్చే అవకాశం లేదని తేల్చి చెప్పారు. పైగా నా గురించిన పోలీసు సర్టిఫికేట్ కావాలట. అయినట్లే!

పాస్‌పోర్టు, వీసా వచ్చే ద్వారాలు మూసుకుపోవడంతో నా అమెరికా కల చెదిరిపోయింది. కుటుంబంలో ఎవరి సహాయం అర్థించలేను. ఆస్తిపాస్తులు చూపిస్తే పాస్‌పోర్టు వస్తుంది. కాని నా ఆస్తి ఏది? కుటుంబానికి నాకూ ఏం సంబంధం ఉంది? అమెరికా వెళ్లే అవకాశం లేదని నిర్ధారణ అయిపోయింది.

కొద్ది రోజుల తర్వాత షా గారు మరొక మంచి వార్త మోసుకొచ్చారు. ఎవరైనా ధనికుడు నా ఆర్థిక బాధ్యతలు వహిస్తానని లేఖ యిస్తే, ఆ లేఖను భారత రాష్ట్రపతికి పంపితే పాస్‌పోర్టు వస్తుందట. అటువంటి ఉదారబుద్ధి గల ధనికుడు నాకు ఎవరు దొరుకుతారు?

ఒక రోజున రజ్జా ముంబయ్ నుండి గోవిందజీ భాయ్ ష్రాఫ్ అనే పారిశ్రామికవేత్తను వెంటబెట్టుకు వచ్చాడు. ఆయనకు 'ఎక్సెల్ ఇండస్ట్రీస్' అనే సంస్థ ఉంది. రజ్జాకు బంధువు. తన తేనె పరిశ్రమ చూపించి నా కుటీరానికి తీసుకు వచ్చాడు. ష్రాఫ్ గారికి నాపట్ల ఆసక్తి కలిగింది. నా గురించి అంతా విని అన్నాడు "దాదాకు కాంప్లిమెంటరీ టికెట్ దొరికినట్లయితే, పాస్‌పోర్టు స్పాన్సర్ ఏర్పాట్లు నేను చేయగలను. లేదంటే నేను గ్యారంటీ ఉంటాను" అని "ముంబయ్ వచ్చి నన్ను కలుసుకోండి" అన్నాడు.

చిత్రంగా ఒకదాని వెంట ఒకటి అలా కలిసొచ్చాయి. మేఘాలు తొలిగాయి. ముంబయ్‌లో ఒక లాయర్ సాయంతో అప్లికేషన్ పెట్టించాడు తానే గ్యారంటీ ఉండి. అప్లికేషన్ రాష్ట్రపతికి పంపారు. వెంటనే ప్రభుత్వం నాకు పాస్‌పోర్టు మంజూరు చేసింది. ఒక అడ్డు తొలగిపోయింది. ఒక విజయం సాధించినట్లు. అంతలో మరొక అవాంతరం – అమెరికన్ వీసా. అమెరికాలో రెండు నెలలు ఉంటానని అప్లికేషన్ పెట్టాను. ఫారిన్ ఎక్స్ఛేంజ్ సరిపోని కారణంగా కన్సులేట్ వారు అప్లికేషన్ తిరస్కరించారు. మిత్రులు కొంత డబ్బు సమకూర్చారు అమెరికాలో ఖర్చుల నిమిత్తం. అయినా 300 డాలర్లు చూపిస్తే గాని కన్సులేట్ వారు ఒప్పుకోమన్నారు.

నాకు ఇండియా వెలుపల పరిచయాల్లేవు. ఫారిన్ కరెన్సీ లభించే అవకాశం లేదు. మరొకసారి అమెరికా కల చెదిరింది. చిరాకు వేసింది. ఎందుకీ నిబంధనలు దేశానికీ దేశానికీ మధ్య, మనిషికీ మనిషికీ మధ్య. అసహ్యం వేసి ముంబయ్ వదలి మహాబ్లేశ్వర్ చేరుకున్నాను. నిజానికి ఎక్కడకో వెళ్లి ఎవరికో జ్ఞానం కలిగించాలని నాకు లేనే లేదు.

ఒక రోజున మార్నింగ్ వాక్ చేస్తుండగా నా చిరకాల మిత్రుడు యు.జి. కృష్ణమూర్తి తారసపడ్డాడు. ఎప్పుడో పదిహేను సంవత్సరాల క్రితం థియోసాఫికల్ సొసైటీలో స్నేహం మాది. కనిపించగానే గుర్తించి గాఢాలింగనం చేసుకున్నాడు. రోడ్డు వారన ఓ పెద్ద రాతి బండపైన కూర్చుని చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాం.

వీలైనప్పుడల్లా కలుసుకుందామని అనుకున్నాం. ఆ రోజు సాయంత్రమే నా కుటీరానికి వచ్చాడు తను.

థియోసాఫికల్ సొసైటీ నాటి కబుర్లు కలబోసుకున్నాం. వసంత విహార్‌లో జిడ్డు కృష్ణమూర్తి ప్రసంగాలు కలిసి విని చర్చించుకునేవాళ్లం. తనూ, నేను, కొలంబో మిత్రుడు డా. అధికారి మంచిమిత్రులం. ఈమధ్య కాలంలో నా ప్రయత్నాలు నేను చెప్పాను. తన గురించి తనూ చెప్పాడు.

"నేను ఎన్నో పుస్తకాలు చదివాను. ఎందరో యోగుల్ని, మాస్టర్లను కలిశాను. నేను ఎవరికీ ప్రతినిధిని కాదలచలేదు. ఎవరి గొంతు నేను వినిపించను. వారి సందేశాలు మన అనుభవాలకు ఆధారం కావడం నా కిష్టం లేదు. నా అనుభవం నాది కావాలి. మనస్సును పరిపరి విధాల పరుగు తీయించ దలచలేదు. ఆ పరుగులు ఆపేశాను. నేనిప్పుడు బొత్తిగా మనసుపైన ఆధారపడడం లేదు. స్వంత అనుభవం ముఖ్యం అనుకుంటున్నాను.

"దివ్యజ్ఞాన సమాజంవారి సాహిత్యం నన్ను ఎదగనీయలేదు. జిడ్డు కృష్ణమూర్తి ప్రసంగాలు, రచనలూ అంతే. మనకి స్వేచ్ఛ ఇవ్వడానికి బదులు మనల్ని నియంత్రిస్తున్నాయి. కొత్త మార్గం అన్వేషించాను. ఎవరి ప్రమేయం లేకుండా, ఎవరి సహాయం సహకారం లేకుండా జీవిత తత్వాన్ని గ్రహించాలను కున్నాను. మహాత్ములందర్నీ తీసి పక్కన పెట్టాను. ఇప్పుడు ఎవరినీ చదవను. ఎవరి బోధల్ని అనుసరించను. ఎవరూ నాకు మార్గదర్శకం కాదు. ఇల్లు, సంసారం, బంధువులు, స్నేహితులు అన్నిటినీ, అందరినీ వదలి వచ్చాను. 'నా' అన్నది, 'నాది' అన్నది లేకుండా చేసుకున్నాను.

"పరిమిత సామాగ్రితో కొండపైకి వెళ్లి ఏకాంతంగా ఉండిపోయాను. మనస్సును బంధించ లేదు. పూర్తి స్వేచ్ఛ నిచ్చాను. ఒత్తిళ్లకు, ప్రలోభాలకు అందనంత దూరం వెళ్లాను. ఆలోచించడం మానేశాను. మనస్సును అన్వేషించే ప్రయత్నంలో చిత్రంగా నా హృదయ కేంద్రాన్ని చేరగలిగాను. అది నిశ్చలంగా ఉంది. మహానిర్మలం అనిపించింది. అక్కడ స్థితమైతే బాహ్య ప్రపంచంతో పని ఉండదు."

యు.జి. కృష్ణమూర్తి నా మనసు గ్రహించాడు. అతని కళ్లలో మెరుపు. ఇంకా నా అనుభూతుల గురించి వివరంగా చెప్పమన్నాడు.

"మిస్టర్ యుజీ! నాలో నిగూఢంగా నిక్షిప్తమైవున్న నిధుల్ని నేను తెలుసుకున్నాను. అవి నాలోని శక్తి గనులు, జ్ఞాన నిధులు. ఒకనాడు నాలో శక్తి

విస్ఫోటనం జరిగింది. ఎగిరి పడ్డాను. శక్తి ప్రవాహం నన్ను ముంచి వేసింది. ఆ తర్వాత అంతా ఆనందం, ప్రశాంతి. నాలో ఏదో ప్రజ్ఞ ప్రభవించింది. అది అతీంద్రియ ప్రజ్ఞ కావచ్చు. పరేంగితం అది. నాలో జ్ఞాన దృష్టి ఏర్పడ్డది. అంతరంగం నుండి జ్ఞాన వీచికలు వీచసాగాయి. అవి సత్యదీప్తులు, దివ్యరోచిస్సులు. ఆ దివ్యశక్తి ఆనాటినుండి నాలోనే, నాతోనే ఉంటోంది. నన్ను వదలిపోలేదు. నాకు గైడెన్స్ అదే. మార్గం చూపేది అది, నన్ను నడిపించేది అది. 'నేను' అంటూ లేను. ఇప్పుడు ఎవరినీ ఏమిటని ప్రశ్నించను. ఎవరినీ అనుకరించను. ఎవరినీ అనుమానించను."

నా అనుభవాలు యు.జి.కె.కు నచ్చాయి. చాలా సంతోషించాడు. విజ్ఞత నెరిగినవాడు. తర్వాత ప్రస్తుతం గురించి మాట్లాడుకున్నాం. ఇట్లా అమెరికా వెళ్ళే అవకాశం చేతి దాకా వచ్చి జారిపోయిందని చెప్పాను. టికెట్, పాస్‌పోర్టు దొరికాయి. 'వీసా' తన్నిందని చెప్పాను. 'ఇప్పుడిక అమెరికా కలవరింతలు లేవు. హాయిగా వుంది' అన్నాను.

యు.జి. నా మాటలకు అడ్డొచ్చి "అప్పుడే నిరాశపడకు దాదా! నీవు అమెరికా వెళతావు" అన్నాడు.

"ఎట్లా మిత్రమా? అక్కడ నాకు తెలిసిన వారెవరూ లేరు. ఒంటరిగా వెళ్ళి ఏం చేయాలి?"

యు.జి. నవ్వి అన్నారు "డోంట్ వర్రీ గవంద్? ఒక సంపన్న మహిళ, సహృదయి నిన్ను ఆదుకుంటుంది. నీకు సాయం చేస్తుంది." అని జ్యోతిషం చెప్పాడు.

నా 'వీసా' కథ వివరంగా చెప్పాను. '300 డాలర్లు కడితే వీసా వస్తుంది'.

"నేను స్విట్జర్లాండ్ వెళ్ళగానే నీకు డాలర్లు నేను ఏర్పాటు చేస్తాను. సరేనా?"

నేనన్నాను "యూజీ నా అమెరికా ట్రిప్ కోసమే నీవు మహాబ్లేశ్వర్ వచ్చినట్లుంది".

"దాదా! నీవు అమెరికా ప్రయాణం మానవద్దు. నీకు ఎక్కడ, ఎప్పుడు, ఏ అవసరం కలిగినా స్విట్జర్‌లాండ్‌లో నేనున్నానని గుర్తుంచుకో. యూరప్ వచ్చినప్పుడు నన్ను కలుపు. స్విట్జర్లాండ్ చాలా సుందరంగా ఉంటుంది".

"ముందు అమెరికా వెళ్ళనీ మిత్రమా! తర్వాత యూరపు సంగతి ఆలోచిద్దాం".

ఇద్దరం ఆనందంగా విడిపోయాం. కాలం ఎడబాటు కలిగించినా మైత్రి మిత్రుల్ని దగ్గరకు చేర్చుతుంది. అది మైత్రీ బంధం.

కొద్ది రోజుల్లోనే ముంబయ్ రిజర్వు బ్యాంకు నుండి 300 అమెరికన్ డాలర్లకు చెక్కు వచ్చింది. యుజి మాట నిలబెట్టుకున్నాడు. ప్రయాణం ఏర్పాట్లు చేసుకోసాగాను. తిరిగి ఎప్పటికి వస్తానో తెలియదు. కనీసం మూడు మాసాల వీసా అనుమతి. ఇంకా ఎక్కువ కాలం పట్టవచ్చు తిరిగి రావడానికి. ఎవరూ తెలియని చోటుకు ప్రయాణం. అనుకున్నట్లు ఏవీ జరగవు. జరిగేవి ముందుగా తెలియవు. ఊహించలేం కూడా.

ఈ విదేశీ యాత్ర దైవ ప్రేరణ. నా సంకల్పం, ప్రయత్నం లేనిది. మహాబ్లేశ్వర్‌లో తెలిసినవారి వద్ద వీడ్కోలు తీసుకుని ముంబయ్ బయలుదేరాను. డా. ఉమారావు ఆతిథ్యం. ఆమెది మాతృ హృదయం. ఆమె కుమారుడు జయరావు నాకు మిత్రుడు. మహాబ్లేశ్వర్ వస్తుండేవాడు. అతనికి తత్వ విషయాసక్తి. అమెరికాలో అతని మిత్రుడు కెన్ రీడ్ ఉన్నాడట. అతను ముంబయ్ వచ్చినపుడు రావు గారింటనే ఉంటాడు. నేను వస్తున్నట్లు డాక్టర్ రావు, జయ అతనికి ఉత్తరం రాశారు. శాన్ ఫ్రాన్సిస్కో హార్బర్‌లో వచ్చి ఫలానా రోజు కలుసుకోమని. నేను అమెరికాలో ఉండే మూడు నెలలు నాకు ఆతిథ్యం యిచ్చి సహాయం చేయమని రాశారు.

అమెరికా వాతావరణానికి సముద్ర యానానికి తగిన బట్టలు, రగ్గులు, వస్తువులు కొని తెచ్చారు మిత్రులు. వారే అన్ని ఏర్పాట్లు చకచక చేశారు. అమెరికా వెళ్లడం అంటే భూగోళం అవతలి వైపుకు వెళ్లడం. ప్రయాణం తేదీ ఖరారైంది. కలకత్తా వెళ్లి, అక్కడ 'షిప్' ఎక్కాలి. ముంబయ్ నుండి కలకత్తాకు 40 గంటలు ప్రయాణం. విక్టోరియా టెర్మినెస్ స్టేషన్‌కు రెండు పెట్టెల లగేజీతో చేరుకున్నాం. యాభై, అరవై మంది మిత్రులు, అభిమానులు వీడ్కోలు చెప్పడానికి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. పూల మాలలు వేసి, పూల గుత్తులు బహూకరించారు. కొందరు స్వీట్ పాకెట్లు తెచ్చి పెట్టారు నౌకలో తినడానికి. నలభై రోజుల నౌకాయానం గదా. నుదుట కుంకుమ పెట్టి శుభాకాంక్షలు అందించారు.

అది 1975. పసిఫిక్ మహాసాగరం దాటి అమెరికాకు వెళుతున్న వేళ. ఏమిటో మరో ప్రపంచానికి ప్రయాణం అయినట్లే అనిపించింది. ఇంతకాలం నా 'లోపల' అన్వేషిస్తున్నాను. ఇప్పుడు బాహ్య ప్రపంచాన్ని అన్వేషిస్తూ బయలు దేరుతున్నాను. దేశం కాని దేశం. మనది కాని భాషలో వ్యవహారం జరపాలి.

రైలు కలకత్తా చేరింది. షా గారు, ఆయన మిత్రులు స్టేషనులోనే స్వాగతం చెప్పి కాంప్లిమెంటరీ టికెట్ అందచేశారు. రజ్దా కుటుంబ సభ్యులు వచ్చారు. నేను రజ్దా ఇంట్లోనే దిగాను. ప్రయాణం ఏర్పాట్లు వారే చేశారు. రెండు కేరీ బాగుల్లో అవసరమైన సామాను, బట్టలు అన్నీ సర్ది పెట్టారు.

ఓడ రేవుకు చేరాం. సముద్రంపైన దూరంగా 'జలమోతి' కనిపించింది. పెద్ద వాణిజ్య నౌక. 1975 జులై 5న వీడ్కోలు చెప్పారు. బయలుదేరాను. రెండు నెలలపాటు 'నౌక'లో నివాసం. నౌకకు తీరానికి మధ్య చెక్కవంతెన. దానిపైన నడిచిపోవాలి. రెండు సంచులు మోస్తూ నడవడం కష్టం అనిపించింది. ఊగి, తూలి పడబోయాను. అలా ఉయ్యాల వంతెనపై ఎప్పుడూ నడిచింది లేదు.

నౌకలోకి వెళ్లగానే ఆఫీసరు స్వాగతం చెప్పి ఆఫీసు గదికి తీసుకువెళ్లాడు. నౌక నిబంధనలు వివరించి చెప్పాడు. భోజనాలు, టిఫిన్ టైమింగ్స్, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పాడు. నేను శాఖాహారిని. కిచెన్‌కు తీసుకుపోయి నా అవసరాలేమిటో, ఎలాంటి భోజనం తయారు చేయాలో చెప్పాడు. నా కాబిన్ చూపించాడు. అది నౌక యజమాని కాబిన్. అన్ని ఏర్పాట్లు గొప్పగా ఉన్నాయి. ఎయిర్ కండిషన్ గది. విశాలమైన మంచం, ఫ్రిజ్. నా జీవితంలో అన్ని సౌకర్యాలున్న గదిని చూచి ఎరుగను. అక్కడే డైనింగ్ టేబుల్ ఉంది. బాత్‌రూమ్, షవర్–అబ్బో ఏమి వైభోగం!

'జలమోతి' సాయంత్రం బయలుదేరుతుంది. ఈలోగా షిప్ అంతా తిరిగి చూచాను. ఎంత పెద్దదో! అయిదు అంతస్తుల భవనం. అంత పెద్ద నౌకలో ఆరు వారాలు కనీస ప్రయాణం. నాకు సహాయం చేసిన వారందరూ జ్ఞాపకం వచ్చారు. మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

ఏమిటో ఇది ఊహించని మార్పు. జీవిత నౌక ఏ తీరాలకు చేరుతుందో? ఎటు పయనిస్తుందో ఎవరు చెప్పగలరు!

డెక్ పైకి వెళ్లి నిలబడి చూచాను. అనంతంలోకి పరుచుకున్న జలరాశి. కాళ్ల క్రింద నౌక. పైన ఆకాశం. ఆవల రోదసి. కనిపించని తీరాలు.

జీవితం అంటేనే అంత. అంతులేని ప్రయాణం జీవిది.

సైరన్ మ్రోత భయంకరంగా వినిపించింది. నౌక కదిలింది!

నెమ్మదిగా రేవు దాటింది. తీరం అల్లంత దూరంలో సాగిపోతోంది నెమ్మదిగా, స్థిమితంగా.



12. రోదసి తీరాలకు ...

జలమోతి ముందుకు సాగుతోంది. సిబ్బంది పనుల్లో పడ్డారు. దీర్ఘకాలం ప్రయాణం. ఎవరి పని వారు నిష్టగా చేసుకుపోతున్నారు. ఎనభై మంది సిబ్బంది. నేనొక్కడినే ప్రయాణీకుడిని. నన్ను విచిత్రంగా గమనించసాగారు. వాణిజ్య నౌకలలో ఎవరూ ప్రయాణం చేయరు. అసలు ప్రయాణీకుల్ని అనుమతించరు. నౌక స్వంతదారుని ప్రత్యేక కాబిన్‌లో నా మకాం. అది గౌరవ కారణం.

నౌక అంతా కలయతిరిగి నా కాబిన్ చేరుకున్నాను. గంట కొట్టారు. అంటే భోజనానికి వేళైందని. ఏం చేయాలి! ఎక్కడికి పోవాలి? అంతలో ఒక వెయిటర్ నా కాబిన్‌లోకి భోజనం తెచ్చాడు. ప్లేటు, గ్లాసులు, అన్నీ. మంచి భోజనమే కాదు చాలా ఖరీదైన భోజనం, శాఖాహారం, సూపు రకరకాల బ్రెడ్లు, సలాడ్లు, కూరలు, పండ్లు, చాక్‌లెట్స్. కుటీరంలో మితంగా తినే నాకు ఇన్ని భోజ్యాలా? అవి తినడం కూడా చాతకానివాణ్ణి.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు. కొత్త ప్రదేశం. కాలం తన రెక్కలపైన మోసుకు పోతోందా అనిపిస్తోంది. ఏదో అజ్ఞాత హస్తం శాసిస్తోంది. అజ్ఞాతశక్తి నడిపిస్తోంది. ఇందులో నా పాత్ర, ప్రేమయం బొత్తిగా లేవు. జీవన సాగరంపైన గమ్యం తెలియని నౌకా యానం. ఏది ఎలా జరిగినా నేను సిద్ధంగా ఉండక తప్పదు. ఏదీ కోరకూడదు, ఆశించకూడదు. అది నా తత్వం, జీవన విధానం. జీవితం నన్ను లోబరచుకుంది. అది ఎటు త్రిప్పితే అటు తిరగాలి. నా జీవితమే పెద్దనౌకా యాత్ర.

మొదటి రాత్రి జాగరణ. కంటి మీదికి కునుకు రాలేదు. విశాలమైన మెత్తని పడక. నిజానికి కంగారుపడవలసిన పని లేదు. అయినా నిద్ర రాలేదు.

లోపల ఏదో కంగారు. అనూహ్య స్పందన. ఉదయమే సముద్రం చూడడానికి డెక్ పైకి వెళ్లాను. గొప్ప సౌందర్యం. నవ్వుతున్న సూర్యోదయం. ఇంకా తీరం కనిపిస్తూనే ఉంది. తీరం వెంట చిన్న నౌకలు, పడవలు. సువిశాల సముద్రం. పైన ఎగిరే పక్షులు, ఆకాశం అంచుల్లో ఎర్రడాలు వేసింది. సూర్య కిరణాలు సముద్రపు అలల పైన మెరుస్తున్నాయి. సముద్ర గాలులు హోరున రొదచేస్తూ వీస్తున్నాయి. నాలో అపూర్వానందం, ఉత్సాహం, ప్రశాంతి. చాలాసేపు డెక్‌పైనే ఉండిపోయాను.

బ్రేక్‌ఫాస్టు వేళకు గదికి వచ్చాను. వెయిటర్ 22 ఏళ్ల కుర్రాడు. తోపుడు బండిమీద రకరకాల పదార్థాలతో వచ్చాడు. అవి నేనేం తినగలను. చెప్పాను "అబ్బాయ్, ఇకపైన ఇవన్నీ తీసుకురావద్దు. టోస్టు గానీ, బ్రెడ్ గానీ చాలు. ఒక అరటిపండు, జ్యూస్." అతను ఆశ్చర్యపోయాడు. "బ్రేక్‌ఫాస్టు బాగా లేదా సార్" అడిగాడు. ఒంటిగంటకు లంచ్ తెస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

ఒంటిగంటకు లంచ్ తెచ్చాడు. నాకు కళ్లు తిరిగినంత పనైంది. "అన్ని తీసుకు రావద్దు. నేను తినలేను" అని చెప్పాను. అతనికిష్టంగా లేదు. "నాలుగు గంటలకు 'టీ' తీసుకురా చాలు. రాత్రి డిన్నర్ వరకు నాకు ఏమీ అవసరం ఉండదు."

ఫ్రిజ్ నిండా పళ్లు, డ్రింకులు, చాక్‌లెట్లు సర్దిపెట్టాడు. ముంబయ్, కలకత్తా మిత్రులు యిచ్చిన స్వీట్సు చాలా ఉన్నాయి. అతిగా తినే శక్తి నాకు లేదు. 'ఈ కాస్త భోజనంతో ఎట్లా బ్రతుకుతారు?' అన్నట్లు చూచాడు వెయిటర్ బాయ్.

కొత్తలో అన్ని డెక్కులు తిరిగాను ప్రశాంత ఏకాంత స్థలం కోసం. అయిదవ అంతస్తులో 'మంకీడెక్' అనుకూలంగా ఉంది. ఎవరూ రారు అక్కడికి. సజ్జన్‌ఘడ్ పర్వతంపైన ఉన్నంత ప్రశాంతత అక్కడ కనిపించింది. అది ధ్యానానికి అనుకూలంగా ఉంది అనుకున్నాను.

మంకీడెక్‌పైన చాలాసార్లు అంతర్యానం చేశాను. అంతర్ బాహ్య దృష్టులు ఏకం కాసాగాయి. అనుభూతులు ఏకోన్ముఖమైనాయి. కళ్లు తెరిచినా మూసినా అనుభూతి ఒక్కటే. నాలో ఏకత్వం, అంతర్ ప్రశాంతి. చుట్టూ రోదసి, నాలో అనంత తాత్వికత. ఆ గంభీర వాతావరణంలో వినీలాకాశం నీడన, గంభీర జలరాశిపైన ఒక చిరుభావన. నేను సాగరంలా మారిపోయినట్లు. ఆలోచన అన్నది ఒక భ్రమ. గతం తాలూకు నీడ. అది తీరని కోరిక. నా చుట్టూ ఉన్నది సాగరమే అయినా, నాది శూన్యసాగరం. అది నా మనస్సుకు ప్రతీక. మనిషి తృప్తిపడడమే

దివ్యత్వం. కాలాతీతం కావడం అంటే ఏమిటో ఆకాశం నీడలో, మహా శూన్య కాసారంలో ఆ క్షణంలో అర్థమైంది.

రోజులు 'గమనిక'లోనే కరిగిపోతున్నాయి. అందరి మధ్యలో ఏకాంతం, సముద్రంపై ప్రయాణం నన్ను అమెరికా వాతావరణానికి సిద్ధం చేస్తోంది. నౌకలో అందరితో ఇంగ్లీషులోనే మాట్లాడాలి. రకరకాల భోజనాలు, వివిధ రుచులు, విభిన్న వంటలు. నా శరీరం అంతబలమైన తిండి తిని హరించుకోలేదు.

డెక్‌పైన కూర్చుని ఆకాశపు అనంత తీరాల్లోకి చూస్తూ, తీరంలేని సముద్రాన్ని గమనిస్తుంటే నాలో కొత్త లోతులు తెలుస్తున్నాయి. నాలో లోతులు పెరిగాయి. దృక్పథం విశాలమైంది. ఏ విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోగలననే ఆత్మవిశ్వాసం ఏర్పడ్డది. చదవడం వేరు, అనుభవం వేరు, ధ్యానం వేరు, ఆలోకనం వేరు. నాలోపలి లోతుల్లోంచి ఉబికి వచ్చిన విశ్వాసం మహాకాశం ముందు చిన్నబోయింది. ఈ మహావిశ్వంలో 'నేను', నాది అన్నది అణుమాత్రంగానైనా లేదనిపించింది. అంతా భ్రమ ... జీవితమే పెద్ద ఉటోపియా.

మంకీడెక్ పై నుండి గమనిస్తే సృష్టి నగ్న తాండవం కనిపించింది. ఎటు తిరిగినా అనంతం ... రోదసి అంచులు ... అనంత జలరాశి ... రాత్రి పూట చీకటిని అలాగే ఆస్వాదించాను. నల్లని ఆకాశం నిండా మెరిసే నక్షత్రాలు. ఎన్ని గంటలు చూచినా తనివితీరని తమి. అంతలో చంద్రోదయం. పరచుకుంటున్న వెన్నెల, నీటి తరంగాలపై వెండి జలతారు, జలతరంగాలు. జల తరంగిణుల సంగీతం. ఎన్నో మెరుపులు. అన్నీ మెరుపుల మరకలే. అన్నీ ప్రకృతి చురకలే. అన్నీ అందాల తునకలే. ఈ తారలు, గ్రహాలు ఎంత కాలంగా భూమితో దోబూచు లాడుతున్నాయో! అసలు భూమి ఏది? భూగోళం ఎక్కడ ఉన్నది? సముద్రం ఒక్కటే కదా! ఈ గ్రహాలు ఏవీ ఎన్నడూ ఒక దానితో ఒకటి ఢీ కొట్టవు. భూమి తన చుట్టూ తను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుందట. మనకు రెండూ తెలియదు. గమనించం. చిన్నతనం నుండి నాకో అనుమానం – ఇన్ని నక్షత్రాలు, గ్రహాలు ఆకాశంలో వేలాడుతుంటాయి గదా! ఒకటీ తెగి, నేలపైన పడదు ఎంచేత! భూమికైతే సదా ఆకర్షణ శక్తి ఉందంటారు. మరి గ్రహాలకు? శూన్యంలో ఏం శక్తి ఉంటుంది? శూన్యంలో తిరిగే గ్రహాలు ఎంత ఖచ్చితంగా తిరుగుతాయి. ఒక క్షణం గతి తప్పవు. అది శూన్యానికున్న శక్తా? ఏమిటీ సృష్టి రహస్యం? మనకెలా తెలుస్తుంది!

అప్పుడప్పుడు కెప్టెన్ వచ్చి 'హలో' చెప్పేవాడు. 'గుడ్ ఈవెనింగ్' చెప్పి విష్ చేసి వెళుతుండేవాడు. నా ఒంటరితనం అతనికి నచ్చిందేమో! ఒకసారి నా

గురించి అడిగాడు. "భోజనం ఎలా వుంది? ఇంకా ఏమైనా అవసరమా? ఇలా గంటల తరబడి కూర్చుంటే విసుగ్గా ఉండదా? కూర్చుని ఏం చేస్తారు?"

"నాకు ఇలా గడపడమే బావుంటుంది". 'ఆయనకు నేను అర్థం కాను.'

కాస్త పరిచయం తర్వాత ఏవేవో పుస్తకాలు పంపసాగాడు. అన్నీ సముద్రాల గురించి, చేపల గురించిన పుస్తకాలు. వాటిలో ఫోటోలు చూడడం తప్ప, చదివేందుకు ఏమీ ఉండేది కాదు. ఒకనాడు నన్ను బ్రిడ్జిపైకి ఆహ్వానించాడు. నౌక నడిపే విధానం అంతా చూపించి వివరించాడు. పెద్ద టెలిస్కోప్‌తో చూపించాడు. నా గురించి వివరాలు అడిగాడు :

"మీరు ఇండియాలో ఏం చేస్తుంటారు? ఏం పని చేస్తారు?"

"మీరు క్రిష్టియనా?" ప్రశ్నించాడు.

"పుట్టడం హిందూ కుటుంబంలోనే పుట్టాను. నేను హిందువునీ కాను. క్రిస్టియన్‌నీ కాను. నాకు మతం లేదు. మతం మీద విశ్వాసం లేదు. నేనసలు ఇండియన్ అనీ అనుకోవడం లేదు."

కొంతసేపు కెప్టెన్ గదిలో గడిపాను. నా గురించి మళ్లీ అడిగాడు, చెప్పాను.

"ఇండియాలో నేను చేస్తున్న పని మానవత్వాన్ని ఉద్ధరించడం. మనుషుల్ని చాదస్తాల నుండి రక్షించడం. మనిషి పుట్టినపుడు ఒక మతం ఉంటుంది. ఒక సంస్కారం ఉంటుంది. తర్వాత వాటి సంకెళ్లలో బిగుసుకుపోతాడు. ఆ సంప్ర దాయాలు, చాదస్తాలు, అలవాట్లు వదలుకోలేడు. నేను అన్నింటిని వదిలిపెట్టాను. స్వేచ్ఛగా బ్రతుకుతున్నాను. స్వేచ్ఛలోనే అసలైన సత్యం ఉందని నా నమ్మకం. ఈ సంకెళ్లు, నిబంధనలు నన్ను నిర్బంధించ లేవు. నేను ఎలాంటి నిర్బంధం సహించను.

"శతబ్దాలుగా మనం ఒక హిందువుగానో, క్రిస్టియన్‌గానో ముద్ర వేయించు కుని బ్రతుకుతున్నాం. ఆయా మతవిశ్వాసాలకు తలవంచి బ్రతుకుతున్నాం. నాగరికతలు, సంప్రదాయాలు మనల్ని రక్షిస్తుంటాయి. ఎవరికీ స్వతంత్రం లేదు. స్వేచ్ఛగా జీవించడం తెలియదు. భయాలతో, సమస్యలతో బ్రతుకుతున్నాం. ద్వేషాలు, రోషాలు, అసూయలు, కోపాలు మనల్ని బంధిస్తున్నాయి. ఏ మతమూ మానవతను గౌరవించడం లేదు. మానవత్వపు విలువల్ని పెంచడం లేదు. సమస్యలు లేని జీవితం ఏది? ఏ మతమూ ప్రేమను, శాంతిని ఇవ్వడం లేదు."

మేం సమాజం గురించి, సమస్యల గురించి చర్చించుకున్నాం. "ప్రపంచం మొత్తం మీద ఉన్న సమస్య ఇదే. నీతి సూత్రాలతో, మతం ఉచ్చులో చిక్కుకుని బ్రతకడం, అలా నియమాల ఉచ్చులో చిక్కి మనిషి, మానవత కుంచించుకు పోతున్నాయి. గొప్ప పరిణామాలు రావాలి. మంచి మార్పు వస్తే గాని మనిషి శాంతిగా జీవించే అవకాశం లేదు. ఈ సంకుచితత్వం, కట్టడులు, నియమాలు ఛేదించవలసిన సమయం వచ్చింది. మనం విశ్వమానవత్వం దిశగా పయనించాలి. హిందూ సమాజం, క్రిస్టియన్ సమాజం అంటూ పోవాలి. విశ్వమానవ సమాజం ఏర్పడాలి. జాతి, మత భేదాలు ప్రపంచంలో ఎక్కడా ఉండకూడదు. ప్రేమ, స్వేచ్ఛ ప్రపంచపౌరు లందరికీ సమంగా అందాలి".

నా మాటలు కెప్టెన్ విన్నాడు కాని సమాధానం చెప్పలేదు. ఎలాంటి స్పందన లేదు. అతని సంప్రదాయానికి నా మాటలు నచ్చి ఉండవు.

'జలమోతి' ప్రశాంతంగా సాగుతోంది. రాత్రిం బవళ్లు ఎక్కడా ఆగే పనిలేదు. వేగం పెంచుతూ అలల్ని చీల్చుతూ సాగుతోంది. హుందాగా రాజహంస గమనం. సముద్రం కల్లోలంగా ఉంటే తాగిన వాడిలా ఊగుతుంది. ఎగిరెగిరి పడుతుంది. కల్లోలాన్ని బట్టి నౌక నాట్యం చేస్తున్నట్లే అనిపిస్తుంది.

సిబ్బంది అంతా రోజూ వ్యాయామం చేస్తారు. శరీరదారుఢ్యం తగ్గకూడదు. సోమరితనం రాకూడదు. అలుపు సొలుపు ఉండకూడదు. రాత్రింబవళ్లు పనిచేసినా కునుకు రాకూడదు. ఏ నిమిషాన ఉప్పెనలు, తుఫానులు వస్తాయో తెలియదు. అన్ని వేళలా అప్రమత్తంగా ఉంటారు. లైఫ్ జాకెట్లు వేసుకుని, లైఫ్ బోట్సులో ఎక్కి విన్యాసాలు చేస్తుంటారు. సాధన చేస్తుంటారు. ఆత్యయిక పరిస్థితిలో కెప్టెన్ మాట శిలాశాసనం. మామూలు ప్రయాణికుడినైనా నేను తీసుకోవలసిన జాగ్రత్తలు ఉన్నాయి. లైఫ్ జాకెట్ వేసుకుని పరుగులు పెట్టడం లాంటివి ప్రాక్టీసు చేయించారు నాచేత.

'జలమోతి' సింగపూరు చేరింది. అయిదు రోజులు హార్బరులో ఉంటుందని ప్రకటించారు. ఏవో చిన్నచిన్న మరమ్మత్తు పనులున్నాయిట. నాకు సంతోషంగా ఉంది. ఇన్ని రోజులు నౌకలో ఊగుతూ, తూలుతూ ప్రయాణం చేశాను. సింగపూర్ అనగానే ఉత్సాహం కలిగింది. ఇండియా వదిలిన తర్వాత మొదటి హార్బరు అది. తీరానికి దూరంగా 'ఆంకర్స్' వేసి నిలిపారు. చిన్నచిన్న బోట్లలో తీరానికి చేరాం. నగరం చూడడానికి నేను వెళ్లాను.

సింగపూర్ చిత్రమైన నగరం. వీధులన్నీ టూరిస్టుల మయం. తినడం, తాగడం, ఖుషీ చేయడం. అందుకే వస్తారేమో యాత్రీకులు అనిపించింది.

సీ రెస్టారెంట్లు అధికం. చైనా, ఇంగ్లీషు భాషల్లో రంగురంగుల దీపకాంతుల్లో మెనూ బోర్డులు. షాపుల్లో వాటర్ టాంకుల్లో రకరకాల చేపలు, కప్పలు. మెనూ ఆర్డర్ చేశాక మనం అడిగిన వాటిని ఫ్రెష్‌గా వండి వడ్డిస్తారు. కోరిన రుచుల్లో వేడి వేడి వంటకాలు సరఫరా చేస్తారు. టూరిస్టులంతా బాగా చదువుకున్నవారు, డబ్బు గలవారు అనిపించారు. చేపల్ని ఎంత ఆప్యాయంగా, ఇష్టంగా తింటున్నారో!

నేను సంపూర్ణ శాఖాహారిని. అలా చేపల్ని, కప్పల్ని పీక్కు తింటుంటే జుగుప్స కలిగింది. అడవిలో జీవించిన వాడినే అయినా అన్నం, కాయలు తిని బ్రతికాను. సింగపూర్ కడిగిన ముత్యంలా పరిశుభ్రంగా ఉంది. విశాలమైన రోడ్లు, రకరకాల రంగురంగుల చెట్లు. ఒక కొత్త ప్రపంచంలో అడుగు పెట్టినట్లు అనిపించింది. జనం ఎంతో ఉత్సాహంగా, క్షణం వృధాకాకుండా పనులు చేసుకుపోతున్నారు. మన దేశంలో మనుషులకు బద్ధకం జాస్తి. కబుర్లు చెప్పడం తప్ప పనికి ఒళ్లు వంచరు. సింగపూరులో జీవనవేగం ఆశ్చర్యం కలిగించింది. అందరూ ఉరుకులు – పరుగులు.

ఒక అందమైన పార్కు ఎన్నుకుని వెళ్లి కూర్చుని తెచ్చుకున్న శాండ్‌విచెస్, పళ్లు తిన్నాను. బజార్లో ఏవీ కొనలేదు. తోటలు, పూలచెట్లు బావున్నాయి. సాయంత్రానికి హార్బరు చేరుకున్నాను. అయిదు రోజులు అలా హాయిగా గడిచింది. నేల, నీరు, నింగి ... రిపేరు పనులు కాగానే మా నౌక హాంకాంగ్ బయలుదేరింది.

రెండు మూడు రోజులు ప్రయాణం సాఫీగానే సాగింది. నాలుగవ రోజు ప్రమాద హెచ్చరిక. లౌడు స్పీకరులోంచి కెప్టెన్ గొంతు. కొద్ది గంటల్లో తుఫాను రాబోతుంది. కెప్టెన్ సిబ్బందిని డెక్‌పైన సమావేశపరచి సూచన లిచ్చాడు. ఎవరు ఏయే పనులు చేయాలో వివరించాడు. వాతావరణ సూచన ప్రకారం తుఫాను భారీగానే ఉండవచ్చు. నాకేం తెలుసు సముద్రం పైన తుఫానులు వస్తాయని. అవి ఎంత ప్రమాదమో నాకు తెలియదు. నేను మామూలుగానే ఉన్నాను.

సాయంత్రానికి గాలి వాలు మారి, గాలులు ఉధృతంగా వీచసాగాయి. వర్షం ప్రారంభమైంది. ఆ వెంటనే కుండపోత. గాలి తాకిడికి సముద్రం అల్లకల్లోలమై నౌక అటుఇటు ఊగుతోంది. ఎగిసిపడే తరంగాలతో పోటీగా ఎగిరెగిరి పడుతోంది. రెండుగంటల్లో తుఫాను బీభత్సం పెరిగింది. నేను కాబిన్ దాటి బయటకు రాలేదు. ఫర్నిచర్ అటు గోడలకు, ఇటు నేలకు ఫిక్స్ చేశారు కనుక సామాను చెక్కు చెదరలేదు. అయినా గది అంతా చిందర వందరైంది.

రాత్రి భోజనం మామూలు వేళకు వచ్చింది. తుఫాను సమయాల్లో భోజనం తక్కువగా తినాలని వెయిటర్ సలహా చెప్పాడు. అసలు తినే సాహసం చేయలేదు.

తుఫాను ఎంతసేపు ఉంటుంది? ఎప్పటికి తగ్గుతుంది? అడిగాను.

తనకూ తెలియదన్నాడు. చాలా ఎక్కువగా ఉంది. తెల్లవారేదాకా తగ్గకపోవచ్చు.

భయంకర తుఫానులో నౌకాప్రయాణం గొప్ప అనుభవం. సిబ్బంది అప్రమత్తంగానే ఉంది. ఎవరూ నిద్రపోలేదు. నేను గది వదలలేదు. కూర్చుంటే అటో ఇటో పడిపోతున్నాను. వెళ్లి పడక మీద పడ్డాను. అలలు ఎంత ఎత్తుగా వస్తున్నాయో గాని, నౌకను ఢీ కొట్టిన శబ్దం వినిపిస్తోంది. సముద్రం ఆగ్రహించింది. నిద్ర రాదు. తెల్లవార్లు జాగరణ తప్పదు.

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ స్వల్పంగా తీసుకున్నాను. తుఫాను తగ్గకపోగా మరీ పెరిగింది. ధైర్యం చేసి కాబిన్ దాటి బయటకు వెళ్లి చూచాను. నౌక బీభత్సంగా ఊగడం తప్ప ఏమీ కనిపించలేదు. అడుగుదూరంలో ఏముందో తెలియదు. అడుగులో అడుగు వేస్తూ గోడ ఆసరా చేసుకుని గదిలోకి వచ్చి పడ్డాను. పెద్ద అల ఎగిరి నౌకమీద పడ్డది. ఆ ఫోర్సుకు నేను నేల కరిచాను. ఏ రిఫ్రిజిరేటర్‌కో వెళ్లి కొట్టుకుని ఉంటే నాపని అయిపోయి ఉండేది. పెద్ద ప్రమాదం తప్పింది.

మధ్యాహ్నానికి తుఫాను ప్రళయ బీభత్సం సృష్టించింది. కాబిన్‌లో కూడ నిలబడే వీలులేదు. ప్రమాదం ముంచుకొస్తోందని తెలుస్తోంది. ఇంతకాలం రాజహంసలా నడిచింది. ఇప్పుడు మృత్యుహేలగా మారింది. మృత్యువు నోరు విప్పి నౌకను మింగేసేలా ఉంది. అది తుఫాను కాదు. ప్రకృతి విలయతాండవం. ఏదో నౌకలో వెళ్లవచ్చు అనుకున్నాను. ఈ బీభత్సం ఊహించనిది. నిలబడి బ్యాలెన్సు చేసుకోవడం నావల్ల కాలేదు. నాకు జీవితంపైన ఆశ పోయింది. అనవసరంగా అమెరికా కలగన్నాను.

అప్పుడప్పుడు మైక్‌లో హెచ్చరిక వినబడుతున్నా ధోరణి మారింది లేదు. సారాంశం ఒక్కటే. తుఫాను తాకిడి తట్టుకోడానికి నౌక మార్గం మళ్లించారు. అయినా ప్రయోజనం కనిపించలేదు. ఎటు వెళ్లినా సముద్రమే గదా. ఎటు చూచినా ప్రళయ భీకర వికటాట్టహాసమే.

సూర్యాస్తమయ సమయం. నిజానికి సూర్యుడు ఉదయించింది లేదు అస్తమించడానికి. పగలు మసకచీకటి. ఇక గాఢాంధకారం. ప్రచండ విలయం.

ప్రతి ఒక్కరు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ఉన్నారు. ఎవరికీ మనసు పని చేయడం లేదు. శరీరం యంత్రంలా పనిచేస్తోంది. ప్రళయం నుండి, తుఫాను నుండి రక్షించే శక్తి ఎవరికీ లేదు. తప్పించుకునే శక్తి అంతకన్న లేదు. డిన్నర్ వేళ నాకు ఆకలి చచ్చిపోయింది. ప్రాణం మీదికి వస్తే ఆకలి ఎవరికి తెలుస్తుంది. చాలామంది సిబ్బంది జబ్బుపడ్డారు. వాంతుల వల్ల పనిచేయ లేకపోతున్నారు. కెప్టెన్ నా గురించి అడిగాడు. ఆయన స్వరంలో కంగారు, అశక్తత ధ్వనించాయి.

కేబిన్ దాటి బయటికొచ్చాను. బయట అంతా బీభత్సంగా ఉంది. అంతలో మరొక ప్రకటన ... ఇప్పట్లో తుఫాను తగ్గే సూచన లేదు అని. రాత్రికి జాగరణ తప్పదు. నేనేమీ తినలేదు. చాక్లెట్ నమిలి, గ్లూకోజ్ బిళ్ల వేసుకున్నాను. నిద్ర అసంభవం. మేల్కొని ఉండడానికైనా ఓపిక కావాలి. ఎంతసేపని నిరీక్షించను! అర్ధరాత్రికి ఇంక ఆగలేక మంచం మీద సొమ్మసిల్లి పడిపోయాను. ఈ రేయి గడిచేనా!

నిద్రలేమితో మంచం మీద అటుఇటు దొర్లుతున్నాను. ఒక్కసారిగా నా ఆలోచనలు 'భయం' చుట్టూ భ్రమించసాగాయి. నిన్నటి నుండి భయపడ్డా ఆలోచన భయం మీద కేంద్రీకృతం కాలేదు. భీకర సముద్రం, భయంకర తుఫాను, ఎగిరిపడుతున్న 'జలమోతి'. పాపం! ఇంకెంత కాలం నౌకకు ఈ కష్టం అనిపించింది. లైఫ్ జాకెట్ వేసుకుని సిద్ధంగా ఉన్నాను. నౌక నిజంగా నీట మునిగిపోతే? ఏం చేయాలి? ఏమై పోతాం? ప్రాణాలతో బయటపడడం జరగని పని. ఒడ్డుకు చేరడానికి తీరం ఏదీ? ఏ నిమిషంలో నైనా లైఫ్‌బోట్సులోకి వెళ్లమని ఆర్డర్లు రావచ్చు. తర్వాత విజిల్ వినిపించగానే చేయవలసిన పని అది ఒక్కటే. చివరి పని.

సముద్రంలో పెద్ద పెద్ద తిమింగళా లుంటాయి. అవి మమ్మల్ని నంజుకుంటాయి. కెప్టెన్ తెలివిగా నౌకను నడిపిస్తున్నాడు. భోజనం లేక మనస్సు ఆందోళనగా ఉండడం వల్ల నీరసించాను. ఆ రాత్రి ఎవరూ నిద్రపోలేదు. ఇంకా కెప్టెన్ నుండి సంకేతాలు లేవు. బాధ్యత తనదే అయినా కెప్టెన్ మాత్రం ఏం చేయగలడు? అంతలో నా కాబిన్‌లో ఫోన్ మ్రోగింది. అర్ధరాత్రి! ఏం ప్రమాదం ముంచుకొస్తుందో?! టెలిఫోన్ అందుకోడానికి పది అడుగులు నడవడం కష్టమని పించింది.

ఫోన్‌లో కెప్టెన్ గొంతు : "దాదా! పరిస్థితి చేయి దాటిపోతోంది. ఎట్లా బయటపడాలి? మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. మీరు మాకోసాయం చేయాలి

దాదా! మాకోసం ప్రేయర్ చేయండి. ప్లీజ్!" అది నాకు చివరి హెచ్చరిక. అర్ధరాత్రి కెప్టెన్ యిచ్చిన అంతిమ తీర్పు.

నా కోసం కాకపోయినా, సిబ్బంది ప్రాణాల కోసమైనా ధ్యానించాలని పించింది. ధ్యానం ప్రారంభించాను. చైతన్యం నాలోపల ఘనీభవించింది. నౌక ప్రతి కదలిక లోచూపుకు తెలుస్తోంది. బీభత్సం తెలుస్తోంది. మావలె జలమోతి ఒక ప్రాణి లాగ విలవిల్లాడుతోంది. నేను వేరు, నౌక వేరు కాదు. అదీ మాలాంటి ప్రాణి. పోతే అందరం ఒకేసారి పోతాం. బ్రతికితే అందరం బ్రతుకుతాం. తెల్లవారే వరకు నా ప్రార్థన సాగింది. ప్రకృతిని కనికరించమని మౌనంగా అర్థించాను.

ధ్యానంలో నిమగ్నమైనా బయటి కల్లోలం తెలుస్తూనే ఉంది. తెల్లవారింది. బయటకు వెళ్లాలనిపించినా వెళ్లగలిగిన పరిస్థితి లేదు. ఆపూట బ్రేక్‌ఫాస్టు రాలేదు. ఆకలీ లేదు. అందరూ చేష్టలుడిగి ఎక్కడెక్కడో నక్కారు. మధ్యాహ్నం రెండు గంటలకు కాస్త వర్షం తగ్గుతున్నట్లు అనిపించింది. అలలు మాత్రం దయ్యాల్లా ఎగిరెగిరి పడుతున్నాయి. ఒక గంట తర్వాత మార్పు తెలిసింది. నౌక ఊగడం తగ్గింది. అందరికి ప్రాణం లేచి వచ్చింది. తుఫాను తగ్గుతోంది అని మైకులో ప్రకటన. హమ్మయ్య! ప్రమాదం గడిచింది.

అందరు భగవంతునికి కృతజ్ఞత చెప్పుకున్నారు. ఎవరి ప్రార్థన వారిది. ప్రాణ భయం అందరికీ సమానమే. మనిషి శక్తిని మించిన దైవశక్తి ఏదో ఉన్నదని ప్రతి ఒక్కరికీ నమ్మకం. నౌక సాగుతూనే ఉంది. ఎన్ని కష్టాలు నష్టాలు ఎదురైనా మనిషి తన గమ్యం వైపు సాగుతుంటాడు. నౌక అంతే. తన గమ్యం దిశగా సాగుతోంది.

38 రోజుల తర్వాత 'తైవాన్' హార్బరు చేరుకున్నాం. రెండు రోజులు సెలవు ప్రకటించారు. నేలపైన నడిచే అదృష్టం కలిగింది. నౌకలో వలె తూలుతూ, కదులుతూ నడవ నవసరం లేదు. నేలపైన నడుస్తుంటే ఎంతో ఆనందం కలిగింది. మనిషికి ఎంత రక్షణ?

రెండు రోజుల్లో నౌక సిద్ధమైంది. ఈసారి ప్రయాణం మరీ దీర్ఘం. పసిఫిక్ మహా సముద్రం. అది దాటితే అమెరికా చేరినట్లు. తైవాన్‌లో షిప్ ఏజంటు నా కోసం వచ్చాడు. ప్రొప్రయిటర్ కాబిన్‌లో ప్రయాణం చేయడం గొప్ప. నా కోసం పళ్లు, స్వీట్సు తెచ్చాడు. తుఫాను ముచ్చట్లు అడిగాడు.

'మనిషి ఏర్పరచుకునే బంధాలు, అనుబంధాలే బాధలకు కారణాలు. విచారాలకు, విషాదాలకు మూలహేతువులు. మనిషికి విశ్వం గురించిన జ్ఞానం

ఉండదు. అవగాహన ఉండదు. 'జీవి' ఆద్యంతాలతో మనిషికి స్పృహ లేదు. సృష్టిలో మనిషి ఒక అణువు. జీవితం అంటే అగోచరం నుండి అగోచరంలోకి బదిలీ. అగమ్యంలో నడయాడటం. అనంతంలోకి సాగడం. తుఫాను నాకు చాలా జీవిత సత్యాలు నేర్పింది.' అదే ఏజంటుకు చెప్పాను.

'ఇది జీవితాంతం జ్ఞాపకం ఉండే అనుభవం'.

ఆ రోజు తైవాన్‌లో ఏదో పండగ. వీధుల్లో జనం ఆనందంగా తిరుగుతున్నారు. నేను పట్టణం కలయ తిరిగాను. నౌకా సిబ్బంది తర్వాత ప్రయాణానికి కావలసిన సరంజామా ఏర్పాటు చేసుకుంటున్నారు. రిపేర్లు చేస్తున్నారు. ప్రస్తుతానికి గండం గడిచింది. ఎలాగో బయటపడ్డాం. ఇక పసిఫిక్ మహాసముద్రంలో ఎక్కడా ఆగేది లేదు అమెరికా తీరం చేరేవరకు. మూడు వారాల ప్రయాణం.

'తైవాన్' హార్బర్ వదిలింది జలమోతి. ఈ ప్రయాణంలో తుఫానులు ఉండవని గ్యారంటీ లేదు. ఎవరికి తెలుసు సముద్రం ఎప్పుడు నవ్వుతుందో, ఎప్పుడు ఆగ్రహిస్తుందో! అమెరికా చేరేలోపు ఏం జరిగినా ఎవరూ బాధ్యులు కారు. అదృష్టం బావుంది ... మూడువారాలు ఏ అవాంతరం లేకుండా ప్రయాణం సాగింది. ప్రయాణం తూర్పుగా. భోజనాలు, టిఫిన్ వేళలు మారుతున్నాయి. గడియారంలో టైం గంట గంటకు మారుతోంది. శరీరం గడియారంలోని ముల్లులకు అనుగుణంగా సర్దుకుపోతూంది. నా కాలం మంకీడెక్ పైన ఎక్కువ సమయం ధ్యానంలో గడుస్తోంది. అమెరికా జీవనానికి అది నాంది.

మొత్తం మీద అరవైరోజులు ప్రయాణం చేసి, జలమోతి కాలిఫోర్నియా తీరం చేరింది. గోల్డెన్ గేట్ బ్రిడ్జి దాటి నౌక జలసంధిలో ప్రవేశించింది. కళ్ల ముందు శాన్‌ఫ్రాన్సిస్కోపై అందాల తెర లేచింది. హృదయాలు ఆనందంతో పులకించ సాగాయి.

నా అమెరికా కల సాకారమైంది.

కొత్త ప్రపంచంలోకి వచ్చాను. ఇక్కడ ఏం కానున్నదో! తెలిసిన వారు ఎవరూ లేరు. కొన్ని రోజులైనా ఉండగలనా? లేక ఇదే నౌకలో ఇండియా తిరిగిపోవాలా? హార్బరు చేరేవరకు అవే నా ఆలోచనలు. అయినా నా లోపల ఉత్సాహం నిరాశపడనీయలేదు. నన్ను నడిపిస్తున్న చైతన్యం, అగోచర శక్తి నన్ను రక్షిస్తుందని నమ్మకం.



13. అమెరికాలో తొలి అడుగు

నౌకా సిబ్బంది యూనిఫారం వదలి మామూలు దుస్తుల్లోకి మారారు. అందరూ ఆనందంగా, ఉత్సాహంగా ఉన్నారు. కొన్ని రోజులు హాయిగా, నిశ్చింతగా, సరదాగా అమెరికా గడ్డపైన గడపవచ్చు. నేనూ పెట్టె బేడా సర్దుకుని డెక్‌పైన సిద్ధంగా ఉన్నాను. నా చూపులు 35 ఏళ్ల గడ్డం వ్యక్తి కోసం వెతకసాగాయి. కెన్‌రీడ్ అనే వ్యక్తి గురించి డా. రావు నాకిచ్చిన సమాచారం అంతవరకే. అతని అడ్రసు కూడా తెలియదు. హార్బరుకు వచ్చి రిసీవ్ చేసుకుంటాడని చెప్పడంతో బోలెడు ధీమాగా ఉన్నాను. అతనే నేను అమెరికాలో కలుసుకోవలసిన వ్యక్తి. వాణిజ్య నౌకలు రావలసిన రోజుకు, వేళకు రావు రైళ్లలాగా, విమానాల్లాగ. పైగా వాటిల్లో ప్యాసింజర్లు ఎక్కరు కనుక హార్బర్‌లో స్వాగతం చెప్పే జనం ఎవరూ లేరు. కొంచెం సేపు నా కళ్లు వెదికాయి గడ్డం కోసం? ఎవరూ రాలేదు.

ఇప్పుడేం చేయాలి? ఒక ఉద్యోగి వచ్చి నా ఏర్పాట్లు గురించి అడిగాడు. 'ఓ అమెరికన్ మిత్రుడు రావలసింది, రాలేదు' అన్నాను కాస్త నిరాశగా. పుర్సన్ అన్నాడు : "ఈ నౌకలు ఎప్పుడొస్తాయో ఆ భగవంతుడికే తెలియదు. కెన్‌రీడ్ పగలు వచ్చి పోయి ఉంటాడు. ఫరవాలేదు. మీరు వెళ్లి కాబిన్‌లో ఉండండి. అతను వస్తే మీకు తెలియచేస్తాను."

అతను కాస్త దయ చూపించాడు. కొంచెం సేపు చూచి, కాబిన్‌కు తిరిగి వచ్చాను. ఏమిటి నా పరిస్థితి? అర్థం కావడం లేదు. కలవరపడి చేసేది లేదు. సహనం తప్పదు. సాయంత్రం వరకు ఎవరూ రాలేదు. పుర్సన్ వచ్చి చెప్పాడు : "మూడు రోజులు నౌక ఇక్కడే ఉంటుంది. అంతవరకు కాబిన్ ఉపయోగించు

కోండి. అసలైతే మా షిప్ ఆరువారాలలో అంటే 45-50 రోజుల్లో శాన్‌ఫ్రాన్సిస్కో చేరాలి. అలాంటిది 60 రోజులు పట్టింది. అనుకున్న రోజుకు వచ్చి కలవడం ఎవరికైనా కష్టమే."

ఆ రోజు ఎలాగో గడిచింది. 'మంకీడెక్' పైన ఒంటరిగానే గడిపాను. రాత్రి వెలుగుల్లో నగరం బహు సుందరంగా ఉంది. విశాలమైన భవనాలు. ఆకాశ హర్మ్యాలు. డెక్‌పైన చలిగా ఉంది. లక్షలాది కార్ల మోతలు శాన్‌ఫ్రాన్సిస్కో దీపాల పందిరిలా ఉంది. ఆ నిశీధిలో జ్ఞాపకం వచ్చింది – ఆ రోజు నా పుట్టిన రోజని. సెప్టెంబరు 4. ఇలా ఒంటరిగా పండుగ జరుపుకుంటున్నాను. కాదు జ్ఞాపకం చేసుకున్నాను అంతే. దేశం కాని దేశంలో ఆ రాత్రి చాలా దిగులు పడ్డాను నా పరిస్థితికి. ఒక పరదేశంలో ఏమిటీ యాతన. అంతా అగమ్యం!



కాలిఫోర్నియాలో యోగాటీచర్స్‌తో సెమినార్

ఉదయం నిద్రలేచేసరికి నౌక మంచులో తడిసి ముద్దయింది. రాత్రి కనువిందు చేసిన నగరసౌందర్యం ఇంకా నిద్ర లేవలేదు. బ్రేక్‌ఫాస్టు తర్వాత స్నానం చేసి రెడీ అయ్యాను. కెన్‌రీడ్ అనే మహానుభావుడు వచ్చాడేమో వెళ్లి వాకబు చేయాలి గదా! అతను రాలేదు. మూడవ రోజునా రాలేదు. ఇంక నౌక బయలుదేరుతుంది. అక్కడ నుండి కెనడా వెళుతుంది. నా వద్ద కెనడా వీసా లేదు. కనుక ఓడలో కెనడా వెళ్లే అవకాశం లేదు.

శాన్‌ఫ్రాన్సిస్కోలోని స్కిండియా స్టీమ్ కంపెనీ ఏజంటు నా గురించి తెలిసి వచ్చి, తమ ఆఫీసుకు తీసుకువెళ్లాడు. లాస్ ఏంజల్స్ ఫోన్ డైరెక్టరీలో ఆ పేరును వెతికాడు. కెన్‌రీడ్ పేరుగల వాళ్లు కొన్ని వందల మంది ఉన్నారు. వారిలో నా 'కెన్' ఎవరు? పాపం! ఆ ఏజంట్ ఓపిగ్గా ఒక్కొక్క నంబరే డయల్ చేశాడు. నాకు సహాయం చేయాలని చాలా శ్రమపడ్డాడు. నాకు తెలిసిన సమాచారం –

అతని వయస్సు 35, గడ్డం ఉంటుంది. లాస్ఏంజల్స్‌లో అతనికి ఒక పుస్తకాల షాపు ఉంది. ఏజంటు ఓ పదిహేను మందికి ఫోన్ చేశాడు. అతనికీ విసుగు పుట్టింది. అంతసేపు ఆ ఏజంటుగారి భార్య అతనికోసం నిరీక్షిస్తూ ... మా అవస్థ గమనిస్తోంది. ఆమె నా దగ్గరకు వచ్చి ఏవేవో అడిగింది. తనూ కొన్ని నంబర్లు ప్రయత్నిస్తానన్నది. ఫలితం లేకపోయింది. ముగ్గరం నిరాశ చెందాం.

మాటల సందర్భంలో నాకో విషయం జ్ఞాపకం వచ్చింది. హరేకృష్ణ సొసైటీలో నాకు లైఫ్‌టైం సభ్యత్వం ఉంది. వారికి అమెరికాలో చాలా దేవాలయాలున్నాయి. శాన్‌ఫ్రాన్సిస్కోలోనూ ఒక పెద్ద ఆలయం ఉంది. 'నేను అక్కడికి పోతాను. కెన్‌రీడ్ ఆచూకీ తెలిసేవరకు అక్కడే ఉంటాను'.

అది వారికి నచ్చింది. ఆ దేవాలయం ఆమెకు తెలుసునంది. మర్నాడు తానే స్వయంగా తీసుకువెళ్లి పరిచయం చేస్తానన్నది. ఆ రోజు రాత్రి కాబిన్‌లో గడిపాను.

ఏజంటుగారి భార్యామణి మాట చెప్పినట్లే మర్నాడు ఉదయం నన్ను హరేకృష్ణ మందిరానికి చేర్చింది.

ఆమె అడిగింది : "మీకు ఏ సంస్థతో, మత సిద్ధాంతంతో పొత్తు లేదన్నారు. హరేకృష్ణ ఫౌండేషన్ సభ్యత్వం ఎందుకు తీసుకున్నారు?"

"అదో పెద్ద కథ తల్లీ! ఒకసారి ఎప్పుడో షీలా ప్రభుపాదను కలవడం జరిగింది. వారే నాకు హరేకృష్ణ సంస్థలో లైఫ్ మెంబర్‌షిప్ కార్డు బహూకరించారు. ఆ కార్డు ఉన్నవారు మందిరంలో కొన్నాళ్లు అతిథులుగా ఉండవచ్చు. నా లాగానే షీలా ప్రభుపాద స్కిండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీ కార్గోషిప్‌లో కాంప్లిమెంటరీలో అమెరికా వచ్చాడు. ఆయన నాలాగ అమెరికాలో ఎవరూ తెలియని పరిస్థితిలోనే వచ్చారుట."

ఏజంటుగారి భార్యామణి ముందుగా హరేకృష్ణ అధిపతికి వెళ్లి నా గురించి చెప్పింది. వారు చాలా గొప్పగా ఆదరించారు. కెన్‌రీడ్ గురించి ఆమె వారికి చెప్పింది. ఎప్పుడు అవసరమైనా ఫోన్ చేస్తే వస్తానని చెప్పి వెళ్లింది. మనసున్న మగువ.

దేవాలయంలో నాకిచ్చిన గది చిన్నది. చిన్న పడక. గది శుభ్రంగా ఉంది. ఇండియన్ చేనేత బెడ్‌షీట్ వేశారు. తృప్తిగా ఉంది. అయితే ఎంతకాలం? లోపల విశ్వాసం చెదరడం లేదు. దేవాలయంలో నా గౌరవార్థం ప్రసాదం చేయించారు.

భగవంతునికి ప్రసాదం కైంకర్యం చేశారు. వారి ఆతిథ్యానికి హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు చెప్పాను. కెన్‌రీడ్ గురించి ఏం చేయాలా అని ఆలోచన.

ఆ గదిలో వారం దినాలు గడిపాను. కనీసం శాన్‌ఫ్రాన్సిస్కో చూడడానికైనా బయటకు పోలేదు. రీడ్ తప్ప ప్రస్తుతం ఈ దేశంలో చూడదగ్గ వ్యక్తి మరొకరు లేరు. విషమ పరిస్థితి. దేవాలయంలోని ఉద్యోగి టెలిఫోన్ ఉపయోగించుకోడానికి అనుమతి యిచ్చాడు. ఎన్ని నంబర్లు డయల్ చేసినా ఫలితం శూన్యం.

అలాంటి పరిస్థితిలో ధ్యానం ఒక్కటే రక్షణ. ధ్యానంలో ఆలోచనలు నశించి, మనసు శూన్యమవుతుంది. శూన్యంలో సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

ఒకనాడు దేవాలయం ఆఫీసుకు వెళ్లి రెండు నంబర్లు తిప్పాను. రెండవ నంబరులో కెన్‌రీడ్ కలిశాడు. "మీకు బుక్‌షాపు ఉందా?" అది నా మొదటి ప్రశ్న. మీకు గడ్డం ఉందా? అని అడగలేం కదా! "అవును ఉంది." రెండవ ప్రశ్న "మీకు ముంబయ్‌లో జయరావు తెలుసునా?" అవు నన్నాడు.

హమ్మయ్య ఇతగాడే అతగాడు! ఇప్పుడు తను లాస్‌ఏంజల్స్‌లో ఉంటున్నాడట.

"నేను శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్నాను. రండి".

"రావు నాకు లెటర్ రాశారు మీరు వస్తున్నట్లు. చాలా కాలం క్రిందట. ఏ రోజున మీరు వచ్చేదీ రాయలేదు".

ఆరు వారాల్లో రావలసిన షిప్ రెండు నెలలకు వచ్చింది. ఏం జ్ఞాపకం ఉంటుంది. రీడ్ నేను వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశాడు.

"రెండు రోజుల్లో వచ్చి పికప్ చేసుకుంటాను అక్కడే ఉండండి" అన్నాడు. అన్నట్లే వచ్చాడు. హమ్మయ్య! పెద్ద దిగులు తీరింది. అమెరికాలో ఒకడు దొరికాడు! ఇన్ని రోజులు ఆతిథ్యం యిచ్చినందుకు హరేకృష్ణ మందిరం వారికి థాంక్స్ చెప్పాను. హోటళ్లలో ఉండాలంటే అయ్యేపని కాదు.

రీడ్ తన కారులో లాస్ ఏంజల్స్‌కు తీసుకువెళ్లాడు. 500 కి.మీ. ప్రయాణం. హాయిగా ఉంది. వెడల్పాటి రోడ్లు, ట్రాఫిక్ తక్కువ. ఏడెనిమిది గంటల్లో లాస్ ఏంజల్స్ చేరాం. నా గురించి చాలా వివరాలు అడిగాడు రీడ్. అతను లోగడ ఇండియా వచ్చాడు కనక నా ఇంగ్లీషు జీర్ణించుకోగలిగాడు. అమెరికన్ స్పీడులో, యాసలో కాక, నాతో నెమ్మదిగా స్పష్టంగా మాట్లాడాడు. అతని వల్లనే అమెరికన్ ఇంగ్లీషు అలవాటైంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో అమెరికన్స్ స్పీడు ఎక్కువ. వారిని, వారి

భాషను అర్థం చేసుకోవడం కష్టం. ఒకోసారి మాటలు, వాక్యాలు మింగేస్తుంటారు. మనకు అర్థమయ్యేలోపు వారు ఎక్కడికో వెళ్లిపోతారు. వాళ్ల ఇంట్లోనే నా మకాం. తన పుస్తకాల షాపు చూపించాడు. భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాలు, ధ్యానం, యోగం మీద చాలా పుస్తకాలున్నాయి. అతని కస్టమర్లు ఆ విషయాలపట్ల ఆసక్తి కలవారే.

షాపు నుండి ఇంటికి వచ్చాక కబుర్లు చెప్పేవాడు. నెమ్మదిగా నేచెప్పే విషయాలపట్ల ఆసక్తి చూపాడు. నా ధ్యానం, శక్తిపాతం గురించి వివరాలు అడిగాడు. తన మిత్రుల్ని, షాపుకు వచ్చేవారిని ఇంటికి ఆహ్వానించి నాకు పరిచయం చేయాలని ఆలోచించాడు. నేను ఉపన్యాసాలు ఇవ్వకుండా వారడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పేవాడిని.


ఆ పద్ధతి మొదట కాస్త ఇబ్బందిగా ఉన్నా క్రమంగా నాకు ఇంగ్లీషుపైన పట్టు దొరికింది. అప్పటికి అమెరికన్ ఇంగ్లీషు అర్థం చేసుకోగలిగాను. మహాబ్లేశ్వర్‌లోని ఒక చిన్నయోగి లాస్‌ఏంజల్స్‌లో విద్యావంతులతో చర్చించడం. మహాబ్లేశ్వర్ అరణ్యవాసంలో నాకు ఆలోచించవలసిన అవసరమే కలగలేదు. అక్కడ చేయవలసిన పనులు ఉండేవి కావు. అవసరాన్ని బట్టి అన్నీ సమకూరు తుండేవి. ఇప్పుడు కూడా ఆలోచించను. నే చెప్పే విషయాలకు ఒక తీరూ తెన్నూ ఉండదు. నేను ఎవరినీ కోట్ చేయను. నాకు సిద్ధాంతాలు తెలియవు. అంతరాత్మపైన ఆధారపడతాను.

సమావేశాల విషయంలో రీడ్ చాలా మనసుపెట్టాడు. శ్రద్ధ చూపించాడు. నా భావాలు బావున్నాయని, ఈ కాలం మేధావులకు పనికొస్తాయని ప్రోత్స హించాడు. సంభాషణలు రికార్డు చేస్తానన్నాడు. నేను ఒప్పుకోలేదు. తర్వాత్తర్వాత నాకు తెలియకుండానే టేప్ రికార్డు చేసేవాడు.

టేప్స్‌లో నాగొంతు వింటే నాకే ఆశ్చర్యం వేసింది. నేను అప్రయత్నంగా చెప్పిన విషయాలే అయినా, శ్రోతల్ని ఆకట్టుకునేలా ఉన్నాయి. నాపైన నాకు కాస్త విశ్వాసం పెరిగింది.

ఆ తర్వాత నా సంభాషణలు అన్నీ రికార్డు చేస్తూండేవాడు.

అప్పటికి నాకు తెలియదు ... ఆ చిరు పరిచయాలు అమెరికాతో నాకు పెద్ద అనుబంధం కలిగిస్తాయని.



14. మనస్తత్వవేత్తలతో ...

మొదట్లో నా పరిచయాలు చాలా పరిమితంగా ఉండేవి. ఒకరో, ఇద్దరో వచ్చి కలుస్తుండేవారు. వారైనా కెన్‌రీడ్‌కు తెలిసినవారు. వాళ్లు తర్వాత వాళ్ల సన్నిహితులతో చెప్పేవారు. అలా క్రమంగా జిజ్ఞాసుల రాక పెరిగింది. చర్చలు, చిన్నచిన్న సమావేశాలు ఎక్కువైనాయి. 'లాస్ ఏంజల్స్ టైమ్స్' పత్రిక రిపోర్టరు నన్ను ఇంటర్వ్యూ చేసి, నా ఫోటోతో పరిచయ వ్యాసం ప్రచురించాడు. దాంతో ప్రచారం ఊపందుకుంది. ఫోన్‌కాల్స్ ఎక్కువైనాయి.

వచ్చే వారంతా యువకులు. 20–30 ఏళ్ల మధ్యవయసు వారు. నేను చెప్పే విషయాలు శ్రద్ధగా వినేవారు. పరిశోధనా రంగంలోని యువ సైకాలజిస్టులు కొందరు వచ్చారు. వారికి చర్చనీయాంశం మెదడు, మనస్సు. బ్రెయిన్ గురించి వారు చదివింది వేరు. నేను చెప్పేది భిన్నంగా ఉండేది. మెదడు పనిచేసే తీరుపై వారి ఆలోచన, మనస్సుపై నా అవగాహన ఉండేది. చాలా శ్రద్ధగా నోట్సు రాసుకునేవారు.

వారి ప్రశ్న : మనసు దాటిపోతే తెలిసేది ఏముంటుంది? తెలుసుకునేది ఎలా?

మంచి ప్రశ్న. జిజ్ఞాస కలిగించే ప్రశ్న. ఆలోచింపచేసే అంశం. మనసు మినహా వేరే 'ప్రజ్ఞ' ఏదీ ఉండదని వారి అభిప్రాయం. మనస్సు, జ్ఞానం, వివేకం, ప్రజ్ఞ అన్నీ మనసు పరిధిలోనివే నంటారు వారు. ఆలోచన కలిగించేది, అవగాహన కలిగించేది మనసేనని వారి వాదన. అసలు లాజికల్‌గా, రేషనల్‌గా ఆలోచించ గలగడమే గొప్ప జ్ఞానలక్షణం అని వారి నమ్మకం. మనిషికి, పశువుకు భేదం

మనసు, ఆలోచనే అంటారు. వారి దృష్టిలో బుద్ధి వికసించడమే ప్రజ్ఞ. శారీరక శక్తి లాంటిదే మానసిక శక్తి అని వాదించారు. ఆ రెండూ కాక మనిషిలో మరొక శక్తి కేంద్రం ఉన్నదంటే వారికి అర్థం కాదు. అది నమ్మదగ్గది కాదని, ఎలా నమ్మమంటారని వాదించారు.

నేను కాస్త ఓర్పు, సహనం పాటించక తప్పలేదు. వారు మేధావులు. వారికి తెలిసింది అంతవరకే. అగోచర శక్తి గురించి చెప్పి అమెరికన్లను, ఐరోపా వారిని ఒప్పించడం చాలా కష్టం. వారికి అతీంద్రియ శక్తి గురించి బొత్తిగా అవగాహన ఉండదు. నేనన్నాను! "మీరు చదువుకుని, నేర్చుకున్న విషయాలు పరిజ్ఞానం. దానిని అవతల పెట్టండి. దాని గురించి మరచిపోండి. నా అనుభవాలు చెబుతాను. మీరు ఒక చట్రంలో దూరి ఆలోచిస్తున్నారు. మీ ఆలోచనలు ఆ చట్రం దాటి బయటకు రావడం లేదు. మీ చుట్టూ వివేకం అనే వలయాన్ని ఏర్పరచుకున్నారు. ఆ వలయం సరిహద్దులు చెరిపేయండి.

మేధతో సంబంధం లేకుండా, మనస్సుతో సంబంధం లేకుండా జ్ఞానం పొందవచ్చు. మనస్సుకు అవతల, బుద్ధిమండలంపైన, అసలు సిసలైన, స్వచ్ఛమైన జ్ఞానభూమిక ఉంటుంది. మన మనసులో జ్ఞాపకాలపందిరి వేసి ఉంటుంది. అది లాజికల్. అక్కడ మంచిచెడుల్ని విశ్లేషించడం జరుగుతుంది. దానిని మీరు ఇంటలిజన్స్ అంటారు. అది వివేకం. వివేకంతో నిర్ణయాలు చేస్తుంటారు. మనసే మీకోసం సిద్ధాంతాలు తయారు చేస్తుంది. ప్రతి పనికి ఆలోచన అవసరం అనుకుని మనస్సుపై ఆధారపడుతున్నారు. నే చెప్పేది ఏమంటే 'సర్వజ్ఞం' అనుకుంటున్న మీ మనస్సుకు కొన్ని సరిహద్దులు, పరిమితులు ఉన్నాయని.

మనసుకున్న పరిమితుల్ని గమనించండి. మనసు ఒక ఆలోచన పట్టుకుని వేలాడుతుంది. గతంలోకి జారిపోయిన సంఘటనలు, విషయాలు తవ్వి తీస్తుంది. భవిష్యత్తు గురించి లేనిపోనివి ఊహిస్తుంది. అవన్నీ కల్పనలు. అవి వాస్తవం కావాలని లేదు. మనసు ఎప్పుడూ సమాజం నీడలో పనిచేస్తుంది. మనసుపైన సమాజం ప్రభావం అధికం. అంటే పరిసరాల ప్రభావం మనసుపైన ఎక్కువగా ఉంటుంది.

మనస్సును గమనించడం నేర్చుకోండి. ఆలోచనలకు స్పందించవద్దు. తీవ్రంగా గమనించండి. మనసు తన ఇష్టం వచ్చిన నిర్ణయాలు చేసి, మనపైన రుద్దుతుంది. అవి వాస్తవికాలు కాదు. సత్యాలు అంతకన్నా కావు. సత్యసమ్మతాలు కావు. మీరు రష్యాలో ఉంటే మీ ఆలోచనలు ఒకలా ఉంటాయి. ఫ్రాన్సులో

ఉంటే మరొకలా ఉంటాయి. ఇండియాలో ఉంటే మరొక విధంగా ఆలోచిస్తారు. అంటే ఏమిటి? మన ఆలోచనలు దేశ, కాల, సామాజిక పరిస్థితుల్ని బట్టి మారుతుంటాయి. మన నిర్ణయాలూ అందుకు తగినట్లే ఉంటాయి. మనిషికి తెలివి ఉంది. జ్ఞానం ఉంది. కాని అది అక్కడి సంస్కారం, సమాజం బట్టి ఉంటాయి. మారుతుంటాయి.

ప్రాయికంగా మనసు అనేది ఒక యంత్రం. దానికి సమాజం, సంప్రదాయం, చదువు, సంస్కారం, రాజకీయాలు రంగులద్దుతుంటాయి. మనస్సు అతి తెలివిని ప్రదర్శిస్తుంది. అనవసర సమాచారం ప్రోగు చేసి, అదంతా జ్ఞానం అంటుంది. కాని ఒక్క సత్యం తెలుసుకోదు – తన వివేకం పరిమితమని. కనుక జీవిత సత్యం ఏదో మనస్సు తెలుసుకోలేదు, పట్టుకోలేదు. మంచిచెడుల్ని గ్రహించదు. పరిమితులకు లోబడి పనిచేసేది మానసిక యంత్రం. అది ఎన్నటికీ సత్యాన్ని తెలుసుకోదు. సత్యం అపరిమితం. అన్ని హద్దులు, నిబంధనలు దాటిన తర్వాతది సత్యం. అసలు మన ప్రధాన జీవిత సమస్య దేనినీ ఇంతవరకు మనసు పరిష్కరించ లేదు. ఆ పని చేసేది, చేయగలది సాధనతో రాటుదేలిన అతీత మానసం. అది అతీంద్రియ ప్రజ్ఞ, దిక్సూచి. శిక్షణ యిచ్చిన రీతిలో మనస్సు ఆలోచిస్తుంది తప్ప దానికి సత్యదృష్టి ఉండదు.

కనుక మన మానసిక విశ్లేషణలు, నిర్ణయాలు వాస్తవాలు కావు. సత్యాలు కాబోవు. ప్రతి ఒక్కరి మనసు తను పొందిన శిక్షణ మేరకు అదే సంస్కారంతో ప్రపంచాన్ని చూస్తుంది, నిర్ణయాలు చేస్తుంది. సమస్యలకు అన్వయించి పరిష్కారాలు వెదుకుతుంది. సామాజిక, రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా ఇతరేతర ఒత్తిడులకు తలొగ్గకుండా ఉంటే మనం సత్యాన్ని నేరుగా గమనిస్తాం.

ఇప్పుడు మన తక్షణ కర్తవ్యం ఏ ప్రలోభాలకు లోనుకాని స్వచ్ఛమైన మనసును సాధించడం. లేకపోతే సమస్యల పరిష్కారం సాకుతో కొత్త సమస్యల్ని సృష్టించుకోవడం జరుగుతుంది. అనవసరమైన ఒత్తిళ్లకు గురవుతుంటాం. అన్ని మతాలు, మత విశ్వాసాలు మనుషుల్ని విశ్వాసాల ఉచ్చు బిగించి, యుద్ధాలు తెచ్చి పెట్టాయి. కల్లోలాల్ని సృష్టించాయి. మనసుల్ని పాడుచేసి పెట్టాయి. చివరకు మానవత్వాన్నే మంట కలిపాయి. కనుక 'నియతి' అనేది రాజకీయం అయినా, సామాజికం అయినా, మతం అయినా మనిషి స్వేచ్ఛను హరించేదే అవుతోంది. మనసును స్వేచ్ఛగా ఉండనీయటం లేదు. మనిషిని ఆనందంగా బ్రతకనీయదు. అలా కట్టడికి లోనైన మనసు లోపల, బయట, ఎక్కడా ప్రశాంతి పొంద వీలుండదు."

ఆ వచ్చిన వారు సైకాలజిస్టులు, సైకో ఎనలిస్టులు కనుక శాస్త్రీయ అవగాహన కోసం, సైన్సు మనిషిని ఎంతగా ప్రభావితం చేస్తున్నదీ చర్చించారు.

నా వివరణ : “మన సైంటిస్టులు చేస్తున్న పని అదే. ‘మానవ మస్తిష్కం’ పైన పరిశోధనలు చేస్తున్నారు. అయినా మనస్సుతో మనస్సును పరిశోధిస్తున్నారు. అలా కాక ‘మనస్సు’ వలయం దాటి బయటకుపోయి మనస్సును పరిశీలించాలి. ‘ఆలోచన’ దాటిపోయి ఆలోచనల్ని గమనించాలి. అది సూత్రం. అప్పుడే ‘టోటల్’గా పరీక్షించవచ్చు. గమనించవచ్చు. అది శూన్యం నుండి చేసే పని. లాబొరేటరీల్లో పరిశోధన వంటిది కాదు ... మనస్సుపై పరిశోధనలు జరపడం. మనలోకి మనం చూచుకోగలగాలి. మనలోని శూన్యాన్ని తరచి చూడాలి. ఆలోచించే మనస్సును, దాని కల్లోలాలను, పెత్తనాల్ని, కార్య కలాపాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి.

వాస్తవంగా మన మనస్సు గురించి మనకు తెలియదు. ఏదో ‘మన’ మనస్సు అని మురిసిపోతాం. మనసు మనల్ని పాతబాటల్లోనే నడిపిస్తుంది. ఆలోచింప చేస్తుంది. కొత్తను అంగీకరించదు. ఆమోదించదు. మన అవసరాలు, కోరికలు తీరడానికి దానిని ఆశ్రయిస్తాం. తళుకులు, బెళుకులు చూచి మురిసిపోతుంటాం. నిజానికి మన ప్లానులు, నిర్ణయాలు, అభిప్రాయాలు అన్నీ ఆ యంత్రంలో రెడీగా ఉన్నవే. మనం ఆలోచించాం అనుకుంటాం. కాని అవే బయట పడుతుంటాయి. అవి సత్యాలని భ్రమపడతాం. మన చదువుల నిర్వాకం అది.”

వారిని స్వతంత్రంగా పరిశోధన చేయమని ప్రోత్సహించాను. అనియతంగా, సంకల్ప రహితంగా, నిరాలోచనగా గమనించడం నేర్పాను.

“ప్రతి ఒక్కరు మనసుతోనే పుడతారు. అది చాలా గొప్పదని మన అభిప్రాయం. అది అసమగ్రం అని తెలుసుకోండి. మనం సంపూర్ణంగా జీవించడానికి ఆ మనసు సరిపోదు. ఆధ్యాత్మిక అవగాహనకు ఆ మనసు అసలు పనికిరాదు. మన అవసరాన్ని బట్టి చదువులు పెరుగుతున్నాయి. అవసరాన్ని బట్టి అవకాశాలు పెరుగుతున్నాయి. అవే మన విజయానికి గీటురాళ్లు. నిజానికి అవి విజయాలా? అంతేనా జీవితం? తాము కోరినవన్నీ సంపాదించి గమ్యం చేరడం కాదు. లక్ష్యం వేరే ఉంది. వ్యాపారాలలో, రాజకీయాల్లో, సమాజంలో ఎందరు తృప్తిగా, ఆనందంగా ఉంటున్నారు? శాంతిగా, ప్రేమగా జీవిస్తున్నారు? భయం, ఆగ్రహం, అనుమానం, ఒత్తిడి లేని మనిషి ఉన్నాడా? మనస్సు ఎప్పటికీ తృప్తిపడదు. శాంతించదు. కనుక మనస్సనే యంత్రాన్ని లోతుగా అధ్యయనం

చేసే అవసరం కలగడం లేదు. అసలు మనసు స్వభావం ఏది? ప్రస్తుతం అది చేస్తున్నదేమిటి? ఆలోచన యంత్రంతో మీరు ఎప్పుడైనా సుఖపడ్డారా!"

'అన్ని రంగాలలో పరిశోధనలు జరుగుతున్నాయి కదా?' వారి సందేహం. నేనంటాను! "పరిశోధనలు జరుగుతున్నాయి. కాని ఫలితాలు ఏవి? మనస్సు పైన పరిశోధనలు ఎవరు చేస్తున్నారు? మనస్సుతో చేస్తున్న పరిశోధనలు మీవి. మనస్సు మీద పరిశోధనలు కావు. మీ లోపలకు చూడడం నేర్చుకోండి ముందు. ఏం కనిపిస్తుంది – కలలు, కోరికలు, కోపాలు, తాపాలు, క్రియలు, ప్రతిక్రియలు, కరిగిపోతున్న ఆలోచనలు, ఎగిరిపడే భావాలు. ఇవన్నీ మనస్సు యొక్క ఉపరితల విశేషాలు. పైపై హడావుడి! దానినే మనస్సు అంటే ఎలా? లోపలకు వెళ్లండి.

మన లోపలి నిక్షేపాల్ని తెలుసుకోవాలి. అది మనల్ని నడిపేది, మన పనుల్ని, స్వభావాన్ని నిర్దేశించేది అదే. మన కామనల్ని, కోరికల వలల్ని తీర్చిదిద్దేది అదే. మనలో ఉన్న ఆ 'నియంత' మనకు తెలియదు. అదే మనల్ని నియంత్రించే శక్తి. అంటే మన ఆలోచనల తీరు మారాలి. పూర్తిగా మారాలి. చిన్న మార్పులు, చేర్పులు చాలవు. మనస్సును మత్తుగా నిద్ర పుచ్చడం కాదు. చైతన్య పూర్ణం చేయాలి. పూర్తిగా చైతన్యంతో, జాగృతితో నింపాలి. విప్లవాత్మకమైన మార్పును ఆహ్వానించాలి.

మనం మారవలసిన అవసరం ఉన్నదని గ్రహించడం ముఖ్యం. అప్పుడు మన దృక్పథం మారుతుంది. దృష్టి మారుతుంది. అవగాహన పెరుగుతుంది. అదే సృజనశక్తి, జీవశక్తి. నిజమే ఆలోచించడం గొప్పకళ. మనస్తత్వ శాస్త్రజ్ఞులు ఉద్రేక స్వభావం కలవారు. ఆలోచనా యంత్రం పనిచేయకపోతే మనిషి చనిపోయి నట్లే నంటారు. లేదా ఉన్మాది అవుతా డంటారు. కాదు. జ్ఞాని అవుతాడు. ఆలోచన 'అవసరం' లేనివాడు జ్ఞాని. అలా అంటే మీరంతా దేబ్య మొహాలు పెడతారు. నేను ఎప్పుడూ చెప్పేది అదే. గమనించడానికి కావలసింది చైతన్యం, స్ఫూర్తి అని. అదే చైతన్యదీప్తి. అదే చేతనావర్తం. లోపలికి వెళ్లినకొద్దీ మనస్సుకు పని తగ్గి, మనిషిలో సున్నితత్వం పెరుగుతుంది. చివరికి అదే స్ఫూర్తి. మనసు హద్దుల్ని దాటించి ప్రజ్ఞ దిశగా తీసుకుపోతుంది."

వీరు విద్యావంతులు, వివేకవంతులు. వీరికి పరం గురించి, 'ప్రజ్ఞ' గురించి బోధించడం కష్టం. నెమ్మదిగా రంగ ప్రవేశం చేస్తున్నారు. మనసు బాట వదలి, నా మార్గంలోకి వస్తున్నారు. రావడానికి ప్రయత్నిస్తున్నారు. మతంతో, మానసిక

మాధ్యమంలో 'ప్రవేశాత్మ' ప్రస్థావన ఉన్నదని అంగీకరించారు. అది ఏమిటో వారికి తెలియదు. దాని వైనం తెలియదు. రకరకాల సిద్ధాంతాలు ఉన్నట్లు అంగీకరించారు. అనుభవం మాత్రం లేదు.

ఈనాడు ప్రపంచంలో 'మానవత' కొత్త చైతన్యం కోసం ఎదురు చూస్తోంది. నేటి విద్యావంతుల అవసరం మహాచైతన్యం అందుకోవడం – ఒక్కటే. దాని వల్లనే మనిషికి మనశ్శాంతి, మనసు దాటితే కలిగే 'మనశ్శాంతి'. అది ఆత్మశాంతి, లోకానికి విశ్వశాంతి లభిస్తాయి. నిజమైన ఆనందం అందుబాటులో కొస్తుంది.

అంటే ఏమిటి? మనిషికి తనలోని మనిషే సమస్య. మనసే సమస్య అవుతోంది. మన మనస్సును వెదకడమే అన్వేషించడం. తనలో తనను తాను అన్వేషించడం తప్ప తన మూలం తెలియదు. అలా వెతికితే తన ఆధ్యాత్మిక నిక్షేపాలు తెలుసుకుంటాడు. ఆత్మను తెలుసుకోవడమే కాక తన ఆత్మశక్తిని స్వంతం చేసుకుంటాడు. ఉపయోగించుకుంటాడు. మనస్సు కట్టడి నుండి విముక్తి పొందితే తప్ప స్వేచ్ఛ లభించదు. స్వేచ్ఛా జీవనంలోనే ఉన్నది నవ్యత, నాణ్యత. అవే సృష్టి శ్రుతి లయలు."


నా భావాలు సైకాలజీ స్కాలర్లకు మింగుడుపడినట్టు లేదు. వారికి మనసంటే ఆలోచనల కేంద్రం. ఉద్రేకాల రిజర్వాయర్. మహాప్రయత్నిస్తే కాస్త అలవాట్లను మార్చుకోగలరు. సిద్ధాంతాల మౌలికతను కాదనే సాహసం ఎవరికీ లేదు. నమ్మకాలు వమ్ముకానీయరు. పుస్తకాల్లోంచి సిద్ధాంతాలు బట్టీవేయడం వారికి తెలిసిన విద్య. సమాచార సమీకరణ వారి విద్యావైదుష్యం.

ఎంత చదివినా, అది పరుల అభిప్రాయాలను అధ్యయనం చేయడమే. వాటి ఆధారంగా మరొక నిర్ధారణ చేస్తారు. కనుక అదంతా పరిమిత జ్ఞానమే. అవి ఆయాకాలాలలోని మేధావులు ప్రకల్పించినవి, లేదా నమ్మినవి అయి ఉంటాయి. కొన్ని వారి కల్పనలు కావచ్చు. పూర్తి సత్యాలు మాత్రం కావు. అన్నీ అర్ధ సత్యాలే. పైగా పరస్పర విరుద్ధాలు, నిరాధారాలు. మొత్తం మీద అందరూ చేస్తున్నది చీకట్లో వెతకటమే. ఈ పరిశోధనలన్నీ సత్యానికి బహుదూరం.

మన విద్యావంతులు నీటి కులాయిల్లాంటి వారు. జ్ఞానం అనే రిజర్వాయర్ గురించి వారు పట్టించుకోరు. అక్కడ జ్ఞానం ఊరుతుంది. మనసు స్వభావాన్ని గ్రహించాలంటే, నేరుగా, మనంగా అనుభవించాలి. అనుభవం వల్ల తెలిసేది మాత్రమే సత్యం. ప్రతి ఒక్కరి మనసు నేరుగా అనుభవించాలి? మనం చేస్తున్న పరిశోధనలు ఇతరుల అనుభవాల 'లాబ్స్'లో.

ప్రశ్న? ఈ సిద్ధాంతాలు సత్యానికి దగ్గరగా చేర్చవా? ప్రజ్ఞ అలవడదా? సత్యం అనేది అనుభవం వల్ల తెలుస్తుందా, సాధన వల్ల తెలుస్తుందా? మనస్సులో ఏ ఆలోచనలు లేకుండా ఉండడం సాధ్యమా?

"ఇంతవరకు మీరు అనుసరిస్తున్న పద్ధతి కొన్నికొన్ని సిద్ధాంతాల ప్రాతిపదికపై ముందుకు సాగడం, ఆలోచించడం. అది కూడా మీ మనస్సు అనుమతించిన మేరకు. కాని అది సరైన పద్ధతి కాదు. మీ స్వంత విధానం కాదు. అది మీ జ్ఞాపకశక్తి పైన ఆధారపడిన పద్ధతి. అంటే పూర్తిగా గతంపైన ఆధారపడడం. స్వంత అనుభవానికి అవకాశం ఏదీ?



ఆతిథ్యమిచ్చిన కెన్‌రీడ్‌తో ...

మీకు తెలియని విషయం ఒకటి ఉంది. మనిషి మేధ ఎప్పుడూ మారడానికి సిద్ధంగా ఉంటుంది. మూలంలో మార్పుకు సైతం సిద్ధం. మనస్సు తనను తానే నమ్మలేనంతగా మారగలదు. మనసు మొండిది కాదు. చాలా సున్నితం. అసలు మన శరీర నిర్మాణంలోనే ఆ సౌలభ్యం ఉంది. అవసరం వస్తే, అవకాశం వస్తే మనిషి పూర్తిగా మారిపోగలడు. అంటే మనసు మారగలదు.

మరొక రహస్యం : ఫిజికల్ లెవెల్ పై జరిగే ప్రతి సంఘటనకు ఈథరిక్ లెవెల్‌లో సరిసమానమైన మరొక సంఘటన ఉంటుంది. ఉదాహరణకు మనకు భౌతిక శరీరం ఉంది గదా. అలాంటి శరీరాలే కనిపించనివి మన శరీరంలోనే ఉన్నాయి. అవి సూక్ష్మశరీరాలు, సటిల్ బాడీస్. సూక్ష్మశరీరాలంటే శూన్యశరీరాలు. మనసు కల్పించే ఆశలు, ఆశయాలు, అనుసరించే విధానాలు మొరటుగా

ఉంటాయి. బయటకు తెలుస్తుంటాయి గ్రాస్ లెవెల్‌లో. అసలు వాటికి ఇవి ప్రతిరూపాలు, పైకి కనిపించే రూపాలు. మన ధ్యానంలో లేదా 'గమనిక'తో లేక అంతర్వీక్షణతో సూక్ష్మశరీరాన్ని లేదా శూన్య శరీరాన్ని కదిలించకలిగితే, స్పృశించ గలిగితే, వాటి చైతన్యం భౌతిక శరీరంపైన పడితీరుతుంది. మార్పు సహజంగా ఏర్పడుతుంది. ఏ మాత్రం కష్టం, శ్రమ అనిపించదు. అది ధ్యాన క్రియ, పరధ్యాన పద్ధతి. అప్పుడు మన బ్రెయిన్ సెల్స్, శరీరంలోని ప్రతి అణువు, ప్రతి కణం పరిణామం చెందడానికి సిద్ధపడుతుంది.

మనిషిలోని సూక్ష్మత గురించి, 'పరేంగిత ప్రజ్ఞ' గురించి మతాలు పట్టించు కోవు. సాహిత్యం పట్టించుకోదు. విద్యావంతులు పట్టించుకోరు. అందుకు కాస్త జిజ్ఞాస, ఇంకాస్త అతీంద్రియ జ్ఞానం కావాలి. ఇప్పుడిప్పుడే ఆ మేరకు ప్రయత్నం జరుగుతోంది. కాస్త అవగాహన ఏర్పడుతోంది. కొందరు సద్గురువులు, మహాయోగులు అలాంటి మౌలిక శక్తిని ఉపయోగిస్తే అబ్బురపడతారు. అవతార పురుషులని కీర్తిస్తారే తప్ప, దాని ఆనుపానులు తెలుసుకోరు. తామూ ప్రయ త్నించరు. తమలోనూ అలాంటి ప్రజ్ఞ ఉన్నదని అంగీకరించరు.

వైజ్ఞానిక వేత్తలు ఇప్పుడిప్పుడే కనిపించే భౌతిక ప్రపంచం కన్న శక్తివంతా లైన, కనిపించని లోకాలున్నాయని అంగీకరిస్తున్నారు. అవి శక్తిమండలాలని, శక్తికేంద్రాలని భావిస్తున్నారు. అవి మనలో నిగూఢంగా ఉన్న నిధులని ఇంకా గ్రహించడం లేదు. వాటిని సబ్ అటామిక్, కాస్మిక్ అని తృప్తి పడుతున్నారు.

ఈథరిక్ శరీరాన్ని మనం స్పృశించగలిగితే, అంటే మన ప్రజ్ఞతో, 'ఆలోకన'తో ప్రభావితం చేయగలిగితే ఆలోచించే మనస్సు నిష్క్రమిస్తుంది. అంతర్వీక్షణ వల్ల, చైతన్యం కలగడం వల్ల, ఆ మార్పు కలిగితీరుతుంది. నిశ్శబ్దంలో ధ్యానం దానికి ఉపాయనం. ధ్యానంలో నిర్మలం కావాలి. నిశ్చలతతో నిర్మలం కావాలి. అదే తారకం. సరైన ఉపకరణం.


ధ్యానంలో నిశ్చలత్వానికి, సమాధికి సమాన ప్రతిపత్తి ఉంటుంది. ధ్యానం ఎంతగా చెడిపోయినదానినైనా బాగుచేస్తుంది. అది పూర్ణత్వ లక్షణం. దైహిక రుగ్మతల్ని, వ్యాధుల్ని నయం చేస్తుంది. లోపాలను, అవకరాలను సైతం చక్క బరుస్తుంది. ధ్యానం వల్ల అసాధ్యాలన్నీ సాధ్యాలవుతాయి. నవ్యత, పరిణామం, ప్రగతి, పురోగతి సాధిస్తుంది ధ్యానం. దానిని మనం దైవశక్తి అనవచ్చు. విశ్వశక్తి అనుకోవచ్చు. ప్రతి మనిషికి అది అందుబాటులో ఉన్నదే. సైకాలజిస్టులు, సైంటిస్టులు దానిని గుర్తించరు.

ఆ మహాప్రాణనిధిని ప్రసాదనంతో అందుకోవాలి. దాని ఆచూకీ మనకు తెలియదు కనుక నిదానంగా సాగాలి. అటు పోకుండా ఆలోచనలు అడ్డుకుని, అవరోధాలు కల్పిస్తాయి. ఆలోచనల సాయంతో అవతలి తీరం చేరలేమన్నది స్పష్టం.

ఇప్పుడు అసలు సమస్య ఏమిటో చూద్దాం! మనలోని మహాశక్తి ఆలోచన రూపంలో నిరుపయోగమవుతున్నది. దానివల్లనే ఇన్ని సమస్యలు, బాధలు. ఆలోచనల ఒత్తిడి లేకపోతే సమస్య లుండవు. శక్తి వృధా కాదు. ఈ అద్భుతమైన శక్తి మనలో ఎక్కడ ఉంది? ఏమో! అవసరమైనపుడు అందుబాటులో ఉంటుంది. అది మనలో పుష్కలంగా ఉంటుంది. తరగదు, కరగదు. మనం దానివైపు చూడడం లేదు. మనలో ఉన్నదని గ్రహించడం లేదు. అలక్ష్యం చేయడం కారణంగానే అది అలభ్యంగా ఉంటోంది.

మన మేధావంతులకు ప్రజ్ఞను గురించి తెలియదు. వారికున్న అవకాశాలు పరిమితం. మనస్సును తెలుసుకోడానికైనా మనసు హద్దుల్ని దాటిపోవాలి (బియాండ్ మైండ్). అది అతీత మానసస్థితి. 1975 ప్రాంతంలో కాలిఫోర్నియాలో ఆశ్రమాలు, గురువులు తక్కువ. 'ధ్యానం' అన్నది వారికి కొత్త అంశం. నేను లాస్ఏంజల్స్‌లో విస్తృతంగా పర్యటిస్తూ చిన్నచిన్న గోష్ఠులు నిర్వహించాను. ప్రాథమిక సమాచారం అందించాను. మూడు నెలల నా పర్యటన అది.

లాస్ ఏంజల్స్‌లో ఉండగా కొందరు హాలీవుడ్ సినిమా నటులు, ఫిలిం డైరెక్టర్లు వచ్చేవారు. వారిలో చాలామంది మంచి మిత్రులైనారు. వీసా గడువు దగ్గర పడుతోంది. తిరుగు ప్రయాణానికి సిద్ధమైనాను. మరికొంతకాలం ఉండమని మిత్రులు బలవంతం చేయసాగారు. వారే నా 'వీసా' పొడిగింపు కోసం ప్రయత్నించారు. అప్పుడే ఒక సంపన్న మహిళ నాన్సీ నికోలస్ నాకు స్పాన్సర్‌గా లభించింది. నేను అమెరికాలో ఉన్నంత కాలం, నా ఖర్చులు, బాధ్యత తనవన్నది. నలుగురు సైకాలజిస్టులు ఇమ్మిగ్రేషన్ ఏర్పాటు చేశారు. ఈసారి హెచ్ టైపు వీసా లభించింది. ప్రత్యేక ప్రతిభ కలవారికి యిచ్చే 'వీసా' అది. మరొక ఏడాది కాలం అమెరికాలో ఉండొచ్చు. అవసరమైతే దానిని మూడేళ్ల వరకు పొడిగించ వీలుంది. వెంటనే ఇండియా వెళ్లవలసిన అవసరం తప్పింది.



15. నూతన యోగం

కొంతకాలం లాస్ఏంజల్స్‌లో ఉండి తిరిగి శాన్‌ఫ్రాన్సిస్కో చేరాను. చాలా మంది నుండి ఆహ్వానాలు వచ్చాయి. కొందరు యోగా టీచర్స్, సైకాలజిస్టుల ద్వారా ప్రచారం జరిగింది. నాతో సంభాషణలు జరిపిన వారిలో మార్పు వస్తోంది. కొన్ని నెలలపాటు వ్యక్తిగత చర్చలు. కొందరిళ్లలో చిన్న సమావేశాలు, గోష్ఠులు జరిగాయి. నా నివాసం రాబర్ట్ కర్ ఇల్లు. అది ఉడ్‌పెకర్‌లో పెద్ద బంగళా. బంగళా పాతదే గాని అందంగా, విశాలంగా ఉంది. అక్కడ గ్రూపు సమావేశాలు చాలా జరిగాయి. రాబర్ట్ కర్ శ్రద్ధగా డాక్టర్లు, ఆర్టిస్టులు, యోగాటీచర్స్ ఇలా రకరకాల వృత్తులవారిని ఆహ్వానించేవాడు.

వాళ్లలో కొందరు తర్వాత విల్బర్ హాట్‌స్ప్రింగ్స్‌లో సెమినార్లు నిర్వహించారు. నలభై మందితో చర్చలు. అందరూ యువకులే. అందరూ ఆధ్యాత్మికంగా ఆసక్తి కలవారు. ఏదో కృషిచేస్తున్నవారు. సెమినార్ మూడు రోజులలో రోజూ ఉదయం ప్రసంగం ఉండేది. మిగిలిన సమయంలో ధ్యానం. యోగం. చర్చలు. నా ప్రసంగాల, చర్చల ప్రధానాంశం **"మనసు గతం నుండి విడివడి స్వేచ్ఛ పొందడం ఎలా? యోగం వల్ల కలిగే ఆధ్యాత్మికత ఎలాంటిది?"**

నా ధోరణి ఇలా ఉండేది :

"మనం అనేక కారణాల వల్ల గతాన్ని మరచిపోలేకపోతున్నాం. గత జ్ఞాపకాలను వదలం. మనకు మానసికంగా, సాంస్కృతికంగా ఒక 'గిరి' ఏర్పడి ఉంటుంది. నిజానికి మనం అటు గతంలోనో, ఇటు భవిష్యత్తులోనో బ్రతుకు తుంటాం. వర్తమానంలో బ్రతకడం లేదన్నది స్పష్టం. మన మనసంతా గతంతో

నిండిపోయి ఉంటుంది. మనకు తెలిసిన మొత్తం సమాచారాన్ని మనస్సు భద్రంగా దాచిపెడుతుంది. దానిని మానసికశక్తి అని సంబరపడిపోతాం. దానినే మనోబలం అని భ్రమపడతాం. కాని ఆధ్యాత్మిక అవగాహనకు, పురోభివృద్ధికి గతం నుండి విడిపోవాలని తెలియదు. మనసు గతం నుండి విముక్తమైతేనే మనిషికి స్వేచ్ఛ.

మన యోగసాధన సైతం పరిమితం. మహా అయితే ఆలోచనల్ని నిరోధిస్తారు. అదో గొప్ప సాధన అనుకుంటారు. ప్రాణాయామం, ఆసనాలు లాంటివి కొంతవరకూ శరీరం పైన, మనసు పైన ఒత్తిడిని తగ్గిస్తాయి. మంచి ఆరోగ్యం యిస్తాయి. ధ్యానానికి అవసరమైన మనోనిశ్చలత కొంతవరకు ఏర్పడుతుంది.

ఆసనాలు వేయడం మాత్రమే యోగం కాదు. యోగానికి గమ్యం ప్రాణాయామం కాదు. వాటివల్ల ఆత్మకు ఒరిగేది ఏమీ లేదు. అది ఆధ్యాత్మికత కానే కాదు. మనిషికి స్వేచ్ఛ లభించదు. ఆసనాలు, ప్రాణాయామం మొదటి మెట్లు మాత్రమే. అవే సర్వస్వం అని, అక్కడే ఆగిపోతున్నారు. అది తప్పు. అది అసంపూర్ణం.

జీవిత సత్యాన్ని శోధించడం, అర్థం చేసుకోవడం నా పద్ధతి. అది వేరే అధ్యాయం, వేరే ప్రకరణ. మిగిలినవన్నీ అందుకు ప్రేరకాలు మాత్రమే, ఉపకరణాలు మాత్రమే. నా యోగం నూతనం. కొత్త కోణంలోంచి గమనించండి. అవగాహన పెంపొందించుకోండి. మనలో రావలసిన మార్పు చాలా ఉంది. యోగాసనాలు, ప్రాణాయామం కొంతకాలం వరకు, కొంతవరకే ఉపయోగం.

గమనించడం అంటే లోపలికి చూడడం. అంటే ఉత్తినే కూర్చోవడం కాదు. ఏ పనీ, వ్యాపకం లేకుండా ఉండడం కాదు. ఊరికే ఉంటే సోమరితనం వస్తుంది. యోగఫలితం కలగదు. మనస్సును దాటిపోవాలి. అది ప్రధానమైన అంశం. మనస్సును అధిగమిస్తే తప్ప చైతన్యం కలగదు. చైతన్యం రుచి తెలియదు. ఆ నూతన చైతన్య స్ఫూర్తి కలగడమే కొత్త జీవితానికి ఆరంభం. అది జీవచైతన్యం. అది ప్రాణనిధి. అది అమృత తుల్యం. ఒక్క ఊపులోనే మనస్సును దాటిపోవచ్చు. సంవత్సరాలపాటు దానికోసం శ్రమించ నవసరం లేదు. ఒక్క ప్రయత్నం చాలు.

ఎలా? అంతర్వీక్షణ. తీక్షణమైన లోచూపు. నిశితమైన శూన్యగమనిక. బాహ్యాన్ని, ఆంతరాన్ని ఒక శూన్యదృష్టితో, భావరహితంగా చూడడం. మీరు చివరి అంచుకు చేరాలి. ఉచ్ఛ్వాస నిశ్వాసలు, కుంభక రేచకాలు ఆపైన అవసరం ఉండదు. శ్వాసించకుండా, అంటే శ్వాసపైన ధ్యాస లేకుండా లోతుల్లోకి

దూసుకుపోవాలి. చక్కగా అర్థం చేసుకోండి. ఏ కాస్త ప్రయత్నం చేసినా మనసు దాటిపోవడం కష్టం కాదు. కాస్త దారి మళ్లిస్తే ఆలోచనలు అవే నిలిచిపోతాయి. బాహ్య స్పృహ లేకుండా చేసుకోగలిగితే చాలు. అంతా సవ్యంగా సాగుతుంది. కోరికలు, ఆశయాలు, కలలు, కలవరింతలు, భ్రమలు ఉండని స్థితి అది.

నా మాటలు వారి మనసుల్ని కలవర పెడుతున్నాయని నాకు తెలుస్తోంది. ఆ యోగా టీచర్స్ అమాయకులు. గర్వం, అహంకారం లేనివారు. సైకోల వలె అహంభావులు కారు. సైకాలజిస్టులు వాదించడం ఎక్కువ, చేసేది తక్కువ. వివేచన ఎక్కువ, వివేకం తక్కువ. కాలికి వదిలితే మెడకు, మెడ వదిలితే కాలికి ముడి వేస్తుంటారు. మనో విశ్లేషకులు, మేధావులు, వారు వాదిస్తారు, చర్చిస్తారు – ఆలోచిస్తారు. ఏ పనిని సవ్యంగా, సూటిగా చేయరు. వీళ్లు అలా కాదు ... స్వభావరీత్యా మంచిని కోరతారు. ధ్యానం, యోగం అర్థం చేసుకోడానికి ఉత్సాహంగా ఉన్నారు. జీవితం అనే పెద్ద క్లాస్‌రూంలో వారు నిరంతన విద్యార్థులు.

నాకు ఆతిథ్యం యిచ్చిన రాబర్ట్‌కర్‌కు లర్క్‌స్పర్‌లో ఒక రెస్టారెంటు ఉంది. అతనికి సినిమా వాళ్లతో పరిచయా లున్నాయి. రాబర్ట్‌కు సీటల్‌లోనూ మంచి మిత్రు లున్నారు. ఆనోట ఈనోట నా గురించి ప్రచారం ముమ్మరంగా సాగింది. ఒకసారి సీటల్ వెళ్దామని రాబర్ట్ మిత్రుడు బాబ్ హచిన్స్ ఏర్పాటు చేశాడు. డబ్బు ఏర్పాటు చేశాడు. రాబర్ట్, కోనీ కీలర్, నేనూ వాన్‌లో వెళ్లాం. ఉత్తర కాలిఫోర్నియా, ఓరగన్ ... వాషింగ్టన్‌ల మీదుగా ప్రయాణం సాగింది. పశ్చిమ తీరాన సౌందర్యాలు చూచే అవకాశం కలిగింది.

ఓరగన్ గుహలు చూచాం. భూమి లోతుల్లోకి వెళ్లి వచ్చాం. చాలా చిన్నచిన్న పట్టణాలలో ఆగి అక్కడి జనజీవనంతో పాలు పంచుకున్నాం. రకరకాల మనుషులు, రకరకాల స్వభావాలు, ఆచారాలు, అలవాట్లు. భిన్నత్వంలో ఏకత్వం. లాస్ ఏంజల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో నాగరీకులకు పల్లె ప్రజలకు ఎందులోనూ పోలికల్లేవు. గ్రామీణ ప్రజలు సనాతనులు, చాదస్తులు, వారి అలవాట్లు మారవు. వారు సంప్రదాయం వదలరు. వారు నమ్మకాలు వమ్ముకానీయరు. చర్చి అంటే అందరికీ ప్రాణం.

చిన్నచిన్న గ్రూపు సమావేశాల్లో ముచ్చటించాను. లోపలి గమనికతో సమస్యలు పరిష్కరించుకునే పద్ధతి వారికి కొత్త. అయినా ఆసక్తి కనపరిచారు. ఆ విధంగా పరిష్కారాల కోసం ప్రయత్నిస్తామన్నారు. కొందరు ప్రశ్న లడిగి సందేహాలు తీర్చుకున్నారు. మనస్సు గురించి ఇంకా తెలుసుకోవాలన్న ఆసక్తి

చూపారు. సైకాలజిస్టులు సిద్ధాంతాలు వల్లిస్తారు. మనసుపైన పరిశోధన చేస్తారు. సామాన్యులకు ఆ 'కుతి' ఉండదు. మనస్సు నడిపించినట్లు నడుస్తారు. మనసును తమ నుండి వేరుగా చూడరు. కొత్తను దగ్గరకు రానివ్వరు. అయినా నన్ను మళ్లీ మళ్లీ వస్తుండమని ఆహ్వానించారు.

ఉత్తర కాలిఫోర్నియాలో ఒక ఏడాది కాలం గడిపాను. నా గురించి, నూతన యోగం గురించి పత్రికల్లో చాలా వ్యాసాలు వచ్చాయి. ప్రచారం సాగింది. జనంలో ఆసక్తి పెరిగింది. రెండుసార్లు రేడియోలో ప్రసంగించాను. ఒకసారి టి.వి.లో ఇంటర్వ్యూ వచ్చింది. ఇంటర్వ్యూల టేపులకు లెక్కలేదు. ఉడ్‌పెకర్‌కు తిరిగి వచ్చాక ఒకరోజున రాబర్ట్‌కర్ ఒక సూచన చేశాడు. కాలిఫోర్నియాలో హిప్పీల సమావేశం జరగబోతోంది. మూడు నాలుగు వందల మందివరకు పాల్గొంటారు. ఆటలు, పాటలు, నృత్యాలు, విందులు, వినోదాలు పసందుగా ఉంటాయిట. వాళ్ల కార్యకర్త తనకు తెలుసని, నేను అక్కడ ప్రసంగిస్తే బావుంటుందని చెప్పాడు.

ఆ సలహా నాకు నచ్చింది. కాలిఫోర్నియా వచ్చేవరకు హిప్పీల సంస్కారం, జీవనశైలి నాకు తెలియదు. ఎప్పుడో ఒకరిద్దరితో కాస్త పరిచయం ఇండియాలో. వారు స్వేచ్ఛగా జీవిస్తారని మాత్రం తెలుసు. ఏ కట్టుబాట్లు, నియమాలు పాటించరు, సహించరు. సిగ్గు శరం లేవంటారు కాని అది స్వేచ్ఛా ప్రియత్వం. శాన్‌ఫ్రాన్సిస్కో దగ్గరలో ఒక పార్కులో సమావేశం ఏర్పాటైంది. పెద్ద వేదిక కార్యక్రమాలకు. చెట్ల క్రింద హిప్పీల ఉత్సవాలు, ఆటపాటలు, చిందులు. అక్కడ ప్రసంగాలు ఎవరు వింటారు! అందరూ ఖుషీఖుషీగా, జాలీగా, జోవియల్‌గా కాలం గడిపేవారే కనిపించారు. ఎవరిని ఎవరూ పట్టించుకోరు. ఒక పద్ధతీ పాడూ లేవు.

వేదికపైకి వెళ్లి మైక్ తీసుకున్నాను. స్టీవ్ బ్రూస్ నాకో కుర్చీ ఏర్పాటు చేశాడు. నేను అందరికీ కనిపిస్తాను. రాబర్ట్‌కర్ నన్ను పరిచయం చేశాడు. "మీ వలె దాదాకు స్వేచ్ఛా జీవనం ఇష్టం. వారు స్వేచ్ఛను గురించి మీతో ప్రసంగిస్తారు".

"మనిషికి స్వేచ్ఛ కావాలి. ఎందుకు? మనసుకు స్వేచ్ఛ కావాలి కనుక. మనిషి ఎదగడానికి మనసుకు స్వేచ్ఛ కావాలి. చరిత్రలో మనిషి స్వేచ్ఛ కోసమే పోరాటాలు చేసినట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఎదగడానికి మనిషికి స్వతంత్రం అవసరం. అలాగే జీవన విధానాలు ఎదిరించడానికి 'స్వేచ్ఛ' కావాలి. స్వేచ్ఛగా జీవించడానికి పాత పద్ధతుల్ని, అలవాట్లను తీసి పక్కన పెట్టాలి."

జనం వింటున్నదీ, లేనిదీ నేను గమనించ లేదు. నేను చెప్పదలచిన విషయాలు చెప్పసాగాను ... జనం దృష్టి నావైపు మళ్లింది. గమనించాను.

కొంచెం ఆగాను. కొందరు చెవులు రిక్కించి వినసాగారు. కొందరైతే బుర్రకు పనిపెట్టి కాస్త ఆలోచించారు.

"మీరు కోరుతున్న స్వేచ్ఛ పరిమితం. హద్దు లున్నాయి. నేను కోరే స్వేచ్ఛకు హద్దులు లేవు. పరిమితులు లేవు. నా స్వేచ్ఛ ఆకాశమంత విశాలం. అది విశ్వవ్యాపితం. ఎక్కడైనా లభిస్తుంది. అది ఏ ఒక్కరికో పరిమితం కాదు. అది జీవితమంత విశాలం. ఆ స్వేచ్ఛ మీకు కావాలా? వద్దా? ఆ స్వేచ్ఛకు మీ మనస్సుతో పనిలేదని గ్రహించండి. దానికి మీ కోరికలతో, వ్యసనాలతో, అలవాట్లతో పనిలేదు. మీ ఉద్రేకాలతోనూ, ఆనందాలతోనూ పనిలేదు. అసలైన స్వేచ్ఛ అది. విశ్వచైతన్యం అందుకోగల స్వేచ్ఛ అది. అది మీలోని శూన్యాన్ని చీల్చుకుని మెరుపులా వస్తుంది. మీ అవసరాలన్నీ తీర్చేది అదే.


మనం ఏం చేస్తున్నాం? కోర్కెలు తీర్చుకుంటున్నాం. ఉద్రేకాలను చల్లార్చు కుంటున్నాం. వ్యసనాలకు బానిసలవుతున్నాం. అంటే మన స్వేచ్ఛను లిమిట్ చేస్తున్నామన్నమాట. అది పాక్షికంగా జరుగుతున్న పని. రాజకీయాలకో, సామాజిక విలువలకో మన స్వేచ్ఛను పణంగా పెడుతున్నాం. మన అవగాహన పెరగడం లేదు. రోజురోజుకు కుంచించుకుపోతోంది. స్వేచ్ఛ అంటే ఏమిటి? సత్యపథం. సత్యాన్ని తెలుసుకునే మార్గం పేరు స్వేచ్ఛ. జీవిత విలువల్ని స్వేచ్ఛగా గ్రహించాలి. అందుకు స్వేచ్ఛ కావాలి. స్వతంత్రం కావాలి. అది వాస్తవమైన స్వేచ్ఛ. స్వేచ్ఛను అన్వేషించడంలో ఉద్రేకాలు, ఉద్వేగాలు ఉండకూడదు. మనస్సును ఒకచోట కేంద్రీకరిస్తే, బంధిస్తే తప్పులు చేస్తుంది. గడ్డకట్టుకుపోతుంది. మనస్సుకు పెత్తనం యివ్వకండి?

మనకు స్వేచ్ఛ విలువ తెలియదు. బయట ప్రపంచంలో స్వేచ్ఛగా, మన ఇష్టం వచ్చినట్లు ఉండాలనుకుంటాం. అదీ మన అవసరం తీరే వరకు. మన కోరికలు తీర్చుకునేందుకు స్వేచ్ఛ కావాలి. అది స్వేచ్ఛ ఎలా అవుతుంది? అవసరాలు తీరడమే గదా. జీవిత గమ్యం ఏది? దానికి పరిమితుల్లేవు. మనం మన లోపలికి చూడడం మన ఇష్టం. విశాల హృదయం కావాలి. లోతైన అవగాహన కావాలి. అందుకు మనం స్వేచ్ఛ పొందాలి.

మన మనస్సు ఒక కత్తుల బోను. గతం తాలూకు విషయాలను జ్ఞాపకాలుగా ఆ బోనులో బంధిస్తుంది. అదీ నిర్బంధమే గదా! ఆ నిర్బంధం నుండి ముందుగా విముక్తి పొందండి. స్వేచ్ఛ పొందండి. అసలు ఒకదాని కోసం ఆరాటపడడమే 'బానిస' లక్షణం. వాటిని మనమే కంట్రోల్ చేసుకోవాలి. కోరికలు

తలెత్తకుండా జాగ్రత్తపడాలి. అంటే మీ మనస్సును మీరే జయించాలి. మనస్సుకు బానిసలు కావద్దు.

"మనలో ఉన్న జీవచైతన్యాన్ని మనం గుర్తించడం లేదు. దాని అవసరం తెలుసుకోవడం లేదు. మనసే నియంతలా వ్యవహరిస్తూ మనల్ని చైతన్యానికి దూరం చేస్తోంది. మనలోని ప్రాణశక్తి బయటకు రాకుండా మనసు అడ్డుపడుతోంది. అంటే ఏమిటి? మన శక్తిని మనమే ఉపయోగించుకోలేని అసహాయ స్థితిలో ఉన్నామని అర్థం. మనసు యొక్క పెత్తనం పోతే జీవశక్తి ఉపయోగం తెలుస్తుంది. సక్రమంగా వినిమయం అవుతుంది. అప్పుడు స్వేచ్ఛ విలువ గ్రహించగలం. ఆ స్వేచ్ఛ కోసం ఎవరితో దెబ్బలాడనవసరం లేదు. దేనితోనూ ఘర్షణ పడవలసిన అవసరం లేదు.



80వ జన్మదినోత్సవ వేళ మరాఠీకవి మంగేష్ పడ్గాంకర్‌తో ...

మీరంతా కొత్త సంస్కృతిని కోరుతున్నారు. మార్పు ఆశిస్తున్నారు. మంచిది. మంచి మార్గంలో నడవండి. మనస్సు చివరివరకు నడవండి. మనస్సు తీరాలను దాటిపొండి. కోర్కెల కోసం, వ్యసనాల కోసం కాలాన్ని వృథా చేయకండి. శక్తిని పాడుచేసుకోవద్దు. మార్గనిర్దేశం చేసుకోవలసింది మీరు. మార్గాన్ని అనుసరించవలసిందీ మీరే. పథగాములూ మీరే.

ఒక్కటి ముందుగా గుర్తించండి. మీకు మీరే బానిసలవుతున్నారు. నియంత మీ లోపల ఉన్న మనసు. లోపం ఎక్కడో సమాజంలో లేదు. మీలోనే ఉంది.

మీ మనస్సులో ఉంది లోపం! మనసు నెత్తిమీద మొట్టికాయ వేయండి. అలవాట్ల నుండి మనస్సును మళ్లించండి. తర్వాత మనస్సులోని ఆలోచనలు ఒక్కొక్కటి తొలగించండి. మీ ఆంతర్యం ప్రశాంతమవుతుంది. బాధా విముక్త మవుతుంది. సుగంధంలా పరిమళిస్తుంది. గుబాళిస్తుంది. హద్దులు అతిక్రమించి, సరిహద్దులు దాటి స్వేచ్ఛా విహంగంలా విహరించగలరు. విశ్వం అంతా మీది. విశ్వంలోకి హాయిగా ఎగిరిపోండి. ఆపైన పోరాడవలసిన అవసరం కనిపించదు."


ఆ విధంగా స్వేచ్ఛ గురించి స్వేచ్ఛగా ప్రసంగించాను. ఎవరు విన్నారో? ఎందరికి అర్థమైందో నాకైతే అర్థం కాలేదు. వాళ్లు అసలే హిప్పీలు. స్వేచ్ఛా ప్రియులు. చిందులు, నృత్యాలు, పాటలే వారికిష్టం. అర్ధనగ్నంగా, విశృంఖలంగా చేసే నర్తనలే వారికి సుఖం, ఆనందం. కొందరు నా మాటలు విన్నారు కష్టపడి. కొందరైతే శాన్‌ఫ్రాన్సిస్కోలో నా ప్రసంగాలు వినడానికి వస్తామన్నారు.

ఉత్తర శాన్‌ఫ్రాన్సిస్కోలో మారిన్‌కౌంట్‌లో ఉండగా అనేకమంది కౌన్సిలింగ్‌కు వచ్చారు. ఏవో వ్యక్తిగత సమస్యలు. బాబ్‌హచిన్స్ చాలా శ్రద్ధ పెట్టేవాడు. నా సందేశం బాగా ప్రచారం కావాలని ఆశించాడు. ఒక పుస్తకం తయారు చేస్తే బావుంటుందని సూచన చేశాడు తనే. పుస్తకం ద్వారా ప్రచారం నిర్దుష్టంగా, అధికారికంగా ఉంటుందని సలహా చెప్పాడు.

లోగడ పుస్తకం రాయాలన్న ఆలోచన నాకు ఎన్నడూ కలగలేదు. పుస్తకాలు రాయడం మాటలతో పని అయినా, మాటలు కాదు. చాలా కష్టాలు ఎదుర్కోవాలి, కష్టపడాలి. ఫలితం ఉంటుందో లేదో చెప్పలేం. చేతులు కాల్చుకోవడం మాత్రం ఖాయం. 'రాయడం' అనేది కొత్త ప్రక్రియ. మాట్లాడటం అంత సులభం కాదు రాత పని.



'తపోవన్' నిర్మాణంలో ...



16. నా 'అతీత మానసం'

(Beyond the Mind)

బాబ్ హచిన్స్ అభిమతాన్ని మరికొందరు అభిమానులు బలపరిచారు. పుస్తక 'రచన'పై ఒత్తిడి ఎక్కువైంది. ఒకరోజున బాబ్ అన్నాడు :

"దాదా, మీ ప్రసంగాలన్నీ టేపుల్లో ఉన్నాయి గదా! వాటిని కాగితంపైన పెట్టే పని ఎప్పుడు మొదలు పెడదాం? మీరు చాలా మందితో అనేక విషయాలు ముచ్చటించారు. వారి సమస్యల్ని పరిష్కరించారు. అనేక కోణాల నుండి జీవితాలను విశ్లేషించారు. అవన్నీ సంకలనం చేస్తే ఓ మంచి పుస్తకం అవుతుంది. ఎందరో ఆసక్తి కలవారుంటారు. ఆ చర్చలు వారికి ఉపయోగపడతాయి.

"ఉదాహరణకు మీరు ఒకరితో చర్చించారు. డబ్బు మనిషిపైన ఎలాంటి పెత్తనం చెలాయిస్తుందో వివరించారు. మీరు చెప్పిన మాటలు నాకు బాగా జ్ఞాపకం ఉన్నాయి. నాకు నచ్చిన అంశం ఒకటి మరచిపోలేదు. ధనవంతుడంటే ఎక్కువ ధనం సంపాదించేవాడు కాదని. ఇంక సంపాదించ నవసరం లేదనుకునే వాడే నిజమైన ధనవంతుడని చెప్పారు. చాలా గొప్ప నిర్వచనం! తనలోని అసలు సంపదలు తన జీవిత విలువలేనని ఎంతో చక్కగా చెప్పారు".

కెన్‌రీడ్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశాడు : "నాకు బాగా జ్ఞాపకం– ఒకసారి 'కళ'ల గురించి అందంగా చెప్పారు. 'కళ' ప్రయోజనం హృదయా విష్కారణ. ఆలోచనకు, మనస్సుకు సంబంధం లేకుండా అనుభూతి కలిగించేది అసలైన కళ అన్నారు. నిజంగా అసలైన ఆర్టిస్టు మనసు చర్యలు పట్టించుకోడు. కళలో ఆత్మని ఆవిష్కరిస్తాడు. నిశ్శబ్దంలోనే కళ అభివ్యక్త మవుతుందని చెప్పారు. గొప్ప నిర్వచనం".

కెన్‌రీడ్, బాబ్ హచిన్స్ చెప్పిన విషయాలు సత్యాలు. నేను అనేక మందితో చర్చించాను. సంసార స్త్రీలతో, డాక్టర్లతో, యోగా టీచర్స్‌తో చర్చించాను. అన్ని చర్చలలో కేంద్ర బిందువు 'సత్యం'. అన్నింటి మూలం ఆలోకన. ఆలోచనలు మనస్సు దాటి పోవాలన్నది చివరి అంశం. భయాలు, కోరికలు, నియమాలు లేని జీవితం గడపాలన్నది సత్యవచనం. అవన్నీ చర్చనీయాంశాలు. అన్నింటిని సంకలనం చేస్తే ఒక పుస్తకం అవుతుంది. అయినా అది నా తలకుమించిన పని. ప్రసంగించడం వేరు. రాయడం వేరు. రాయడానికి ఆలోచనపైన, మనసుపైన ఆధారపడాలి. ఆ రెండు మరచిపోయిన వాడిని నేను. అయినా మిత్రుల కోసం, అభిమానుల తృప్తికోసం ఓ మంచి పుస్తకం రావాలి.

పుస్తకం ప్రచురించడానికయ్యే ఖర్చు బాబ్ భరిస్తానన్నాడు. ఇంకా చాలా మంది అభిమానులు సహాయం చేయడానికి సిద్ధపడ్డారు. పని మొదలైంది. నా ప్రసంగాల టేపుల్ని, రికార్డుల్నీ సేకరించారు. ఈలోగా నేను లాస్ ఏంజల్స్‌లో మార్కెల్ బ్రూక్స్‌ని కలిశాను. ఆమె నా ప్రసంగాలు కొన్ని విన్నది చక్రపాణి ఉల్లాల్ ఇంట్లో. చక్రపాణి అక్కడొక పెద్ద ఆస్ట్రాలజర్. పేరు, పరపతి ఉన్నవాడు. మార్కెల్ తన ఇంటికి ఆహ్వానించింది. అక్కడ చాలా ఉపన్యాసాలు ఏర్పాటు చేసింది.

మార్కెల్‌కు పుస్తకం విషయం నచ్చింది. పత్రికల్లో ప్రకటన లిచ్చింది ... కాలేజీ విద్యార్థుల కోసం, పుస్తకం ప్రాజెక్టు పనికి. ఆ విద్యార్థులకు నా సబ్జెక్టు అర్థం కాలేదు. నా ఇంగ్లీషు అర్థం కాలేదు. విద్యార్థుల సహకారం అందలేదు. అయినా మార్కెల్ నిరాశ పడలేదు. ఆమె ఒకరోజున పని ప్రారంభించింది. టేబుల్ ముందు కూర్చుని రాయసాగింది. తర్వాత సాండ్రా బెన్నెట్, ఇరా ఫ్లెష్‌మన్, జుడిత్ స్కాట్ వచ్చి సహకరించారు.

ఒకరోజు కూర్చుని ప్లాన్ వేశాం. పది ఇంటర్వ్యూలు ఎంపిక చేసుకున్నాం. వేర్వేరు విషయాలపైన చర్చలు అవి. అంతలో శాన్‌ఫ్రాన్సిస్కో నుండి ఆహ్వానం వచ్చింది. ట్రాన్స్ స్క్రిప్టులు వెంటతీసుకు వెళ్లాను. ఉత్తర కరోలినాలో రాబర్ట్ కర్ ఆతిథ్యం. పత్రికల్లో నా గురించి చదివి జానిటా గిల్బర్ట్ అనే ఆమె ఇంటర్వ్యూ కోసం వచ్చింది. ఆమె పుస్తకం విషయంలో చాలా శ్రద్ధ, ఆసక్తి చూపింది.

ఆమె ఇల్లు పెద్దది. అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభించాం. పుస్తకం ప్రచురణ కయ్యే ఖర్చు వచ్చింది. ఏ పబ్లిషర్ కైనా యిస్తే పుస్తకం రూపురేఖలు మారిపోతాయి.

వాళ్లు మొత్తం తిరగ రాయించుకుంటారు మార్కెట్ అవసరాల దృష్ట్యా, పాఠకుల అభిరుచుల దృష్ట్యా. అంచేత మేమే అయిదువేల ప్రతులకు ప్లాన్ చేశాం.



1977లో 'బియాండ్ ది మైండ్' ప్రచురణ సంబరం

"Beyond The Mind" పుస్తకానికి మంచి ఆదరణ లభించింది. పత్రికల్లో మంచి సమీక్షలు వచ్చాయి. కొత్త సందేశం – మంచి సందేశం అని ప్రశంసించాయి. యోగాజర్నల్ (1978 మే జూన్ సంచికలో) సమీక్ష చేస్తూ 'రచయితకు మంచి అనుభవం, అవగాహన' ఉన్నదని రాశారు. కొద్ది మాసాల్లోనే 1500 కాపీలు అమ్ముడు పోయాయి. అప్పటికి నా వీసా గడువు పూర్తి కావచ్చింది. గ్రీన్‌కార్డుకు అప్లై చేయమని మిత్రులు ఒత్తిడి చేశారు. అమెరికా జీవితం అలవాటైంది. పరపతి పెరిగింది. ప్రచారం ఎక్కువైంది. ఒకేచోట ఉండిపోవడం నా స్వభావానికి విరుద్ధం. ఎక్కడా శాశ్వతంగా ఉండిపోవాలనిపించదు. జానిటా తన ఇల్లు అమ్మింది. నాతో పాటు ఇండియాకు బయలుదేరింది. యూరపు మీదగా ఇండియా వెళ్లాలని నా ఆలోచన. తనూ నాతోపాటు రావడానికి ఏర్పాట్లు చేసుకుంది. న్యూయార్కు నుండి యూరపుకు నౌకలో ప్రయాణం. ఈసారి అట్లాంటిక్ సముద్రంపైన ఎనిమిది రోజుల ప్రయాణం.

ఇంగ్లండులో హెన్రీ మేరీ వైలాకర్ బ్లాకెడ్ స్వాగతం చెప్పారు. వారింట మూడు రోజులు గడిపి లండన్ నుండి మాంచెస్టర్ ప్రయాణం చేశాం. మాంచెస్టర్‌లో మిత్రుడు ఎడ్వర్డ్ ఆనీ ఉన్నాడు. అతనింట్లో మిత్రుల సమావేశం. అంతా బిజినెస్ మెన్. అయినా ఆధ్యాత్మిక విషయాల పట్ల ఆసక్తి కలవారు. కొందరు కాలేజీ విద్యార్థులు వచ్చారు. ఆసక్తిగా ప్రశ్నించారు. నేనన్నాను :

"మతం అంటే ఒక విశ్వాసానికి కట్టుబడి ఉండటం కాదు. ఒక జీవన విధానం కాదు. జీవితాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం మతం అంటే. అదే

ఆధ్యాత్మికతకు అర్థం, పరమార్థం. మనస్సు చేసే మోసాలు కనిపెట్టి పరిహరించడమే నిజమైన మతం. మతం మనిషిని స్వేచ్ఛగా మనుగడ సాగేటట్లు చేయాలి.

మనం ఓపెన్‌గా, ఓపెన్ మైండ్‌తో జీవిస్తున్నామా? లేదు. మనస్సును ఏదో ఒక విషయం పైకి తిప్పి, అక్కడ కేంద్రీకరిస్తున్నాం. ఒక గాడిలో నడిపిస్తున్నాం. ఆలోచించేటట్లు చేస్తున్నాం. గత కాలపు పునాదులపైన కొత్తగా భవనాలు నిర్మిస్తున్నాం. అలా పరిమితమైన మనస్సు కొత్తను ఆహ్వానించదు. ఆస్వాదించలేదు. సత్యాన్ని అసలు దగ్గరకు రానీయదు".

★ ★ ★


ఎడ్వర్డ్ ఇంగ్లండులో చాలా చారిత్రక ప్రదేశాలు, కట్టడాలు చూపించాడు. బకింగ్‌హాం పాలెస్, పార్లమెంటు భవనం, సెయింట్ పాల్ కెథడ్రల్, నేషనల్ మ్యూజియం, ట్రఫాల్గర్ స్క్వేర్, వెస్ మిన్‌స్టర్ ఆబీ చూచాం. తర్వాత ఫ్రాన్సు వెళ్లాం. పారిస్‌లో కొద్ది రోజులు గడిపాం. పారిస్‌లో ఎవరూ ఇంగ్లీషు మాట్లాడరు. పెద్ద తలనొప్పి. విదేశీయులంటే మంచి, మర్యాద లేకుండా ప్రవర్తిస్తారు. అక్కడ ఈఫిల్ టవర్, మ్యూజియంలు చూచాం.

అక్కడ నుండి జర్మనీ వెళ్లాం. మ్యూనిచ్‌లో ఓ అభిమాని కలిశాడు. నా 'అతీత మానసం' చదివాడట. జర్మనీలోకి అనువదిస్తానన్నాడు. అతనికి ఇంగ్లీషు బాగా వచ్చు. ఓ ముప్ఫయి మందితో సమావేశం ఏర్పాటు చేశాడు. నేను ఇంగ్లీషులో ప్రసంగించాను. అతను జర్మనీలోకి అనువదించాడు.

జర్మనీ నుండి ఇటలీకి ప్రయాణం. కళా నిలయాలు, వాటికన్ సిటీ, కళా ఖండాలు చూచాం. అన్నీ గతకాలపు వైభవ ముద్రలు. మిలన్, ఫ్లారెన్స్, రోమ్ నగరాలు చూచాం. యూరప్‌లో ఇమ్మిగ్రేషన్ గొడవ. భాషా భేదాలు జాస్తి. అందరూ క్రిస్టియనులే అయినా సఖ్యత అవగాహన లేని దేశాలు. అందరికీ జాతీయాభిమానం, స్వార్థం ఎక్కువ. మతం మనుషుల్ని కలపడం బదులుగా దూరం చేస్తోంది. మతం ద్వారా ఎప్పటికీ సామరస్యం సాధించటానికి వీలుకాదనిపించింది. విశ్వ సౌభ్రాతృత్వం నెలకొనాలంటే మనిషి 'మతం' హద్దుల్ని అతిక్రమించక తప్పదు.

ఇటలీ నుండి సరాసరి ముంబయ్ చేరుకున్నాం. విమాన ప్రయాణం.

1978 డిసెంబరు 5న. రెండున్నర సంవత్సరాల తర్వాత ఇండియా చేరుకున్నాను.



17. పునరాగమనం

ముంబయ్ చేరిన వెంటనే అమ్మని, పిల్లల్ని చూడాలనిపించింది. సరాసరి 'తానే' వెళ్లాను. మూడు సంవత్సరాలైంది ఇల్లు వదలి వెళ్లి. అమ్మకు అమెరికా నుండి ఉత్తరం రాశాను. నేను బాగున్నానని. కానీ అమ్మను చూడాలన్న ఆరాటం నాలో. నా అమెరికా యాత్రా విశేషాలు అందరికీ, ముఖ్యంగా అమ్మకు చెప్పాలి. అమ్మకు అమెరికా నుండి ఫోటో ఆల్బం పంపించాను కనుక నా విశేషాలు కొన్ని తనకు తెలుసు. పత్రికల్లో పడ్డ నా ఫోటోలు, వార్తలు, వ్యాసాలు చూచింది. నా పుస్తకం 'బియాండ్ ది మైండ్' అమ్మకిచ్చాను. అమ్మకు చదువు రాదు. ఫోటోలు చూచి మురిసిపోయింది. అమెరికా, యూరోపు దేశాల నా మిత్రుల బొమ్మలు చూచింది. నేను ఇంగ్లీషు పుస్తకం రాయడం నమ్మలేని నిజం. నేను ఇంగ్లీషులో ఉపన్యాసాలిచ్చానంటే అసలు నమ్మలేదు. అయినా ఆమె మొహంలో గొప్ప గర్వం, తృప్తి.

సుమతీ బెన్ మొరార్జీని కలిసి కృతజ్ఞతలు చెప్పాను. నా పుస్తకం ఒక కాపీ బహూకరించాను. ఇది నా అమెరికా పర్యటన ఫలం. మీకు చాలా రుణ పడ్డాను. మీ సహాయ సహకారాలు లేకుంటే నేను అమెరికా వెళ్లేవాడిని కాను. మీరు దయతో నాకు ఎంతో సహాయం చేశారు. ఎక్కడో అడవిలో ఉన్న నన్ను అమెరికాకు పరిచయం చేశారు. కృతజ్ఞుణ్ని".

నన్ను అమెరికా పంపడం వల్ల ఆమెకు ఒరిగింది లేదు. ఏ మాత్రం స్వార్థం గాని, లాభం కాని లేవు. ఆమె నిమిత్త మాత్రురాలు. అనుభవం నాది. ఫలితాలు నావి. ఆమె ఆశ్చర్య పడ్డారు నా నిర్వాకానికి. ఒక చిన్న నౌకాయానం

మూడు సంవత్సరాల ప్రపంచ యాత్రగా మారుతుందని ఎవరనుకుంటారు. ప్రసంగాలు, పుస్తకరచన, కాసెట్లు – నమ్మవీలుకానివి.

కలకత్తాలోని బిహారీ భాయ్ షా పాత్ర తక్కువైంది కాదు. ఆయన నా జీవితంలో ప్రవేశించిన తీరే విచిత్రం. కారణం లేకుండా కార్యం జరగదంటారు. కార్య కారణాలు కలిసే ఉంటాయి. భగవంతుడు నా పనికోసం ఆయన్ని పురమాయించాడు. నా జీవితంలో అవసరానికి సహాయ పడేవారు అలా ప్రవేశిస్తుంటారు. వారందరూ అంతకు ముందు నాకు పరిచయం ఉన్నవారు కారు. నా సంకల్పం, ప్రయత్నం లేకుండానే పనులు జరిగి పోతుంటాయి. అంటే ఏదో అగోచర శక్తి నా వెనక పనిచేస్తోంది. నాచేత పనులు చేయిస్తోంది. అందరిచేత, నాకోసం పనులు చేయిస్తోంది. కొందరు దానిని విధి అంటారు. కొందరు 'కలిసి రావడం' అంటారు. ఇంకొందరు అదృష్టంగా భావిస్తారు. నా వరకు అది దైవికం. అది అగోచర శక్తి. మనస్సుకు అందనిది, మనసు అందుకోలేనిది. నా అంచనా ప్రకారం ఏదీ ఉత్తినే జరగదు. ప్రతి పని వెనక విశ్వసంకల్పం ఉంటుంది. దానికొక ప్రయోజనం ఉండి ఉంటుంది.

మరొక ముఖ్యమైన వ్యక్తి రజ్జా. తన కుటీరం నాకు అప్పగించాడు. నా చుట్టూ ఒక బుల్లి ప్రపంచాన్ని తయారు చేసుకునే వీలు కల్పించాడు. నాకు సహాయం చేసిన ప్రతి ఒక్కరి వెనుక దైవసంకల్పం ఉంది. దివ్య ప్రేరణ ఉంది. అగోచర ప్రయోజనం ఉంది.

కొన్ని రోజులు బొంబాయిలో గడిపి మహాబ్లేశ్వర్ చేరాను. జునిటా నాతోనే వచ్చింది. చాలా కాలం తర్వాత తిరిగి నా కుటీరంలో అడుగుపెట్టాను. మూడు వర్షర్తువులు గడిచినా కుటీరం చెక్కు చెదరలేదు. శుభ్రంగా ఉంది. మాతో ఒక చిన్న 'టెంట్' తెచ్చాం. జునిటా టెంట్‌లో ఉండేది. ఆమెకు పరిసర గ్రామాలు, పట్టణం పరిచయమైనాయి. తన ఇష్టం మేరకు వంట చేసుకునేది. డ్రీమ్‌లాండ్ హోటల్ నుంచి రేణుబెన్, రాంనిక్‌భాయ్ మాకు భోజనం పంపే ఏర్పాటు చేశారు. జునిటా భారతీయ మెనూకు అలవాటు పడ్డది. ఇక్కడి శీతల వాతావరణం ఆమెకు నచ్చింది. రెండు నెలల తర్వాత ఆమె కాలిఫోర్నియా వెళ్లిపోయింది. మహాబ్లేశ్వర్‌లో అన్ని రోజులు గడిపిన మొదటి అమెరికన్ ఆమె.

మేము వచ్చిన కొద్ది రోజుల్లో అమెరికా నుండి Beyond the Mind పుస్తకాలు వచ్చాయి. మిత్రులు చెన్నయ్, బెంగుళూరు, కోల్‌కత్తా, పూనా నగరాలలో పంపిణీ చేశారు. పుస్తకం అందరికీ నచ్చింది. అంతకన్నా నా సిద్ధాంతం నచ్చిందంటే

బాగుంటుంది. పత్రికలు మంచి సమీక్షలే ప్రచురించాయి. పుస్తకాల షాపువాళ్లు అమ్మిపెట్టడానికి అంగీకరించారు. మరికొన్ని ప్రతులు పంపమని బ్రెండ్, లారాలకు ఉత్తరాలు రాశాం. వచ్చిన పుస్తకాలన్నీ వెంటనే అయిపోయాయి. నా సిద్ధాంతం రమణ మహర్షి భక్తుల్ని బాగా అలరించింది. 'Mountain path' రమణాశ్రమం వారి పత్రిక చక్కగా సమీక్షించింది. వారంటారు : “చాలా మంది ఇండియన్ గురువులు అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. ‘దాదా’ వలె ఒక మంచి పుస్తకం రాసిన వారు లేరు. Beyond the Mind చాలా మంచి పుస్తకం. మనసు లీలల్ని విశదీకరించింది. మనసును దాటిపోయే మార్గం చూపిన మంచి రచన.”

దక్షిణ భారతం నుండి పుస్తకానికి బాగా ఆర్డర్లు వచ్చాయి. ఆయా నగరాలలో, పట్టణాలలో వచ్చి ప్రసంగించమని ఆహ్వానించారు. ఇది కొత్త జీవితం. ఇంతకాలం కొండపైన అజ్ఞాతంగా ఉన్నవాడికి జనావళి ఆహ్వానం.

ఒకనాడు నా కుటీరం బయట కూర్చుని తేనె పట్లు చూస్తుండగా ఒక మధ్య వయసు మహిళ హడావుడిగా నా దగ్గరకు వచ్చింది. నలభై లోపు వయసు. చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంది. చదువు, సంస్కారం ఉన్న మహిళ. వచ్చి నమస్కారం చేసి కంగారు పడసాగింది. కూర్చోమని ఆహ్వానించాను. నా పుస్తకం చూపిస్తూ ‘ఇది మీరు రాసిందే కదా?’ అని అడిగింది. అవునన్నాను. ఆమె తన పేరు మంజు బెన్ షా అని పరిచయం చేసుకుని తన గురించి చెప్పింది:

“ఉదయం నేను మధుసాగర్ వచ్చాను తేనె కొనడానికి. షాపులో తేనె సీసాల ప్రక్కన మీ పుస్తకాలు కనిపించాయి. యథాలాపంగా ఒక పుస్తకం తీసుకుని తిప్పాను. అక్కడక్కడ చదివాను. మీ అభిప్రాయాలు, వ్యాఖ్యలు చిత్రం అనిపించాయి. అరగంటసేపు షాపులో నిలబడి చదివాను. ఇంకా చదవాలని పిస్తోంది. షాపులో కుర్రవాడు నా దగ్గరకు వచ్చి ‘మేడమ్ ఇది రాసినాయన మీకు తెలుసా?’ అని ప్రశ్నించాడు. తెలియదన్నాను. మీరు ఇక్కడ ఉంటారని అడ్రసు యిచ్చాడు. మీ గురించి విని మిమ్మల్ని చూడాలని వచ్చాను”.

ఒక నిమిషం ఆగి మళ్లీ అన్నది “ఆశ్చర్యం. చాలా సంవత్సరాలుగా మా శ్రీవారితో కలిసి ఇక్కడికి వస్తున్నాను. ఎప్పుడూ మీ గురించి విన్నది లేదు. ఇక్కడ వుండీ మీ గురించి తెలుసుకోలేకపోవడం బాధగా వుంది”.

నేను నవ్వి అన్నాను “నాది అజ్ఞాత జీవితం. ఎవరూ నా కోసం రాకూడదనే ఇక్కడ ఉంటున్నాను”.

"ఏం బాగా లేదు సార్, నేను రోజూ వస్తాను. అయిదు రోజులపాటు ఇక్కడ ఉంటాం. మా శ్రీవారు డాక్టర్ శాంతిభాయ్ షాని తీసుకువస్తాను. మీ అభ్యంతరం ఉండదనుకుంటాను".


మర్నాడు భార్యా భర్తలు వచ్చారు. చాలాసేపు సంభాషించారు. మహాబ్లేశ్వర్ పర్వతంపైన ఒక సత్యం తెలుసుకున్నందుకు సంతోషించారు. నన్ను ముంబయ్ రమ్మని ఆహ్వానించారు. తమకి తెలిసిన వారందరికీ పరిచయం చేస్తామన్నారు. నేను కాదనలేదు. ఏది ఎప్పుడు, ఎందుకు జరుగుతుందో!

ముంబయ్‌లో చాలా సమావేశాలలో ప్రసంగించాను. చాలా ఇంటర్వ్యూలు జరిగాయి. మొత్తం మీద ఇండియా కూడ నన్ను గుర్తించింది. అట్లా ముంబయ్‌లో మొదలైన నా తాత్విక ప్రసంగాలు, ఉపన్యాసాలు పూనే, షోలాపూర్‌లకు పాకాయి. అనేక మహారాష్ట్ర పట్టణాలకు వెళ్లి ప్రసంగించవలసి వచ్చింది. నాశిక్, నంగల్, చండీఘర్, అహ్మదాబాద్, బరోడా, కోట, భోపాల్, హైదరాబాదు, బెంగుళూరు, కలకత్తా, చెన్నయ్, ఢిల్లీ, ఖాట్మాండు, కొలంబో నగరాలలో నిర్విరామంగా పర్యటించి, ప్రసంగించవలసి వచ్చింది.

మాధవపూర్ ఆశ్రమంలో స్వామి భక్తి వేదాంత నా ఉపన్యాసాలు ఏర్పాటు చేశాడు. 1979-80ల్లో ఎక్కువ కాలం మహాబ్లేశ్వర్‌లోనే గడిపాను. అప్పుడప్పుడు ఉపన్యాసాలు. ఇప్పుడు నేను అమెరికన్ ఇంగ్లీషు బ్రహ్మాండంగా మాట్లాడగలను. రకరకాల మనుషులతో, సంస్కృతులతో పరిచయం ఏర్పడ్డది. ఒక రచయిత నైనాను. ఇదంతా ఎలా జరిగింది? నా ప్రతిభ కాదు. ఏదో అగోచర శక్తి నాచేత ఈ పనులు చేయించింది. అమెరికా మిత్రుల ఉత్తరాలు అందుతున్నాయి. పుస్తకాలు, టేపులు బాగా పోతున్నాయి. మళ్లీ అమెరికా రమ్మని పిలుపు. విమానం టికెట్ పంపారు. నా వీసాకు కొత్త స్పాన్సర్లు లభించారు. వారి ఆహ్వానం మన్నించి మళ్లీ అమెరికా బయలుదేరాను 1981లో.



రాబర్ట్ కెర్‌తో - 1976లో



18. రెండో పుస్తకం కథ

1981 ఆరంభంలోనే మళ్లీ అమెరికా ప్రయాణం. అభిమానులు ముంబయ్ విమానాశ్రయానికి వచ్చి వీడ్కోలు చెప్పారు. ఈసారి మూడు సంవత్సరాలు ఉండి పోవద్దని, వీలైనంత తొందరగా తిరిగి రమ్మని అభ్యర్థన. 'అలాగే' అన్నాను. విమానం లండన్ మీదగా 24 గంటలు ప్రయాణించింది. లాస్ ఏంజల్స్ చేరేసరికి కెన్‌రీడ్ బృందం వచ్చి స్వాగతం చెప్పారు. బోకేలతో స్వాగతించి ఫోటోలు తీశారు. పాత మిత్రుల్ని మళ్లీ కలిసిన ఆనందం నాది.

ఈసారి కెన్‌రీడ్ ఇంట మకాం. తనే లాస్‌ఏంజల్స్ ప్రాంతంలో ఉపన్యాసాలు ఏర్పాటు చేశాడు. పుస్తకాలు, కాసెట్సు బాగా అమ్ముడవుతున్నాయి. రాబర్ట్‌కెర్ ఆహ్వానం మేరకు శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లాను. ఈసారి కలర్ వీడియో ప్లాన్ చేశారు. సముద్రం నేపథ్యంగా అవుట్‌డోర్‌లో చిత్రీకరించారు. 'A Song of Life' అనే అందమైన వీడియో ఫిల్మ్ రూపుదిద్దుకుంది. కేబుల్ టెలివిజన్‌లో ప్రదర్శించారు.

హేల్స్‌బర్గ్ నుండి ఇద్దరు మిత్రులు లార్రీ స్విన్, బెంద్రా సేల్స్ వచ్చారు. వాళ్లిద్దరు Beyond the Mind ప్రాజెక్టుకు పనిచేశారు. వారికి మంచి పండ్ల తోటలు, కూరగాయల తోటలు ఉన్నాయి. అక్కడికి తీసుకువెళ్లారు. అక్కడ నాన్సీలాడ్ కలిసింది. అప్పుడే 'Towards the Unknown' పుస్తకానికి పథక రచన జరిగింది. ప్రణాళిక సిద్ధమైంది. అదీ **'మనసు గతి'** గురించిన పుస్తకమే **'అహంకారం లేని మనసు మనిషికి ఎంతో మేలు చేస్తుంది'**. అదీ ప్రధానాంశం. కాస్త వివరంగా చెప్పాలంటే ...

మనిషి పనిచేసేది మనసుతో. మనసు ముసుగులో మనిషి బ్రతుకుతాడు. మనసును లయింప చేస్తే మనిషి స్వేచ్ఛగా జీవిస్తాడు. వినయశీలత, నిరాడంబరత, సునిశితత్వం పెరిగితే అహంకారం నశిస్తుంది. అదే ప్రజ్ఞగా పరిణమిస్తుంది. అది మొదట దివ్యజ్ఞానం అనిపిస్తుంది. మనిషి చివరకు అందుకోవలసింది అదే. ఉద్రేక స్వభావంతో దానిని అందుకోవడం జరగదు. అది ఎక్కడో ఉండేది కాదు. ప్రతి మనిషిలోనూ ఉంటుంది. వెతుక్కోవలసింది తనలోనే.

రెండో పుస్తకం కథ మొదలైంది. దాని పేరు 'Song of Life'. అంతా కవితామయం. ఆ రోజుల్లో నా ప్రసంగాలు కవితాత్మకంగా సాగేవి. వీసా గడువు అయిపోవచ్చింది. పుస్తకం ప్రచురణ దాకా రాలేదింకా. ఇండియా నుండి మిత్రులు రమ్మని ఉత్తరాలు రాస్తున్నారు. తిరిగి ఇండియా వచ్చేశాను.

ఆ సంవత్సరం ఇండియాలో చాలా చర్చా సమావేశాలు జరిగాయి. కొన్నిచోట్ల అమెరికా పర్యటన విశేషాలు చెప్పాను. అమెరికాలో నా భావాలకు మంచి స్పందన లభించింది. అక్కడ వారు ఆధ్యాత్మికాన్ని మేధస్సుతో పరిశీలిస్తారు. అందుకే వారికి ఆత్మను గురించిన జ్ఞానం బొత్తిగా బుర్రకెక్కదు.

అమెరికా జనాలకు ఎందుకోగాని ఉత్సాహం అధికం. స్థిమితంగా, నెమ్మదిగా, నిదానంగా జీవించడం వారికి నచ్చదు. లోపల మనశ్శాంతి, ఆత్మశాంతి అనేది వారికి అలవికాని విషయాలు. వారి జీవనవిధానం, సంస్కృతి అలాంటివి. ఒత్తిడి జాస్తి. ఊరికే ఉండరు. ఉరుకులు, పరుగులు. జీవితాంతం వారి మనస్సు, ఆలోచనలు అంతే వేగంగా పనిచేస్తాయి. అయినా వారికి జీవిత రహస్యాలు తెలుసుకోవాలన్న ఆసక్తి ఉంది – తపన కాదు. 'శాంతి' కోసం ఆరాటపడతారు. అర్రులు చాస్తుంటారు. విద్య, వివేకం ద్వారా కాక 'శాంతి'కి వేరే మార్గం ఉందంటే వారికి ఆశ్చర్యం.

మన దేశంలో పరిస్థితి వేరు, మనవారి మానసిక స్థితి వేరు. పెద్దపెద్ద నగరాలు మినహాయిస్తే ఇక్కడ ప్రజాజీవనం ఏ ఒడుదుడుకులు లేకుండా సాగిపోతుంది. మనవారికి బోలెడంత తీరుబడి, విశ్రాంతి. అయితే మనవారి కాళ్లకు బంధాలు వేసేది సంప్రదాయం. సంప్రదాయం ఉల్లంఘించరు. దేవుడినైనా తమ సంప్రదాయ చట్రంలో బిగిస్తుంటారు. ఇక్కడి వారి బుర్రల నిండా ప్రాచీన విజ్ఞానం, సంప్రదాయం నిండిపోయి ఉంటాయి. 'సనాతనం' అంటే ఇష్టం. ఆ గీత దాటి బయటకు రారు. ఇండియా, అమెరికా దేశాల సంస్కృతుల్లోని వైవిధ్యాన్ని గమనించాను.

వేసవి వచ్చిందంటే ముంబయ్‌లో ఉండలేను. ఆ తాపం నేను భరించలేను. నా మకాం మహాబ్లేశ్వర్‌కు మార్చాను. అక్కడ హాయిగా ఉంటుంది. Towards the Unknown పుస్తక ప్రచురణ ఇండియాలో కుదిరేటట్లు లేదు. మంచి పేపరు దొరకదు. చక్కని ముద్రణ లభ్యం కాదు. ప్రస్తుతానికి నిలిపివేశాను. ఇంక చేయవలసిన పనిలేదు. వ్యాపకాల్లేవు. మిత్రులు నాకోసం రాసాగారు. అమెరికాలో కొన్ని టెంట్స్ కొని తెచ్చాం. నా కుటీరానికి దగ్గరగా టెంట్స్ వేసుకుని మిత్రులు ఉంటారు. ఇరవై నిమిషాల్లో టెంట్ వేయవచ్చు. అయిదారు టెంట్స్ అతిథుల కోసం ఏర్పాటు చేసి ఉంచాం. అంటే పదిహేను మందికి వసతి సౌకర్యం ఏర్పడ్డది.

మహాబ్లేశ్వర్‌లో అతిథులు పెరిగారు. హోటల్ నుండి భోజనాలు వచ్చేవి. వంటపని లేదు. విదేశీయులూ రాసాగారు. కాలిఫోర్నియా మిత్రులు రమ్మని ఒత్తిడి చేస్తున్నారు. పుస్తక ప్రచురణ కోసమైనా అమెరికా వెళ్లాలి.

★ ★ ★

పుస్తకం కోసం శాంతా పన్నుటి చాలా శ్రమపడుతోంది. తనే బొమ్మలు, డ్రాయింగులు తయారు చేసింది. ఎంత డబ్బు చాలడం లేదు. ఒక రోజున ఎవరో ఒకామె నాగదికి వచ్చింది. "దాదా, ఇంక ప్రచురణ ఆలస్యం చేయవద్దు. వెంటనే ప్రింటింగ్ ఏర్పాటు చేయండి" అని కావలసిన డబ్బు యిచ్చింది. ఈసారి పుస్తకాల షాపుల వారు ఉత్సాహంగా ఉన్నారు. అమ్మకాల గురించి బెంగలేదు. ఎటొచ్చీ పుస్తకం అచ్చువేయడం ఒక్కటే ఆలస్యం. అమెరికాలో పుస్తకం అచ్చువేయడం అంటే ఒక పెద్ద భారీ ప్రయత్నం! భారీ వ్యాపారం.

★ ★ ★

ఒకరోజున బ్రెండా చిరాకుగా, దిగులుగా నావద్దకు వచ్చింది. "దాదా! జీవితం చాలా విసుగనిపిస్తోంది. కాసేపు ప్రశాంతంగా కూర్చుని ధ్యానం చేసుకోవాలంటే వీలు కావడం లేదు. మీతో మాట్లాడటానికి కూడా తీరిక చిక్కడం లేదు. మీకు ఎంతో సాయం చేయాలని వుంది. లర్రీకి నాకు పడడం లేదు. ఏం చేయమంటారు?"

ఆమెను చూస్తుంటే జాలి వేసింది. ఆమెలో ఆధ్యాత్మిక తపన ఉంది. జిజ్ఞాస ఉంది. చాలాసార్లు ఆ విషయాలు మాట్లాడుకున్నాం. చాలాచోట్ల జరుగుతోంది అదే. ఆశ ఉంటుంది. అవకాశం రాదు. జిజ్ఞాస ఉంటుంది. సరైన గైడ్ దొరకడు. కొందరికి కాలం కలిసిరాదు. కేవలం ఆసక్తి వల్ల సాధించేది ఏమీ ఉండదు. సాధనకు ప్రయత్నించకుండా ఎంత ఆరాటపడినా ప్రయోజనం ఉండదు. రోజూ

ఒకగంట సేపు ధ్యానానికి కేటాయించకపోతే ఏం ఒరుగుతుంది. జీవితాంతం అలా ఎదురుచూడ్డంతోనే జరిగిపోతుంది.

నేడు అందరికీ ఉద్యోగ, వృత్తి బాధ్యతలు ఎక్కువ. చేస్తున్న పనులు, చేయవలసిన పనులు అధికం. కాస్తయినా విశ్రాంతి, విరామం కనిపించదు. ఒంటరిగా ఉండడానికి భయం. కళ్లు మూసుకుని ధ్యానించడానికి భయం. భయం వల్ల పనులు కల్పించుకుంటారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు తీరిక లేకుండా ఉంటారు. తమ పిల్లల్ని అలాగే తయారు చేస్తారు. బిజీగా ఉండడమే జీవితం. అదే భ్రమలో బ్రతుకుతున్నారు అందరూ.

ఒంటరితనం రెండు విధాలు : ఒకటి ఏకాంతం కోరడం. రెండవది ఏకాకిగా బ్రతకడం. ఒకటి భౌతికంగా ఒంటరి కావడం, రెండవది మానసికంగా ఏకాంతం కావడం. మనిషి శబ్దాన్ని భరించగలిగినంతగా నిశ్శబ్దాన్ని భరించలేడు. నిశ్శబ్దం అంటే భయం. ఒంటరిగా ఉండడానికి భయం. పనులు మానాలి, వృత్తులు మానాలి, ఆలోచనలు విరమించాలి. నిరంతరం పరిశ్రమించే వారి శరీరం, మనస్సు విశ్రాంతిని ఆశిస్తాయి. తీరిక లేకుండా పనిచేయడమే జీవితగమ్యమా?

ఇక్కడ ఒక విషయం గమనించాలి? ఒంటరితనం అంటే చేసే పనులు అన్నింటినీ వదిలిపెట్టడం కాదు. ఒత్తిళ్ల నుండి విముక్తం కావడం. పరిసరాల ప్రభావాలకు లోను కాకుండా, ధైర్యంగా నిలబడడం. అప్పుడు 'ఆత్మ' ఉనికి తెలుస్తుంది. ఆత్మ ప్రస్థానం మొదలవుతుంది. ఆత్మ ప్రాముఖ్యత తెలుస్తుంది. అప్పుడు ఆత్మసాక్షాత్కారం అయినట్లే. ఆత్మదర్శనం అయితే శరీరం మీద వ్యామోహం తగ్గుముఖం పడుతుంది. పూర్తిగా నశిస్తుందని కాదు – తగ్గుతుంది. మమేకం కావడం ఉండదు. అదే ప్రధానం, సర్వస్వం అనుకోవడం జరగదు. అంటే వ్యాపకాలు, వ్యావృత్తులు, వ్యసనాలు తగ్గుముఖం పడతాయి. ఒత్తిళ్లు ఉండవు. పెద్దగా ఆలోచించవలసిన అవసరం ఉండదు. అది స్వచ్ఛంద జీవన తరంగం. స్వేచ్ఛా జీవన ప్రబంధం.

అలా ఏకాంతంగా ఉన్నప్పుడే ఆంతర్యం వికసిస్తుంది. ఆధ్యాత్మికత పరిమళిస్తుంది. సంయమనం ఏర్పడుతుంది. 'ఆత్మ'కు రక్షణ కలుగుతుంది. నిర్భయం అంటే అంతా ఆనందమే. మానసికంగానూ ఏకాంతం పొందగలిగితే అంతశ్శక్తి పెరుగుతుంది. అంతర్దృష్టి ఏర్పడుతుంది. సాధనతో శోధన పెరుగుతుంది. మనిషిలో సృజనాత్మకత మొదలవుతుంది. అంటే స్వేచ్ఛ,

సర్వస్వతంత్రత, ఆత్మ వివేకం, ఆత్మజ్ఞానం అన్నీ ఒకదానివెంట ఒకటి ఏర్పడతాయి.

కాని మనం ఏం చేస్తున్నాం? అసలు జీవకేంద్రం దాకా పోకుండా పైపైన తచ్చాడుతుంటాం. బంధుత్వాలు, బాంధవ్యాలు, వ్యవహారాలు, ఆత్మీయతలు అని సతమతమవుతూ జీవిత సత్యాలకు దూరం అవుతుంటాం. ఇంక మనల్ని మనం వెతుక్కునేది ఎప్పుడు? సత్యాన్ని గ్రహించేది ఎప్పుడు? మనిషిలోని నిర్మలత్వం, నిశ్చలత్వమే జీవం. జీవనం గురించీ జీవం గురించీ ఎందరికి తెలుసు? ఎందరు తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు? తెలుసునని అహంకరించే వారికి మాత్రం తెలుసా? అతి ప్రధానమైన అంశాన్ని వదలి వేస్తున్నాం, ఎందుచేత?



'తపోవన్' ప్రాంగణంలో సత్సంగం

మనిషి అంతరంగంలో, హృదయం లోతుల్లో అద్భుత శక్తు లున్నాయి. అంతులేనంత సృజనాత్మకత ఉంది. ఆ విషయమే మనకు తెలియదు. మనసును నిశ్చలం చేసి, ఎడాపెడా ఆలోచించడం మానితే, కోరికలకు వ్యసనాలకు ఆనకట్టలు వేస్తే, మన శక్తి నిల్వలు పెరుగుతాయి. వాటిని సద్వినియోగ పరచు కోవచ్చు. అంటే మన కేంద్రాన్ని చేరినట్లు.

'ఏకాంతం' అంటే ఆషామాషీ కాదు. అది హృదయ కేంద్రం చేరడానికి రాజమార్గం. అక్కడికి చేరుకుంటే తప్ప మనశక్తి నిధులు మనకు తెలియవు.

మన సునిశితత్వం తెలియదు. అది సుక్షేత్రం. దివ్యభూమి. సృజనకు తావలం అది. అదే జీవితానికి ఇంధనం. శాంతిని, చైతన్యాన్ని, పూర్ణత్వాన్ని అందించేది అదే. ప్రతి ఒక్కరు సాధించవలసింది, సాధన చేయవలసింది, ధ్యానించవలసింది దాని కోసమే. లోపలకు వెళ్లి వెతికితే తప్ప, వాటి ఉనికి మనకి తెలియవు.

అది ప్రశాంత ఏకాంతంలో జరిగే పరిణామం. ప్రశాంతత లేకపోతే మనిషి జీవకేంద్రాన్ని చేరడు. ప్రశాంతి అంటే నిశ్శబ్దం, నిశ్చలనం, నిరాలోచన, నిష్కామ్యం. లోపలి లోతుల్లోకి వెళ్లే మార్గం పేరు 'ఏకాంతం'. అంతర్గత శక్తులు సొంతం చేసుకునే మార్గం. పరేంగిత ప్రజ్ఞకు అది అగోచర మార్గం.

మరొక విధంగా చూస్తే, ఏకాంతం అంటే పరిసర ప్రభావాలు మనపైన పడకుండా జాగ్రత్తపడడం. పని ఒత్తిడులు పరిహరించడం. సమాజం కట్టడులు, నిబంధనలు దాటిపోవడం. పరిసరాలు, సమాజం మనల్ని క్షోభకు గురి చేస్తుంటాయి. మన జీవనధారను కలుషితం చేస్తాయి, కల్లోల పరుస్తాయి. అసూయాద్వేషాలు, స్వార్థ ప్రయోజనాలు మనచుట్టూ పెద్ద గోడలు సృష్టించాయి. మన చుట్టూ ఉన్న వాతావరణం కలుషితమైపోయింది. ప్రశాంతికి అవరోధాలు ఎక్కువైనాయి. ఈ వాతావరణ కాలుష్యంలో మనిషి ప్రశాంతంగా జీవించగలడా?

అవి అవరోధాలే కాదు, బలమైన ఆకర్షణలు కూడా. వాటికీ చైతన్యం ఉంది. కనుక వాటిని అంత సులభంగా దాటడం సాధ్యం కావడం లేదు. ప్రతి ఆలోచనకు, భావానికి శక్తి ఉంటుంది. ఆ శక్తి పరిసరాలను ప్రభావితం చేస్తుంది. జీవితాన్ని కల్లోల పరుస్తుంది, కదిలిస్తుంది, కకావికలు చేస్తుంది. ధ్వని కాలుష్యం వంటిదే భావ కాలుష్యం. అది మన అంతరాన్ని క్షోభకు గురిచేస్తుంది. మానసిక అశాంతికి గురిచేస్తుంది. అది చేసే అపకారం, కలిగించే హాని ఇంత అని మనకు తెలియదు. వాటి ప్రభావం మనిషిపైన, సమాజంపైన, కాలంపైన పడుతోంది.

ఈ కల్మషాలను వదిలించుకోవడం ఎలా? వాటి ప్రభావాలకు దూరం కావడం ఎలా? వాటిలో కనిపించేవి కొన్ని, కనిపించనివి ఇంకొన్ని. కొన్ని మనసు పరిధిలోనివి. కొన్ని భౌతిక ప్రపంచం పరిధిలోనివి. ఆ ప్రభావాల నుండి తప్పించుకోవడమే స్వేచ్ఛ. అందుకు ఏకాంతం అవసరం. బుద్ధి, జ్ఞానం, విజ్ఞత కలవారు ఈ ఒత్తిళ్ల రహస్యం ఇట్టే తెలుసుకోగలరు. అవి ఎంత నిరుపయోగాలో, వ్యర్థమో గ్రహిస్తారు. ఆ ప్రయత్నంలోనే తపన మొదలవుతుంది. జిజ్ఞాస ఆరంభమవుతుంది. నేనేమిటి? నేనెవరు? అన్న ప్రశ్నలకు సమాధానాల కోసం వెతుకులాట జరుగుతుంది. అప్పుడే మనిషి జిజ్ఞాసిగా మారి ఏకాంతాన్ని అన్వేషిస్తాడు, ఆశిస్తాడు.

ఒంటరిగా జీవించాలనుకుంటాడు. తన లోపలకు నిష్క్రమించడం సాధన చేస్తాడు. కళ్లు తెరిచి ఉన్నా ఆ స్థితిలో బాహ్య ప్రపంచం కనిపించదు. అంతా అంతర్ రామణీయమే. అదే అంతర్గమనం, అంతర్వీక్షణం.

నా అవగాహన ప్రకారం ఒక్కొక్కరి మనస్సు ఒక్కోవిధంగా ఉంటుంది. దానికి వారసత్వ సంక్రమణలు, సంప్రదాయ ప్రభావాలు, సామాజిక ఒత్తిళ్లు కారణాలు. అలవాట్లు, ఆచారాలు ఊపిరాడనీయవు. అవే మనసుపైన పనిచేస్తాయి. మనసును ప్రభావితం చేస్తాయి ఒకరినొకరు తెరచాటున చూస్తున్నట్లు. ఆత్మాను సంధానం ఉండదు. ఆత్మదర్శనం లభించదు. కనుక సంబంధాలలో సఖ్యత కనిపించకుండా పోతుంది. హృదయం స్పందించదు. అది కారణంగా, దగ్గరివారితోనూ దూరం పాటిస్తాం. ఆ స్థితిలో నేను నాలోకి చూచుకోసాగాను. బాంధవ్యాలు ఏమిటి? ఎంతవరకు? ఎందుకు? అని ప్రశ్నించుకుంటే అంతా డొల్ల. లోపల ఏమీ లేదు. దిగులు వేసింది. మనస్సును నమ్ముకుంటే అంతా మోసం. ఎవరికీ మేలు జరగదు. మనసుచేసే సహాయాలు ప్రమాదాలనిపించాయి. ఎవరి అవసరాలు ఎవరికి తెలుస్తాయి? ఏదో సర్దుకు పోవడం తప్ప. అసలు ఎక్కడికక్కడ సర్దుకు పోవడమే జీవితం అనిపించింది.

పెద్దవాళ్లను గమనించండి. తమ వయసు వారితోనూ కలిసిమెలిసి సఖ్యతగా ఉండరు. తమకంటే చిన్నవారిని ఇష్టపడుతుంటారు. అందులో నిజమైన ఇష్టం ఉంటుందా? అంటే, ఉండదు. ఏవో తెలియని బంధాలు, ఆత్మీయతలు. ఏక పక్షంగా ఉంటాయి ప్రేమలు, అభిమానాలు. మనం అభిమానించినట్లు, ప్రేమించినట్లు అవతలివారు మనల్ని అభిమానించరు, ప్రేమించరు.

అంటే ఏమిటి? మనిషి పైపై మెరుగుల్ని మాత్రమే ఇష్టపడుతుంటాడు... లోతులకు వెళ్లి చూచే అలవాటు లేక. చీకట్లో, ఒంటరిగా పోవడానికి మనస్సు ఇష్టపడదు. భయపడుతుంది. అసలు మనసు కెందుకు భయాలు? ప్రతి మనిషి ఒంటరిగానే ప్రపంచంలోకి వస్తాడు. ఒంటరిగానే పోతుంటాడు. కానీ, జనన మరణాల మధ్యకాలంలో మాత్రం ఒంటరితనం అంటే భయపడతాడు. జంటకోసం తపిస్తాడు. జనం కోసం అంగలారుస్తాడు. పరిచయాలు, ప్రేమలు, సుఖాలు, ఆనందాలు సవాలక్ష ఉపకరణాలు, కారణాలు చూపిస్తాడు. ఆ పిచ్చి పనులకు సమాజసేవ అని పేరు. సుఖంగా జీవించడం లక్ష్యం. దాని మరో పేరు ప్రేమ. ఈ ప్రేమకథ సహస్రాబ్దాలుగా సాగిపోతోంది. మనసు మనిషిని ఆడిస్తూనే ఉంది.

మనిషి ప్రేమించడం, ప్లవించడమే జీవిత లక్ష్యం కాదని గ్రహించాలి. కాని అదే జీవితం అనే స్థితికి దిగజారాడు. భార్య, పిల్లలు, కుటుంబం, సమాజం–

నాలుగు స్తంభాల మండపం. వారి అవసరాలకు అనుకూలంగా బ్రతకాలి. తన వారు అని అంగలార్చుతుంటాడు. ఎవరు తనవారు? అసలు తనెవరు? వారెవరు? తను బ్రతుకుతున్నది తనచుట్టూ ఉన్నవారి కోసం. తనకోసం జీవించడం లేదు? తానేమిటో తెలిస్తే తనకోసం జీవిస్తాడు.

అందుచేత జ్ఞానులు ఈ బంధాలను వదులుకుంటారు. అనుబంధాలకు దూరం అవుతారు. బంధుగణాన్ని గణనలోకి తీసుకోరు. మిత్రుల్ని చేర్చుకోరు. ఎవరితోనూ స్నేహం చేయరు. ఉన్న బాంధవ్యాలు తెంచుకుంటారు. తప్పించుకోరు. ప్రేమ పక్షులై పెళ్లాలచుట్టూ, పిల్లలచుట్టూ, బంధువులచుట్టూ గిరికీలు కొట్టరు. ఈ సమాజాన్ని, మనుషులను అసలు పట్టించుకోరు.

స్వశక్తిని తెలుసుకోవాలంటే ఎవరైనా ఏకాంతాన్ని ఆశ్రయించక తప్పదు. అది సృజనశక్తి. అందుకు ముందుగా బంధాలనుండి విముక్తం కావాలి. అభిమానాలు, ఆరాధనలు, అనుబంధాలు బొత్తిగా పనికిరావు. ప్రేమ చుట్టూ పరిభ్రమించడం, చక్కర్లు కొట్టడం జీవిత లక్ష్యం కాదు. బంధాలలో బందీ కావడం జీవిత పరమార్థం అవదు. జిజ్ఞాస పెంచుకోవాలి. శాంతిని కాంక్షించాలి? ఆత్మను అన్వేషించాలి. మనం ప్రయత్నం చేయనిది ఆత్మశక్తి బయటకు రాదు. ఒకసారి బయటకొచ్చిన ఆత్మచైతన్యం మనిషిని లోపలా బయటా శుద్ధి చేస్తుంది. ఆత్మ 'తృప్తి'ని కలిగించి, ప్రజ్ఞా తీరాలకు తీసుకుపోతుంది. నిరుపయోగమైన ఆలోచనలు లేకపోతే, పొంగులెత్తేది ఆత్మశక్తే.

అయితే, లోచన లేని ఆలోచన ఇబ్బందికరం కాదు. లోకాన్ని మరిపించే ఆలోకనం మంచిదే. తన్మయం కాని భావం ప్రమాదకరం కాదు. అది అనుబంధాన్ని పెంచదు. ఆత్మీయతల్ని చిగురించదు. అంతా అంటీముట్టని వ్యవహారం. అది ఒక విధంగా సర్వోత్తమమైన స్థిరత, స్థిమితం. మన జీవన వేగం తగ్గితే, అది సాధ్యపడుతుంది. ఎందులోనూ వేగిరపాటు పనికిరాదు. ఏకాంతం, ఆలోకనం, గమనిక భావాతీత ప్రజ్ఞకు బాటలు వేస్తాయి. అది తురీయం.

ఆ స్థితిలో, సంయమనంలో విశ్వచేతన అనుభూతికి అందుతుంది. విశ్వశక్తి మనకు అందుబాటులో ఉంటుంది. మనలో, అంటే మనసులో సంకుచితత్వం ఉండకూడదు. స్వార్థం ఉండదు. అన్నింటినుండి స్వేచ్ఛ లభిస్తుంది. అది అసలైన ప్రేమకు వారధి. మన ప్రజ్ఞ మానవతను మేల్కొల్పుతుంది. మనం నవయుగానికి, నవజీవనానికి వైతాళికులం కాగలం, అవుతాం.



19. స్వదేశ సందర్శన

రెండవ పుస్తకం ప్రచురణ జరిగింది. ఆ ఉత్సాహంతో ఇండియాకు తిరిగి వచ్చాను. అమెరికాలో పుస్తకం పనులు, ప్రసంగాలు, ఇంటర్వ్యూలతో అలసి పోయాను. వెంటనే ఇంటికి వెళ్లి అమ్మను పరామర్శించాను.

"Towards the Unknown" పుస్తకం కవితాత్మకంగా ఉన్నా, పాఠకులు ఆదరించారు. ముంబయ్‌లో ఉండగా మంజూ బెన్ షా వచ్చి ఉత్తరభారత పర్యటన కార్యక్రమం చెప్పింది. తన స్నేహితుడు శరద్‌మెహతా స్పాన్సరర్. జమ్ము, కాశ్మీరం వరకు ప్రయాణం. హిమాలయ అరణ్యాలలో ఎక్కడో మంచి కర్పూరం ఫాక్టరీలున్నాయట. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను కలవాలని ఆయన ప్లాను. కర్పూరం తయారీ చాలా కష్టమైన పని. అక్కడ అరణ్యాల మధ్య పట్టాణా లేర్పడ్డాయి. అంత సుదూర ప్రాంతాలలో, అరణ్యాల మధ్యన పనిచేసే వారిని కలవాలని నాకూ అనిపించింది.

మీటింగులకు వచ్చిన వారంతా విద్యావంతులే. కొందరు లాబ్స్‌లో పనిచేసే సైంటిస్టులు. వారి జీవిత విధానం చిత్రంగా ఉంటుంది. అందరిలో కలిసి ఉన్నా ఒంటరిగా ఉన్నట్లే. ఎందుకంటే బయటి ప్రపంచంతో వారికి సంబంధం ఉండదు. అయినా ఉత్సాహంగా, సృజనశీలంగా, క్రియాత్మకంగా పనిచేస్తారు. 'వివేకం' గురించి వారితో ముచ్చటించాను. క్రియాత్మకత గురించి బోధించాను. వారం రోజుల్లో చాలామందితో డైరెక్టుగా సంభాషించే అవకాశం కలిగింది.

నేను ప్రశ్నించాను : "నిత్య జీవితంలో మీకు సైన్సు ఎంతవరకు ఉపయోగం? సైంటిఫిక్‌గా జీవిస్తున్నారా? మీ శాస్త్రజ్ఞానం డిగ్రీలతో

ఆగిపోయింది. తర్వాత ఉద్యోగం. అంతేగదా? జీవనతత్వం అర్థం చేసుకోడానికి శాస్త్రీయ దృక్పథం, అవగాహన అవసరం. మనం వ్యక్తిగత జీవితం గురించి తెలుసుకోవలసింది ఎంతో ఉంది. మీ యాంత్రిక జీవితంలో క్రియాశీల జీవిత విలువల్ని పట్టించుకోరు".

మా సంభాషణల్లో కొందరు ఆసక్తి కనపరిచారు. వారి దృక్పథంలో మార్పు వచ్చింది.

నాకు పర్వతాలంటే ఇష్టం. కలకత్తా ప్రసంగాల తర్వాత డార్జిలింగ్ వెళ్లాలని యోచించాను. డార్జిలింగ్ ప్రకృతి పరంగాను, జీవన పరంగాను సమున్నతం. గొప్ప విహార ప్రదేశం. అక్కడ నుండి చూస్తే ఎవరెస్టు శిఖరం కనిపిస్తుందంటారు. ఆ అవకాశం జీవితంలో లభించడం కష్టం. కలకత్తా నుండి ఒక మిత్రుడు నాతో బయలుదేరాడు. హిమాలయ సౌందర్యాలు మహాద్భుతంగా ఉన్నాయి. మంచు దుప్పట్లు కప్పుకున్న పర్వత సానువులు. సూర్యకిరణాలు పడి మెరిసే శిఖరాలు. ఎవరెస్టు శిఖరం దర్శించాలని సంకల్పించాం. నిజంగా అది కష్టమైన ప్రయాణం. జీపులో ఉదయం 3.30కే బయలుదేరాం. రెండు గంటలు ప్రయాణం టైగర్ హిల్ వరకు. అక్కడ నుండి ఎవరెస్టు శిఖరం కనిపిస్తుంది. అదీ మంచుకరిగినపుడు. అదృష్టం ఉంటే మంచుపొరల చాటున కొన్ని నిమిషాలు కనిపిస్తుంది.

తెల్లవారు ఝామున ప్రయాణం. అసలే హిమాలయాలు. చలి అదర గొట్టింది. ఊలు రగ్గులు కప్పుకున్నాం. ఫ్లాస్కులో నిండుగా వేడి టీ. తినడానికి చాక్‌లెట్స్, పప్పుగింజలు. రెండు గంటల తర్వాత దట్టమైన అరణ్యంలో ఒకచోట జీపు ఆపి, అక్కడి నుండి చూడమన్నాడు గైడ్. అరగంట తర్వాత పొగమంచు విచ్చుకున్నది. మంచు కరిగిన వెంటనే బంగారం రంగులో ఎవరెస్టు దర్శన మిచ్చింది. నా చిరకాల స్వప్నం ఫలించింది. వెళ్లిన ఎనిమిదిమంది ఆనంద తాండవం చేశారు. వేడివేడి 'టీ' తాగి సెలబ్రేట్ చేసుకున్నాం.

హోటల్‌కి తిరిగి వచ్చాక అనిపించింది - ఎవరెస్టు శిఖరాన్ని ఎవరు కొలవగలరు. అక్కడికి వెళ్లడానికి ఎంత ఆత్మబలం కావాలి. జీవితంలో ఏ రంగంలో శిఖరాన్ని చేరాలన్నా ఆత్మశక్తి అవసరం. పట్టుదల ఉండాలి. ఎంతమంది జీవిత శిఖరాల్ని చేరగలుగుతున్నారు? జనం ఎందుకు అలాంటి సాహసాలకు పూను కుంటారు? ఆలోచించాను. అసలు వారి ఉత్సాహమే శిఖరాలకు చేర్చుతుంది. పట్టుదల, క్రియాశీలత సహకరిస్తాయి. మనిషికి ఉత్సాహమే ప్రాణం. పట్టుదల విజయశిఖరాలకు చేర్చుతుంది. కొందరే విజయం సాధిస్తారు. మిగిలినవారు దిగువ

స్థాయిలో ఆగిపోతారు లేదా ఓడిపోతుంటారు. అయితే 'అపజయం'లోను విజయ కాంక్ష ఉంటుంది. లక్ష్యం ఉంటుంది. సాహసం చేయనివారు ఎప్పుడూ క్రిందనే ఉండిపోతారు.

అతీత మనస్కులు కాకుండా, సాహసం చేయకుండా, ఎవరూ తమ ఆంతర్యాన్ని తెలుసుకోలేరు. జీవితంలో చేరవలసిన శిఖరం బయట ఉండదు. మనలోనే ఉంటుంది. లోపలనే ఉంటుంది. అది తెలుసుకోవడమే శిఖరారోహణం. అది జ్వాల. అంతర్జ్వాల. ఆ శిఖరం చేరడానికి కావలసింది అద్భుతమైన సంకల్ప బలం. చెక్కు చెదరని దీక్ష ఉండాలి. విప్లవ చైతన్యం ఉండాలి పుష్కలంగా. కొందరు మానసికంగా ఎదుగుతారు. ఆ తర్వాత ఒక సుముహూర్తంలో అంతరాత్మ పిలుపు వినిపిస్తుంది. అక్కడ నుంచి లోపలకు పరుగుతీస్తారు. గమ్యం చేరుకుంటారు.

జీవితంలో ఏది సాధించాలన్నా తపన ఉండాలి. పట్టుదల సడలకూడదు. అనవసరంగా కొన్ని కోరికలకు, వ్యసనాలకు శక్తిని ఖర్చు చేస్తుంటారు. శక్తిని వృధా చేయకూడదు. పొదుపు చాలా అవసరం. అదే అతీంద్రియ శక్తిగా పరిణమిస్తుంది. అప్పుడు ఏ శిఖరం అయినా సులభంగా చేరవచ్చు. హృదయమే కైలాసం అవుతుంది. హృదయ కేంద్రమే ఎవరెస్టు అవుతుంది. ఎలాంటి ప్రతికూలత, ప్రతిఘటన ఉండదు. అయితే మన సంకల్పాన్ని, లక్ష్యాన్ని ఆత్మదిశగా మరల్చాలి. నిజానికి అది ఏమాత్రం శ్రమ కాదు. మనసును లక్ష్యంపైన పెట్టి మనసును దాటిపోవాలి. అంతే!

ఎవరెస్టు శిఖరారోహణం కోసం ఎందరో ప్రయత్నించారు. ఎడ్మండ్ హిల్లరీ, షెర్పా టెన్జింగ్‌లు మాత్రమే విజయం సాధించగలిగారు. హోటల్ మేనేజరు చెప్పాడు టెన్జింగ్ ఆ దగ్గరనే ఉంటాడని. వెళ్లి అతన్ని కలిశాను, మాట్లాడాను. అడిగాను "ఎవరెస్టు శిఖరారోహణ చాలా కష్టం కదా! మీరెలా విజయం సాధించారు".

టెన్జింగ్ అన్నాడు : కష్టాలు తప్పవు. ఎవరెస్టు ఆరోహణలో ముప్ఫయి పౌనులు బరువు కోల్పోయాను. చేస్తున్నది సాహసం కనుక ఉత్సాహం తగ్గదు.

అతనిలో పట్టుదల, ఉత్సాహం తగ్గలేదు. ఎంతో వినయంగా, నిరాడంబరంగా ఉన్నాడు. ఒక గొప్ప వ్యక్తిని కలుసుకున్న సంతృప్తి నాకు కలిగింది.

★ ★ ★

హిమాలయ సౌందర్య దర్శనం తర్వాత కలకత్తాలో మిత్రుడి యింటికి చేరాం. ముంబయ్ నుండి శైలేంద్ర తివారీ నాకోసం వచ్చాడు. ఢిల్లీ వెళ్లాలి.

ముందుగా నేపాల్ ప్రయాణం పెట్టాడు. ఖాట్మండు గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం. మూడు రోజులకు ముందుగానే హోటల్ బుక్ చేశాడు. ఎత్తయిన పర్వతాలపైన విమాన ప్రయాణం. హాయిగా అనిపించింది.


నేపాల్ ఎయిర్‌పోర్టు చాలా చిన్నది. కస్టమ్స్ గొడవ లేదు. గేటు దాటగానే నలుగురు వచ్చి బొకే లిచ్చి స్వాగతం చెప్పారు. నలుగురూ కాషాయబట్టలు ధరించి ఉన్నారు. పొరపాటున నన్ను స్వాగతిస్తున్నారనుకున్నాను. కాదు నా గురించి, నా రాక గురించి తెలుసుకునే వచ్చారు.

వారి ఆశ్రమానికి ఆహ్వానించారు. హోటల్‌కు వెళ్లవద్దని వారి పట్టుదల. కాదనలేక వారి ఆశ్రమానికి వెళ్లాను. మూడు రోజులు అనుకున్నది అక్కడ పదిరోజులు ఉండవలసి వచ్చింది. చాలా మీటింగులు, ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. వారే ఖాట్మండు అంతా తిప్పి చూపించారు.

అక్కడి నుండి ఢిల్లీ వచ్చాం. ఢిల్లీలో డా. రాధాకృష్ణన్‌ను కలిశాను. కాంగ్రెసు జనరల్ సెక్రటరీ శంకర్‌రావ్‌దేవ్ ని కలిశాను.



భారత రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో ...



20. అమెరికా, కెనడా పర్యటన

ఇండియాలో ఉన్నప్పుడు అమెరికా నుండి ఆహ్వానాలు. అమెరికాలో ఉంటే ఇండియా నుండి ఆహ్వానాలు. మళ్లీ అమెరికా నుండి ఆహ్వానాలు ... లోగడ పరిచయం లేని వ్యక్తుల నుండి. ఆరు మాసాలకు సరిపడా ప్రోగ్రాం. వెళ్లక తప్పలేదు. 1984లో నాల్గవసారి అమెరికా పర్యటన. అమెరికా వాయవ్య రాష్ట్రాలు ఓరగాన్, వాషింగ్టన్, కెనడాలకు వెళ్లాలి. రాయ్‌కి నా తాత్వికతపట్ల ఆసక్తి పెరిగింది. ఈసారి నాన్సీలాయిడ్ ఇంట్లో దిగాను. రాయ్ ప్రయాణం ఏర్పాటు చేశాడు. వాన్‌లో ప్రయాణం. ఆ వాన్ చాలా పాతది. నాన్సీ డ్రయివింగ్. అంత డొక్కు వాన్‌లో ప్రయాణం ఎలా సాగుతుందా అనిపించింది! కాని రాయ్ దానిని చక్కగా ముస్తాబు చేసి సిద్ధం చేశాడు. వాన్‌లో రెండు పడకలు, కిటికీలకు కర్టెన్లు. చక్కని డ్రాయింగ్ రూంలా ఉంది.

నాన్సీ ప్రయాణానికి చాలా తినుబండారాలు తెచ్చింది. రెండు పుస్తకాల కట్టలు, వీడియోలు. వాన్‌లో ఓ చిన్న ఆఫీసు తయారైంది. రోడ్ మ్యాప్ చూస్తూ డ్రయివ్ చేయాలి. రెండువేల మైళ్లు కారులో ప్రయాణం. మాటలు కాదు.

మా మొదటి మజిలీ ఓరగన్. రుత్ అనే ఆమె ఉత్తరం రాసింది. ఫ్లొరెన్స్‌లో కొందరు మహిళలు ఒక సెంటర్ నడుపుతున్నారట. నా పుస్తకం చదివి ఆహ్వానించారు. వాళ్లందరూ ఆధ్యాత్మికాసక్తి కలవారు. ఆధ్యాత్మిక ప్రచారం ఆ సెంటర్ లక్ష్యం. ఓరగన్ తీరం వెంబడి రెండు రోజులు ప్రయాణం చేసి ఫ్లొరెన్స్ చేరుకున్నాం. మంచి ఆతిథ్యం యిచ్చారు. వారి అధ్యయనం జీవిత విలువలు. నిరాడంబరంగా జీవిస్తారు. చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తారు. ఖర్చులకు సరిపడ సంపాదన వారిది. ప్రధానంగా వారి ఆరాటం ఆత్మ కోసం, ఆత్మతృప్తి కోసం.

రెండు గ్రూపుల్లో ప్రసంగించాను. వేర్వేరు ఇంటర్వ్యూ లిచ్చాను. వారికి ఇంకా యింకా వినాలన్న తపన ఉంది. జీవిత సత్యాలు తెలుసుకోవాలి. జీవితపు లోతులు వెతకాలి.

నా ప్రసంగం : "మీరు ఇలా సమష్టిగా జీవించడం బావుంది. మంచి ప్రయోగం. దానివల్ల మంచి అవగాహన ఏర్పడుతుంది. సత్సంబంధాలు నెల కొంటాయి. ఇతర వ్యాపకాలు, వ్యసనాలు, కోరికలు, ఆరాటాలు ఉండవు కనుక మనశ్శాంతి ఏర్పడుతుంది. అయితే ఇలా కలిసి జీవించడంతో ఏం సాధిస్తున్నారు? నిరాడంబర జీవనం వల్ల ఏం వొరిగింది? ముసలితనం వస్తుంది. అంటే గమ్యం చేరినట్లా? లక్ష్యం సాధించినట్లా? జీవితానికి మరణం గమ్యం కాదు. కలిసి కబుర్లు చెప్పుకుంటారు. గొప్ప విషయాలు చర్చిస్తారు. ఏదీ తృప్తి నివ్వదు. ఆత్మ తృప్తి కలగాలంటే ఆత్మదాకా వెళ్లాలి కదా! బుద్ధి శుద్ధి అయితే తప్ప ఆంతర్యం పరిశుద్ధం కాదు. లోపల మార్పు రావాలి. ఆ మార్పును గుర్తించి ఆత్మకు నివేదన చేసుకోవాలి!

ఆ మార్పు మీలో వస్తున్నదా? గమనించండి. మీ ప్రతి ఒక్కరిలో అసంతృప్తి ఉంది. ఏదో 'లేమి' మీ మొహాల్లో తొంగిచూస్తోంది. పైకి ప్రశాంతంగా కనిపిస్తున్నా, సుఖంగా ఉన్నామని అనుకుంటున్నా లోపల అసంతృప్తి ఉంది. ఎందువల్ల? ఎక్కడో అపశ్రుతి దొర్లింది. కారణం? మీ మనస్సు ఆత్మకు సహకరించడం లేదు. ఆధ్యాత్మికంగా జీవించడం మీకు తెలియదు. దాని రుచి మీకు తెలియదు. ఉత్తుత్తి 'ఆధ్యాత్మికత' ముసుగు వేసుకుంటున్నారు. సంపూర్ణశాంతి నిచ్చేది ఆత్మ. ఏదీ మీలో ఆత్మజాగృతి, ఆత్మవికాసం?

మీరు చేస్తున్నది ఒక ప్రయోగం. జస్ట్ ఎ ట్రయల్, ఎక్స్‌పరిమెంట్. ఆధ్యాత్మికంగా, సంపూర్ణంగా జీవించడానికి వేరే రకమైన వాతావరణం కావాలి. ఆంతర్యపు లోతులు అన్వేషించాలి. అంతర్వీక్షణ కావాలి. లేనపుడు ఈ అరకొర ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనాలవుతాయి. అవి మీ మనసుకే పరిమితం. ఆత్మ దాపులకు వెళ్లడం జరగదు. ఆత్మ తృప్తి ఉండదు. ఆత్మశాంతి లభించదు. తపన పడాలి. జాగరణ మొదలు పెట్టండి".

ఓరగాన్ తీరం వెంబడి ప్రయాణం. నాన్సీ డ్రయివింగ్. తర్వాత మా మజిలీ సీటెల్. లోగడ ఎప్పుడో ఒకసారి ఇక్కడకు వచ్చాను. ఈసారి రే షహాన ఆతిథ్యం. రే బోయింగ్ ఎయిర్‌క్రాఫ్టు ఇంజనీరు. చాలామంది మిత్రుల్ని ఆహ్వానించాడు. ప్రతి ఒక్కరికీ ఏవో సమస్యలున్నాయి. అన్ని సమస్యలకు పరిష్కారం

ఆధ్యాత్మిక చైతన్యం. వారందరు విద్యావంతులు, మేధావులు. ఒక సమస్య ఎదురవగానే పరిష్కారం కోసం వెతుకుతారు. ఆగిపోతారు. ఆ సమస్యకు అదే పరిష్కారం అనే నిర్ధారణకు వస్తారు. అది ఎదుగుదలకు సూచిక కాదు. విస్తృతి కాదు – జీవితాన్ని పరిమితం చేయడం.

నేనంటాను : "జీవితంలో దేనికీ ఏదో ఒకటి ముగింపు అనుకోవద్దు. మీ అవగాహన పెరగనీయండి. అవకాశాలను విస్తరించనీయండి. ప్రతి సంఘటన, ప్రతి క్షణం ఒక అనుభవం. అదే చివరిది కాదు. అంటే ఏమిటన్నమాట? అవగాహన విస్తరిస్తుండాలి. పెరుగుతుండాలి. ఎక్కడా ఆగిపోకూడదు. కొనసాగు తుండాలి. జీవితం అంటే అంతులేని ప్రయాణం. అది ఒక స్టేషన్‌లో ఆగి, నిలిచి పోకూడదు. ఎప్పుడూ కదులుతూ, ముందుకుపోతూ ఉండాలి. కదిలే జీవితానికే 'వివేకం' నడిపే శక్తి నిస్తుంది. వివేకం జీవితాన్ని నడిపిస్తుంది. మనస్సుతో ఆలోచిస్తే అది ఆరంభం. వివేకంతో, విజ్ఞతతో చూస్తే ఏదీ ఆఖరు కాదు. మనస్సుతో జీవితాన్ని బంధించి ఒక రాటకు దాన్ని కట్టిపడేయ కూడదు.

కనుక స్వ ఇచ్ఛతో నిరాటంకంగా ఆంతర్యంలోకి చొచ్చుకుపోండి. మిమ్మల్ని మీరు మేధావులుగా, పరిశోధకులుగా అభివర్ణించుకోవచ్చు. కానీ ఎలా జీవిస్తున్నారన్నది ప్రశ్న. నిజమైన ప్రేమ, కరుణ, మనశ్శాంతి అనేవి మీకు తెలుసా? అసలైన విలువల్ని విస్మరించి మీరు బ్రతికేస్తున్నారు. మీకు చదువులు, సంపాదనలు, తెలివితేటలు, ప్రగతి కావాలి సరే. అవి కాక వేరే ముఖ్యమైన జీవిత విలువలు ఉన్నాయి. వాటి గురించి పరిశీలించండి.

ఉదాహరణకు : మీరు ఒక సైంటిస్టు. స్వతంత్రంగా ఆలోచిస్తారు. స్వేచ్ఛగా ప్రయోగాలు చేస్తారు లాబ్‌లో. ఇంటికి వచ్చాక అంత సీరియస్‌గా ఉంటారా? లాబ్‌లో ఉన్నంతకాలం మీరు సైంటిస్టు. ఇంటికి వచ్చాక మామూలుగా మారిపోతారు. మీరంతా చదువుకున్నవారు. ప్రతిభా పాటవాలు కలవారు. మేధ వల్ల మీలో ప్రేమ కలగదు, పెరగదు. మీరు నమ్ముకున్న మనస్సు మీకు శాంతి నివ్వదు. మీ తెలివితేటలు, ఆలోచనలు మీకు జ్ఞానం కలిగించవు. మనస్సు నీడలో జీవిస్తున్న మీకు మనస్సు అవసరంలేని జీవనం గురించి తెలియదు. మనస్సు శూన్యం అయినప్పటి ప్రశాంతత మీకు అందుబాటులో లేదు.

మీరు 'సైంటిఫిక్' అనే రంగు కళ్లద్దాలు తీసి, జీవితాన్ని చూడండి. ఆర్జించిన జ్ఞానాన్ని, పెంచి పోషిస్తున్న అహంకారాన్ని వదిలించుకోండి. అమాయకంగా, స్వేచ్ఛగా, నిరాడంబరంగా ఉండండి. 'అమాయకత్వం' అంటే సంపాదించిన విజ్ఞానం పూర్తిగా వదిలి శూన్యం కావడం. మీ బుర్రలు శూన్యం

కావాలి. మీరు స్పెషలైజ్ చేసిన కొద్దీ మీ బుద్ధి కుంచించుకుపోతుంది. పరిమితం అవుతుంది. మరో విషయం మీకు పట్టదు. మీకు రుచించదు. అలా కుంచించుకు పోయిన మేధ జీవితాన్ని అనుభవించనీయదు.

నా ప్రశ్నలు, వ్యాఖ్యలు ఆ ఇంజనీర్లను, సైంటిస్టుల్ని కలవరపరిచాయి. మానసిక విశ్లేషణ వారికి తెలియదు. ఘర్షణ మాత్రమే వారికి అనుభవం. మనోయవనికపై కొత్తరంగులు, హరివిల్లులు వారు ఆస్వాదించలేదు. వారంతా మేధావులు. నేను ప్రశ్నించి, విశ్లేషించిన తీరులో వారి బుర్రలు శూన్యాలయ్యాయి. శాస్త్ర విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం పుంజీలు తెంచుకు పారిపోయింది. అట్లా మనసు వ్యాకుల పడడమే కావాలి.

జనం అనుకుంటారు ఒక సైంటిస్టు బుర్ర చాలా గొప్పదని, అది జ్ఞానానికి పరాకాష్ట అని. సైంటిస్టులూ తాము జీనియస్‌ల మనుకుంటారు. నిజంగానే వారు కొత్తది కనిపెడుతున్నారా? ఉన్నవాటినే బయటపెట్టి మెరుగుపెట్టి తమ స్వంతం అంటున్నారా? వారి బుర్రలు యుద్ధాల్ని సృష్టిస్తాయి. అశాంతికి కారణాలవు తున్నాయి. కలవరాల్ని సృష్టిస్తున్నాయి. ఆ విచ్ఛిత్తి అవసరమా? అలాంటి మేధ అవసరమా?

నేను ప్రశ్నిస్తున్నాను : "కల్లోలం సృష్టించడానికి తప్ప మనస్సును ప్రశాంత సాధనకు ఎందుకు ఉపయోగించరు? నేను, నా దేశం అంటూ దేశ రాజకీయాలతో మనస్సును క్షుభితం చేయడం తప్ప వాటి నుండి ఆ మనస్సును విముక్తం చేయలేరా? ప్రశాంతంగా, నిష్కల్మషంగా జీవించగలిగితే ఎంత ఆత్మశక్తి ఆదా అవుతుంది. అది ప్రేమగా, దివ్యత్వంగా మారుతుంది. ఎంత శాస్త్రజ్ఞానం సంపాదించినా, ఎంత చదివినా, ఎన్ని సాధించినా జీవితంలో అతి ముఖ్యమైనది కోల్పోతున్నాం. అది ఏదో తెలుసుకోవాలి. అదే నేటి మానవుని కర్తవ్యం. మనందరిలో, అందరి ఆత్మల్ని కలిపే ఒక సన్నని బంధం ఉంది. అది మమతా బంధం. అది తెలుసు కోవాలి".

ఆ ప్రసంగానికి రే షహాన చలించాడు. చాలా స్పందించాడు. ఆ ఊపులో చాలా ఉపన్యాసాలు ఏర్పాటు చేశాడు.

తర్వాత మా ప్రయాణం కెనడాలోని వాంకోవర్‌కు. తీరా మేం వీసా చెక్ వరకు వెళ్లాక జ్ఞాపకం వచ్చింది నాకు కెనడా వీసా లేదని. అక్కడి ఆఫీసరుకు మా పరిస్థితి వివరించాం. మేం కేవలం ప్రత్యేక ఆహ్వానితులుగా వెళుతున్నట్లు ఆహ్వానాలు చూపించాం. మొత్తం మీద కెనడా చేరుకోగలిగాం.



21. ఓహై పర్యటన

లాస్ ఏంజల్స్‌లో మార్కెల్ బ్రూక్స్ అంటే నాకిష్టం. ఆమె ఆతిథ్యంలో ఆత్మీయత ఉంటుంది. ఆమె స్నేహమయి, ప్రేమమయి. నన్ను అర్థం చేసుకుని నా భావాలను, సిద్ధాంతాలను గౌరవిస్తున్న మహిళామణి. ఆమెలో ఉత్సాహం ఉంది, తపన ఉంది, ఏదో చేయాలన్న సంకల్పం ఉంది. ఆమె ఇంటికి చాలా మంది వస్తుంటారు. కనుక నా గురించి ఆ ప్రాంతంలో బాగా తెలుసు.

మార్కెల్ ఇంట్లో ఉండగా, ఒక రోజు ఉదయం ఓహై నుండి మిరస్ అనే వ్యక్తి ఫోన్ చేశాడు. తనను పరిచయం చేసుకుంటూ తనకు ఆధ్యాత్మిక విషయాల పట్ల ఆసక్తి ఉన్నట్లు చెప్పుకున్నాడు. ముఖ్యంగా జిడ్డు కృష్ణమూర్తి గారి జీవనతత్వం తన కిష్టమని, ఆయన అభిమానినని చెప్పాడు. "మీ రచన Beyond the Mind చదివాను. మీకు కృష్ణాజీకి ఏదో సంబంధం ఉందనిపిస్తోంది. మీరు ఇక్కడకు వచ్చి ప్రసంగించాలి. ఇక్కడ చాలామంది అభిమానులున్నారు. ఆసక్తి కలవారున్నారు. వారంతా మిమ్మల్ని చూడాలని, మీతో మాట్లాడాలని అను కుంటున్నారు".

"ఓహైలోని యునిటేరియన్ చర్చిలో మీ ప్రసంగాలు ఏర్పాటు చేస్తాం. చర్చి పాస్టర్ చర్చి సభ్యులనే కాక, చాలా మందిని ఆహ్వానిస్తున్నాడు. తన ఇంట్లోనే మీకు వసతి ఏర్పాటు చేస్తున్నాడు. ఒక వారం రోజులు మీరు మాతో గడపాలి".

ఓహై నుండి ఒక అపరిచిత వ్యక్తి ప్రేమపూర్వక ఆహ్వానం. ఆశ్చర్యం వేసింది. కృష్ణమూర్తి నివాసం ఓహై. అక్కడ కృష్ణాజీ నెలకొల్పిన పాఠశాల, ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. ఆయన నడిచిన ప్రదేశాలవి. అక్కడకు వెళ్లాలని

లోగడ రెండు మూడుసార్లు అనుకున్నాను. అది నా కల. ఇప్పుడు అదే ఓహైలో వారం రోజులు ఉండే అవకాశం వచ్చింది. ఎందుకు తిరస్కరించాలి? అక్కడి ఆధ్యాత్మిక జిజ్ఞాసాపరుల్ని కలిసే అవకాశం వదులుకో దలచలేదు. వెంటనే ఫోన్‌లోనే నా అంగీకారం తెలిపాను.

ఓహైకి అమెరికాలో మంచి గుర్తింపు ఉంది. ప్రపంచ మేధావిగా ప్రసిద్ధి చెందిన మన కృష్ణాజీ అక్కడే చివరివరకు ఉన్నారు. ఇప్పటికీ కృష్ణాజీ నివసించిన ఇల్లు, ప్రదేశాలు చూడడానికి జిజ్ఞాస కలవారు, అభిమానులు వందలు, వేలు వస్తుంటారు. అక్కడ ఆధ్యాత్మిక వేత్తలు ఇప్పుడు చాలామంది ఉన్నారు. అది ఒక 'స్పిరిట్యుయల్ రిసార్ట్'. వారంతా సత్యాన్వేషులు. జిజ్ఞాస కలవారు. థియోసాఫికల్ సొసైటీ బ్రాంచి అక్కడ ఉంది. థియోసఫిస్టులే కాక, ఇంకా రకరకాల ఆధ్యాత్మిక వేత్తలు అక్కడ ఉన్నారు. ఓహై లోయ అంటే 'రుషివాలీ'. అది కృష్ణమూర్తి ధ్యానంతో పునీతమైన ప్రదేశం.

ఓహై ఆహ్వానం నాకు మంచి అవకాశం. కృష్ణమూర్తి స్కూలు చూచే అదృష్టం, అక్కడ విద్యార్థుల్ని తీర్చిదిద్దే విధానం చూడవచ్చు. కృష్ణాజీ భావాలు ఎలా బోధిస్తారు? ఆయన విద్యావిధానం ఏమిటి? కారీతో కలిసి వెంటనే ఓహై చేరాను. ఓహైని గురించి విన్నంత అందంగానూ ఉంది. లోయ మొత్తం తోటల మయం. మిరస్ దంపతులు ప్రేమగా స్వాగతించారు. వారే స్వయంగా డా. ఫెల్లోస్ ఇంటికి మమ్మల్ని తీసుకు వెళ్లారు. అదే ఓహైలో మా విడిది.

ఓహైలో నా మొదటి ప్రసంగం పబ్లిక్ మీటింగు హాలులో ఏర్పాటైంది. ఓహై విశిష్టతను శ్లాఘిస్తూ నా ప్రసంగం సాగింది : "ఓహై బహు సుందరంగా ఉంది. పచ్చని తోటలు, బారులు తీరిన పర్వతాలు, దగ్గరగా సముద్రం. ప్రకృతి తన అందాలన్నీ ఈ లోయలో రాశి పోసిందా అనిపించింది. పైగా ఇది తపో పర్వతం. నేటి కాలం ఆధ్యాత్మిక వేత్తలు ఎందరో ఇక్కడకు వస్తున్నారు. ఇది ప్రపంచానికే ఆధ్యాత్మిక కేంద్రంగా ఉంది.

ప్రకృతి ప్రసాదించిన ఇన్ని సంపదల్ని, సౌందర్యాలను అనుభవిస్తున్న మన జీవితం ఏమిటో మనకు తెలియదు. మన ప్రతి ఒక్కరి పరిస్థితి ఏమిటి? మనం ప్రకృతి శక్తులకు అనుగుణంగా జీవిస్తున్నామా? మనలో సౌందర్యారాధన ఎంత? కళాత్మకత ఎంత? లేక మనం నిత్యకృత్యాలతో తృప్తి పడుతున్నామా? అది తెలుసుకోవలసిన అవసరం ఉంది.

"దయచేసి, లోతుగా ఆలోచించండి, విశ్లేషించండి, అధ్యయనం చేయండి. మనం స్వతంత్రతను అనుభవిస్తున్నామా? స్వేచ్ఛగా జీవిస్తున్నామా? మన స్వేచ్ఛ ఎంత? దాని విలువ ఏ పాటి? మనలో నిర్మాణాత్మకత ఉందా? ఉంటే ఎంత ఉంది? ఏవో కొన్ని క్షణాలు ఉత్సాహంగా, తృప్తిగా ఉండడం కాదు. పూర్ణత్వం. మనం సంపూర్ణంగా జీవిస్తున్నామా? పూర్ణానందం పొందగలుగుతున్నామా? అసలు మనం ఎవరినైనా సంపూర్ణంగా ప్రేమిస్తున్నామా? పూర్ణ ప్రేమతో జీవించగలుగు తున్నామా? మన ఆంతర్యానికి, బాహ్యానికి సంబంధం ఉండడం లేదు. మనం ఆత్మకు దగ్గరగా పోవడం లేదు. అంతరాత్మ చెప్పినట్లు వినడం లేదు. చుట్టూ ఉన్న ప్రపంచానికి అనుకూలంగా జీవిస్తున్నాం. అంతరాత్మ సందేశాల్ని అవతల పెట్టేస్తున్నాం. ఎందుకో భయం! ఈ భయాలు, అనుమానాలు, ఆత్రుత ఎందుకు? రేపటి కోసం ఈ ఆరాటం ఎందుకు?"

నా ఈ ప్రశ్నలు శ్రోతల్ని, ప్రేక్షకుల్ని ఉక్కిరిబిక్కిరి చేశాయని తెలుసు.

"మీకసలు జీవితంలో శాంతి విలువ తెలియదు. శాంతి అవసరం తెలియదు. మీలో ఉన్న శక్తి మీకు తెలియదు. ఆనందంగా జీవించడం చాత కాదు. నిజానికి మీ ఆనందమే మీ చైతన్యం. అదే మీ శక్తి. అదీ తెలియదు మీకు. జీవితానికి పూర్ణత్వం కలిగించేది ఆనందం. అంతర్గత శక్తిని తెలుసుకోవడం ఆనందం. అంతర్గత శక్తిలోనే ప్రశాంతి ఉంది. నిశ్చలత్వంలో నిర్మలత్వం ఉంది. సంయమనంతో జీవితంలో ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చు, ఎదుర్కోవచ్చు. ఆ క్రియాత్మకశక్తి ఏమిటో చూద్దాం. అదే సృజన చైతన్యం.

నిసర్గ జీవనధార మీకు అనుభవంలో లేదు. స్వచ్ఛమైన జీవితం తెలియదు. మీకు స్వార్థం తెలుసు. బాధలు పడడం తెలుసు. ఎదుగు బొదుగు ల్లేకుండా జీవించడం తెలుసు. మనసుతో రాజీపడి జీవిస్తారు. మనసు ఎప్పుడూ ఏదో ఒకటి కోరుతుంటుంది. కోరింది పొందేవరకు స్థిమితంగా ఉండదు. ఉండనీయదు. మీలోపలికి ఎప్పుడైనా చూచుకున్నారా? మనస్సు అనే యంత్రం ఎట్లా పని చేస్తుందో గమనించారా? ప్రతి ఒక్కరి బుర్ర నిండా ఆశలు, ఆలోచనలు, కోరికలు ఉంటాయి. అవి మీ తెలివిని బట్టి పెరుగుతుంటాయి, ఉద్రేకాలు పెరుగు తుంటాయి. అదే జీవితం అనుకుంటారు. అదేనా జీవితం? యంత్రంలా తిరగడమేనా మనస్సు చేసే పని. అందులో నవ్యత ఏముంది? సృజన ఏముంది? మౌలికత ఏది? మీ స్వంతం అనేది ఏముంది?

మీరు ప్రతిక్షణం బయటి ప్రలోభాలకు లొంగిపోతున్నారు. కోరికలు,

వ్యసనాలు, వినోదాలు, సంతోషాలు అన్నీ ఒత్తిడి కలిగించేవే. అంటే మనసు ఆడించినట్లు ఆడుతున్నారు. దానివల్ల ఏం వొరిగింది? ఆధ్యాత్మిక తపన తీరిందా? ఆత్మ శాంతించిందా? కుతి తీరిందా?

చూడండి! ఆలోచన అంటే ఏమిటి? దేనికి? ఎప్పుడూ ఒక ఆలోచన మనోఫలకం మీద కదులుతుంటుంది. అది ఒక జాగాలో మాత్రమే. మిగిలిన మనసు ఖాళీగానే ఉంటుంది. మనసు మొత్తంగా ఎప్పుడూ పనిచేయదు. మనసు నిర్మాణం తెలియదు. యాంత్రికత తెలియనీయదు. మనసుదంతా రహస్యం, గోప్యం. రకరకాల కోరికల్ని తెచ్చి పడేస్తుంది. ఉద్రేకాల్ని రెచ్చగొడుతుంది. ఊపిరి సలపనివ్వదు. స్థిమితంగా, శాంతంగా ఉండనీయదు. మన లక్ష్యాలను, గమ్యాలను తానే నిర్ణయించి నిర్దేశిస్తుంది, శాసిస్తుంది. మనమేమో మనసు చెప్పినట్లు వింటూ, జీవితాంతం అనంతమైన సమస్యలతో సతమత మవుతుంటాం.

చూడండి! ఈ మనస్సు ఎప్పుడైనా ఆత్మను గురించి ఆలోచిస్తుందా? అసలు ఆత్మభావన కలగకుండా అడ్డుపడి వేరే వ్యాపకాలు కల్పిస్తుంది. వాస్తవానికి 'భావం' అన్నది, ఆలోచన అన్నది చాలా పరిమితం, సంకుచితం. ఎప్పటికీ మనస్సు పూర్ణంగా పనిచేయదు. కనుక స్వేచ్ఛ లభించదు. అయినపుడు మనం ప్రాణశక్తిని ఎలా పట్టుకోగలం? మనసును తప్పించుకోవాలి. అదే మార్గం. ఆలోచనల్లో చిక్కుపడకుండా తప్పుకుంటే ప్రాణనిధిని చేరవచ్చు. వివేకంతో ఆ పని చేయలేం. వివేకం మళ్లీ మనసు క్రిందికే వస్తుంది. కేవలం చైతన్య స్ఫూర్తి కావాలి. గమనిక కావాలి. అంటే మనసుకు చిక్కకుండా, మనసులో చిక్కుపడ కుండా లోపలికి పోతుండాలి.

ప్రస్తుతం జరుగుతున్నది ఏమిటి? కళ్లతో చూడడం లేదు. మనసుతో చూస్తున్నాం. మనం వింటున్నది చెవులతో కాదు మనసుతో. అన్ని ఇంద్రియాలు మనసు చెప్పు చేతల్లో పనిచేస్తున్నట్లు. ఆ దాస్యం పోతే స్వేచ్ఛ లభిస్తుంది. మనం తెలివిగలవాళ్లమే కాని స్పందన తెలియనివాళ్లం. చైతన్యం లేని వాళ్లం. నిజానికి మనకి స్వేచ్ఛ లేదు, స్వతంత్రం లేదు. యాంత్రిక జీవనం మనది. మనసు శాసించినట్లు చేస్తున్నాం, నడిపిస్తున్నట్లు నడుస్తున్నాం. ఎందుకో మనకు తెలియదు. రెండు ఆలోచనల్లో ఒకటి ఎన్నిక చేయడం స్వేచ్ఛ కాదు. అసలు ఆలోచించడమే బానిసత్వ లక్షణం.

మనసు పనిచేయకుండా ఉండాలంటే మనలో చైతన్యం మేల్కొనాలి. మనోచర్యల్ని, క్రియల్ని, యాంత్రికతను చైతన్యం గమనించాలి? స్పందించడం

చాలదు. మనసు తనకు అలవాటైన రీతిలో పరుగులెత్తకుండా చూడాలి. ఒకేసారి బయట, లోపల గమనించాలి. అదే అసలైన ధ్యాన పద్ధతి. గమనించడమే ధ్యాస కావాలి. అప్పుడు ధ్యాస ధ్యానంగా మారుతుంది. ఆ ధ్యానం ప్రేమల్ని పుష్పిస్తుంది.

ధ్యానం అన్నది ఒక భావన కాదు. ఒక ఆలోచన కాదు. ఒక క్రియ కాదు. ఏదో ఆశించడం కాదు. మొత్తం మనసును చర్యలు లేకుండా శూన్యం చేయడం. ఆ ప్రశాంత స్థితిలో ఒక చైతన్యం కదులుతుంది. దానికి మనసుతో బొత్తిగా సంబంధం ఉండదు. దేనితోనూ అనుబంధం పెట్టుకోదు. మనసు శూన్యం అయిన మరుక్షణం దివ్యత్వం ప్రవేశిస్తుంది ఆ జాగాలోకి.

దాని కోసం ఎక్కడికీ పరుగులు తీయవలసిన పనిలేదు. ఎవరినీ ఆశ్రయించ పనిలేదు. అది పుస్తకాలలో దొరకదు. అది ఒకరు నేర్పే విద్య కాదు. మనం సాధనతో గ్రహించవలసిందే. అగోచరం. మనం లోపలికి తొంగి చూస్తే ఇప్పుడైనా కనిపిస్తుంది. ఎప్పుడైనా కనికరిస్తుంది. దర్శనమిస్తుంది. మనస్సును, వివేకాన్ని అవతల పెడితే చాలు ఆత్మ పైకొస్తుంది.

మానససంచారం నిలిచిపోగానే హృదయ ద్వారాలు తెరుచుకుంటాయి. ఆత్మ సౌరభాలు గుబాళిస్తాయి. అది చైతన్య పరీవాహక ప్రాంతం. దాని రహస్యం పుస్తకాలు చెప్పవు. ఎవరికి వారుగా తనలో అన్వేషించి, తెలుసుకోవలసిందే. ఏకాంతంలో ప్రశాంతంగా ధ్యానించడం ఒక్కటే ఉపాయం."

యూనిటేరియన్ చర్చిలో ప్రసంగాల తర్వాత డా. ఫెల్లోస్ మరొక చిన్న సమావేశం ఏర్పాటు చేశాడు. ఇరవై ముప్ఫయి మందిని ఆహ్వానించాడు. నాటి ప్రసంగ సారాంశం **"అవగాహనకు పాక్షిక దృష్టి పనికిరాదన్నది. ఏ భేషజాలు లేకుండా వినగలిగితే హృదయస్పందనలు వినిపిస్తాయని".**



గుజరాత్ మాధవ్‌పూర్‌లోని భక్తి వేదాంత ఆశ్రమంలో ...



22. ఫొటోగ్రఫీ : ధ్యాన విశేషం

చిన్న వయస్సులో నా దగ్గర ఓ డబ్బా కెమెరా ఉండేది. ఇంట్లో అందరి ఫొటోలు, మా వేట కుక్క ఫొటోలు తీస్తుండే వాడిని. తర్వాత కాస్త పెద్దయ్యాక కాస్త ఖరీదైన కెమెరా కొన్నాను. ఫొటోగ్రఫీ పిచ్చి కాదు, కాని అదొక సరదా. ఇల్లు వదలి వచ్చేవరకు సరదాగా ఫొటోలు తీస్తుండేవాడిని. అజ్ఞాతంలోకి వెళ్లినప్పుడు, అన్నింటితో పాటు ఫొటోగ్రఫీని వదిలి పెట్టాను.

అమెరికా వెళ్లాక రాబర్ట్ కర్, కానీ కీలర్‌ల వద్ద మంచి కెమెరాలు చూచాను. ఆ కెమెరాలతో నేను కొన్ని ఫొటోలు తీశాను. నా అభిరుచి గమనించి జానిటా గిల్బర్ట్ ఓ మంచి కెమెరా ప్రెజెంట్ చేయడంతో నా కెమెరా వ్యావృత్తి పెరిగింది. తర్వాత ఎక్కడకు వెళ్లినా నా వెంట కెమెరా ఉండేది. హిమాలయాల నుండి హవాయ్ దీవుల వరకు అంజూబొర్రెగా ఎడారి సౌరభాల నుండి నయాగరా జలపాతం వరకు అనేక అందాలను కెమెరాలో బంధించాను.

ఫొటోగ్రఫీ వల్ల నా దృష్టికోణం మారింది. నిశితంగా అనేక కోణాలలో పరిశీలించడం అలవాటైంది. కంటికి కనిపించని సౌందర్యాలను కెమెరా కన్ను చూస్తుంది. నా ధ్యానానికి ఫొటోగ్రఫీ పదును పెట్టింది. ఫొటోగ్రఫీని ఒక ధ్యాన విశేషంగా పరిగణిస్తాను. అంతర్వీక్షణకు ఫొటోగ్రఫీ చాలా సహకరించింది. కనిపించే ప్రతి దృశ్యం వెనుక ఆత్మను చూడగలిగాను. ప్రయాణాల్లో చాలా ఫొటోలు తీశాను. ఫొటోలు చూస్తుంటే ఎన్నో అర్థాలు స్ఫురిస్తాయి. లోతులు తెలుస్తాయి. అవి నాతో సంభాషిస్తాయి. ఆ ఫొటోలకు వ్యాఖ్యలు కవితాత్మకంగా రాసేవాడిని. కళ, కవిత్వం కలిసిపోతాయి.

కొన్ని ఫొటోలు ఎన్లార్జి చేసి మిత్రులకు బహూకరించాను. ఎఫెక్ట్ కోసం చాలా రకాల పేపర్లు వాడాను. మార్కెల్ బ్రూక్స్ కొన్నింటి కలర్ ప్రింట్స్ వేయించి తెచ్చాడు ఇండియా తీసుకు వెళ్లడానికి. ముంబయ్‌లో ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశాం. అప్పటి మహారాష్ట్ర గవర్నరు కోన ప్రభాకరరావు ఎగ్జిబిషన్ ప్రారంభించారు. పత్రికల్లో టి.వి. రేడియోల్లో మంచి ప్రచారం జరిగింది. 1985 నవంబరు 23–30న ముంబయ్ ఆర్టిస్ట్ సెంటర్‌లో ప్రదర్శన జరిగింది. 'Cosmic Intelligence through color photography' ఎగ్జిబిషన్ పేరు. ఫొటోలలో ఆధ్యాత్మికత చూడడం కొత్త అంశం. ఆధ్యాత్మికత వల్ల ఫొటోల విలువ పెరిగింది. మిగిలిన తావులలో ప్రదర్శనలు ఏర్పాటు చేయమని గవర్నరు సూచించారు.

"ఆధ్యాత్మిక జీవితం గడుపుతున్న నాకు ఫొటోగ్రఫీలో ఇంత ప్రావీణ్యం ఎట్లా వచ్చిందని పలువురు ప్రశ్నించారు. మంచి ప్రశ్న. ఫొటోగ్రఫీ నా వృత్తి కాదు. ఫొటోగ్రఫీలో శిక్షణ పొందలేదు. నాది 'Beyond the Mind' సిద్ధాంతం. ధ్యానంలోనూ, ఫొటోగ్రఫీలోనూ అదే ధోరణి. అతీత మానస చేతన. మనసు దాటిపోయి పరిశీలించడం, గమనించడం. అదే నా వ్యాపకం, జ్ఞానం.

మనిషిలో జీవంతోపాటు చైతన్యం ఉంటుంది. రెంటినీ జతపరచడం కళ. జీవచైతన్యంలో అన్ని కళలు ఉంటాయి. అన్ని సద్గుణాలు నిక్షిప్తమై ఉంటాయి. కళల్ని, మానవతతో చేర్చితే, వాటికి వినయం, సౌశీల్యం తోడైతే భావాతీతప్రజ్ఞ ఏర్పడుతుంది. అదే ఆధ్యాత్మిక జీవనానికి ఆధారం.

మనిషికి కావలసింది నిరహంకార ప్రవృత్తి. అహంకారాన్ని వదిలి పెడితే సత్యానికి చేరువవుతాం. మనసు దాటితే మనీషి కావచ్చు. అదే కళల్లోని తన్మయత్వం. అంటే ఏమిటి? కళ, అభిజ్ఞ, ఆత్మ త్రివేణిలా సంగమించాలి. పెనవేసుకుపోవాలి. ఒక దానిలో ఒకటి లీనం కావాలి. దేనికది విడివిడిగా ఉండదు. ఉంటే దానికి విలువ ఉండదు. ఆత్మలేని కళ రాణించదు. సత్యం అంటే విశ్వచైతన్యం అనుభవించడం, అనుభూతించడం. కళ ద్వారా ఆ అనుభవాన్ని ప్రకటించి, అదే అనుభూతిని కలిగించ గలగాలి. రెండూ సమోన్నత శిఖరాలే. రెండింటిలోనూ దివ్యస్పర్శ ఉంటుంది. దివ్యస్పందన ఉంటుంది.

ప్రకృతి దృశ్యాలు ఫొటో తీస్తున్నప్పుడు దృశ్య వస్తువుపైన అదృశ్య శక్తి ప్రసరిస్తుంది. అది లీలగా తోస్తుంది. అక్కడ 'నాది' అన్న అహం గానీ, ఆలోచనతో కూడిన మనస్సు గానీ ఉండవు. క్షణం సేపు శూన్యమైపోవడం జరుగుతుంది. ఆ

క్షణంలోనే కెమెరా 'ఆత్మ'ను బంధిస్తుంది. కళలో అదే, ఫొటోలో ఆత్మ ఆవిష్కరించబడుతుంది. ప్రశాంతంగా ధ్యానం చేస్తున్నపుడు జరిగే క్రియ అదే.

ఫొటోగ్రఫీ కళ అవుతుందా? ప్రతిభ అవుతుందా? పనిలో ప్రావీణ్యమా? అది కెమెరా వెనక ఉన్న మనిషి సంస్కారం బట్టి మారుతుంది. సృజన ఉంటే అది కళగా రాణిస్తుంది. కళాకారుడైనవాడు తన ఆత్మను కళలో నిక్షిప్తం చేస్తాడు, ఆవిష్కరిస్తాడు. నా వరకు ఫొటోగ్రఫీ ఒక ధ్యాన కళ. ధ్యాన ప్రక్రియ.

ఫొటో ఎగ్జిబిషన్ తర్వాత ఆదర మిత్రులు ఒక సూచన చేశారు. ఫొటోలని ఒక క్రమంలో అమర్చి పుస్తకంగా అచ్చు వేయిస్తే బాగుంటుందని. ఫోటోల పుస్తకం అంటే మాటలు కాదు. మూటలు కావాలి. అయినా అభిమానుల ఒత్తిడి పెరిగింది. అమెరికాలో పుస్తక ప్రచురణ చేస్తే బావుండుననిపించింది.

మార్కెల్ బ్రూక్స్, కారీ క్లైన్, రాజేష్ బక్షీల సహకారంతో "Intuitive Intelligence - a play within and without" 1992లో అచ్చయింది. ఎందరో సహకరించారు. 'కళ' అనేది ఫొటోగ్రఫీ గాని, మరొకటి గాని, అది మాధ్యమం మాత్రమే. మనిషిలోని సున్నితత్వాన్ని, ఆత్మను తట్టి లేపే సాధనం. మనిషిని ఆలోచింప చేస్తుంది. మేధస్సు నుండి జ్ఞానం దిశగా నడిపిస్తుంది. కళాకారుడు ఎవరుగానీ వ్యక్తిత్వం అనే పంజరం వదలి వినీల గగనాలకు ఎగిరిపోతాడు. అది ఆత్మావలోకనం అవుతుంది చివరకు. ఆత్మను స్పృశించని కళాఖండం నిరుపయోగం. ఫొటోల పోటీలో నాకు అమెరికాలో నాలుగువేల డాలర్లు బహుమతి వచ్చింది.

మరో ఆరు మాసాలు అమెరికాలో గడిపి ఇండియా వచ్చాను. నా సంపాదన అయిదు వేల డాలర్లు. సుమారు లక్షన్నర రూపాయలు వెంట తెచ్చుకున్నాను. ఇల్లు వదలి వెళ్లినపుడు నా వద్ద ఉన్నది 300 రూపాయలు. ఇప్పుడు నేను ధనవంతుడిని. లక్షాధికారిని. ఏ బ్యాంకులోనైనా మదుపు చేస్తే వచ్చే వడ్డీ నాకు సరిపోతుంది. మిత్రుల్ని సలహా అడిగాను.

నా తమ్ముడి కొడుకు అప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు... ఇళ్లు కట్టించి అమ్మడం. నా డబ్బు తన వ్యాపారానికి పెట్టుబడి పెట్టమని అడిగాడు. రెండేళ్లలో తన ఫ్లాట్లు అమ్ముడవుతాయని, మంచి లాభం వస్తుందని చెప్పాడు. పైగా నాకు రెండు ఫ్లాట్లు ఉచితంగా యిస్తానన్నాడు. కష్టపడకుండా చేసే వ్యాపారం, మిత్రుల సలహా అదే. కిరణ్‌కి డబ్బు లిచ్చేశాను. ఏడాదిన్నరకు బిల్డింగ్ తయారైంది. ఫ్లాట్లు అమ్ముడుపోయాయి. మంచి లాభం వచ్చింది. నా పెట్టుబడి రెట్టింపైంది.

కిరణ్ మళ్లీ వేరేచోట్ల ఫ్లాట్స్ ప్లాన్ చేశాడు. స్థలం కొని ఇళ్లు కట్టించడం. 'యేవూర్' అనే పల్లెలో నాకోసం ఒక జాగా చూచాడు. తానేకు దగ్గర, ముంబయ్‌కి మరీ దూరం కాదు. వర్షాకాలంలో మహాబ్లేశ్వర్‌లో ఉండడం కష్టం. అమ్మ పెద్దదై పోతోంది. అమ్మకు దగ్గరగా ఉండాలి. యేవూర్ స్థలం చూపించాడు. అన్నీ పెద్ద పెద్ద బండలు స్థలం నిండా. వాటిని తొలగించడం పెద్ద పని. వాటిని పగల కొట్టించి భవన నిర్మాణానికి ఉపయోగించవచ్చునన్నాడు. 500 గజాల స్థలం కొన్నాం. రెండు గదులు, ఒక వరండా వేయించాడు. అది నా తపోవనం. తర్వాత దాని పక్కనే 700 గజాలు కొని కలిపాం. నా అమెరికన్ సంపాదన ఖర్చయిపోయింది.

యేవూర్ స్థలం కొండదిగువన ఉంది. చెట్లు మొలిచే అవకాశం లేదు. గ్రామాల నుండి పశువులు వచ్చి గడ్డి మేస్తుంటాయి. వర్షాకాలం రాగానే చెట్లు మొక్కలు నాటాలని నిర్ణయించాం. అన్నీ పళ్ల చెట్లు – మామిడి, జామ, చిక్కుడు, జీడి, ఆపిల్, దానిమ్మ. ఇలా అన్ని రుతువులలో ఏదో ఒక రకం పండ్లు కాస్తుండాలి. కొంత స్థలం కూరకాయలు పండించడానికి కేటాయించాం.

కొండవాలు, రాతినేల కావడం వల్ల రెండడుగుల ఎత్తు నల్లమట్టి తోలించి పోయించాం. ఎరువులు పుష్కలంగా పట్టించాం. అక్కడ నీటి వనరు లేదు. దూరం నుండి నీరు తెచ్చుకోవాలి. రాత్రివేళ చిరుతలు తిరుగుతాయి.

బావి తవ్వించగా వెంటనే మంచినీరు పడ్డది. మూడేండ్లలో ఆ పరిసరాలు మారిపోయాయి. ముంబయ్ మిత్రులు సెలవు రోజుల్లో వచ్చి సాయపడేవారు. ముంబయ్ నుండి నలభై నిమిషాల ప్రయాణం. స్టేషన్ నుండి తపోవన్‌కి బస్సు సౌకర్యం ఉంది.

రెండేళ్ల వ్యవధిలో ఎంతో మార్పు వచ్చింది. స్వయం సమృద్ధి సాధించాం. సోలార్ కుక్కర్ వాడాం. తపోవనం వచ్చే వారికి అది నిజంగా ఒక ఆశ్రమం అయింది. ఎన్ని రోజులైనా ప్రశాంతంగా గడపవచ్చు. ప్రతిరోజు ఎవరో వస్తుంటారు – కాలక్షేపానికి, కబుర్లు, తాత్విక విషయ చర్చలకు. కొందరు మనశ్శాంతి కోసం, ధ్యానం కోసం వస్తారు.

అంతలో కారీ క్లెయిన్ వచ్చాడు అమెరికా నుండి. అతిథుల కోసం రెండు గదులు నిర్మించాలని అతని ఆలోచన. మొదట పర్ణశాలలుగా ఉన్నవి తర్వాత పక్కా భవనాలుగా రూపాంతరం చెందాయి. నా ఆత్మాన్వేషణ హృదయంలో జరిగే పని. దానికి బంగళాలతో భవంతులతో నిమిత్తం లేదు.



23. అగ్నికీలాద్రి శిఖలు

1990లో లాస్ ఏంజల్స్ వెళ్లిన సందర్భంలో మిత్రుడు చక్రపాణి ఉల్లాల్ ఒక విషయం చెప్పాడు. తనకు హవాయ్‌లో ఓ మంచి స్నేహితుడున్నాడని, నాకు అంగీకారమైతే అక్కడ సమావేశాలు ఏర్పాటు చేస్తాడని. ఆధ్యాత్మికాసక్తి కలవారు అక్కడ చాలామంది ఉన్నారన్నాడు. అక్కడ ఆశ్రమాలు, స్పిరిట్యువల్ సెంటర్లు చాలానే ఉన్నాయి. గురువులు ఉన్నారు. హవాయ్ దీవుల అందాలు ఎంత చూచినా తనివి తీరదు.

1991లో హవాయ్ వెళ్లాను. నాకు ఆతిథ్యం యిచ్చిన జెఫ్, లక్ష్మి లిండ్నర్ 'కాయి' ద్వీపంలో ఉంటారు. వారు స్వామి ముక్తానంద శిష్యులు. ఎప్పుడో ముక్తానంద వారి వివాహం జరిపించాడట. వారి గెస్ట్ హవుస్ నా విడిది. సముద్ర తీరానికి దగ్గర. లిండ్నర్ దపంతులకు ఆ దీవుల్లో చాలామంది పరిచయస్తులున్నారు. చర్చా సమావేశాలకు వారందర్నీ ఆహ్వానించారు. వచ్చిన వారంతా ఏదో ఒక సంప్రదాయానికి చెందినవారు. ఒక గురువుకు శిష్యులైనవారు. ఒక మంత్రమో, జపమో చేస్తున్నవారు. గురువుల్నీ, దేవుళ్లను నమ్మినవారే అందరూ. భజనలు, పూజలకు అలవాటు పడ్డారు. వచ్చినవారిలో బహు కొద్దిమందికి ఆత్మను గురించి బహు కొద్దిగా తెలుసు. నా ప్రసంగం తర్వాత ప్రశ్నలు, జవాబులు. కార్యక్రమం తర్వాత జీవితానికి వేరే పరమార్థం ఉన్నదని గ్రహించారు. కొందరు పర్సనల్ ఇంటర్వ్యూలు కావాలని అడిగారు. ఈసారికి కుదరదు, మరోసారి వచ్చినప్పుడు చూద్దాం అన్నాను.

జెఫ్, లక్ష్మి ద్వీపంలోని సుందర ప్రదేశాలన్నీ తిప్పి చూపించారు. పర్వతాలు,

జలపాతాలు, సముద్రతీరాలు. అక్కడ 15 రోజులు గడిపి 'మాయి' ద్వీపానికి చేరుకున్నాం. అక్కడ నా మిత్రుడు సందీప్ ఉన్నాడు. అతనే మీటింగులు ఏర్పాటు చేశాడు. కాలిఫోర్నియా నుండి అభిమానులు చాలామంది వచ్చారు. కాలిఫోర్నియా జీవితం రద్దీగా ఉంటుంది. విశ్రాంతి కోసం ఇక్కడకు వస్తుంటారు జనం. మాయి ద్వీపంలో భక్తులు, మానసిక విశ్లేషకులు ఎక్కువ. ఆర్టిస్టులు, యోగులు, టీచర్లు, డాక్టర్లు, హోమియో వైద్యులు ఈ అగ్నిపర్వతాల ద్వీపానికి తరచు వస్తుంటారు.

మరు సంవత్సరం వెళ్లినపుడు వాళ్లతో ఆత్మీయంగా ప్రసంగించాను. అప్పటికి నా 'తాత్వికత' వారికి కొంత అర్థమైంది.

"ఇప్పటికైనా మిమ్మల్ని మీరు తెలుసుకోవాలనుకుంటున్నారు. సంతోషం. ప్రలోభాల నుండి, ఆకర్షణల నుండి కాస్తకాస్త బయట పడుతున్నారు. ఆత్మను తెలుసుకోవాలంటే బయటి సంచారం ఆపండి. లోపలకు దయచేయండి. ఆత్మాను సంధానంతో సమున్నత శిఖరాల్ని చేరగలరు.

ఎవరికి వారే సమస్య. బయట ఎవరో గొప్పవారి కోసం, మహా గురువుల కోసం, మహాత్ముల కోసం అన్వేషించకండి. వారు ఎవరైనా కొంతవరకే సహాయ పడతారు. అసలు మార్గం మీది, అన్వేషణ మీది. ఉన్నచోటు నుండే యాత్ర ప్రారంభించండి. ఎవరి హృదయంలోకి వారే వెళ్లగలుగుతారు. ఒక్కటే సూత్రం – ఆలోచనలు వదలడం, ఆత్మను అన్వేషించడం, సంకల్పం ఆత్మదిశగా సాగించడం. అందుకు సిద్ధాంతాలు, విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం బొత్తిగా అవసరం లేదు.

ఈ ద్వీపంలో ఆధ్యాత్మికంగా ఎదగడానికి చాలా అవకాశాలున్నాయి. బాహ్యాకర్షణలు, ప్రలోభాలు కనిపించడం లేదు. ఈ వాతావరణం సాధనకు అనుకూలం. బయటి ప్రకృతి సౌందర్యం లోపలి ఆత్మ సౌందర్యాన్వేషణకు ఎంతగానో ఉపకరిస్తుంది. సౌందర్యం బయటనే కాదు లోపలా ఉంది. రసాస్వాదన లోపలా బయటా ఒక్కలాగే ఉంటుంది. బయటి రంగులు, హంగులు నేత్రానంద కరాలు. లోపలి సౌందర్యాలు ఆత్మానందకరాలు. కంటికి కనిపించేదే అందం కాదు. కనిపించని అందాలు ఎన్నో ఉన్నాయి అంతరంలో. ప్రకృతిలో కళ ఉంటుంది. కళలో ఆత్మ కదలాడుతుంది. కళ్లతో కాదు ఆత్మతో చూడండి, మనలోని అందాలు – మనకు తెలియనివి".

జనంలో ఆసక్తి కనిపించింది గానీ అలవాట్లలో మార్పు లేదు. నమ్మకాలు

సడలడం లేదు. పుస్తకాలలో చదివినవే నమ్ముతారు. వారి గురువులు చెప్పినవే గట్టిగా పట్టుకుంటారు. స్వంత అనుభవం కోసం చూడరు. నేనంటాను :

"చదవడం వల్ల లాభం ఉంది, నష్టమూ ఉంది. చదివి చదివి ఒక అభిప్రాయానికి వస్తారు. ఒడ్డుకు చేరామనుకుంటారు. అంటే ఏమిటి? మనస్సులో గట్టిగా అతుక్కుపోయారని. కొత్తవి ఏమాత్రం అంగీకరించలేనంతగా మీ మనస్సు గట్టిపడుతుంది. పాత జ్ఞానం వదలకపోతే, వదిలించుకోకపోతే, కొత్తది ప్రవేశించే అవకాశం ఏది? కొత్తని ఆస్వాదించే సంస్కారం కావాలి."

1994లో సర్గమ్ గ్రిఫిన్ ఆహ్వానంపైన మళ్లీ 'మాయి' వెళ్లాను. ఆమె జర్మన్ కళాకారిణి. కాలిఫోర్నియాలో జీవనపోరాటంలో అలసిపోయి మనశ్శాంతి కోసం హవాయ్ వస్తుంది. ఆమెలో స్పందన, సంస్కారం ఉన్నాయి. ఆమె రెండు సమావేశాలు ఏర్పాటు చేసింది. అనేక తావులకు తనతో తిప్పింది.

మూడవసారి ఉలాకు గర్‌పిర్టు ఆహ్వానం. ఆమె నవనాగరీకురాలు. చాలా విజ్ఞత, సంస్కారం గల మహిళ. అక్కడ కిలువా అగ్నిపర్వతాలు చూచాం. లావా ప్రవాహాలు చూచాను. హెలికాప్టర్‌లో ప్రయాణం చేశాం. అగ్నిపర్వతాలు చూస్తుంటే నా కనిపించింది – మనిషి లోనూ అగ్నికీలాద్రు లున్నాయని. అక్కడ వారం రోజులుండి 'కవాయ్' వచ్చాం. హవాయ్ ద్వీపాలన్నింటిలో 'కవాయ్' అందమైన దంటారు. అది భూతల స్వర్గం అనేవారూ ఉన్నారు.

ఒక రోజున లక్ష్మి ఒక లోయకు తీసుకు వెళ్లింది. హవాయ్ పర్వతాలలో చాలా పవిత్రమైన లోయ అది. దాని పేరు 'కలాలే'. హవాయ్‌లోని ఇండియన్ రిజర్వేషన్ ప్రాంతాలకు వెళ్లాం. దానిపేరు 'హైహూ'. పరిసరాలు చూస్తుండగా అక్కడి పూజారి వచ్చాడు. అతని పేరు 'కయివూ'.

'ఆగండి' అని గద్దించాడు. మమ్మల్ని ముందుకు పోకుండా నిరోధించాడు.

మమ్మల్ని తనే ఒక రహస్య గుహకు తీసుకు వెళ్లాడు. అతనొక పెద్ద తాంత్రికుడు, మంత్రవేత్త. నాతో మాట్లాడాడు. తన పేరు 'ఎడ్ కయివూ' అని చెప్పాడు. అతను లక్ష్మితో మాట్లాడలేదు. మమ్మల్ని తీసుకువెళ్లి వారి ప్రార్థన ప్రదేశాలు తిప్పి చూపించాడు.

వారి ప్రార్థనా విధానాలు వివరించాడు. వారు ప్రకృతిని శక్తిగా ఆరాధిస్తారు. వారికి పర్వతాలంటే ప్రేమ. భక్తి. 'ఎడ్ కయివూ' మంచివాడు, స్నేహపాత్రుడు. వారు పూజలు చేసే పెద్ద రాతి బండ వద్దకు నన్ను తీసుకువెళ్లాడు. ఆ బండకు నా వెన్ను తాకేటట్లు నన్ను నిలబెట్టాడు. వారి భాషలో ఏదో పాట పాడి, మంత్రాలు

వల్లించాడు. మధ్యమధ్య శంఖం ఊదాడు. ఏదో దేవతను ఆవాహన చేశాడనుకున్నాను. అయితే అతను లక్ష్మిని పూజా మందిరంలోకి రానివ్వలేదు. అమెరికన్లు తమ జాతికి అన్యాయం చేస్తున్నారని ఫిర్యాదు చేశాడు. ఆ మందిరం దాటి బయటకు రాగానే నాలో ఏదో గొప్ప శక్తి ప్రవేశించినట్లు అనుభూతి కలిగింది.

చాలా ద్వీపాలు తిరిగాను. చాలా మందిని కలిశాను. వారంతా మానసిక శక్తుల్ని ప్రయోగిస్తున్న వారే. వారి పూజలు, ప్రార్థనల వెనక మనోబలం పనిచేస్తుంది. దేవతా శక్తుల్ని ఆవాహన చేస్తారు. నన్ను వారి పూజల్లో పాల్గొనమని ఆహ్వానించేవారు. నేను ఎక్కడికీ వెళ్లలేదు. నాది ఆత్మారాధన. అటువంటి శక్తి ఆరాధనల వల్ల నా లక్ష్యం చెడుతుంది. ఆత్మను ఆరాధించేవారు శక్తుల జోలికి పోకూడదు.

అక్కడ డా. ఆర్థర్ బ్రౌన్‌స్టీవ్ ఏర్పాటు చేసిన మీటింగులో మాట్లాడాను.

"మనిషి ఉద్రేకాలకు లోనవుతుంటాడు. మనస్సుకు లోబడి ప్రవర్తిస్తుంటాడు. తన శక్తినంతా బయటి కార్యాలకే వినియోగిస్తాడు. తన లోపలి తన అవసరాలు గమనించడు. భూమికి ఒక ఆకర్షణశక్తి ఉంది. తనలోని కేంద్ర బిందువు వైపు అన్నిటిని ఆకర్షిస్తుంది. మనం ఆ పని చేయాలి. మనలోని శక్తి కేంద్రాన్ని పనిచేయించాలి. ఉదాహరణకు, భూమ్యాకర్షణ శక్తిని కాదని, దేనినైనా ఆకాశంలోకి శూన్యంలోకి పంపాలంటే గంటకు 17000 మైళ్ల వేగం గల శక్తి కావాలి. అప్పుడు భూమి ఆకర్షణ నుండి విడిపోవచ్చు. లేనప్పుడు ఎంత దూరం వెళ్లినా తిరిగి భూమికి రాక తప్పదు.

అటువంటిదే మన మనోశక్తి. ఆలోచనల ఆకర్షణ నుండి బయటకు రావాలంటే అంతకు మించిన శక్తిని ఉపయోగించాలి. అంతకు ఎక్కువైన ఆకర్షణ ఉండాలి. అప్పుడు లోపలికి వెళ్లగలుగుతాం. అదే అంతర్యామిత్వం. అక్కడే అసలు చిక్కు. బయటకు నెట్టే ఆలోచనల్ని నిరోధిస్తూ, త్రోసివేస్తూ లోపలకు చేరాలి. ఎంతో ఫోర్సు కావాలి. ఆ ఫోర్సు పేరే సంయమనం. దాని మరో క్రియ గమనిక. 'వీక్షణ' 'గమనిక' ఒక్కటే శక్తి సమీకరణ సూత్రం, మార్గం. ఆలోచనలు తగ్గిన కొద్దీ బాహ్య కార్యాచరణ తగ్గుతుంది. అంటే ఆలోచనలు బయట తిరగవు. బయటి ప్రపంచాన్ని పట్టించుకోవు. అప్పుడు గత్యంతరం లేక అన్ని శక్తులు కేంద్రం వైపు పరుగులు తీస్తాయి.

అదే ఆధ్యాత్మికత. అదే ఏకైక మార్గం.



24. అనులోమ విలోమాలు

ఇన్ని సంవత్సరాలలో ఎందరో జిజ్ఞాసులు లబ్ధిపొందారు. వ్యక్తిగతంగా, సామూహికంగా, సభాపరంగా, లేఖల ద్వారా తమ బాధల్ని చెప్పుకున్నారు. ఉపశమనం పొందారు. ఎవరి జీవితమూ సాఫీగా సాగిపోతున్నట్లు కనిపించదు. విసిగిపోయి వస్తారు. విసుగుతో వస్తారు. కొందరికి దారి దొరుకుతుంది. కొంతదూరం వెళ్లాక, ఎటు పోవాలో తెలియక ఆగిపోయేవారు ఎక్కువ.

ప్రతి ఒక్కరు మంచిగా మారాలన్నది నా ఆశ. అందరూ బాగుపడాలి. బాగుండాలి. ఎవరికి వారు ఉద్ధరించుకునే ఉపాయం చెబుతాను. ఉత్తరాలు చదువుతుంటే యావత్ప్రపంచం నా కళ్ల ముందు నర్తిస్తున్నట్లు ఉంటుంది. జీవితం అంటే సుఖాలు, భోగాలు మాత్రమే కాదు. కోరికలు తీరడమే జీవితం కాదు. జీవితంలో బాధలు ఒక పార్శ్వం. కష్టాలు, సుఖాలు కలిస్తేనే జీవితం. జీవితానికి లోతైన అర్థం ఉంది. కన్నీరు, కష్టాలు, బాధలోనే జీవితానికి అర్థం తెలుస్తుంది. అన్వేషణకు తెరచాప లేస్తుంది.

సముద్రం మీద ప్రయాణం. తుఫానులు తప్పవు. ఎవరూ ఆపలేరు. వాతావరణానికి తగినట్లు తెరచాప దిశ మార్చుతుండాలి. చుక్కాని పట్టాలి. కష్టాలను కసురుకుంటే పోవు. సాధనలో అవీ ఒక భాగం. సాధకుడు కష్టాలు పడడం అవసరం. హృదయం శుద్ధి అవుతుంది. ఆత్మ మేల్కొంటుంది. మనం అంటే ఏమిటో, మనసు గతి ఏమిటో, మనిషి విలువ ఏమిటో తెలుస్తుంది. అయితే ఎంతమంది కష్టాల్ని భరించగలరు? మన బాధలకు, కష్టాలకు ఎవరినో నిందించి ప్రయోజనం లేదు. ఎవరి సానుభూతి, సాంత్వన కన్నీటిని తుడవలేవు.

ఆధ్యాత్మిక రంగంలోనూ కష్టా లున్నాయి. దశ లున్నాయి. మానసిక వ్యధ లున్నాయి. ఉద్రేకాలు కలుగుతుంటాయి. భౌతికంగా ఇబ్బందులుంటాయి. ఒక్కొక్కటి పైకొస్తాయి. ఆటంకాలు కల్పిస్తాయి. అవరోధాలు ఏర్పడుతుంటాయి. అహం ఘోరంగా దెబ్బతింటుంది. స్వార్థం తలవంచుతుంది. ధ్యానంతో అహం తగ్గుతుంది. స్వార్థం వదలిపోతుంది. మనస్సే సాధనకు అవరోధాలు కల్పించి ప్రలోభాలు పుట్టిస్తుంది. పిచ్చి పిచ్చి ఆలోచనలు వస్తాయి. అప్పుడే సాధకుడు అప్రమత్తం కావాలి. జాగరూకత వహించాలి. ధైర్యంగా మనసు జోక్యాన్ని ప్రతిఘటించ గలగాలి. ప్రతిఘటన తప్పదు. మనస్సు చూపిన మార్గంలో ఎప్పటికీ గమ్యం చేరడం జరగదు.

బాధ అనేక రూపాలలో ఉంటుంది. మనస్సుని బట్టి, శరీరతత్వాన్ని బట్టి బాధ మారుతుంది. అందరి బాధలు ఒకేలా ఉండవు. అన్ని బాధలు ఒకటి కావు. మనోనిబ్బరాన్ని బట్టి, శరీరదారుఢ్యం బట్టి బాధల పల్లవి మారుతుంది. ఎవరికైనా సహనం, ఓర్పు తప్పనిసరి. ఎవరినీ నిందించి ప్రయోజనం లేదు. లోపల గమనించడం, ఆత్మను అన్వేషించడం జరగవలసిన పని.

బాధలకు, విచారాలకు మూలాల్ని అన్వేషించడం జరిగేపని కాదు. సమస్యను అర్థం చేసుకోవడమే కష్టమనిపిస్తుంది. కారణాలు విశ్లేషించడం, వెతకడం బుద్ధిమంతులు చేసేపని. తెలివిగలవారు చేసే తెలివితక్కువపని. ఎందుకంటే ఆ వెతుకులాట, విశ్లేషణ మనసుతో చేసే పని. ఆత్మశాంతికి మనసు మార్గం కాదు. గతంలో ఎన్నడో జరిగిన సంఘటనల అవశేషాలు అవి. అన్వేషణలో వాటిని గమనించాలి. పైకి వచ్చినపుడు పట్టుకోవాలి. ఎంత కష్టం వచ్చినా, ఎవరినీ నిందించకుండా, నిర్వికారంగా, నిర్విచారంగా ఉండడం మంచి పద్ధతి.

బాధలకి, కష్టాలకి కనలిపోయి, కారణాలు వెతుక్కుంటూ కూర్చోవడం కన్న, ఒంటరిగా నిశ్చలంగా కూర్చుని, దానిపైకి సంకల్పం సారిస్తే, ఆ సంకల్పం చైతన్యంగా మారి బాధ నివారణ అవుతుంది. ఆ పని వల్ల అంతర్గత శక్తి పెరుగుతుంది. ధ్యానంలో పరవశించడానికీ, ఆధ్యాత్మికాభివృద్ధికీ అదే మార్గం. అది శక్తిపాత మార్గం, ఆత్మవిచార సంగ్రహం.

జిజ్ఞాసులు వస్తుంటారు. బండెడు సందేహాలు మోసుకువస్తారు. సమస్యల నుండి బయటపడడం ఎలాగో వారికి తెలియదు.

నా సలహా : హృదయం క్రుంగిపోతే పోనివ్వండి. ఏడ్వదలిస్తే మనసును ఏడవనివ్వండి. కన్నీరు కష్టాల బరువును తగ్గిస్తుంది. మనసులోని కల్మషాలను

కన్నీరుతో తుడవండి. నిన్నటి బాధల నుండి హృదయాన్ని విముక్తం కానీయండి. గతాన్ని విస్మరించండి. భవిష్యత్తును స్మరించవద్దు. రేపు గురించిన బెంగపడకండి, చచ్చిపోతామన్న ఆలోచన రానీయవద్దు. నేడు బ్రతకడం కోసం సాధన చేయండి. సమస్యల నుండి దూరం కావద్దు. తప్పించుకో నవసరం లేదు. ప్రతిఘటించ నవసరం లేదు. బాధల్ని హృదయంలో దాచుకోండి ... గుండెలో కాదు. ఉన్నది ఉన్నట్లు భరించడం చాలు. ఎన్ని బాధలనైనా హృదయంలో దాచండి. అక్కడ లయించిపోతాయి. ఎవరికీ చెప్పుకోవద్దు. మీరూ మరచిపోండి. అలక్ష్యం చేస్తే అవే పోతాయి.


ఆ పనులు మనసు చేయదు. జ్ఞాపకాలు చేయవు. గతం గురించి తవ్వుకోకుండా, జ్ఞాపకాలను తవ్వి తలకెత్తుకోకుండా ఉంటే చాలు. వర్తమానంలో జీవించడం అలవాటు చేసుకోండి. గతాన్ని గతంలోనే సమాధి చేయండి. ఉద్రేకాలు వద్దు. సమస్యల పరిష్కారానికి ఉద్రేకపడి ప్రయోజనం లేదు.

బాధల్ని భరించలేక క్రుంగిపోయేవారు చివరకు 'కర్మ' అనుభవించక తప్పదు అనే నిర్ణయానికి వస్తారు. గమనిక వల్ల చైతన్యం కలుగుతుంది. శక్తి లభిస్తుంది. ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. మీ గురించి మీరు జాలిపడకండి. విధిని నిందించకండి. 'కర్మ' అని సరిపెట్టుకోవద్దు. ఆత్మస్థైర్యంతో ముదుకు సాగండి. దైవం అండగా నిలుస్తుంది.

పరేంగిత ప్రజ్ఞ మనల్ని ఎప్పుడూ మేల్కొల్పుతూనే ఉంటుంది.



అందరితో కలసి మెలసి ...



25. పరమాక్షరం

ప్రపంచం ఎటుపోతోంది? మనిషి చివరికి ఏమవుతాడు? సమాజం ఏమవుతుంది? ఈ మధ్యకాలంలో చాలామంది వేసుకుంటున్న ప్రశ్నలవి.

ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు! ఎలా చెప్పగలరు? జిజ్ఞాసాపరుల ప్రశ్న కన్న సాధకుని ఆర్తి ఎక్కువ. యోగం వల్ల, ధ్యానం వల్ల ఆధ్యాత్మికంగా కలిగే మార్పు సమాజాన్ని మార్చుతుందా? మార్చగలదా? యోగసాధన వల్ల విశ్వశాంతి నెలకొంటుందా? లేక ఈ దుర్మార్గం, ఘర్షణ, అశాంతి ఇలాగే కొనసాగుతుంటాయా? మానవుడు దానవుడుగా మారకుండా మానవతను రక్షించడం ఎలా? ఇదీ అని చెప్పకపోయినా, ప్రపంచ ప్రజలందరి సందేహం అదే.

మార్పుకు అవకాశం ఉందా? ఉంటే అది ఎటువంటి మార్పు?

ఇదమిత్థంగా ఇలాగే జరుగుతుందని కాలజ్ఞానం చెప్పడం కుదరకపోవచ్చు.

మనందరికీ తెలిసిన సత్యం ప్రపంచంలో యుద్ధాలు, అరాచకాలు, కరువులు, కాటకాలు, కార్పణ్యాలు సమసిపోవడం లేదు. వాటివల్ల అనేకానేక అనర్థాలు పిలకలు వేస్తున్నాయి. ప్రతి దేశంలో ప్రతి మనిషి సమస్యల్ని ఎదుర్కొంటున్నాడు. బాధ, అసహనం రోజురోజుకీ పెరుగుతూనే ఉంది. రోగాలు, దరిద్రం, ఆకలి, వ్యసనాలు, ఎయిడ్స్, వ్యభిచారం, అవినీతి కట్టలు తెంచుకుంటోంది. ఇవి లోకాన్ని పీడిస్తున్నాయి. ఎంతగా ప్రయత్నించినా ఇవి పెరుగుతున్నాయి. రూపాలు మారుతున్నాయి తప్ప తగ్గుముఖం పడుతున్నట్లు లేదు. సమస్యల్ని పరిష్కరించుకునే ప్రయత్నంలో కొత్త సమస్యల్ని సృష్టించుకుంటున్నాం.

ఏ ఒక్కరి ఇంట్లో స్థిరత్వం లేదు. కంట్లో ఆనందం కనిపించడం లేదు. ఆనందాలు పైపూతలు. విలువలు సుఖాలతో సరిపుచ్చుకుంటున్నాయి. కోరికలూ అంతే. సుఖాలతో తాత్కాలిక తృప్తి. ఆత్మానందం అనే మాటకు ఎవరూ అర్థం వెతకరు. అసలు ఆత్మ గురించి, అంతరాత్మ గురించి ఆలోచించే నాథుడు కనిపించడు. ఇంక మానవత్వపు విలువల్ని పట్టించుకునే వ్యవధి ఎక్కడ?

ప్రస్తుత అవ్యవస్థలో మనకు కావలసింది మతాభిమానం కాదు. ఆధ్యాత్మిక అవగాహన. ఆలోచనతో ఏ సమస్యా పరిష్కారం కాదన్న సత్యం గ్రహించాలి. వ్యక్తిగత సమస్యలే కాదు సామాజిక, రాజకీయ సమస్యలూ పరిష్కారం కావడం లేదు. మనసు బొత్తిగా మనసు లేని దైంది. మనసుల్లో మార్దవం కరువైంది. ఎవరి కళ్లలోనూ కరుణ, జాలి, ప్రేమ తొంగిచూడడం లేదు.

ఆత్మకు నీది, నాది అన్న తేడా ఉండదు. దానికి దేశం, మతం అనే వివక్ష ఉండదు. ఒకే సిద్ధాంతం అనీ, ఒకే తాత్వికత అనీ ఉండదు. అన్ని రకాల హద్దుల్ని దాటి, సరిహద్దుల్ని అతిక్రమించగలదు ఆత్మ. అన్ని అవరోధాల్ని, నిరోధాల్ని త్రోసి రాజనగలదు. ఇప్పుడు మనకు కావలసింది విశ్వజనీనత. చరిత్రలోని చాలా అధ్యాయాలు లుప్తమైపోయాయి. అవి కాలంలో చిరునామా కోల్పోయాయి. ఎన్ని మతాలు పుట్టినా ఏం సాధించాయి? ప్రతి దేశంలో ప్రతి మతం, ప్రతి నాగరికత చరిత్రావశేషం అవుతున్నది. చివరకు చరిత్రలోనూ మిగలకుండా పోతుంది.

నిజానికి మనదీ ఒక బ్రతుకేనా? అనిపిస్తోంది!

మనది అసలు నాగరికత అనిపించుకుంటుందా?

ఇది అనాగరికత. అన్ని విధాల భ్రష్టుపట్టిపోయిన సమాజం మనది. మనకు నైతికత, విలువలు తెలుసునా? నీతికే నిలబడని వారికి నైతికత గురించి, విలువల గురించి ఏం తెలుస్తుంది? మనకు మంచి, చెడు అని రెండు మాటలు తెలుసు. అవి సమాజానికి, మతానికి దగ్గరి చుట్టాలు. మతానికి నీడలు. నైతికత, సంస్కృతి అనేవి దేశానికి, దేశానికి మారుతుంటాయి. ఒక మతానికి మరొక మతానికి మధ్య చిచ్చు రగులుతుంది. ఇదీ మన నిర్వాకం, మన ప్రగతి, మన నాగరికత. మనం గతంలోనే బ్రతుకుతున్నామని మరవకూడదు.

చాలా శతాబ్దాలుగా మానవత్వం సున్నితంగా మారుతూ వస్తోంది. దానినే నాగరికత, అభ్యుదయం అనుకుంటూ మురిసిపోతున్నాం. భిన్నత్వం తల విదిలించింది. భిన్నత్వంలో ఏకత్వం అని అంగలార్చుతుంటాం. అది అయ్యేపని

కాదు. ఏమీ సాధించకుండానే విజయం సాధించినట్లు సంబరపడతాం. ప్రపంచీకరణ అని మురిసిపోవడం తప్పు, ఏ రెండు దేశాలు సఖ్యతగా ఉన్నాయి? సామరస్యం సాధించాయి! ఇప్పుడు మనకు కావలసింది, మనం సాధించవలసింది సంస్కృతీ సమీకరణం కాదు. ఈ సంస్కారాలకు, నాగరికతకు అతీతమైన హృదయ సంస్కారం. ఒక దేశాన్ని మరొక దేశం ఆర్థికంగానో, సాంస్కృతికంగానో లోబరచుకోవడం ముఖ్యం కాదు. భౌగోళిక దురాక్రమణలు లేకపోవచ్చు. ఒక దేశం మరొక దేశంపైన పెత్తనం చలాయించడమూ దురాక్రమణే. ఎవరి స్వేచ్ఛ వారిది అనుకోవాలి. ఏది నైతిక విషయం అనుకుంటున్నారో అది అనైతికం, అప్రాకృతికం. ప్రాక్పశ్చిమాలు ఏకమైనా, మనసులు కలవడం లేదు. సంస్కారాలు ఏకం కావడం లేదు. ఎవరికి వారు తమకు తెలిసిందే నిజం. తాము చెప్పిందే సత్యం అనే వరకు అహంకారం పెరిగింది. ఇంక సహనానికి తావెక్కడ? ఎదుటి వ్యక్తిని గౌరవించనంతకాలం సంస్కారం అలవడినట్లు కాదు.



మహాబ్లేశ్వర్ సమావేశం

'ఈగో మైండ్ అనేది మనిషికే కాదు. దేశానికీ ప్రమాదమే. అహంభావం వల్ల ఎప్పటికీ మనశ్శాంతి లభించదు. విశ్వశాంతి ఆకాశ కుసుమం. ఒక్క ఆత్మ సంస్కారంవల్ల మాత్రమే విశ్వశాంతి సాధించగలం. ప్రతి ఒక్కరు తనలో వెలుగుతున్న జ్యోతి వెలుగులో పయనించాలి. అసలు తన అంతర్జ్యోతిని గుర్తిస్తున్న వారేరీ? మనిషి మారితే సమాజం మారుతుంది.

మార్పుకు మార్గం విప్లవం. అంతరంగ విప్లవం. తిరుగుబాటు. పురోగమనం. నిశ్శబ్దాన్ని ఛేదించి, శూన్యాన్ని శోధించవలసిన సమయం. లోపలకి చూడాలంటే బయట ప్రపంచాన్ని విస్మరించాలి. ఒంటరితనం కావాలి. అన్ని నియమ నిబంధనల్ని వదిలించుకోవాలి. సంపూర్ణ స్వేచ్ఛ ఉంటేనే అంతరంగంలోకి ప్రయాణం సాధ్యం. సులభం. లోపలికి వెళ్లిన కొద్దీ దృష్టి మారుతుంది. సునిశిత మవుతుంది. రంగం మారుతుంది. ప్రపంచరంగం నుండి అంతరంగంలోకి నిష్క్రమించడం జరుగుతుంది. ఆత్మతత్వం అవగతమవుతుంది. ఆత్మసాక్షాత్కార మవుతుంది. అంతర్ చైతన్యమే అసలైన ప్రగతి. ఆలోచనలు లయించిపోవడమే నవజీవనానికి నాంది.

భావాన్ని చైతన్యంగా, చైతన్యాన్ని శక్తిగా మార్చుకోవాలి. అదే 'గమనిక' ఆంతర్యం, రహస్యం. మనం లోపలికి వెళ్లినకొద్దీ మనసు శూన్యమవుతుంది. మనసు శూన్యం అయినకొద్దీ ఆత్మశక్తి బలపడుతుంది. ప్రాణధార జీవచైతన్యంగా మనకు అందుతుంది. ప్రాధాన్యత పెరుగుతుంది. విలువ పెరుగుతుంది. భావాతీత ప్రజ్ఞ రేపటి మనిషికి జ్ఞాన వాహిక, దీప కళిక.

ఈనాడు ప్రపంచంలో తత్వవేత్తలుగా, ఆధ్యాత్మికవేత్తలుగా ప్రచారం పొందుతున్నవారు ఆత్మవిదులని నేను నమ్మడం లేదు. అన్ని రంగాలలో విజయ సాధన కోసం, స్వార్థ ప్రయోజనం కోసం 'ఆత్మ' ప్రదక్షిణ చేస్తూ ఆత్మస్మరణ చేస్తున్నారు. అయినా ఎవరిలోనూ ఆత్మశాంతి లేదు. పాపం! అంతా మార్పు కోసం తహతహలాడుతున్నవారే. తపన పడుతున్నవారే. భోగాలలో శాంతిని, మనసులో ఆత్మశాంతిని వెతుక్కుంటున్నారు. అది మనస్సు చేస్తున్న మరొక మోసం. మనిషి చేస్తున్న మరొక తప్పిదం. మనస్సులో చాలా అరలున్నాయి, భాగాలున్నాయి. మనసు మొత్తంగా, ఒక యూనిట్‌గా పనిచేయదు. అందుచేతనే ప్రతిమనిషి రకరకాలుగా ఆలోచిస్తుంటాడు. ద్విపాత్రాభినయం, త్రిపాత్రాభినయమే కాదు. బహుపాత్రల్ని పోషిస్తుంటాడు. పైకి మంచివాడుగా నటిస్తూ దుర్మార్గంగా బ్రతుకుతాడు. అంటే మనసే మనల్ని మోసం చేస్తూంది. కావాలనే మనస్సు మంచిని చంపేస్తుంది. లేదా మార్గం మళ్లిస్తుంది. ఒక పద్ధతి, ఒక మార్గదర్శి, ఒక గురువు వల్ల గమ్యం చేరగలమన్న నమ్మకం లేదు. మారవలసింది మనసు. మార్చేది, మార్చవలసింది సాధన ... గమనిక.

ఒక మార్గం అనుసరిస్తే, ఒక పద్ధతిని ఆచరిస్తూ పోతే అది మళ్లీ సంప్రదాయం అవుతుంది. ఒక గురువును అనుసరిస్తే పరంపర అవుతుంది. స్వేచ్ఛ, స్వతంత్రం ఉండనట్లే. ఒక పద్ధతిని నమ్మడం, దానిని అంటి పెట్టుకుని


సాధన చేయడం మనసు గారడీ. మనసును దాటిపోయే ప్రయత్నంలో తిరిగి మనసులో చిక్కుకోవడం ఏమిటి? మనసులో ఆత్మని అన్వేషించడం కూడని పని.

కొందరు సాధకులు కాస్త ప్రశాంతితోనే ఏవో అనుభవాలు పొందుతారు. అదో గొప్ప అని పొంగిపోతారు. వారికి తెలియదు అవి మనసు కల్పించే అనుభవాలని. శూన్యం కాకుండా పొందే అనుభవాలు నిజమైన అనుభవాలు కావు. ఆ చిరు అనుభవాలు ప్రగతిని నిరోధిస్తాయి. అక్కడే స్తంభింప చేస్తాయి. మానసిక చర్యలు, విభ్రమాలు, అనుభవాలు బయటి కొస్తాయి. మానసికంగా స్వేచ్ఛ పొందిన తర్వాత అలాటి అనుభవాలు కలగవు. స్వేచ్ఛ తర్వాతి అనుభవాలకే విలువ. నిశ్శబ్దంగా శూన్యంలోకి, శూన్యం లోతుల్లోకి వెళ్లినకొద్దీ అవరోధాలు వీగిపోతుంటాయి. మార్గం సుగమం అవుతుంది.

చిట్టచివరి అవాంతరం - చాలా మంది సాధకులు ఏదో ఒక స్థాయికి వస్తారు. అక్కడ ఆగిపోతారు. ముందుకు కదలరు. కాస్త అనుభవంతో అహం తల కెక్కుతుంది. అవకాశాలు క్రమంగా మూసుకుపోతుంటాయి. నేను అన్న స్ఫురణ ఒక్కటే మిగులుతుంది. 'నేను' అనే భూమికను వదిలితే తప్ప 'ఆత్మాకాశం' లోకి ఎగిరే అవకాశం కలగదు. అనుభవాలు చాలా దగ్గరగా వచ్చినట్లే వచ్చి అందనంత దూరంగా పోతుంటాయి. ఎవరికోగానీ ఆధ్యాత్మిక శిఖరాలు కనిపించవు. సిద్ధులు, మహత్తులు కలగవు. ఆధ్యాత్మికరంగంలో అనుభవాలు భావాలుగా రూపాంతరం చెందుతుంటాయి. కనుక తృప్తి ఉంటుంది. చేయగలిగింది ఉండదు. ముందుకు పోలేక అక్కడే ఆగిపోతారు చాలా మంది. ఎదుగుదల ఉండదు.

అనుభవాల్ని వదిలిపెడుతుండాలి. అంటే వాటిపైన దృష్టి పెట్టకూడదు. అవి కావాలని కోరకూడదు. శక్తుల్ని విస్మరించాలి. నిరాడంబరంగా జీవిస్తూ సాధన ఒక్కటే వ్యాపకంగా పెట్టుకోవాలి. అవధి లేదు, పరమావధి లేదు. ఉన్నది సాధన ఒక్కటే. సాధకుడు తనను మరచిపోతాడు, అహాన్ని మించిపోతాడు. ఆలోచనల్ని దాటిపోతే 'అహం'పైకి రాదు.

చివరి అవరోధం భావం. నేను యోగిని, నేను సాధకుడిని, నేను ఆధ్యాత్మిక వేత్తను అనే భావన సైతం లేకుండా పోవాలి. మనస్సుతో ఆలోచించకూడదు. భావంతో జీవించకూడదు. నేను అన్న భావం భావరహితం కావాలి. అభావం కావాలి. అది చివరి అవరోధం. అదే చివరి విజయం. చివరికి మిగిలేది అదే.



26. భావాతీతప్రజ్ఞ

అనేక ప్రపంచ దేశాలు పర్యటించాను. 14 సార్లు అమెరికా వెళ్లి వచ్చాను. జనం తరచుగా అడిగే ప్రశ్న – తమలో ఏమైనా మార్పు వస్తున్నదా? అని. నా వరకు నేను ఎప్పుడూ ఫలితాలు ఆశించలేదు. నాలో ఎంత మార్పు వచ్చిందీ తెలుసుకోవాలని ఆరాట పడలేదు. నా 'భావం' శ్రోతలకు, అభిమానులకు అందాలి – అంతవరకే. జీవితాన్ని నేను అర్థం చేసుకున్న తీరు తెన్నులు వివరిస్తాను. ఆధ్యాత్మిక మార్గంలో ఎవరి నడక వారిది. ఎవరి మార్గం వారిదిగా ఉంటుంది. ఒకరినొకరు అనుకరించడం కుదరదు. కొంతవరకు అనుసరించవచ్చు. నా అనుభవాలు, అభిప్రాయాలు చెప్పడం వరకే నా పని. మంత్ర దండంతో ఎవరినీ మార్చలేం. ఎవరికి వారు నిజాయితీగా వ్యవహరించాలి. స్పందించాలి.

అదే జీవితం. జీవితంలోని సొగసు. జీవితం ఎప్పుడూ మనకు అవకాశాలు కల్పిస్తుంది. ఎవరిష్టం వచ్చిన రీతిలో వారు జీవితాన్ని మలుచుకోవచ్చు. ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉంది. స్వతంత్రమైన అవగాహన కావాలి. ఎవరి కాళ్లతో వాళ్లే నడవాలి. ఎవరో మన కోసం నడవరు. చేయూత నివ్వరు. ముందుకు నెట్టరు. ఇది నిజం, ఇది సత్యం. నా వరకు నేను చాలామంది గురువుల బోధలు విన్నాను. చాలా నేర్చుకున్నాను. చివరకు గ్రహించింది నా మార్గం నేనే ఎన్నుకోవాలని. నా బాధలేవో నేను పడవలసిందే. నన్నూ ఆలోచనలు సతాయించాయి. అయితే ఆలోచనల ఒత్తిళ్లలో నేను నలిగిపోలేదు, క్రుంగిపోలేదు. వాటిని తీక్షణంగా గమనించాను. అది మనసు ఆడిస్తున్న నాటకం అని గ్రహించాను. ఆలోచనలు నాటకంలోని పాత్రల వలె వచ్చి పోతున్నాయి. అవి నన్ను కదిలించలేదు. నన్ను బాధించనూ లేదు. ఆత్మ తృప్తిని అలవరచుకున్నాను.

అలా మనసు చేష్టల్ని తీవ్రంగా, నిశితంగా గమనిస్తుండగా సంప్రదాయం నన్ను కలవరపరిచింది. నా మనోయంత్రం మొత్తంగా చెడిపోయిందనిపించింది. అందులో పొరలు, తెరలు లేవు. అంతా గడ్డకట్టి ఘనీభవించిపోయింది. వివేకం, విచక్షణ పనిచేయడం లేదనిపించింది. నాకున్న జ్ఞానమే ప్రశ్నగా నిలిచింది నా ఎదుట. మరుగుతున్న నీరులా కుతకుత లాడసాగింది. నా 'అహం' దెబ్బతిన్నది. చాలా కలతపడ్డది. కలవరపడ్డది. భయంతో విహ్వలమై పోకుండా, భయానికి ఎదురు నిలిచి భేటీ వేశాను. భయంతో కలిసి జీవించాను. భయంతోనే మైత్రి నెరపాను. 'భయం' భయపడలేదు. నేనూ భయపడలేదు. భయానికి భయమేమిటి? ప్రతిస్పందన లేదు. నాలో అది క్రమంగా 'గమనిక'గా పరిణమించింది. లోపలకు నిష్క్రమిస్తూ గమనించడం ఒక్కటే పనిగా పెట్టుకున్నాను. పరిసరాలను విస్మరించ సాగాను. అది నేను చేసిన రెండవ పని. ఇంకా ఇంకా లోతులకు వెళ్లగలిగాను. అయినా నా ఉనికి కోల్పోలేదు. చైతన్యం, స్పృహ కోల్పోయింది లేదు. దృఢ సంకల్పం, పట్టుదల నాకు అండగా నిలిచాయి. పోగాపోగా లోపల నా కోసం కాస్త జాగా ఏర్పడ్డది. అక్కడ ప్రశాంతంగా ఉంది. అక్కడ నిశ్చింతగా విశ్రమించ సాగాను. ఆలోచనలు కరిగిపోసాగాయి. అదే నాలో మార్పుకు మొదటి ప్రకరణం. ఒక్క ఊపుతో, ఒక్క ప్రయత్నంతో మనస్సు శూన్యం అయింది. అట్లా శూన్యం అవుతానని గానీ, అయిపోగలనని గానీ నాకు తెలియదు. ఊహకందని రీతిలో జరిగిపోయింది. అది ప్రతిఒక్కరు అనుభవంతో పొందవలసిందే!

అమెరికాలోనూ, ఇండియాలోనూ నా ప్రసంగాల ప్రధానాంశం ఒకటే. **లోపలికి పోవడం ఎలా? లోపల గమనించడం ఎలా? మలుపు తిరగడం ఎలా? కల్లోలంగా ఉండే ఆలోచనలను ఉపశమింపచేసి, మనస్సును శాంతింప చేయడం ఎలా? ఒకరికి శ్రద్ధ, ఒకరికి భక్తి, ఇంకొకరికి పట్టుదల.** ఇలా ప్రతిమనిషికి ప్రయోగశైలి మారుతుందా?

ఆరంభంలో ఆనందంగా ఉంటుంది. అనుభవం కనిపిస్తుంది. ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ప్రోత్సాహకరంగానూ అనిపిస్తుంది. కానీ ప్రయాణం మొదలైన తర్వాత వేగం పుంజుకోవడం ఎట్లా అన్నది సమస్య. కదలదే! స్వేచ్ఛగా ప్రయాణం సాగుతుందా? అవరోధాల మాట ఏమిటి? ఆటంకాలు ఏర్పడితే ఎలా? ఏం చేయాలి?

డా. హెలెన్, కరోల్ రిట్ ఇద్దరూ మనస్తత్వవేత్తలు. లాస్ ఏంజలస్‌లో పని ఒత్తిడి భరించలేక వర్జీనియా వచ్చి ప్రశాంతంగా గడుపుతుంటారు. నన్ను తమతో ఉండమని ఆహ్వానించారు. అక్కడ నా ప్రసంగాలు వినడానికి చాలా మంది

వచ్చేవారు. ఒకసారి **'ఎరుకతో గమనిక'** గురించి వివరంగా ప్రసంగించాను. ప్రసంగానంతరం అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చాను.

ఆనాటి ప్రసంగం **'భావాతీత ప్రజ్ఞ'** గురించిన సారాంశం ఇది :

"గుడ్ ఆఫ్టర్‌నూన్ ఎవ్రీ వన్!

మీరందరూ జీవితం యొక్క విలువల గురించి, అంతరార్థం గురించి తెలుసుకోవాలనే ఉత్సాహంతో ఉన్నారు. సంతోషం!

ఆ 'తెలుసుకోవడం' అన్నది ఎవరికి వారు చేయవలసిన ప్రయత్నం. కానప్పుడు జీవితం నిర్వీర్యం అవుతుంది. సంప్రదాయాలు, ఆచారాలు, పరిసరాలు మిమ్మల్ని దారుణంగా హింసిస్తాయి. పట్టి పీడిస్తుంటాయి. మీ స్వంత అనుభవం ఏ ఒక్కటీ కనిపించదు. మన అలవాట్లు, జ్ఞాపకాలు అనే చక్రాలపైన మన జీవన శకటం సాగుతుంది. ఏ మార్గంలోనూ నవ్యత కనపించదు. క్రియాశీలత కనిపించదు. కదలికలేని సరస్సులాగా జీవితం నిశ్చలంగా ఉండిపోతుంది. అప్పుడప్పుడు బుడగలు పైకి తేలుతుంటాయి.

మనం దృష్టి పెట్టవలసింది మనస్సుపైన. మన ఆలోచనలతీరు గమనించాలి. అప్పుడు జీవితం యొక్క నిజస్వరూపం, సహజ స్వభావం తెలుస్తుంది. ఆలోచనలు కలగడం, అవి కార్యరూపం ధరించడాన్ని 'జీవితం' అంటున్నాం. మీరు నా భావవీధుల్లోకి వస్తున్నందుకు సంతోషంగా ఉంది. మనస్సు యొక్క యాంత్రికత గురించి తెలుసుకుందాం మొదట.

మానవ మేధ చాలా ప్రాచీనమైనది. చాలా గట్టిది. మనిషి ఎంత ప్రాచీనమో మానవమేధా అంత ప్రాచీనం. ఇంత చరిత్రగల మేధను విశ్లేషించగలమా? మనస్సులోకి తొంగిచూడగలమా?

ఏదైనా ఒక దినపత్రిక చూస్తే, ఒక మాగజైన్ చూస్తే, హవాయ్ దీవుల అందాల ప్రకటన కనిపిస్తుంది. "హవాయ్ రండి, ఆనందించండి." "హవాయ్ స్వర్గం మీకోసం ఆహ్వానిస్తోంది". "మా రెస్టారెంట్ కారు చౌక" ఆ ప్రకటనలు చదవగానే మీ మనసు పరుగులు తీస్తుంది. "మంచి అవకాశం మించిన దొరకదు" అనుకుంటారు. ఆ ప్రకటన మీ కళ్లపడేవరకు మీకు హవాయ్ ఆలోచన ఉండదు. పేజీలు త్రిప్పితే, మరొకచోట అలాంటిదే మరొక ప్రకటన. అప్పుడు మీ బుర్ర చురుగ్గా పనిచేయడం ప్రారంభిస్తుంది. 'ఒకసారి వెళ్లితే బావుండు. వెళ్లొస్తే పోలా! తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆనందం' అనుకుంటారు.

ఎప్పుడైతే ఆలోచన మొదలైందో, అప్పుడే కోరికలు కదలడం ప్రారంభ మవుతుంది. ఆలోచించిన కొద్దీ, కాలం గడిచిన కొద్దీ కోరికలు పెరుగుతుంటాయి. ఆ ప్రకటన ప్రక్కన పెడతారు తర్వాత చూద్దాంలే అని. మరొక వారం తర్వాత అలాంటి ప్రకటన మరొకటి కంట పడుతుంది. మనసు దాని వెంట పడుతుంది. లోగడ ఒకసారి చదవడం, ఆలోచించడం జరిగింది. ఇది దాని పొడిగింపు. ఎప్పుడో పడ్డ బీజం ఇప్పుడు మొలకెత్తింది. మనసులో హవాయ్ చిత్రం లీలగా మెదులుతుంది. అలా మనసుపైన ఒత్తిడి పెరుగుతుంది.

అది జ్ఞాపకాల పందిరి. మనస్సులోని అన్ని బోగీలలోనూ పరిస్థితి అంతే. అన్ని శాఖల పనితీరు అదే. అసలు మనం ప్రతిరోజు బ్రతుకుతున్న తీరూ అదే. మనం చేసే అన్ని పనులకు ఇలాంటి ప్రేరణలే పునాదులు, ఆలోచనలే ఆధారాలు. ఈ పనుల ఒత్తిడి, ఆలోచనల ఒత్తిడి కారణంగా అసలు జీవిత విలువల్ని గురించి ఆలోచించం. నిజంగా ఏదీ కొత్తగా ఆలోచించం. ఆలోచన కలగడం సహజం. కార్యనిర్వహణ సహజం. అన్నీ సహజంగా, సజావుగా జరిగి పోతుంటాయి. ప్రతి ఆలోచనను ఆచరణలో పెట్టే వరకు మనస్సు సతాయిస్తుంది. ఊరుకోదు. తర్వాత అయినా మనస్సు నెమ్మదిస్తుందా? ప్రశాంతంగా ఉంటుందా? అంటే అదీ లేదు. అవే జ్ఞాపకాలు, స్మృతులు. రాత్రింబవళ్లు ఏదో తపన. ఏదో ఆరాటం. ఒత్తిడి.

అంటే, జీవితం అంతా ఆలోచనల, కోరికల బృంద నృత్యాలు. మనస్సు, జ్ఞాపకాలు కలిసి ఆడించే నాటకం – జీవితం. మన ఆలోచనలన్నీ ఒక పెద్ద బోనులో బంధించబడి ఉంటాయి. వాటి నిర్వహణకే మన యావచ్ఛక్తి వినియోగపడుతుంది. ప్రతిఒక్కరి ఆలోచన కార్యరూపం ధరించడానికి బోలెడు శక్తి అవసరం. అది మన జీవశక్తి. అన్యం కాదు. మన శక్తినంతా అలా తొందర తొందరగా ఖర్చు పెట్టేస్తుంటాం. దేనికీ స్వయంసత్తా ఉండదు. ఆలోచన కలగగానే శక్తిని ఆశ్రయిస్తుంది సాయపడమని. కార్యనిర్వాహణకు శక్తి అవసరం గదా! కనుక మనదైన 'జీవ' శక్తికి స్వేచ్ఛ లేకుండా పోతోంది.

ప్రతిభావం సర్వకాల సర్వావస్థలలోనూ శక్తిని తనతోపాటే ఉంచు కుంటుంది. విడిచి ఉండదు. దానికి మరొక ఆస్కారం లేదు. ఒక చిన్న భావం కూడా బోలెడు శక్తిని వినిమయం చేస్తుంది. చిన్నిచిన్ని మేఘాలు సూర్యుని వెలుగును అడ్డుకున్నట్లు, చిన్నచిన్ని భావాలు జీవశక్తిని అడ్డుకుంటాయి. శక్తి హరించక పోయినా జీవశక్తి కున్న స్వేచ్ఛను హరిస్తుంది. అంటే ఆలోచన మన

జీవశక్తిని తనకోసం ఉపయోగించుకుంటుంది. మన అంతశ్శోధనకు ఏమాత్రం వెసులు బాటు కలగ నీయదు. మనస్సు చేస్తున్న ఈ పనుల్ని మనం నిరోధించాలి.

ఆలోచనలు, కోరికలు, వేగిరపాటు, ఒత్తిడులతో అస్థిమితంగా ఉండే మనస్సు స్థిమితపడితే తప్ప ఆనందం లభించదు. అదే నిజమైన స్వేచ్ఛా జీవనం. మనకు లేనిదీ అదే. అందరూ బంధాలలో చిక్కుకున్నవారే మనుషు లందరూ మనసు యంత్రంలో చిక్కుకున్నవారే జ్ఞాపకాలలో బందీలైనవారే. బయటపడడానికి ఎవరైనా సిద్ధంగా ఉన్నారా? ఎంత ఆలోచించినా ఆలోచన ప్రక్రియ వల్ల హృదయం శుద్ధి కాదు. మనసు నిర్మలం కాదు. జ్ఞాపకాలు ఏవీ స్వచ్ఛం కావు. గత కాలపు కల్మషాల పోగులు జ్ఞాపకాలు. అవి ఎప్పటికీ స్వతంత్రం కావు. సృజనాత్మకం కావు.

మనకు జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నీ కొత్తగా ఉంటాయి. గతంతో ముడి వేసుకుని బ్రతికినంతకాలం జీవితం కొత్త అనుభవాలు పొందలేదు. స్వేచ్ఛగా, స్వతంత్రంగా, స్వచ్ఛందంగా జీవించడం మన మొదటి కర్తవ్యం. కనుక మీరు చేయవలసిన మొదటిపని ఆలోచనల్ని గమనించడం. ఆలోచనల మూలాల్లోకి పదండి. గమనిక వల్ల మీలో ఏకాగ్రత పెరుగుతుంది. సున్నితత్వం ఏర్పడుతుంది. గ్రహణశక్తి బలపడుతుంది. అలా గమనిస్తూ పోతే మీలోనే ఒక కొత్త ప్రపంచం ఆవిష్కృతమవుతుంది. అతీంద్రియత చోటు చేసుకుంటుంది. తీవ్రంగా ప్రతి ఆలోచనను లోతుగా పరిశీలించాలి. ప్రతి ఆలోచన ఎక్కడ, ఎలా మొదలైందీ గమనికలో తెలుస్తుంది. ఎన్నో సత్యాలు బయటపడతాయి.

మొదట్లో ఆలోచనల్ని గమనించడం కష్టమనిపిస్తుంది. ఆలోచనల్ని ఒడిసి పట్టుకోవడం ఎలాగో తెలియదు. జారిపోతుంటాయి. కొన్ని కరిగిపోతుంటాయి. ఆలోచనల్ని మరొక ఆలోచనతో పట్టుకోవటానికి ప్రయత్నిస్తాం.

ఆలోచనల్ని రాకుండా త్రోసివేస్తే, నిరాలోచన కలిగించే శూన్యంలో ఉన్న ఆలోచనలు కలిసి శూన్యం అవుతాయి. ఆ రెండు స్థితుల్ని వేరు చేయాలి. ఆలోచనను, దానిని గమనించే మరొక ఆలోచన నుండి విడదీయాలి. రెండవదాని పైన మన అజమాయిషీ ఉంటుంది. అంటే మన సంకల్పం, మొదటి ఆలోచనపై మనసు పెత్తనం ఉంటుంది. అలా విడదీయడం గమనికతో సాధ్యపడుతుంది. అసలు రహస్యం ఒకే ఆలోచన రెండు భూమికలపైన వర్తించడం. మనసు పెత్తనం ఉన్న ఆలోచన నిలిచిపోతే, మన సంకల్పంతో కలిగిన ఆలోచన మిగులుతుంది.

ఇది మన చెప్పుచేతల్లో ఉంటుంది. తర్వాత ఆలోచనపోయి గమనిక మిగులుతుంది. గమనించడం లోతుగా జరగాలి. ఎరుకతో జరపాలి. చైతన్యంతో జరపాలి.

ఇక్కడ 'ఎరుక' ప్రధానం. గమనిక వైశాల్యం విస్తరిస్తుంది. అది ఏక పక్షం అయినపుడు భావ సంఘర్షణగా, భావ పోరాటంగా మారుతుంది. భావం ఆలోచనల్లోకి రాదు. అది అంతరంగ యాతన. రెండు ఆలోచనల ఘర్షణలో చైతన్యం పుడుతుంది. ఆలోచనలు నశిస్తాయి లేదా నిస్తేజం అవుతాయి.

మరొక రహస్యం – ఆలోచించే మనసు ఒకవైపే మొగ్గుతుంది. ఒక దిశగానే సాగుతుంది. ఒక కోణం నుండే గమనిస్తుంది. ఆలోచనకు నిలకడ ఉండదు. ఏకాగ్రత కుదరదు. సంపూర్ణం కాదు. సమగ్రత సాధించడం కుదరదు. మనసులో ఒక్కో విభాగం ఒక్కో పని చేస్తుంది. 'భావన' అన్నది మన జీవశక్తిలోని ఒక చిరు తరంగం. సూర్యునిలోని ఒక 'కిరణం' ఆలోచన. ఏ కిరణమూ తిరిగి సూర్యుని చేరదు. ఆలోచన తిరిగి మూలస్థానానికి పోదు. లయించి పోతుంది.

ఆలోచనల్ని శూన్యం చేసే పని నిదానంగా, మంచి అవగాహనతో జరపాలి. అప్పుడే ఆలోచన వెనక ఉన్న శక్తి చైతన్యంగా మారుతుంది. ఆత్మికశక్తి పెరిగిన కొద్దీ భావం తగ్గుతుంది. ఆలోచనల అవసరం ఉండదు. అదే గమనిక. అది గమనికలోని సౌలభ్యం, ప్రయోజనం బహుళం. అది పెరిగిన కొద్దీ వినిమయం తెలుస్తుంది. దానివల్ల అంతర్దృష్టి ఏర్పడుతుంది. ఆత్మజ్ఞానం కలుగు తుంది. అప్పుడు మనపైన ఆలోచన పెత్తనం ఉండదు. అలాగే భావం అభావమవుతుంది.

ఆలోచనల ఆనుపానులు తెలిశాక దాని భరతం పట్టడం సులభం. ఆలోచనల్ని ధిక్కరించవచ్చు. అవి రాకుండా చేసుకోవచ్చు. మొదట్లో ఆలోచనా రహితంగా ఉండడం కష్టం అనిపిస్తుంది. కాని అసంభవం కాదు. ఆలోచనలు వదిలిన తర్వాత మనలో కలిగే చైతన్యం వల్ల సమకూరే శక్తి అద్భుతం. ఇంతకాలం మనస్సు మనల్ని నడిపించింది. ఇప్పుడు మనసు మనం చెప్పినట్లు నడుస్తుంది. లేదా కనిపించకుండా పోతుంది.

ఆలోచించడమే మేధావి లక్షణం అనుకుంటారు. ఆలోచించేవారు తెలివిగల వారని, వివేకవంతులని భావిస్తారు. ఆలోచించి సంపాదించే విజ్ఞానంలో వారి స్వంతం ఏమీ ఉండదు. వారి గుండెలో తడి ఉండదు. ప్రేమ, కరుణ ఏవీ ఉండవు. మేధావుల జీవిత విధానం మారాలి. మనం ఆడ, మగ అనే తేడా అవసరం లేదు. అందరం మనుష్యులం. సమానం అనుకోవాలి. మన జీవకేంద్రాన్ని

తెలుసుకున్నప్పుడు మనం సంపూర్ణంగా జీవించ గలుగుతాం. తన జీవ కేంద్రాన్ని చేరిన ప్రతివ్యక్తి స్వేచ్ఛగా జీవిస్తాడు. దృష్టి, అవగాహన సంపూర్ణంగా మారుతుంది. మీరు చేసే పనులలో పూర్ణత్వం, మౌలికత కనిపిస్తాయి.

కనుక మీరు చేయవలసిన పని ఆలోచనల హద్దుల్ని దాటి పోవడం. కేవలం ఆలోచన ఎవరినీ గమ్యానికి చేర్చదు. దివ్యత్వాన్ని, అమృతత్వాన్ని అందించదు. ఆధ్యాత్మికంగా ఎలాంటి అనుభవం ఇవ్వదు. ఆలోచనలు దాటిపోతే అంతా ప్రశాంతి. మానవ మేధ ఇప్పుడు ఆ స్థితికి చేరింది. మనోభూమికల సరిహద్దుల్ని దాటే శక్తి మీ అందరికీ ఉంది. ఇంకా, ఇంకా లోపలకు చొచ్చుకుపోండి. అందుకు సిద్ధాంతాలు, తాత్వికత అవసరం లేదు. విధి విధానాలు, టెక్నిక్‌లు లేవు. లోపల గమనించడం ఒక్కటే మార్గం. అదే ఆత్మజ్ఞానాన్ని అందిస్తుంది. తప్పులు దొర్లవు. మీరు స్వేచ్ఛగా సాగిపొండి. మీకు మీరే మార్గదర్శి. మీకు మీరే గురువు. తర్వాత ఏం చేయాలి? ఎటు పోవాలి? ఎవరూ చెప్పనవసరం లేదు. గైడెన్స్ మీలోపలి నుండే వస్తుంది. మీకు మీరే గురువు. ఆ గురువుకు మీరే శిష్యులు.

ఒక సందేహం : జీవిత సత్యాన్ని అన్వేషించడం మంచిదే. అయితే బ్రతికేదెలా? ఏదైనా ఉద్యోగమో, సద్యోగమో ఉండాలి కదా! ఆ తర్వాత గదా విలువలు, ఆధ్యాత్మికత?

జవాబు : జీవించాలనే తపన తప్ప మీకు జీవించడం తెలియదు. జీవితపు విలువలు తెలియవు. బ్రతకడం కోసం ప్రయాసపడుతున్నారు తప్ప జీవించడానికి ప్రయత్నించడం లేదు. జీవిత సత్యాలు తెలిస్తే ఈ తపన ఉండదు. జీవిత విలువలు తెలిస్తే ఈ వెంపర్లాట ఉండదు. ప్రక్కవాడితో పోటీ పడుతున్నారు. మీతో మీరు పోటీ పడడం లేదు. బ్రతకడం కోసం సమస్యలు సృష్టించు కుంటున్నారు. సమస్యలు లేకుండా చేసుకోండి, జీవితం గుబాళిస్తుంది. పరిమళిస్తుంది.

ఒక గొప్ప అద్భుతాన్ని చూస్తుంటే, సౌందర్యాన్ని చూస్తుంటే ఆకలి తెలియదు. జీవితపు విలువలు తెలిస్తే బ్రతుకులో భయం ఉండదు. రేపటి ఆలోచన ఉండదు. ఆ మహదానందంలో అన్నీ మరచిపోతారు. అప్పుడు బ్రతకడం అన్నది ఒక సమస్య కాదు. కనుక విలువలు తెలిసిన జీవితం కావాలి. సృష్టిలో తాపత్రయ పడేది, భవిష్యత్తు కోసం అంగలార్చేది మనిషి ఒక్కడే. మిగిలిన జీవాలు ఏవీ తాపత్రయపడవు. గమనించండి. మనసు

హద్దుల్ని దాటిపోతే తాపత్రయాలుండవు. మీ కోరికలన్నీ తీరకపోవచ్చు. కాని సహజంగా జీవించడం సమస్య కాదు.

సందేహం : నాలో పేరుకుపోయిన చెత్తా చదారం చాలా సంవత్సరాలుగా గమనిస్తున్నాను. మరి నా 'గమనిక' వల్ల ఆ చెత్త తగ్గింది లేదు. నాకు ఒరిగిందీ లేదు. ఏం చేయమంటారు? ఏది నా దారి?

జవాబు : చెత్తా చదారం అంటూనే ఆ చెత్తలో కూరుకుపోతున్నారు. బయటపడే ప్రయత్నం ఎప్పుడు చేశారు? అందుకే చిత్తుగా ఓడిపోతున్నారు. ముందుగా మీరేమిటో తెలుసుకోండి. దెబ్బలాడకండి. అయిష్టం చూపకండి. వచ్చినంతలో తృప్తిపడండి. ఉన్నంతలో తృప్తిగా జీవించండి. లేదు, లేదు అనుకోవడం; ఇది కావాలి, అది కావాలి అనుకోవడం శత్రువులు. అవిగాక మీ అంతశ్శత్రువు లున్నాయి. కోపం, అసూయ, స్వార్థం, అత్యాశ. వీటిని వదిలించుకోండి. పారిపోకండి. భయపడకండి. అన్నింటిని గమనించండి. విశ్లేషించండి. కారణాలు వెతకండి.

కోపం వచ్చింది. అది ఎవరిది? మీదే గదా! దాన్ని ఎవరిపైనో ప్రదర్శిస్తారు. ఎందుకు? ఏం లాభం? కోపాల్ని మీలోపలే అణచిపెట్టి, నామరూపాల్లేకుండా చేయండి. ఎంత హాయి. కోపాన్ని దిగమింగి స్థిమితపడడం ఏమాత్రం కష్టం కాదు. కోపానికి వ్యతిరేకమైన అనురాగానికి, వాత్సల్యానికి కాస్త మీలో చోటివ్వండి. కోపం ప్రక్కనే జాలిని, కరుణను ఎదగనివ్వండి. కోపం పోతుంది. పోయి తీరుతుంది. ఎవరి మనస్సు దుర్గుణాలను సద్గుణాలుగా మార్చదు. ప్రక్క ప్రక్కన వాటికి కాస్త చోటిస్తుంది. అణచడానికి ప్రయత్నిస్తే లాభం లేదు. గమనిస్తే చాలు చెడు క్రమంగా తోక ముడుస్తుంది.

చెత్త, చదారం గురించి అడిగారు. ఎందుకా కంగారు? అదంతా మీ సంపద అనే భ్రమలో ఉన్నారు గదా ఇన్నాళ్లు! ఇప్పుడు చెత్తా చదారం అయిపోయిందా? వదిలిపెట్టండి. వద్దనుకుంటే, ఎవరూ వాటిని మీపైన రుద్దలేరు. మీరే తలకెత్తుకున్నారు. నిర్లక్ష్యం చేస్తే అవే పోతాయి. దిగులెందుకు?

సందేహం : ఒంటరిగా, ప్రశాంతంగా కూర్చుని ధ్యానం చేస్తుంటే బాగానే ఉన్నట్లుంటుంది. కాని పని ఉన్నప్పుడు స్థిమితం చిక్కదు. ధ్యానం కుదరదు. అప్పుడు మనసును స్థిమితపరచడం చేతకావడం లేదు. చాలా కష్టం అనిపిస్తోంది.

జవాబు : మీరు మనసును నిశ్చల పరచాలని ప్రయత్నిస్తున్నారు. అదే పొరపాటు. అసలు ఆ మనస్సు జోలికి పోకండి. అదే స్థిమితపడుతుంది. శాంతిస్తుంది. మీరు మనస్సును స్థిమిత పరచాలని, శాంతింప చేయాలని ప్రయత్నించినంత కాలం అది పేట్రేగిపోతుంది. అదే అవరోధం. పట్టించుకోకండి.

సందేహం : ధ్యానం చేస్తున్నంత సేపు హాయిగా ఉంటుంది. రోజంతా అలాగే ఉండిపోవాలనిపిస్తుంది. ఆ ప్రశాంతత ఎప్పుడూ అలాగే ఉండిపోవాలంటే ఏం చేయాలి?

జవాబు : అది కావాలి, ఇది కావాలి అనే ఆలోచన రానీయకండి. దేనికోసమూ ప్రయత్నించకండి. ఏదీ ఆశించకండి. అసలు ఆలోచన కూడదు. ఆశ పనికిరాదు. మనస్సును దాని పని అది చేసుకోనివ్వండి. దాని జోలికి పోవద్దు. ఎటుపోతే అటు పోనివ్వండి. దాని పరుగులు పట్టించుకోవద్దు. దాని వెంటపడి మీరెందుకు పరుగులు తీస్తారు. దాన్ని స్థిమితపరచాలన్న ప్రయత్నంలో మీరు అస్థిరమవుతున్నారు. దానిని గమనించండి చాలు. దూరంగా ఉండి, చూస్తుండండి. మనసు గంతులేస్తుంది. ఎగిరిపడుతుంది. వినోదించండి. అది మీది కాదనుకొని చూడండి. ఎప్పుడూ మనసుపై పెత్తనం వద్దు. దాన్ని నిశ్చల పరచాలన్న ప్రయత్నమూ వద్దు. ఎందుకీ ఘర్షణ. మనసును అలా తయారు చేసింది మీరు, మీ తాపత్రయాలతో మీరిచ్చిన శిక్షణ అది. దాని సంగతి వదిలేస్తే, మీ 'గతి' సద్గతి అవుతుంది. అతితెలివికి పోవద్దు. మూర్ఖత్వం అనుకోవద్దు. రెండూ వద్దు. మనసుగతి ఇంతే అనుకోండి చాలు.

మనసు ఓ అందమైన పంజరం. దానిని అలా తయారు చేసుకుంది మనమే. మన అవసరాల కోసం, మన సుఖాల కోసం, సౌకర్యాల కోసం అలా తయారు చేసుకున్నాం. అలాంటి విషయాలలో మనసు మనిషికి సాయం చేస్తుంది. ఇప్పుడు అదే మనసు అనవసరంగా పెత్తనం చలాయిస్తోంది. మనల్ని శాసిస్తోంది. మనసు పురమాయించకుండా ఒక్కపనీ మనిషి చేయడు. అంతగా మనసుకు మనిషి బానిసైపోతున్నాడు. ఇది అదనుగా తీసుకుని మనసు ఓవర్ యాక్షన్ చేస్తోంది.

నిజానికి మనం మనసుని కాదనడం లేదు. మనశ్చర్యల్ని కాదనడం లేదు. మనసు చేయవలసిన పనులు మనసుకున్నాయి. ఆలోచనల తీరుతెన్నుల్ని మనం గమనిస్తే చాలు. లేకపోతే మన ఆలోచనల్ని మనం సక్రమంగా వినియోగించుకోలేం అంచేత 'గమనిక' అత్యంతావశ్యకం. గమనిక వల్ల మనసు


హద్దుల్ని దాటి పరిధుల్ని అతిక్రమించి మన జీవకేంద్రాన్ని చేరగలం ఆపని కోసం మళ్లీ కళ్లు మూసుకుని ఆలోచించకండి. లోపలి నిశ్శబ్దాన్ని వినండి చాలు.

ఎప్పుడూ సత్వర ఫలితాలు ఆశించవద్దు. ఎవరు ఫలితాలు ఆశిస్తారు...? ఆశలు కలవారు, కోరికలు కలవారు. అవి లేకుంటే ఆశించేది ఉండదు. మనసులో దాచి ఉంచేది ఉండదు. అది జ్ఞాన భూమిక. అదే హృదయాలయం. అది అగోచరం. అక్కడ బ్రహ్మ స్పర్శ తెలుస్తుంది. జ్ఞానం ప్రజ్ఞగా మారుతుంది. అందుకు ఎవరి సహకారం అవసరం లేదు. పాఠాలు నేర్వపని లేదు. మంచి చెడుల భయం వద్దు. తప్పులు చేస్తున్నామేమోనన్న అనుమానాలు అనవసరం. అది సహజక్రియ. సహజ పరిణామం. ఎవరినీ అనుసరించ నవసరం లేదు. మీకు మీరుగానే సర్వం గ్రహించగలుగుతారు.

సందేహం : ఆ స్థాయికి చేరిన తర్వాత మానవసేవ చేయవచ్చునా?

జవాబు : మానవసేవ ముఖ్యం కాదు. మానవత్వాన్ని నిలబెట్టండి. మనం వేరు, మానవత్వం వేరు కావు. సద్భావన వెంట సత్క్రియ ఉంటుంది. మన ఆలోచన మంచిదైతే, చేసే పని మంచిదవుతుంది. మన ప్రమేయంగానీ, సంకల్పం గానీ లేకుండానే 'మంచి' జరుగుతుంది. 'చెడు' జరగకపోగా పరిహరించ బడుతుంది.

ఇప్పుడు మీలో ఏదో చేయాలన్న తపన ఉంది. కానీ చేయలేక పోతున్నారు. ఇతరులకు చేయవలసిన సాయం మీకు మీరు చేసుకుంటున్నారు. ప్రతివారికి లోకసేవ చేయాలని ఉంటుంది. కానీ చేయరు. ఆధ్యాత్మికంగా పరిణతి చెందిన తర్వాత సదవగాహన ఏర్పడుతుంది. సహాయం దానంతట అదే జరుగుతుంది. మీరు ఏదో చేయాలని సంకల్పించనవసరం ఉండదు. ప్రతి భావన, ప్రతి సంకల్పం, ప్రతి కదలిక విశ్వశ్రేయస్సును కాంక్షిస్తుంది. మానవతకు మేలు చేస్తుంది.



27. సందేశాలు

అనేక సంవత్సరాలుగా పలు రకాల సాధకుల్ని, జిజ్ఞాసుల్ని కలుస్తూ వస్తున్నాను. వారి సందేహాలకు సమాధానాలిస్తున్నాను. ఆత్మాన్వేషణలో అనేక అవరోధాలు ఏర్పడుతుంటాయి. అంతరంగ యాత్ర అనుకున్నంత సులభం కాదని నా అనుభవంలో గ్రహించాను. అడుగడుగునా మనస్సు అడ్డుపడుతుంది. అడ్డుగోడలు నిర్మిస్తుంది. వాటిని వివేకంతో దాటి పోవలసింది సాధకులే. వారివారి సాధువర్తన, శీలం, అంతరంగ ప్రబోధం ముందుకు సాగించే ఉపాయనాలు.

ప్రశ్న : మనకు ఆలోచనలు కలుగుతుంటాయి? ఎందుకు కలుగుతుంటాయి?

జవాబు : నేను సమాధానం చెప్పినంత మాత్రాన, ఆలోచనల మూలం ఏదో మీకు తెలియదు. చెప్పేవారు లేక, పుస్తకాలలోను లేక విధి విధానాలు తెలియకపోతే ఎలా అంటారు? అంటే మీరే స్వయంగా ఆలోచనల్ని పట్టుకుని వాటి ఉద్గమస్థానాలకి చేరాలి. నెమ్మదిగా, ప్రశాంతంగా, ఏకాంతంగా, స్థిమితంగా కూర్చుని అన్వేషించాలి. మీరే పట్టుకోవాలి ... అవి ఎక్కడ మొదలవుతున్నాయో. శూన్యంలో ప్రయాణించి పట్టుకోవాలి. అవీ శూన్యం నుండే పుట్టుకొస్తాయి. శూన్యంలో శూన్యాన్ని పట్టుకోవడమే యోగక్రియ. గమనించడంతో మీ అన్వేషణ ప్రారంభం కావాలి.

ఎప్పుడూ ఆలోచనను ఒక క్రియగా మీరు చూచి ఉండరు. క్రియాత్మకంగా గమనించి ఉండరు. కానీ ఆలోచనలకు అనుగుణంగానే అన్ని పనులు చేస్తుంటారు. ఆ పనుల వెనుక ఆలోచన ఉన్నట్లు తెలియదు. అది ప్రేరణ. ప్రేరణ లోపలిది, పనులు బయటివి. మనసు వెలుపల, మెదడునే కాదు కళ్లు, చెవులు లాంటి పంచేంద్రియాలను ఉపయోగిస్తాం. మన కృషి

అంతా బయటి ప్రపంచానికి సంబంధించిందే. లోపలకు వెళ్లం కనుక ఆలోచన ఎక్కడ పుట్టేది, ఎలా పుట్టేది తెలుసుకోవడం కష్టం. ఇంద్రియాలకు అందకుండా భావం తప్పించుకుంటుంది.

మనసు దరిదాపులకు ఇంద్రియాలను రానివ్వదు. తనవేపు, తనలోకి చూడనీయదు. తన పని తీరు తెలియనివ్వదు. చాలా గోప్యంగా ఉంటుంది. మిమ్మల్ని మనసు ఎంతకీ బయటి ప్రపంచంలోనే కట్టివేస్తుంది. లోపల ప్రవేశించ నీయదు. అంచేత మనస్సు ఎప్పుడూ సురక్షితంగా ఉంటుంది. దాని లోపల ఎలాంటి కల్లోలం ఉండదు. మన దృష్టి బయటనే గానీ, లోపలకి పోదు.

ఇప్పుడు మీ ప్రథమ కర్తవ్యం లోపలికి చూడడం. లోపలికి ప్రవేశించడం. లోపల ఏం జరుగుతూందో నిశితంగా గమనించడం. ఏముంటుంది లోపల? అంతా శూన్యమే కదా! అవును లోపల, ఉండేది శూన్యం. కళ్లతో చూడం కనుక చీకటి అనుకుంటాం. శూన్యంలోనే ఆలోచనా తరంగాలు ఉంటాయి. చీకటి వెలుగు లుంటాయి. అవి మెత్తమెత్తగా కదులుతుంటాయి.

ఒక ఆలోచనను పట్టుకోవాలంటే దానికన్నా ఎక్కువ వేగంగా పరిగెత్తాలి. లేదంటే ఎప్పటికీ ఆలోచనల్ని దాటిపోలేం. అంచేతనే అప్రమత్తంగా ఉంటూ ఆలోచన వేగాన్ని నియంత్రించాలి. ప్రతి కదలికను గమనించాలి. మెలకువతో చీకట్లో, శూన్యంలో ముందుకు సాగాలన్నమాట. అప్పుడు అంతా మీకే తెలుస్తుంది. అది 'విదేహ' యాత్ర. 'దేహ' స్ఫురణ లేకుండా, భావశరీరంతో లోపలికి పోవడం. శూన్యంలో ప్రయాణించగలది భావశరీరం మాత్రమే. అదే సూక్ష్మశరీరం.

ఆ పని ఒక రోజులో జరగదు. రోజురోజు సాధన చేస్తుండాలి. లోపలకు వెళ్లినకొద్దీ శూన్యంతో ఆత్మీయత పెరుగుతుంది. ఆలోచనకన్న ముందు మీ సూక్ష్మశరీరం పయనిస్తుంది కనుక, మీరు వేగం పెంచినకొద్దీ ఆలోచన వెనకబడుతుంది. కనుమరుగవుతుంది. చివరికి శూన్యంలో లయించిపోతుంది.

ప్రశ్న : సాధకుని జీవితంలో భావానికి తావు లేదంటారా?

జవాబు : ఎందుకు లేదు! ఆలోచన లేకపోయినా, భావం ఉంటుంది. ఆలోచన సైతం మనసు పరిధిలోంచి హృదయం పరిధిలోకి పోతుంది. అక్కడ 'ఆత్మ' క్రింద పనిచేస్తుంది. మనసు పరిధిలో ఉన్నపుడు ఆలోచన వేరుగా ఉంటుంది. హృదయం పరిధిలో అది ప్రేమగా పరిణమిస్తుంది.

మీ భయం ఏమిటి? ఆలోచనల్లేకుండా జీవించడం ఎలాగా? ఆలోచన ప్రక్రియ ప్రత్యేకంగా ఉండదు. హృదయంతో కలిసిపోయి ఉంటుంది. ఎప్పటికప్పుడు 'భావం' పైకొస్తుంది. మరల 'అనుభవం' అవుతుంది. అప్పుడు ఏం జరుగుతుంది? జీవితం ఏమవుతుంది? అద్భుతంగా ఉంటుంది. సంపూర్ణ జీవితాన్ని అనుభవించగలుగుతారు.

ఆలోచనలు లేకుండా బ్రతకడం ఎలా? ప్రతి పనికీ ఆలోచిస్తాం గదా! ఆలోచనల్లేని స్థితి అంటే పిచ్చిపట్టడం కాదు. మందమతిగా ఉండడం కాదు. ఆలోచనశైలి మారుతుంది. ఆలోచనకు అన్యాయం జరగదు. ఆలోచిస్తున్నట్లు అనిపించగలగాలి. అంతర్వాహినిగా భావం సాగుతుంది. ఆలోచనలు చేసే పనిని భావమే నేరుగా హృదయస్పందనతో చేస్తుంది.

ప్రశ్న : 'గమనిక' సవ్యంగా సాగుతుందో లేదో ఎట్లా తెలుసుకోవడం?

జవాబు : అది మళ్లీ మనసు ప్రమేయం. మంచిగా గమనిస్తున్నానా? చెడుగా గమనిస్తున్నానా? అనే సందేహం కలిగిస్తోంది మీ మనస్సు. అది మళ్లీ ఆలోచన అవునా? అదీ ఆశించకుండా ముందుకు సాగండి. తీర్పులు, తీర్మానాలు, ఫలితాలు ఎందుకు? మొదట్లో స్పష్టత ఉండదు. ఎందుకని? మనసు జోక్యం వల్ల. కలవరం, అనుమానం కలగడం మనసు బలహీనతవల్ల. ఎంత త్రోసివేసినా, ఎక్కడో దాగిన మనస్సు, ఆలోచన అప్పుడప్పుడు బయటకు తొంగి చూస్తుంది. 'గమనిక' సవ్యంగా ఉంటే బయటపడ్డ మనస్సును, ఆలోచనల్ని మొట్టి ముందు సాగవచ్చు. బుద్ధికి 'బుద్ధి' చెప్పవచ్చు. మీ ప్రయత్నానికి, పురోగమనానికి అడ్డురావద్దని హెచ్చరించవచ్చు.

ప్రశ్న : దాదా! అలా అధిగమించడం 'టెక్నిక్' అవుతుందా?

జవాబు : కాదు, ఆలోచన వల్ల ఒత్తిడి పెరుగుతుంది. విపరీతం జరుగుతుంది, అని మీ అనుమానం. ఆరంభంలో ఆలోచనలను బట్టి అనుభవాలకు ఆటంకాలు ఏర్పడుతుంటాయి. కనుక 'గమనిక' టెక్నిక్ కాదు. 'టెక్నిక్' అంటే ఒక ప్లాను. లోగడ ఒకరు అనుసరించిన పద్ధతిని, అదే విధంగా మీరు ఆచరిస్తే అది టెక్నిక్. ఇది గమనిక. అబ్జర్వేషన్. మీ స్వంతం. ఈ క్షణంలో జరిగే పని. దానికి గతంతో సంబంధం ఉండదు. **జీవితం మీ చేతుల్లో ఉంది. ఏదీ మిమ్మల్ని నిరోధించదు. ఎవరూ మీకు అవరోధం కారు, కాలేరు, కాబోరు!**

★ ★ ★